# జంధ్యా మారుతం



(జంధ్యాల సినిమావలోకనం)

1









పులగం చిన్నారాయణ

# వందనం...అభివందనం

నరేశ్
ప్రదీప్
నూతన్‌ప్రసాద్
సుత్తివేలు
కోట శ్రీనివాసరావు
ఆదివిష్ణు
డా॥ బ్రహ్మానందం
శ్రీలక్ష్మి
ధర్మవరపు సుబ్రహ్మణ్యం
రాధాకుమారి
వైజాగ్ ప్రసాద్
రత్నాసాగర్
జిత్‌మోహన్ మిత్రా
అగస్త్యశాస్త్రి
ఇంద్రగంటి శ్రీకాంతశర్మ
మల్లాది వెంకట కృష్ణమూర్తి
అట్లూరి రామారావు
ఇ.వి.వి.సత్యనారాయణ
కె.మురారి
జయకృష్ణ
బి.వి.పట్టాభిరామ్
మాధవపెద్ది సురేశ్
'గజల్' శ్రీనివాస్

తోట ప్రసాద్(సినీ రచయిత)
ప్రదీప్ (ఆంధ్రజ్యోతి)
మోహన్ గోటేటి(సితార)
సురేశ్ కొండేటి('సంతోషం' సినీ వార పత్రిక సంపాదకులు)
జి.రాజేశ్(డిజైనర్)

# క్లాప్...స్విచాన్...ఫస్ట్‌షాట్ డైరెక్షన్

"నవ్వు నాలుగిందాల చేటు కాదు నాలుగింతల దీటు!" - అని ఘన్‌టాపథంగా చాటి చెప్పడమే గాకుండా, 'నవ్వు'ని క్యారెక్టర్ ఆర్టిస్ట్ స్థాయి నుంచి "హీరో" రేంజ్‌కి తీసుకెళ్లిన '(అ)దర్శ'కుడు జంధ్యాల. జంధ్యాల రచయితగా 'పెన్'టాస్టిక్ అనిపించుకున్నారు. అలాగే దర్శకుడుగా 'ఫన్'టాస్టిక్ అనిపించుకున్నారు.

అలాంటి మహానుభావుని చిత్రాలతో చెలిమి చేసి 'జంధ్యామారుతం' పేరుతో అవలోకనం గావించే అపురూపమైన అవకాశం అనుకోకుండా లభించడం నా అదృష్టం. యాదృచ్ఛికం ఏమిటంటే సినీ పాత్రికేయునిగా నా తొలి కవరేజ్ జంధ్యాల చిత్రం కావటం 'విచిత్రం'. ఇందిరాపార్క్‌లో పాట కవరేజ్‌కు వెళ్లి ఆయనతో కొద్దిసేపు ముచ్చటించటం జరిగింది. ఆయన ఇంటర్వ్యూ కూడా చేయని నాకు ఆయన సినిమాలను ఇంటర్వ్యూ చేసే అవకాశం లభించింది.

సుప్రసిద్ధ సినీ సంగీత విమర్శకుడు, పాత్రికేయుడు రాజాగారి సూచన మేరకు 'హాసం' హాస్య - సంగీత పత్రికలో పదమూడు సినిమాలను విశ్లేషించాను. రచయితగా అనుభవం లేకున్నా, అక్షరాల మీద అభిమానం, సినిమాలపై పెంచుకున్న మమకారం ఈ 'జంధ్యామారుతం' రా(వీ)యించడానికి బాగా ఉపకరించాయి.

జంధ్యాల గారు మొత్తం 39 సినిమాలకు దర్శకత్వం వహించారు. 'హాసం'లో ప్రచురితమైన పదమూడు సినిమా విశ్లేషణలతో పాటు మిగిలిన సినిమాల విశ్లేషణలను జత చేసి అందాల గ్రంథంగా ప్రచురించడానికి పూనుకున్న ప్రఖ్యాత రచయిత, 'ముళ్లపూడి సాహితీసర్వస్వం' సంపాదకులు, 'హాసం' మేనేజింగ్ ఎడిటర్ ఎమ్బీయస్ ప్రసాద్‌గారికి, 'హాసం' పబ్లిషరు పద్మభూషణ్ కె.ఐ.వరప్రసాదరెడ్డి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

షూటింగులో బిజీగా ఉన్నా, నాకోసం సమయం వెచ్చించి, ముందుమాట వ్రాసి నన్ను ప్రోత్సహించిన మెగాస్టార్ చిరంజీవిగారికి

ప్రత్యేక కృతజ్ఞతలు.

కొన్ని సినిమాలకు సంబంధించిన సమాచారం సేకరించడం చాలా కష్టమైంది. వాటి తాలూకు వీడియోగానీ, స్టిల్స్‌గానీ లభించలేదు. ఏవో కొన్ని సినిమాలకు సంబంధించిన సమాచారంతో ఈ పుస్తకం తీసుకురావడం ఇష్టంలేక అన్నింటినీ ఇందులో చేర్చడం జరిగింది. అందుకే వాటిని ఒకటి, రెండు పేజీలకే పరిమితం చేయడం జరిగింది. అనుభవలేమితోనో, అవగాహనలోపంతోనో ఏవైనా తప్పులు దొర్లితే మన్నించ ప్రార్థన. భవిష్యత్‌లో ఈ సినిమాల తాలూకు సమాచారం మరింతగా లభిస్తే ద్వితీయ ముద్రణలో సంపూర్ణంగా అందివ్వడం జరుగుతుంది.

ఈ 'జంధ్యామారుతం' వీయడానికి చాలా హృదయాలు సహకరించాయి. జంధ్యాల గారి శ్రీమతి అన్నపూర్ణ గారిని ప్రప్రథమంగా పేర్కొనాలి. జంధ్యాల గారితో పనిచేసిన చాలామందిని ఫోన్స్‌లోనూ, డైరెక్ట్‌గానూ హింసించైనా సమాచారం తీసుకున్నాను. సమాచార సేకరణలో సహకరించిన తమ్ముడు పులగం గిరికి ప్రత్యేక కృతజ్ఞతలు.

పాలిటెక్నిక్ చదివినా నాకిష్టమైన సినీరంగంలోకి వెళ్లడానికి పూర్తిస్వేచ్ఛను కల్పించిన అమ్మానాన్నలు పులగం వరలక్ష్మి, గాంధీలను ఈ సందర్భంలో తలుచుకోకుండా ఎలా ఉండగలను.

విసుక్కోకుండా నాకు రాసుకోవడానికి సహకరించిన నా శ్రీమతి సౌజన్యకు, నా ముద్దుల కూతురు లాలిత్య (హ్యాపీ)కి స్పెషల్ థ్యాంక్స్.

అలాగే నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న మావయ్య పోలిశెట్టి సత్యనారాయణ, చెల్లెళ్లు సత్యనాగవేణి, సూర్యకుమారి, బావలు సంకు చంటి, బందారు బాబ్జీని ఈ సందర్భంలో తలుచుకోకుండా ఉండలేను. 'హాసం'లో 'జంధ్యామారుతం' చదివి సంబరపడిపోయిన మా మావగారు వలవల వీరవెంకట సత్యనారాయణమూర్తి ఈ పుస్తకం విడుదల సమయానికి లేకపోవడం బాధాకరం. స్వర్గంలోంచి ఆయన ఆశీస్సులు నాకు లభిస్తాయని ఆశపడుతున్నాను.

మన మధ్య లేకున్నా, మన బంధువు కాకున్నా మన అందరికీ నవ్వుల ఆస్తుల్ని పంచిపెట్టి వెళ్లిపోయిన జంధ్యాలకు ఇదే నా అక్షరాంజలి.

నా ఈ ఫస్ట్‌టైమ్ బుక్ డైరెక్షన్‌కు మీ ఆశీర్వచనాల క్లాప్ కొట్టి..., సహృదయాన్ని స్విచాన్ చేసి ముందుకు సాగండి.

- పులగం చిన్నారాయణ

## ప్రకాశకుల విజ్ఞప్తి

'హాసం, హాస్య-సంగీత పత్రిక' ద్వారా మూడేళ్లపాటు హాస్య, సంగీత ప్రియులను అలరించిన అనుభవం ఆలంబనగా ఈ ప్రచురణల రూపంతో పాఠకుల ముందు తిరిగి వస్తున్నాం. హాస్యం, సంగీతం అనే అంశాలతో కూడిన పుస్తకాలను సాధ్యమైనంత తక్కువ ధరకు పాఠకులకు అందించాలన్న సదుద్దేశ్యంతో ప్రారంభించబడిన మా సంస్థ వెలువరిస్తున్న మూడవ ప్రచురణ ఇది.

ఆరోగ్యకరమైన హాస్యచిత్రాలు తీసిన సినీరచయిత, దర్శకుడు జంధ్యాల ప్రేక్షకుల మనస్సుల్లో సుస్థిరస్థానాన్ని ఏర్పరచుకున్నారు. 'జంధ్యాల మార్కు' హాస్యం పండిత పామరులనందరినీ ఆకట్టుకుంది. అంతేకాదు, ఆయన తన సినిమాలలో సంగీతానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన అకాలమరణానికి దు:ఖించనివారు లేరు. ఆయన స్మృతికి నివాళిగా ఆయన డైరక్టు చేసిన 39 సినిమాల విశేషాలను విలక్షణ రీతిలో 'హాసం' పాఠకులకు పరిచయం చేయాలని ఫిలిం జర్నలిస్టు, రచయిత శ్రీ పులగం చిన్నారాయణను కోరడం జరిగింది.

శ్రీ పులగం చిన్నారాయణ పదేళ్లగా 'శివరంజని', 'నంబర్‌వన్', 'చిత్రం' లోనూ, ప్రస్తుతం 'సంతోషం' పత్రికలోనూ సహసంపాదకులుగా ఉన్నారు. తన వృత్తి కారణంగాను, దాదాపు 50 సినిమాలకు పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా పనిచేసిన అనుభవం కారణంగాను ఆయనకు సినీరంగ ప్రముఖులనేకులతో సత్సంబంధాలున్నాయి. జంధ్యాలతో పనిచేసిన ఎందరో కళాకారులను ఇంటర్వ్యూ చేసి, శ్రమకోర్చి సమాచారం సేకరించి, అరుదైన ఫోటోలతో, ఆసక్తికరమైన రీతిలో ఆయన ఒక్కో సినిమా గురించి పాఠకులకు అందించారు. 15 సం॥లుగా కవితలు, కథలు, సినీవ్యాసాలు వ్రాసిన అనుభవం శ్రీ చిన్నారాయణ కథనానికి తోడ్పడింది.

ఇటువంటి ప్రయోగం తెలుగునాట ఇంతకుముందు జరగకపోవడం వలన ఈ శీర్షిక అఖండమైన, అపూర్వమైన ఆదరణ చూరగొంది. 17 సినిమాల గురించి వ్రాసిన తర్వాత పత్రిక నిలిపివేయడం వలన తక్కిన సినిమాల గురించి తెలుసుకునే అవకాశం పాఠకులు కోల్పోయారన్న బాధతో మొత్తం 39 సినిమాల విశేషాలను పుస్తకరూపంలో తేవాలని సంకల్పించాం. అయితే ఒకే పుస్తకంగా కంటె రెండు సంపుటాలుగా వెలువరిస్తే ధరరీత్యా వెసులుబాటు ఉంటుందనే ఉద్దేశ్యంతో కొన్ని సినిమాలను మాత్రమే ఈ సంపుటంలో చేరుస్తున్నాం. తక్కినవి 'జంధ్యామారుతం - 2' లో చూడవచ్చు.

శాంతా బయోటెక్నిక్స్ ద్వారా మేలైన ఔషధాలను, టీకాలను అందుబాటుధరలో అందించి పలువురి ప్రశంసలందిన స్ఫూర్తితో నేను 'హాసం' పత్రిక ప్రచురించడం జరిగింది. పాఠకుల అభిమానం ఎంత ఉన్నా, ప్రకటనకర్తల ఆదరణ లేని కారణంగా పత్రికా నిర్వహణ భారంగా పరిణమించింది. కేవలం అమ్మకాలపై ఆధారపడి ఏ పత్రికా మనజాలదు. ఎలక్ట్రానిక్ రంగం దినపత్రికలు మాత్రమే పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయని, వాటిద్వారా మాత్రమే తమ ఉత్పాదనల కొనుగోళ్లు పెరుగుతాయని ప్రకటనకర్తలు భావించడం వల్లనే మ్యాగజైన్లకు యాడ్స్ రావు.

78 సంచికలు వెలువరించాక అయిష్టంగానే పత్రికను నిలిపివేయడం ఎందరో హాస్య, సంగీతాభిమానులను కలచివేసింది. పత్రికను పున:ప్రారంభించమని ఎన్నో అభ్యర్థనలు వెలువడ్డాయి. పాతసంచికలకోసం ఇప్పటికీ రాస్తూనే ఉన్నారు. అంటే ఆ సంచికలద్వారా పాఠకులకు అందించిన సమాచారం ఎంతో విలువైనదని ఋజువవుతోంది కదా! మేం కూడా రాబోయే సంచికలకై ఎంతో సమాచారాన్ని సేకరించి, భద్రపరచుకోవడం జరిగింది. అవన్నీ వ్యర్థం కాకుండా ఉండాలంటే, ఈ 'హాసం' ఉద్యమం కొనసాగాలంటే పత్రిక అవతారాన్ని పరివర్తనం చేసి పుస్తకరూపంలో పాఠకుల ముందుకు వద్దామని నిర్ణయించుకోవడం జరిగింది.

అయితే పుస్తక విక్రయం కూడా అంత సులువైన పనేమీ కాదు. ఏడుకోట్ల తెలుగువారున్నా, వెయ్యికాపీలు చెల్లుబాటుకావడానికి ఏళ్లూ, పూళ్లూ పడుతున్న పరిస్థితి రాజ్యమేలుతోంది. డైరక్టు మార్కెటింగు సౌకర్యాలు లేవు, ఔట్‌లెట్స్ దాదాపు కరువైపోయాయి. పుస్తకవిక్రేతల నిర్వహణాభారం

కూడా చేరి పుస్తకం ధర అసలుకు మూడురెట్లు పెరుగుతోంది. ఉద్యోగావకాశాలు పెంచే పుస్తకాలు, ఇంగ్లీషు పుస్తకాలు మాత్రమే మార్కెట్లో బాగా అమ్ముడుపోతున్నాయి. తక్కిన పుస్తకాల ప్రచురణ కిట్టుబాటు కాని వ్యాపారంగా మారిపోయింది.

ఇలాటి పరిస్థితిలో ఈ రంగంలో కాలిడి 'శాంతా బయోటెక్' ఉత్పాదనల విషయంలో మేం అవలంబించిన విధానాన్నే పుస్తకరంగంలో కూడా అన్వయించడానికి ప్రయత్నిస్తున్నాను. హెపటైటిస్-బి వ్యాధికి మేం రూపొందించిన శాన్‌వాక్-బి అనే టీకాను ప్రజలకు అందించడానికి ప్రపంచంలో ఎక్కడా జరగని స్థాయిలో క్యాంప్‌లు నిర్వహించి సామాన్యుల ముంగిట చేరాం. క్రమేపీ వారికి 'శాంతా' బ్రాండ్‌పై విశ్వసనీయత పెరిగింది. అదే విధంగా 39 నెలలపాటు నిర్వహించిన 'హాసం' ద్వారా మాకొక బ్రాండ్ ఈక్విటీ ఏర్పడింది. మా క్వాలిటీ గురించి, నిజాయితీ గురించి ప్రజలకు ఒక అవగాహన ఏర్పడింది - అనే నమ్మకంతోనే ఈ కొత్తరంగంలో అడుగిడుతున్నాం. ఇప్పటికే 15 ఊళ్లలో 'హాసం క్లబ్స్' నిర్వహించబడుతున్నాయి. రైతుబజారు ఫక్కీలో వాటి ద్వారా దాదాపు 'ప్రొడక్షన్ కాస్ట్' కే పుస్తకాలు అందించడానికి చూస్తున్నాం.

'హాసం క్లబ్స్' కు రాలేనివారి మాట? 'హాసం' బ్రాండ్‌పై విశ్వాసం గల పాఠకులు పుస్తకాల ధర మాకు నేరుగా పంపితే మేం వారికి కొరియర్ ద్వారా పంపగలుగుతాం. లేదా దగ్గర్లో ఉన్న విశాలాంధ్ర బ్రాంచీలకు (హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, హన్మకొండ, అనంతపురం, కాకినాడ) పంపుతాం. అలా అయితే ధరలో డిస్ట్రిబ్యూటర్స్ కమీషన్ వాటా మేరకు లబ్ధి పొందుతారు. పుస్తకాలు కంటచూడందే కొనలేమనే పాఠకులు సైతం ఈ పుస్తకంతో బాటు జతపరచిన కూపన్ తీసుకెళితే 'హాసం' ప్రచురణలపై 10 శాతం డిస్కౌంటు పొందుతారు.

పత్రికకు నిర్దిష్టమైన కాలపరిమితి ఉంటుంది. 'హాసం' పత్రిక ఆ పక్షం తర్వాత పాతబడిపోయేది. కానీ పుస్తకమైతే కలకాలం ఉండేది, దాచుకోదగినది, బహుమతిగా ఇవ్వదగినది. హాస్య, సంగీతాభిమానులను నిరుత్సాహ పరచకూడదన్న ఉద్దేశ్యంతోనే వారి 'డాటా బ్యాంక్' తయారుచేసి రెడీ మార్కెట్కై శ్రమిస్తున్నాం. మీ ఆదరణకై ఎదురుచూస్తున్నాం. సంవత్సరాంతంలోగా ఈ పుస్తకం పునర్ముద్రణకు వస్తే మా లక్ష్యం ఫలించినట్లే.

'హాసం' ప్రచురించబోయే పుస్తకాల గురించి కాస్త వివరణ - 'హాసం' పత్రికలో వెలువడిన అంశాలతోనే వెలువడే పుస్తకాలు కొన్ని, పత్రికలో వెలువడినవాటిని విస్తరించి నూతనాంశాలు చేర్చిన పుస్తకాలు కొన్ని, 'హాసం'లో చోటు చేసుకోకపోయినా హాస్య, సంగీతాంశాలకు సంబంధించిన పుస్తకాలు కొన్ని - ఇలా మూడు కేటగిరీలుగా పుస్తకాలు ప్రచురించబోతున్నాం.

తొలి విడతలో వెలువడే తనికెళ్ళ భరణి గారి 'ఎందరో మహానుభావులు' మొదటి వర్గానికి చెందినదయితే, పులగం చిన్నారాయణ 'జంధ్యామారుతం' రెండవ వర్గానికి చెందినది. ఈ 'అచలపతి కథలు' మూడో వర్గానికి చెందినది.

'కొనడం మీ వంతు - ఆకట్టుకొనడం మా వంతు' అని మా 'హాసం' నినాదం. మీరీ పుస్తకాలు ఆదరించి, కొని, కొనిపించి మమ్మల్ని ఉత్సాహపరిస్తే 'హాసం' ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను. ఈ ప్రచురణలపై, మార్కెటింగు విధానాలపై మీ సలహాలను 'హాసం ప్రచురణలు' అడ్రసుకుగాని, మేం నిర్వహిస్తున్న హాసంఆన్‌లైన్ డాట్‌కామ్ వెబ్‌సైట్‌కు గాని తెలుపగోర్తాము.


తెలుగునాట ప్రచురణారంగానికి ఆదరణ యింకా నశించలేదని నిరూపిస్తారని ఆశిస్తూ,

భవదీయుడు

వరప్రసాద్..

కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి

ప్రచురణకర్త



# ఆ నవ్వుల పువ్వుల పరిమళాలు...

జంధ్యాల.. అన్న మూడక్షరాలు చెవిన పడగానే తెలుగు సినిమా అభిమానుల పెదాలపై చిరునవ్వు చిందులు వేస్తుంది. రచయితగా జంధ్యాల నవరసాలనూ అద్భుతంగా పలికించినా, హాస్యరసంలో ఆయన ఒలికించిన రచన తెలుగువారిని విశేషంగా ఆకట్టుకుందని నేడు కొత్తగా చెప్పనవసరం లేదు. నటనలో హాస్యాన్ని పలికించడం ఎంతటి కత్తి మీద సామో, దానిని రచనలో చిలికించడం కూడా అంతటి సాహసమే. అయితే ఆ ఫీటును పలు చిత్రాలలో తన రచనద్వారా, దర్శకత్వంతోనూ విజయవంతంగా నిర్వర్తించినవారు జంధ్యాల. దర్శకుడిగా ఆయన రూపొందించిన చిత్రాలలో ఒకటి, అరా మినహాయిస్తే అధికశాతం హాస్యంతో అలరించినవే కనిపిస్తాయి.

జంధ్యాల రాసిన సంభాషణలను పలు చిత్రాలలో పలికాను. ఆయన దర్శకత్వం వహించిన 'చంటబ్బాయ్' లో నటించాను. నటుడిగా నాటకరంగంలో లబ్ధప్రతిష్ఠుడైన ఆయన నాతో కలిసి 'ఆపద్బాంధవుడు'

చిత్రంలో నటించారు. ఈ చిత్రంలో ఆయనను నేను 'గురువుగారూ' అంటూ ఉంటాను. ఇందులో ఆయన రాసిన కావ్యాన్ని నాకు అంకితమిచ్చే సన్నివేశముంది. ఇప్పుడు ఆయన చిత్రాలపై యువ పాత్రికేయుడు పులగం చిన్నారాయణ రాసిన 'జంధ్యామారుతం' కు ముందుమాట రాయాలని అడగ్గానే దీనిని ఒక మంచి అవకాశంగా భావించాను.

చిన్నప్పుడు చూసిన చార్లీచాప్లిన్ హాస్యాభినయం నా మనోఫలకంపై చిరస్థాయిగా నిలచిపోయింది. నా అభిమాన నటుల్లో చాప్లిన్ ఒకరని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం కూడా లేదు. ఎందుకంటే చాప్లిన్ హాస్యాభినయ ప్రభావం నుండి బయటపడ గలవారెవరుంటారు!? హాస్యం కురిపించడంలో అందెవేసిన చేయి అయిన జంధ్యాలపై కూడా చాప్లిన్ హాస్యప్రభావం సహజంగానే ఉండేది. అందుకే ఆయన పాత్రల్లో 'శ్లాప్‌స్టిక్ కామెడీ' ఎక్కువగా దర్శనమిచ్చేది. నాచేత 'చంటబ్బాయ్' చిత్రంలో ఓ సన్నివేశంలో చార్లీ చాప్లిన్ గెటప్ వేయించి, తన ముచ్చట తీర్చుకున్నారాయన. జంధ్యాల హాస్యమంటే అభిమానం కారణంగానే ఆ సినిమాలో నటించడం జరిగింది. ఆ సినిమా చూసి మా పిల్లలు ఇప్పటికీ పడిపడీ నవ్వుతూ ఉంటారు.

రచయితగా అంత్యప్రాసలతో ఆటాడుకున్న జంధ్యాల, దర్శకుడిగానూ తనదైన మార్కును పలికించారు. ఆయన దర్శకత్వం వహించిన అన్ని చిత్రాలను ఒక వరుసక్రమంలో చూడడం అరుదైన విషయం. ఇక ఆయన చిత్రాల తెరవెనుక విషయాలు తెలుసుకోవడమూ అరుదైన విషయమే! జంధ్యాల అభిమానులను అలరించేందుకు చిన్నారాయణ ఆయన చిత్రాల తెరవెనుక విషయాలను కూడా చక్కగా సేకరించి ఇందులో పొందుపరచడం అభినందనీయం. "నవ్వడం యోగం, నవ్వించడం భోగం, నవ్వకపోవడం రోగం" అని చాటిన జంధ్యాల మనల్ని వదలి వెళ్ళిపోయినా, ఆయన పంచిన నవ్వుల పువ్వులే ఆయనను మన హృదయాల్లో సజీవుని చేస్తాయి. ఆ నవ్వుల పువ్వుల పరిమళాలు 'జంధ్యామారుతం'లో మరింతగా గుబాళిస్తాయనిపిస్తోంది.

# 1

## తెలుగు అందాలతో ముద్దొచ్చేలా విరిసిన



# ముద్దమందారం


నవ్వడం భోగం
నవ్వించడం యోగం
నవ్వకపోవడం రోగం' అంటూ తెలుగు సినిమా హాస్య ప్రియత్వానికి తారక మంత్రంగా నిలిచిన దర్శకుడు జంధ్యాల.

ఓ చేత్తో 'సిరిసిరిమువ్వ'లాంటి క్లాస్ సినిమాకి, మరో చేత్తో 'అడవిరాముడు' లాంటి మాస్ సినిమాకి ఏక కాలంలో మాటలు రాసి 'శభాష్' అనిపించుకున్న జంధ్యాలకి సినీరంగప్రవేశం చేసిన నాటినుండే దర్శకత్వ శాఖ మీద ఎనలేని ప్రేమానురాగాలున్నాయి.

1976లో 'దేవుడు చేసిన బొమ్మలు' చిత్రం ద్వారా సంభాషణల రచయితగా తొలిసారిగా కలం ఝుళిపించిన జంధ్యాల... ఐదేళ్ళలోనే దాదాపు 85 చిత్రాలకు మాటలు రాయగా,అందులో 80 శాతం సినిమాలు ఘనవిజయాన్ని సాధించాయి.

దర్శకత్వ శాఖలో ఎలాంటి అనుభవమూ లేకున్నా, కేవలం పరిశీలనా సామర్థ్యంతోనే దర్శకునిగా మారారు. దర్శకునిగా తన తొలి సినిమాను ఆయన ఏ తరహాలో చేస్తారోనని సినీపరిశ్రమలోని వ్యక్తులు, ప్రేక్షకులూ ఆసక్తిగా ఎదురు చూశారు. 'శంకరాభరణం' లాంటి క్లాసిక్‌నో, 'వేటగాడు' లాంటి కమర్షియల్ మూవీనో టచ్ చేస్తారని అందరూ భావిస్తే,ఆయన మాత్రం ఓ టీనేజ్ లవ్ స్టోరీని ఎంచుకున్నారు. అది కూడా కొత్త ఆర్టిస్టులతో! "అనేక చలన చిత్రోత్సవాల్లో పాల్గొన్న నన్ను కొన్ని పాశ్చాత్య చిత్రాలు విపరీతంగా ఆకట్టుకున్నాయి. జీవితానికి, వాస్తవానికి దగ్గరగా ఎంతో గొప్పగా ఉన్నాయా చిత్రాలు. 'మనం కూడా అలా ఎందుకు నిర్మించకూడదు?' అనిపించింది. ఆలోచన వచ్చిన దగ్గర నుంచీ సినిమా డైరెక్ట్ చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించాను" అని జంధ్యాల చెప్పుకున్నారు.

జంధ్యాల దర్శకత్వం చేపడుతున్నానని చెప్పినప్పుడు చాలామంది స్నేహితులు వారించారు. '


ప్రదీప్,పూర్ణిమ



రైటర్‌గా పెద్ద పేరున్న నీకు...డైరెక్షన్ ఎందుకు?' అని కొందరంటే, 'రచయితలెవ్వరూ దర్శకులుగా సక్సెస్ కాలేదు' అని మరికొందరు కొన్ని ఉదాహరణలు చెప్పుకొచ్చారు. అయినా దర్శకత్వం మీద బాగా మమకారం వున్న జంధ్యాల నవ్వుతూనే ముందడుగు వేశారు.

జంధ్యాలకు రంగస్థలం మీద గురువు విన్నకోట రామన్నపంతులు. చిన్నతనంలో వాళ్ళింట్లోనే ఎక్కువ పెరిగారాయన. గురుపుత్రుడు విజయరామ్, జంధ్యాల మంచి స్నేహితులు. విజయవాడ ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో జంధ్యాల, విన్నకోట విజయరాం, అశ్వనీదత్, సుత్తి వీరభద్రరావు, సుబ్బరాయ శర్మ, మాధవపెద్ది రమేశ్, ఎం.వి.రఘు తదితరులంతా క్లాస్‌మేట్స్.

జంధ్యాల మదిలో దర్శకత్వపు ఆలోచనలు మొగ్గ తొడిగిన సమయంలో...విజయరామ్ మేనల్లుడు ప్రదీప్ నటించిన రంగస్థల నాటిక ఒకటి చూడడం జరిగింది. 'నిన్ను సినిమా హీరోను చేస్తాన్రా' అని ఆ కుర్రాడితో అన్నారు జంధ్యాల. డిగ్రీ సెకండియర్ చదువుతున్న ప్రదీప్‌కి మాత్రం జంధ్యాల జోక్ చేశారనుకున్నాడు. చదువుకోవడం, అప్పుడప్పుడు డ్రామాలు వేయడం తప్ప ప్రదీప్‌కి సినిమాల్లో కెళ్ళాలనే పెద్ద ఆలోచనలు లేవు. అయితే చిన్నతనంలో 'ఇదెక్కడి న్యాయం' అనే సినిమాలో ఓ చిన్న పాత్రను పోషించడం జరిగింది. జంధ్యాల అలా అన్న ఆరు నెలల తర్వాత ప్రదీప్‌కి మద్రాసు నుండి పిలుపొచ్చింది. ఆయన జోక్ చేయలేదని అప్పుడు అర్థమైందతనికి.

మద్రాస్‌లో తన ఇంట్లోనే వుంచుకుని ప్రదీప్‌కి డాన్సులు, ఫైట్లు, హార్స్‌రైడింగ్, కార్ డ్రైవింగ్ ... అన్నీ నేర్పించారు జంధ్యాల. కుర్రాడు కొంచెం బక్కపలుచగా ఉండడంతో ప్రతిరోజూ ఐస్‌క్రీమ్‌లు బాగా తినమని చెప్పేవారు. అలాగే విడుదలైన ప్రతి తెలుగు సినిమాను చూసి, అందులో హీరోలు ఎలా నటిస్తున్నారో గమనించమనేవారు.

మరో పక్క కథానాయిక కోసం అన్వేషణ మొదలైంది. వందల ఫోటోలు...జంధ్యాలకు ఒక్కరూ నచ్చరాయె ! వరలక్ష్మి, డబ్బింగ్ జానకి చెల్లెలు లక్ష్మి తదితరులు ఇందులో అవకాశం కోసం ప్రయత్నించారు. చివరికా అదృష్టం పూర్ణిమకు దక్కింది. మద్రాసులో స్థిరపడిన తెలుగు కుటుంబం వాళ్ళది. ఈ అమ్మాయికి సింగర్ అవ్వాలన్నది చిన్ననాటి కోరిక. 'హరిశ్చంద్రుడు' సినిమాలో పాట అడగడానికి వెళ్లి అనుకోకుండా అందులో చిన్నవేషం వేయాల్సి వచ్చింది. మహానటి సావిత్రి


ప్రదీప్,పూర్ణిమ

('హరిశ్చంద్రుడు' ఆమె చివరి చిత్రం) కూతురుగా నటించింది పూర్ణిమ.

పూర్ణిమ నాన్నగారికి సినిమారంగం అంటే ఇష్టం లేదు. జంధ్యాల ఆయన భయాన్ని పోగొట్టి 'మేము విశ్వనాథ్ గారి శిష్యులం. అసభ్యత అనేది మా నిఘంటువులో లేదు. ఆ దృక్పథాన్ని అనుసరించే మా చిత్రాలు ఉంటాయి' అని హామీ ఇచ్చారు. దాంతో పూర్ణిమ నటించడానికి వాళ్ల నాన్నగారు పచ్చజెండా ఊపారు.

ఇందులో హీరో హీరోయిన్లే కాదు, చాలామంది ఆర్టిస్టులు కూడా కొత్తవాళ్ళే. అన్నపూర్ణ, కృష్ణచైతన్య, రామన్నపంతులు, థమ్ వంటి కొద్దిమంది సినిమా అనుభవం ఉన్నవారు ఉన్నారు.

నటనాలయ బ్యానర్‌లో కోనేరు రవీంద్రనాథ్ సమర్పణలో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం ఫిబ్రవరి23,1981న మద్రాసులోని గిరి హౌస్‌లో (తర్వాత జయసుధ కొని అమ్మేశారు) జరిగింది. పూర్ణిమను ప్రదీప్ తన భవంతికి తీసుకెళ్ళి దేవుడి గదిని చూపడాన్ని ముహూర్తపు షాట్‌గా చిత్రీకరించారు.

ఏవో కొన్ని సన్నివేశాలు మినహా మొత్తం సినిమా అంతా వైజాగ్‌లోనే తీశారు. సింగిల్ షెడ్యూల్ ప్లాన్ చేసి టాకీపార్ట్, పాటలు అక్కడే పూర్తి చేశారు. 1,2 రోజులు ఆప్టికల్ వర్క్ మాత్రం మద్రాసులో చేశారు. అప్పటికి 'కులగోత్రాలు', 'మరో చరిత్ర' లాంటి ఏవో కొన్ని సినిమాలు మాత్రమే వైజాగ్‌లో రూపొందాయి. కానీ విశాఖ పరిసరాల్లోని కొత్త అందాల్ని, అరకులోయ సౌందర్యాన్ని రమణీయంగా తెరకెక్కించిన ఘనత మాత్రం జంధ్యాలకే తొలిసారిగా దక్కుతుంది.

యూనిట్ మొత్తం వైజాగ్‌లోని ముప్వలవాని పాలెం( ఎం.వి.పి. కాలనీ)లో బస చేశారు. అప్పుడే అక్కడ క్వార్టర్స్ నిర్మాణం జరుగుతోంది. అక్కడ 30-40 ఇళ్ళు అద్దెకు తీసుకుని ఒక ఇంట్లో కాస్ట్యూమ్స్‌కి,ఒక ఇంట్లో మేకప్‌కి, ఒక ఇంట్లో మెస్‌కి, అసిస్టెంట్ డైరెక్టర్స్ ఒకదాంట్లో, ప్రొడక్షన్ వాళ్ళు ఒక దాంట్లో, ఆర్టిస్టులు కొన్ని ఇళ్ళల్లో...ఉండడం జరిగింది. జంధ్యాల దగ్గర నుండీ ప్రొడక్షన్ బాయ్ వరకూ అందరికీ అక్కడే బస. వనభోజనాలకో, పిక్నిక్‌కో వచ్చినట్టుగా యూనిట్ సభ్యులు అనుభూతి

## పాత్రలు -పాత్రధారులు

| | |
|---|---|
| ప్రదీప్ | - ప్రదీప్ |
| దుర్గ | - పూర్ణిమ |
| రావు | - శంకర్ |
| మాలక్ష్మి | - అన్నపూర్ణ |
| మేనేజర్ మూర్తి | - కృష్ణచైతన్య |
| ఇందు | - తులసి |
| దుర్గ తాత | - విన్నకోట రామన్నపంతులు |
| క్షురకుడు | - నరసింగరావు |
| కొండడు | - శ్రీనివాసమూర్తి |

మరియు


థమ్, విన్నకోట విజయరామ్, యమ్.సి.వాస్, ఎ.వి. రామారావు, సుబ్రహ్మణ్యం, నరసింహారావు, రవి, బాబన్న, వేలు, బాబురావు, జేవియర్, జి.శ్రీనివాసమూర్తి, ఎస్.విజయకుమార్, జి.రాధాకృష్ణమూర్తి, సుధాకర్, ఇవటూరి సరోజిని ఇంకా విశాఖ రంగస్థల కళాకారులు.

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : నటనాలయ |
| సమర్పణ | : కోనేరు రవీంద్రనాథ్ |
| కథ | : జంధ్యాల |
| పాటలు | : వేటూరి |
| సంగీతం | : రమేశ్‌నాయుడు |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : ఎస్.గోపాలరెడ్డి |
| ఆపరేటివ్ కెమెరామెన్ | : యమ్.వి.రఘు |
| సహాయకుడు | : దివాకర్ |
| ఎడిటింగ్ | : జి.జి. కృష్ణారావు |
| కళ | : తోట తరణి |
| నేపథ్యగానం | : బాలు,జానకి, జిత్‌మోహన్ మిత్రా |
| నృత్యం | : శివసుబ్రహ్మణ్యం |
| అసోసియేట్ డైరెక్టర్ | : బి.యస్.నిష్టల |
| అసిస్టెంట్ డైరెక్టర్ | : బత్తుల రామకృష్ణ |
| కో -డైరెక్టర్ | : యు.వి.పాణి |
| నిర్మాతలు | : రంజిత్ -ప్రశాంత్ |
| రచన- దర్శకత్వం | : జంధ్యాల |



చెందేవారంటే, ఆ షూటింగ్ ఎంతటి ఆత్మీయపూర్వక వాతావరణంలో జరిగిందో అర్థమవుతుంది. 'ఒక ఫ్యామిలీ మొత్తం 60 రోజులు పిక్నిక్‌కి వెళ్ళినట్టు అనిపించింది' అన్నారు ప్రదీప్ ఆ రోజుల్ని గుర్తుకు తెచ్చుకుంటూ.


ఎ.వి.యస్.,ప్రదీప్

ఈ సినిమాకు ఏదైనా తెలుగుదనం వున్న పువ్వు పేరు పెట్టాలనుకున్నారు జంధ్యాల. 'సన్నజాజి','ముద్దమందారం' రెండు ఆప్షన్స్. అమాయకత్వానికి, స్వచ్ఛతకి ప్రతిరూపంగా వుంటుందని భావించి చివరికి 'ముద్దమందారం' టైటిల్ పెట్టారాయన. ఇందులో హీరోయిన్ జడలో ఎప్పుడూ ముద్దమందారమే కనిపిస్తుంది. ఈ ముద్దమందార పువ్వే హీరో, హీరోయిన్ మధ్య ప్రేమ మొగ్గ తొడగడానికి కారణమవుతుంది.

ప్రదీప్ తాతగారైన విన్నకోట రామన్న పంతులు, మేనమామ విన్నకోట విజయరామ్ కూడా ఈ చిత్రంలో నటించారు. తాత- మేనమామ- మనవడు ఒకే చిత్రంలో నటించడాన్ని ఓ ప్రత్యేకాంశంగా చెప్పుకోవాలి. హీరోయిన్ తాతగా విన్నకోట రామన్నపంతులు, పోలీస్ కానిస్టేబుల్‌గా విన్నకోట విజయరామ్‌లు ఇందులో కనిపిస్తారు. రంగస్థలంపై ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన రామన్న పంతులు, గతంలో 'బాటసారి, కన్యాశుల్కం, చదువుకున్న అమ్మాయిలు, సాక్షి, బంగారు పిచ్చుక' తదితర చిత్రాల్లో నటించారు. 'ముద్దమందారం' విడుదలైన ఏడాది తర్వాత ఆయన కన్నుమూశారు.

ఈ సినిమాలో జె.వి. సోమయాజులు ట్రూప్ 'మనిషి - నూతిలో పడితే...' అనే నాటకం వేసే సీన్ వుంది. హీరో, హీరోయిన్లు ఇంట్లోంచి పారిపోతూ, దారిలో ఈ నాటకం చూస్తారు. ఈ నాటకాన్ని సినిమా కోసం ప్రదర్శిస్తున్నారు. ఈ నాటకంలో నటించడానికి వచ్చిన ఓ బక్కపలుచని వ్యక్తి జంధ్యాలను ఆకర్షించాడు. అతనికి ఇందులో చిన్న వేషం ఇచ్చారు.

హీరో, హీరోయిన్ దొంగచాటుగా పెళ్ళి చేసుకుని వేరే ఊరు పారిపోతారు. అక్కడ ఓ హోటల్‌లో రూమ్ తీసుకుని మూడ్రోజులు తలుపులు మూసేసుకుని, అన్నపానాల సంగతి కూడా మరిచిపోయి దంపతులుగా సౌఖ్యాన్ని అనుభవిస్తారు. ఆ హోటల్ మేనేజర్ పాత్రను ఈ బక్క పలుచని వ్యక్తితో చేయించారు జంధ్యాల. అతనే ఆ తర్వాత 'నాలుగు స్తంభాలాట' తో పాపులరైన సుత్తివేలు.

ఈ సినిమాలో తనకు అవకాశం ఎలా వచ్చిందో ఇలా వివరించారు వేలు - "వైజాగ్ నావల్ డాక్‌యార్డ్‌లో పనిచేస్తున్న నాకు అనుకోకుండా జంధ్యాల పరిచయమయ్యారు. 'ముద్దమందారం'లో ఓ సీన్ నిమిత్తం జె.వి.రమణమూర్తితో 'కన్యాశుల్కం' నాటకం ప్లాన్ చేశారు. అయితే ఆయనకు కుదర్లేదు.

దాంతో మాకు 'మనిషి నూతిలో పడితే..'నాటకమాడే అవకాశం లభించింది. మొత్తం ఇరవై యారు పాత్రలు. ఆ నాటకంలో నటించిన నన్ను గుర్తుపెట్టుకుని లాడ్జి మేనేజర్‌గా వేషం ఇచ్చి నన్ను వెండితెరకు పరిచయం చేశారు జంధ్యాల గారు" అని తెలిపారు వేలు అనబడే కురుమద్దాలి లక్ష్మీ నరసింహారావు.

అయితే జె.వి. సోమయాజులు సన్నివేశాలను ఎడిటింగ్‌లో తొలగించేశారు. సుత్తివేలు, జంధ్యాల దృష్టిలో పడడానికి ఆ నాటకం మాత్రం అలా ఉపయోగపడింది.

ప్రముఖ హాస్యనటుడు ఏ.వి.యస్ ఈ చిత్రంలో చిన్న పాత్ర వేశారు. పూర్ణిమ గర్భవతి అయ్యిందన్న విషయం ఓ ఉత్తరం ద్వారా వాళ్ళ తాతయ్యకి రాస్తాడు ప్రదీప్. ఆ ఉత్తరాన్ని తాతకి చదివి వినిపించిన వ్యక్తిని కాస్త జాగ్రత్తగా గమనించండి. మొలకి టవల్ చుట్టుకుని, ముఖానికి నూనె రాసుకుని ఆ వ్యక్తి కొన్ని చోట్ల నత్తిగా మాట్లాడుతుంటాడు. అలాగే ప్రదీప్, పూర్ణిమ పూలకొట్టు ఎదురుగా వున్న టీ స్టాల్‌లో కూర్చొని ఆమెనే చూస్తుంటాడు. ఆ టీస్టాల్ ఓనరే ఏ.వి.యస్. టైటిల్స్‌లో మాత్రం ఆయన పేరు సుబ్రహ్మణ్యం గా వస్తుంది. ఏ.వి.యస్. పూర్తిపేరు ఏ.వి. సుబ్రమణ్యం. మిమిక్రీ ఆర్టిస్ట్‌గా అప్పటికే పేరు తెచ్చుకున్న ఏ.వి.యస్ ని ఎవరో స్నేహితుడు జంధ్యాలకు పరిచయం చేయడంతో ఈ వేషమిచ్చారు.

బాపు 'స్నేహం'లో హీరోగానూ, 'సీతామాలక్ష్మి, వంశవృక్షం' సినిమాల్లో గెస్ట్‌రోల్స్ చేసిన శంకర్ ఈ చిత్రంలో ప్రదీప్ తండ్రిగా నటించారు. ఆయనకు జంధ్యాలే డబ్బింగ్ చెప్పారు.

ఈ సినిమాకు డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ నిర్వహించిన ఎస్.గోపాలరెడ్డికిది రెండో చిత్రం. ఆయన తొలి చిత్రం 'సంధ్య' ద్వారా ఎ.కోదండరామిరెడ్డి దర్శకునిగా పరిచయమైతే, రెండో చిత్రం 'ముద్దమందారం' ద్వారా జంధ్యాల దర్శకునిగా పరిచయమయ్యారు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు ఎం.వి.రఘు ఈ చిత్రానికి ఆపరేటివ్ కెమెరామన్ కాగా, ఆయన దగ్గర దివాకర్ ('పడమటి సంధ్యారాగం' కెమెరామన్) సహాయకునిగా పనిచేసారు. ఇప్పుడు వాణీ అవుట్‌డోర్ యూనిట్ నిర్వహిస్తున్న సుబ్బరాజు, ప్రముఖ కెమెరామన్, నిర్మాత - వి.శ్రీనివాసరెడ్డి ఈ చిత్రానికి కెమెరా అసిస్టెంట్లుగా పనిచేసారు.






పూర్ణిమ, ప్రదీప్, వేలు

ఈ చిత్రం మొదలు పెట్టేముందు తన క్లాస్‌మేట్ మాధవపెద్ది సురేశ్(అప్పటికి ఆయన చాలా మంది సంగీత దర్శకుల దగ్గర కీ బోర్డ్ ప్లేయర్‌గా పని చేస్తున్నారు) ను మంచి మ్యూజిక్ డైరెక్టర్‌ను సూచించమని అడిగారు జంధ్యాల. రమేశ్‌నాయుడు, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పేర్లు సూచించారు సురేశ్. రమేశ్‌నాయుడు లాంటి సంగీత ఉద్యానవనం నుంచి మనసారా 'ముద్దమందారం' లాంటి గీతాలను ఏరుకున్నారు జంధ్యాల. 'ముద్దమందారం' మ్యూజిక్ సిట్టింగ్స్ కృష్ణవేణమ్మ తీరాన గల నాగార్జున సాగర్‌లోని అశోక్‌విహార్ అతిథి గృహంలో వారం రోజులపాటు జరిగాయి. తిరుగు ప్రయాణమయ్యే సమయంలో కృష్ణవేణమ్మను స్మరిస్తూ ఓ అందమైన పాట కావాలని అడిగారు జంధ్యాల. అలా ఒక పూటలో 'అలివేణీ ఆణిముత్యమా' పాట సిద్ధమైంది. పాటల చిత్రీకరణలో కూడా జంధ్యాల తనదైన శైలిని కనబరచడానికి ప్రయత్నించారు. ఇందులో మొత్తం ఎనిమిది పాటలున్నాయి. వేటూరి 7 పాటలు రాయగా, 'నా షోలాపూర్ చెప్పులు పెళ్లిలో పోయాయి' పాటను బాబన్న- సుబ్బారావు జంట రాశారు. వీళ్లే జంధ్యాల రెండో సినిమా 'మల్లెపందిరి'లో కూడా 'లాగడానికెందుకురా తొందరా...' అనే పేకాట పాటను రాశారు. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జానకి ఈ 'ముద్దమందారం' చిత్రంలోని పాటల్ని ఆలపించగా, 'నా షోలాపూర్ చెప్పులు పెళ్ళిలో పోయాయి' పాటను మాత్రం జిత్‌మోహన్ మిత్రా పాడారు. 'గుమ్‌నామ్' చిత్రంలోని 'హమ్ కాలే హైతో క్యా హువా దిల్ వాలే హై' అనే హిందీ పాటట్యూన్ దీనికి ఒరిజినల్.

యూనిట్‌కి చేదోడు వాదోడుగా ఉండే బాబన్న(జంధ్యాల స్నేహితుడు) ఓ రోజు బి.సుబ్బారావు అనే రచయితను జంధ్యాలకు పరిచయం చేశారు. ఆయన ఓ 15 పేరడీ పాటల్ని వినిపించారు. 'పెళ్లాడే తీరాలన్నారు మా నాన్నారు' అనే పాటకు పేరడీగా రాసిన 'నా షోలాపూర్ చెప్పులు...' పాట జంధ్యాలకు బాగా నచ్చేసింది. మ్యారేజ్ సీన్‌లో కామెడీ సీన్స్‌కన్నా ఈ సాంగ్ పెడితే బాగుంటుందని అనుకున్నారు. రాజమండ్రికి చెందిన జిత్‌మోహన్ మిత్రా తన ఆర్కెస్ట్రాతో 'పెళ్లాడే తీరాలన్నారు మా నాన్నారు' అనే పాటను ఎక్కువసార్లు పాడి ఉన్నారు. అందుకే 'నా షోలాపూర్ చెప్పులు' పాటను ఆయనతోనే పాడించి, ఆయన మీదనే చిత్రీకరించా లనుకున్నారు జంధ్యాల. కారణాంతరాల వల్ల

## కథా సంగ్రహం

ప్రదీప్ ఓ గొప్పింటి కుర్రాడు. విదేశాల్లో చదువుకుని వచ్చిన ప్రదీప్‌కి తమ అమ్మాయినిచ్చి పెళ్ళి చెయ్యాలని చాలామంది సంపన్నులు ఆశపడతారు. దేవాలయం దగ్గర పూలమ్ముకునే దుర్గ, ప్రదీప్ గాఢంగా ప్రేమించుకుంటారు. తండ్రి కుదిర్చిన ఇందుతో పెళ్ళిని తెలివిగా క్యాన్సిల్ చేయిస్తాడు ప్రదీప్. వీళ్ళ ప్రేమని ప్రదీప్ తండ్రి రావు అంగీకరించడు. దుర్గ ప్రేమకు ఖరీదు కట్టాలని ప్రయత్నిస్తాడు. దాంతో ప్రదీప్, దుర్గ లేచిపోయి పెళ్ళి చేసుకుంటారు. ఇద్దరూ పనులు చేసుకుంటూ సంసారాన్ని నెట్టుకొస్తుంటారు. దుర్గ గర్భవతి అవుతుంది. ఈ విషయం దుర్గ తాతకి ఉత్తరం రాస్తాడు ప్రదీప్. వీళ్ళ ఆచూకీ తెలుసుకున్న దుర్గ సవతితల్లి తమ్ముడు కొండడు దుర్గను బలవంతంగా ఈడ్చుకుపోతుంటే, ప్రదీప్ అడ్డుపడతాడు. దుర్గ ఓ మగబిడ్డను ప్రసవిస్తుంది. దుర్గ పిన్ని మాలక్ష్మి, ప్రదీప్ నాన్న రావు తమ దగ్గరకు రావడం గమనించి ప్రదీప్, దుర్గ ఆత్మహత్య చేసుకోవాలనుకుంటారు. చివరికి పసిబిడ్డ సాక్షిగా ప్రదీప్, దుర్గకు మళ్ళీ పెళ్ళి జరిపించి ప్రేమ గొప్పతనాన్ని అంగీకరిస్తాడు రావు.

మిత్రా ఆ షూటింగ్‌కు వెళ్లలేక పోయారు. దాంతో వేరే వాళ్లమీద చిత్రీకరించేశారు.

'ముద్దమందారం'లో పాటల బాణీలు, సాహిత్యం, చిత్రీకరణ ఉన్నత స్థాయిలో ఉంటాయి. పాటల చిత్రీకరణ కోసం ముందుగా లొకేషన్ల ఎంపిక చేయలేదు. జంధ్యాల కారు ముందు బయలుదేరితే ఆ వెనుకే మిగతా వ్యాన్లు, కార్లు, జనరేటర్ వెళ్ళేవి. జంధ్యాల కారులో ఎస్.గోపాలరెడ్డి, ప్రదీప్, పూర్ణిమ కూర్చునేవారు. దారిలో ఎక్కడైనా మంచి లొకేషన్ కనబడితే, అక్కడాపి పాట తీసేవారు జంధ్యాల.

**పాటలు**

| పల్లవి | - అభినయించినవారు |
|---|---|
| 1. ముద్దుకే ముద్దొచ్చే మందారం | - ప్రదీప్,పూర్ణిమ |
| 2. కలకంఠి కొలకుల్లో | - ప్రదీప్,పూర్ణిమ |
| 3. ఆ రెండు దొండపండు పెదవుల్లో | - ప్రదీప్, పూర్ణిమ, విన్నకోట రామన్న పంతులు |
| 4. నా షోలాపూర్ చెప్పులు పెళ్ళిలో పోయాయి | - గ్రూప్ |
| 5. జొన్న చేలో జున్ను అన్నుల మిన్న | - ప్రదీప్,పూర్ణిమ |
| 6. అలివేణి ఆణిముత్యమా | - ప్రదీప్,పూర్ణిమ |
| 7. నీలాలు కారేనా | - ప్రదీప్,పూర్ణిమ |
| 8. జో..లాలీ....జో లాలీ | - ప్రదీప్, పూర్ణిమ |

"ఆయన పాటల్లోని భావుకతకు, చిత్రీకరణ శైలికి నా ఒళ్ళు పులకరించిపోయేది" అని చెప్పారు ప్రదీప్. 'కలకంఠి కొలకుల్లో' పాటను తొమ్మిది రోజుల పాటు చిత్రీకరించారు. పాటలోని ప్రతి లైనుకి తగ్గట్టుగా సూక్ష్మంగా చాలా విశ్లేషణాత్మకంగా చిత్రీకరించారు.

జంధ్యాలపై కె.విశ్వనాథ్ ప్రభావం చాలా ఉండేది. సెట్లో ఏ మాత్రం క్రమశిక్షణ తప్పినా సహించేవారు కాదు. విశ్వనాథ్ సెట్లో ఖాకీ బట్టలు వేసుకున్నట్టుగానే,ఈయన కూడా వైట్ డ్రెస్ వేసుకునేవారు. సెట్లో టైగర్‌లా కనిపించే జంధ్యాల షూటింగ్ పూర్తి కాగానే మాత్రం బాల్య మిత్రునిలా అందరితో కలిసిపోయేవారు.

ఓ రోజు కోటపాడులో షూటింగ్ జరుగుతోంది. ప్రదీప్,పూర్ణిమలు చాపమీద పడుకుని 'ఇవాళ్టికి కడుపునిండా భోంచేసి ఐదురోజులైంది'అని సంభాషించడాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ లోగా లంచ్‌బ్రేక్ వచ్చింది. ఓ పక్క భోంచేస్తూనే, మరోపక్క జోక్స్‌తో అందర్నీ తెగ నవ్వించేశారు జంధ్యాల. షాట్ రెడీ అయ్యింది. డైలాగ్ చెప్పడానికి ప్రదీప్ చాలా టేకులు తీసుకున్నారు. దాంతో ఒళ్లు మండిపోయింది



పూర్ణిమ, విన్నకోట రామన్న పంతులు, ప్రదీప్



జంధ్యాలకి. 'ఏం ఆడుకోవడానికి వచ్చావా? సినిమా అంటే లక్షలతో వ్యాపారం. నీ మీద లక్షలు పెడుతున్నాం. చిన్న డైలాగ్ కూడా చెప్పలేకపోతే ఎలా...?' అని చెడామడా తిట్టేశారు జంధ్యాల. ఎప్పుడూ ప్రేమగా చూసుకునే ఆయన తొలిసారి అలా కసురుకునే సరికి ప్రదీప్ కళ్ళవెంబడి నీళ్ళు వచ్చేసాయి. వెంటనే జంధ్యాల 'రెడీ..టేక్' అన్నారు. షాట్ బాగా వచ్చింది. వెంటనే చిన్నపిల్లాడిలా ఆనందంతో క్లాప్స్ కొట్టారు జంధ్యాల. 'ఇందుకోసమే నిన్ను తిట్టాను' అన్నారు ప్రదీప్‌తో ఆ తర్వాత.

| | | |
|---|---|---|
| విడుదల | : | **11-9-1981** |
| నిర్మాణప్రాంతాలు | : | వైజాగ్, శ్రీకాకుళం, అరకులోయ, కోటపాడు, శృంగవరపుకోట, భీమిలి తదితర ప్రాంతాలు. |
| నిర్మాణవ్యయం | : | సుమారు 17 లక్షల రూపాయలు |
| నిర్మాణ సమయం | : | సుమారు 60 రోజులు. |

ఆ వయసులో పూర్ణిమ చాలా అమాయకంగా ఉండేది. నటనలో ఏ మాత్రం అనుభవం లేకపోయినా చిలుక మాటలు నేర్చినట్టుగా జంధ్యాల ఎలా చెబితే అలా చేసేది. ఓ సన్నివేశంలో ప్రదీప్, పూర్ణిమ హోటల్‌లో రూమ్ తీసుకుని స్వేచ్ఛాప్రపంచంలో విహరిస్తారు. ఆ సన్నివేశంలో – 'పూర్ణిమా! ఇన్నాళ్లూ మీరిద్దరూ ప్రేమించుకున్నారు. ఇక్కడ మీ ప్రేమకు అడ్డు చెప్పే వాళ్లెవరూ లేరు. ఇప్పుడు నీ ముఖంలో తృప్తి కనిపించాలి' అన్నారు జంధ్యాల. వెంటనే పూర్ణిమ –'అంకుల్ ! తృప్తి అంటే ఏమిటి?' అని అడిగింది. దానికి జంధ్యాల ఏమి సమాధానం చెబుతారు?

అతి మామూలు ప్రేమకథను సహజంగా, అందంగా మలిచేందుకు జంధ్యాల చాలా శ్రమ పడ్డారు. ఈ సినిమా జంధ్యాలకు ఎంతో గుర్తింపు తీసుకువచ్చింది. అలాగే హీరో ప్రదీప్‌కు కూడా విపరీతమైన క్రేజ్ తీసుకువచ్చింది. "యూత్‌లో నాకు చాలా పెద్ద క్రేజ్ వచ్చింది. మద్రాస్ నుండి సినిమా ఇండస్ట్రీ షిఫ్ట్ కాకముందు, హైదరాబాద్‌లో ఉన్న హీరోలు అక్కినేనిగారు, నేనే. తెలంగాణాలో ఏ సభ, సమావేశం జరిగినా నన్ను పిలిచేవారు. లెక్కలేనన్ని సభలకు హాజరయ్యాను" అని ఆనాటి మధురానుభూతులను గుర్తుకు తెచ్చుకున్నారు ప్రదీప్.



ప్రదీప్, పూర్ణిమ

ఈ సినిమా చేసేటప్పుడు ప్రదీప్ వయసు 20 ఏళ్ళు. ఓ పక్క షూటింగ్ చేస్తూనే, మరోపక్క బి.కాం ఫైనలియర్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అయ్యారు. ఈ సినిమా విడుదలయ్యేదాకా తాను సినిమా హీరోనన్నది కలగానే భావించేవారు ప్రదీప్. స్క్రిప్ట్ మొదలు పెట్టిన దగ్గర్నుంచీ, సినిమా ఫస్ట్‌కాపీ వచ్చేవరకూ జంధ్యాల టీమ్‌లో ఓ సభ్యుడిలాగానే ఉన్నారాయన.


వేలు తొలివేషం

ఈ సినిమాలో హీరోగా నటించినందుకు ఆయనకు 2,500 రూపాయలు పారితోషిక మిచ్చారు. " హీరోగా అవకాశం ఇవ్వడవే చాలా ఎక్కువ. అలాంటిది జంధ్యాలగారు తన ఇంట్లోనే ఏడాది పాటు ఉంచుకున్నారు. అన్ని ఖర్చులూ ఆయనవే. అలాంటిది పారితోషికం కూడా ఇప్పించారు" అని తెలిపారు ప్రదీప్. ఇందులో ప్రదీప్‌కి డబ్బింగ్ చెప్పింది ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం. "తొలుత ఈ విషయంలో చాలా బాధపడ్డాను. కానీ సినిమా రిలీజయ్యాక బాలుగారి వాయిస్ వల్ల నా పాత్రకి మంచి డెప్త్ వచ్చిందని అర్థమైంది. నాది టీనేజ్ కాబట్టి వాయిస్ సరిగా ఉండదని జంధ్యాల గారు బాలుతో చెప్పించారు" అని వివరించారు ప్రదీప్.

ఈ సినిమా టైటిల్స్‌ని కూడా జంధ్యాల డిఫరెంట్‌గా ప్రజెంట్ చేసారు. తన టైటిల్‌కి మాత్రం బ్యాక్‌డ్రాప్‌లో చేతులు జోడించడాన్ని వేసుకున్నారు. తన తొలి సినిమా కాబట్టి అందరికి వినయంగా నమస్కరించా రనుకోవాలి.

ఈ సినిమా రిలీజ్‌కు ముందు థియేటర్స్‌లో ట్రైలర్స్ రిలీజ్ చేశారు. వేటూరి పాట మొదలు పెట్టడం, దానికి రమేశ్‌నాయుడు ట్యూన్ కట్టడం, ఆ పాటను బాలు ఆలపించడం, పాట చిత్రీకరణకు రిహార్సల్స్ చేయడం, ఓ పల్లెటూళ్ళో పాటను షూట్ చేయడం... ఈ షాట్స్ అన్నీ చూపించి ఫైనల్‌గా 'అలివేణీ ఆణిముత్యమా' పాట చూపిస్తారు. ఈ ఎపిసోడ్ మొత్తాన్ని థియేటర్స్‌లో ట్రైలర్‌గా ప్రదర్శించటాన్ని అప్పట్లో కొత్తగా చెప్పుకున్నారు. టీనేజ్ లవ్‌స్టోరీ కావడంతో అప్పటి నియమనిబంధనల ప్రకారం ఈ చిత్రానికి 'ఎ' సర్టిఫికేట్ ఇచ్చారు సెన్సారు వారు.

ఈ చిత్రాన్ని చింపూ(రాజ్‌కపూర్ చివరి కుమారుడు) హీరోగా, పద్మినీకొల్హాపురి హీరోయిన్‌గా, జంధ్యాల దర్శకత్వంలోనే హిందీలో తీయాలని టి.సి.దివాన్ అనే నిర్మాత ముచ్చట పడ్డాడు కూడా ! ఎందుకో అది కార్యరూపం దాల్చలేదు.

ఈ చిత్ర శతదినోత్సవం మద్రాస్‌లోని పామ్‌గ్రోవ్ హోటల్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు కె.బాలచందర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. గుమ్మడి, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.


తమ ఊళ్లో షూటింగ్ జరుపుకున్న 'ముద్దమందారం' శతదినోత్సవం జరుపుకోవడంతో తెగ సంబరపడ్డ కె.కోటపాడు గ్రామ ప్రజలు జనవరి 22, 1982 నాడు జంధ్యాలకు భారీ ఎత్తున పౌరసన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన జంధ్యాల "జయమాలిని డ్యాన్స్ ఉంటేనే గానీ హిట్ కాని నేటి క్యాబరే యుగంలో, నటనంటే తెలియని నటులతో నిర్మించిన 'ముద్దమందారం' ప్రజాదరణ పొంది నా దర్శకత్వ కీర్తి పెంచింది" అని పేర్కొన్నారు.

నిజంగానే 'ముద్దమందారం' జంధ్యాల కీర్తికిరీటంలో ఓ కలికితురాయిగా నిలిచిపోయింది.



2

## జంధ్యాల 'పెన్'చి పెద్ద చేసిన మల్లె 'ఫన్'దిరి




మొదటి సినిమా 'ముద్దమందారం' విజయపరిమళాలు వెదజల్లడంతో, జంధ్యాల కాన్ఫిడెంట్‌గా, కామి'డీ'సెంట్‌గా(తో) రెండో సినిమా తీశారు. కాస్సేపు అందర్నీ ఆనందంగా నవ్వించాలనే ఉద్దేశంతో 'మల్లెఫన్‌దిరి' నేయడం మొదలు పెట్టారు. 35 ఏళ్ల బ్రహ్మచారి కథ ఈ చిత్రంలోని ఇతివృత్తాంతం. 'ముద్దమందారం'లో కొత్త హీరో, హీరోయిన్లను పరిచయం చేసినట్టుగానే, 'మల్లెపందిరి' కింద విజ్జీబాబు అనే కొత్త కుర్రాడికి బాపు 'తూర్పువెళ్లే రైలు' లో ఫస్ట్‌క్లాస్ పాసింజర్ అయిన జ్యోతి అనే అమ్మాయితో జట్టు కట్టించారు. అలాగే రోజూ మూడు పూటలా పాటలతో బిజీగా ఉండే ప్రసిద్ధ గేయ రచయిత వేటూరి సుందర్రామ్మూర్తి, ప్రఖ్యాత నేపథ్యగాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంలను ఈ 'మల్లెపందిరి' కిందికి అతిథులుగా ఆహ్వానించారు జంధ్యాల.

ప్రొఫెషనల్ కిల్లర్ షేక్ మోజెస్ మూర్తిగా చాలా విచిత్రమైన పాత్రను ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పోషించారు. చావుకు కులాలు, మతాలు లేవు. అతని వృత్తి చంపటమే గనుక అలాంటి తేడా లేకుండా మూడు మతాల పేర్లు కలిపి పెట్టారు జంధ్యాల చమత్కారంగా. 'తుగ్లక్'లో తొలిసారి తెరపై కనబడి 'పక్కింటి అమ్మాయి' తో నటుడయిన బాలుకి నటుడిగా ఇది రెండో చిత్రం.

ఆ రోజు రాజమండ్రి రోడ్ కమ్ రైలు బ్రిడ్జి దగ్గర బాలు, విజ్జిబాబు, జ్యోతిలపై సన్నివేశం తీస్తున్నారు. ఈ సినిమాలో ఒక సందర్భంలో హీరో తనను చంపొద్దంటూ బాలు వెంట పడతాడు భార్యతో సహా. బ్రిడ్జి కింద నుంచి ఓ టవర్ చుట్టూ వున్న స్పైరల్ స్టేర్ కేస్ మీదుగా బ్రిడ్జిపైకి చేరి పేరపెట్‌వాల్ ఎక్కి దూకి, అక్కడున్న ఓ స్కూటర్ మీద బాలు వెడుతుంటే హీరో ఆయన వెంట బడుతుంటాడు. అసలే బాలుది భారీ శరీరం. అంత దూరం నడిచి ఎడ్వంచర్ చెయ్యడం ఒక్కసారికే చాలా కష్టం. అందుకని జంధ్యాల, గోపాలరెడ్డి డైరెక్టుగా టేక్ చేద్దామన్నారు. బాలు చాలా సీరియస్‌గా ఆ సీన్ ముగించి రొప్పుతూ బ్రిడ్జి మీద కుర్చీలో చేరగిలబడ్డారు. 'అమ్మయ్య! సీన్ అయిపోయింది' అని తెగ ఆనందపడిపోయారు. తీరా జంధ్యాల, గోపాల్‌రెడ్డి వచ్చి చావుకబురు చల్లగా ఊదారు. 'బాలూ! టేకులో కెమెరాలో ఫిల్మ్ తిరగలేదు. మరొక టేకు చేయాలి' అని అన్నారు. ఓ అరగంట విరామం ఇచ్చి బాలు ఆ సీన్ పూర్తి కావించారు.

హీరోగారొకానొక సందర్భంలో ఈ షేక్ మోజెస్ మూర్తిని కలిసి 'నన్ను గ్యారంటీగా చంపేయ్యాలి' అని ఒప్పందం కుదుర్చుకుంటాడు. "ప్రాణం పోయినా, ఈ షేక్ ఆడిన మాట తప్పడు మిస్టర్. ఒప్పుకున్న పని పూర్తయ్యేదాకా, ఈ షేక్ మరో విషయాన్ని వినడు, మాట్లాడడు, చూడడు. నలభై ఎనిమిదో గంటలోపు నీ శవాన్ని కళ్ళజూస్తాను" అని షేక్ మోజెస్ మూర్తి హామీ ఇచ్చేస్తాడు. తీరా హీరోగారికి హీరోయిన్ మళ్ళీ దగ్గరవ్వడంతో ప్రాణాల మీద తీపి కలుగుతుంది. దాంతో షేక్ మోజెస్ మూర్తి నుంచి తప్పించుకోవడం కోసం హీరోగారు నానా కష్టాలు పడతారు.

ఇంతకూ ఈ షేక్‌మోజెస్ మూర్తి... విలన్ కాదు, హీరోనే. ఈయన అసలు పేరు సత్యమూర్తి. స్టేట్ బ్యాంక్ ఆఫీసర్. పెళ్ళయిన ఏడాది తర్వాత ... సత్యమూర్తి వెర్రి ఆవేశంతో భార్యని తిట్టి కొడితే, ఆవిడ బిడ్డతో సహా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. క్షణికమైన ఆవేశంతో ప్రాణాలు

## పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| వెంకు | : విజ్జిబాబు |
| శ్యామల | : జ్యోతి |
| షేక్ మోజెస్ మూర్తి | : ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం |
| ప్రేమ గురువు | : వేటూరి |
| ముద్దమందారం 'జంట': | ప్రదీప్, పూర్ణిమ |
| జానకమ్మ | : సుందరలక్ష్మి |
| పేరిశాస్త్రి | : నరసింగరావు |
| సరస్వతమ్మ | : ధనశ్రీ |
| సుగుణ | : కృష్ణవేణి |
| భీముడు | : సత్తిబాబు |
| మంగపతి | : ధమ్ |
| నీలకంఠం | : విజయరామ్ |
| అప్పారావ్ | : వేలు |
| సంగీతం మేష్టారు | : హేమసుందర్ |
| గోదావరమ్మ | : లక్ష్మీకాంతమ్మ |
| డుంబు | : ఆలీ |
| కుమారి | : ఫణి |
| శంకర్రావు | : జిత్‌మోహన్‌మిత్రా |
| మధు | : మధు |
| అన్నపూర్ణమ్మ | : అన్నపూర్ణ |
| బేబీ | : లలితా సుబ్బలక్ష్మి |

**మరియు**

అనూరాధ, శ్యామల(వైజాగ్), బాజంగ్‌రావ్, వంగల శ్రీరామమూర్తి, కబీర్‌దాస్, ఆదినారాయణ, శ్రీపాద పట్టాభి, అమరప్రసాద్, ప్రసాద్, చిరంజీవి, గణేష్‌రావ్, ఇంద్రకుమార్, శేఖర్‌బాబు, బాబి, బేబి కామాక్షి, మాస్టర్ గణేష్, లడ్డు శ్రీరామమూర్తి, త్రిమూర్తి, మూర్తిశ్రీ, వెంపటాపు సత్యనారాయణ.


విడుదల
1982
నిర్మాణ ప్రాంతాలు
రాజమండ్రి పరిసరాలు
నిర్మాణ సమయం
30 రోజులు




విజ్జిబాబు, జ్యోతి

తీసుకోబోయిన వెంకట్రావు, అదేనండి మన హీరో, వెంకూలో మార్పు కోసం ఇలా షేక్ మోజెస్ మూర్తిగా మారువేషం వేస్తాడు సత్యమూర్తి.

ఇక వేటూరి విషయానికి కొద్దాం. ఇందులో ఆయన పాత్ర పేరు 'ప్రేమ గురు'. హీరోకి ప్రేమ పాఠాలు బోధిస్తుంటారు. ఈయన పాఠాలు చెప్పాలంటే కాస్త ఖర్చవుతుంది. ఫలం... పుష్పం... తోయం సమర్పించుకోవాలి. ఫలమంటే చికెను, పుష్పమంటే మల్లెపూలదండ, తోయమంటే ఓ క్వార్టర్ బాటిల్ బ్రాందీ. ఓ పెద్ద పరుపు నేలమీదేసుకుని, దాని మీద ముఖమల్ దుప్పటీ పరుచుకుని, బోల్డన్ని దిళ్ళ మధ్య కాషాయదుస్తుల్లో సుఖాసీనులై వుంటారు ఈ ప్రేమ గురువు. ముప్పొద్దులా సుష్టుగా భోంచేస్తూ, శనివారం రాత్రైనా నీచు తగలందే నిద్రపోరాయన. గురువు కాబట్టి గడ్డాలుంటాయనుకోవద్దు. శుభ్రంగా స్విష్ బ్లేడుతో ఒకటికి రెండు సార్లు షేవ్ చేసుకుని నీటుగా కనిపిస్తారాయన. ఈయనగారు తన దగ్గరకొచ్చేవాళ్ళని 'ఖుషీభవ!' అని ఆశీర్వదిస్తుంటారు. ఆయన అరచేతిలో ఆఠీన్‌మార్కు హృదయంలోకి దూసుకువెళ్తున్న బాణం బొమ్మ తప్పనిసరిగా వుంటుంది "ఇదివరకటి ఉద్యోగమేనా నాయనా?" . "ఇదివరకటి ఇల్లేనా నాయనా?". ఇది వరకటి ఇల్లాలేనా?"... ఎవర్నైనా ఇలా అడగడం ఆయన కలవాటు. మధ్యమధ్యలో 'మానసవీణా మధుగీతం-మన సంసారం సంగీతం' అంటూ రాగయుక్తంగా, పాటలందుకుంటుంటారు. ఈ ప్రేమగురువు దృష్టిలో 'ప్రేమ' అనేది ఒక దుష్టసమాసం. ప్రే అంటే ఇంగ్లీషులో 'ఎర' అని అర్థం. 'మా' అంటే సంస్కృతంలో 'వద్దు' అని అర్థం. అంచేత ప్రేమంటే ఎర కావద్దూ, బలి కావద్దూ అని కొత్త తాత్పర్యం చెబుతారాయన.


షేక్ మోజెస్ మూర్తి'గా బాలు

ఇంతకూ ఈయనగారు 'ప్రేమగురువు' అవతారం ఎత్తడానికి ఓ కారణం వుంది. ఆయన సైటు కొట్టిన చిలక పెళ్ళికి సిగ్నల్ ఇవ్వలేదట. అప్పట్నుంచే దీక్ష బూని, ప్రేమని శోధించి, మథించి, ఓ థీసిస్ తయారు చేస్తారు.

ప్రేమగురువు సలహాలందుకుని సాధించుకున్న శిష్యులంతా,

## కథాసంగ్రహం

వెంకూకు 35ఏళ్ళు నిండాయి. అయినా పెళ్ళి కాలేదు. పెళ్ళి చేసుకోవాలంటే ఏం చేయాలనే ఆలోచనతో ప్రేమ గురువును ఆశ్రయిస్తాడు. ఆ చిట్కాలు ఫలించకపోయినా మొత్తానికి వెంకూ శ్యామల అనే ఓ చిన్నదాని మనసు జయిస్తాడు. పెళ్ళి చేసుకుంటారు. కాలం కలిసిరాక వెంకూ ఉద్యోగం ఉడితే, కాలం కలిసి వచ్చి శ్యామలకు ఉద్యోగం వస్తుంది. ఆడదాని సంపాదనతో బతుకుతున్నాడని చుట్టు పక్కల సమాజం వేళాకోళం చేస్తుంది. దాంతో భార్యభర్తలు విడిపోతారు. ఎవరూ తనకు లేరన్న ఉద్దేశంతో ఆత్మహత్యకు ప్రయత్నిస్తాడు. అదీ చేతకాక షేక్ మోజెస్ మూర్తి అనే ప్రొఫెషనల్ కిల్లర్‌తో తనను చంపేందుకు వెంకూ ఒప్పందం కుదుర్చుకుంటాడు. అప్పుడు శ్యామల క్షమించమంటూ ఇంటికి వస్తుంది. పెళ్ళాన్ని చూశాక బతకాలనే కాంక్ష పుడుతుంది. ఇటు చంపాలనే ఒప్పందం, ఇటు బతకాలనే కాంక్ష మధ్య వెంకూ ఇరుక్కుని ఎలా ఇబ్బందులు పడ్డాడో, అదే ముగింపు.

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : కాంతి ఫిలింస్ |
| సంగీతం | : రమేష్‌నాయుడు |
| పాటలు | : వేటూరి, బాబన్న-సుబ్బారావ్ |
| నేపథ్యగానం | : ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్. జానకి |
| డైరెక్టర్ ఆఫ్ సినిమాటోగ్రఫీ | : ఎస్.గోపాలరెడ్డి |
| కెమెరామన్ | : ఎం.వి.రఘు |
| ఎడిటింగ్ | : జి.జి.కృష్ణారావు |
| ఆర్ట్ | : తోట తరణి |
| డాన్స్ | : కుమారి |
| మేకప్ | : హరి |
| స్టిల్స్ | : సెబా - రాజా |
| కో- డైరెక్టర్స్ | : యు.వి.పాణి, బి.ఎస్.నిష్ఠల |
| అసోసియేట్ డైరెక్టర్ | : ఎల్. సత్యానంద్ |
| ప్రొడక్షన్ మేనేజర్స్ | : బి.సత్యం, ఎమ్. సత్యనారాయణ |
| నిర్మాత | : చల్లా వెంకట్రామయ్య |
| కథ-మాటలు-దర్శకత్వం | : జంధ్యాల |


ప్రేమగురువుగా వేటూరి

పెళ్ళి హడావిడీ, 'హనీమూనింగు' వల్ల ఆయన్ని తాత్కాలికంగా మర్చిపోయినా, ఖాళీ దొరగ్గానే సతీసమేతంగా వెళ్లి ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుని మరీ వెళ్లారు.

ఆ రీతినే 'ముద్దమందారం' సినిమా జంట ప్రదీప్, పూర్ణిమ కూడా ఆయన దగ్గరకు విచ్చేస్తారు. దారిలో కనపడ్డ మన హీరోగారికి "మేమిద్దరం ప్రేమ గురువుగారి ఆశీస్సులందుకునే ప్రేమించుకున్నాం. గురువుగారికి మా పిల్లాణ్ణి చూపిద్దామని వచ్చాం" అని చెబుతారు వాళ్ళు.

ఈ 'ప్రేమగురువు' పాత్ర గురించి వేటూరి ఏమన్నారో చూద్దాం. "నన్ను, నా హావభావాలను, నా మాటలను మహా మురిపెంగా చూసుకున్న 'నా వాడు' జంధ్యాల. నన్ను నటుడుగా చూడాలని ఆయన తపన పడేవాడు. 'మల్లెపందిరి'లో కకుంభంజకం స్వాములవారుగా నా చేత వేషం కూడా వేయించి మురిసి పోయాడు. నన్ను నటింపజేసి - రచన కన్నా నటన కష్టతరమనే సత్యం గ్రహింపజేశాడు" అని చెబుతారు వేటూరి. వేటూరి పాత్రను ఆయన రాసిన పాటలతోనే కొన్ని సంభాషణలు అల్లి ఆ పాత్రకు నేటివిటీ తెచ్చే ప్రయత్నం చేశారు జంధ్యాల.

"ద్వితీయ విఘ్నం వుండకూడదనే ఉద్దేశంతోనే జంధ్యాలగారు మా ఇద్దరినీ ఇందులో నటింపజేసారు" అని ప్రదీప్ తెలిపారు.

విజ్జిబాబు వదినగా చిలక రాధ నటించారు. తణుకుకు చెందిన చిలక రాధ (అసలు పేరు అనూరాధ) అనేక నృత్యప్రదర్శనలు ఇచ్చారు. ఆమె తొలి చిత్రం 'కురుక్షేత్రం'. ఇది ఆమెకు రెండో చిత్రం.

ఇందులో సత్తిబాబు పాత్ర పేరు భీముడు. ఇంటిపేరు 'కండలవారు'. ఈ భీముడి బామ్మ పేరు గోదావరమ్మ. ఆవిడ జీవితాశయం ఈ భీముడు - పేరుకు తగ్గట్టు తయారవ్వాలని. పాతికేళ్లొచ్చినా ఎముకుల గూడులా మిగిలిపోయిన భీముడ్ని కసరత్తు చేయించనిదే ఏ రోజూ నిద్రపోదు.

ఇక మన హీరోగారి విషయానికొద్దాం. ఇతని పేరు




వేలు

వెంకట్రావు. వాళ్ళమ్మేగాక తెలిసిన వాళ్ళంతా కూడా 'వెంకూ' అనే పిలుస్తుంటారు. ముప్ఫై ఐదేళ్ల వచ్చాయిగానీ, పాపం ఇంకా పెళ్లియోగం పట్టలేదు. అమాయక శిఖామణి, శుద్ధ బుద్ధావతారం. బట్టల కొట్లో సేల్స్‌మన్ వుద్యోగం చేస్తుంటాడు. లాల్చీ పైజామా, మెళ్ళో గుడ్డ సంచీ, కళ్ళజోడు ...ఇదీ అతగాడి అవతారం.

35 సంవత్సరాలు వచ్చినా పెళ్ళికాని అమాయక బ్రహ్మచారి కథ కాబట్టి, నిజంగా 35 సంవత్సరాలుండి బ్రహ్మచారిలా కన్పించే నటుడు విజ్జిబాబుని ఎన్నుకున్నారు జంధ్యాల. విజ్జిబాబు అసలు పేరు విజయప్రసాద్.

ఓ దృశ్యంలో హీరో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాలి. దాని కోసం యూనిట్ అంతా రాజమండ్రి రోడ్ కమ్ రైలు బ్రిడ్జి మీద ఆ షాట్ ఏర్పాటు చేసి కూర్చున్నారు రైలు రాకకోసం. వస్తున్న రైలు అతన్ని గుద్దేస్తే ఆత్మహత్య జరిగినట్లు చిత్రీకరించాలన్నది జంధ్యాల ప్లాన్. ఎక్కడో దూరంగా రైలు వస్తున్న శబ్దంతో యూనిట్ అంతా రెడీ అయ్యారు. విజ్జిబాబు నడుస్తున్నాడు. రైలు దగ్గరకొచ్చే కొద్దీ అతనిలో భయం పట్టుకుంది. రైలు దగ్గరకు రాకముందే భయంతో విజ్జిబాబు పక్కకు దూకేయడంతో జంధ్యాలతో పాటు యూనిట్ అంతా తిట్టిపోశారు. మళ్ళీ రైలు కోసం వెయిటింగ్.

మళ్ళీ మరో రైలు వచ్చింది. మళ్ళీ అదే పరిస్థితి. 'ఇక ఆఖరి ఛాన్స్. ఈసారి టేక్ ఓకే కాకపోతే.. ' అని జంధ్యాల బెదిరించారు. ఈసారి ఏదైతే అది అయ్యిందని ధైర్యంగా పట్టాల మీద నడుస్తున్నాడు విజ్జిబాబు. కెమెరా స్టార్ట్ అయ్యింది. ఆ రైలు హీరో దగ్గరకొచ్చి దానంతట అదే ఆగిపోయేసరికి అంతా ఆశ్చర్యంగా చూసారు. అసలు విషయమేమిటంటే - ఆ రైలు డ్రైవర్ ఎవరో ఆత్మహత్య చేసుకుంటున్నారని భావించి రైలుని దూరంనుండి చూసి ఆపేసాడు. యూనిట్ అంతా గొల్లున నవ్వుకొని మరో రైలు కోసం ఎదురుచూడలేక హీరో బ్రిడ్జి మీద నుంచి గోదావరిలో దూకేలా చిత్రీకరించారు.

1981 అక్టోబర్ 29 నుంచి నవంబర్ 30 వరకూ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేశారు. రాజమండ్రిలోని విశ్వేశ్వరాలయం, గంధం సీతారామాంజనేయులు గారిల్లు , బులుసు సత్యం గారింటిలో టాకీ సీన్స్ తీశారు. కొన్ని పాటలు పాపికొండలు, దేవీపట్నం, హుకుంపేట, గుమ్మళ్ళ దొడ్డి ప్రాంతాల్లో చిత్రీకరించారు.

ముందు ఈ చిత్రానికి '1,2,3,4' టైటిల్ అనుకున్నారు. తర్వాత 'మగాడా! మొగుడివి కాకు' అనుకున్నారు, "ఆ పేరు నా ఎదురుగానే భ్రష్టు కావడంతో నేను పెట్టిన టైటిల్ మీద నాకే నమ్మకం పోయింది. అందుకే 'మల్లెపందిరి' గా పేరు మార్చాం" అని జంధ్యాల చెప్పడం జరిగింది.

ఈ చిత్ర ప్రారంభోత్సవంలో జంధ్యాల మాట్లాడుతూ -" జీవితంలో ఏ రసానికీ లేని ప్రాధాన్యత హాస్యరసానికి వుంది. నాకు హాస్యమంటే ఇష్టం. పదిమందినీ హాయిగా కాసేపు నవ్వుకునేలా చెయ్యడం ఇష్టం. ఆ కారణంగానే రచయితగా నేను రాసిన సినిమాలు కొద్దే అయినా వాటిలో ఎక్కువ హాస్యమే రాసాను. మొదటిసారి 'ముద్దమందారం' చేసాను. ఈసారి హాస్య ప్రధానమైన చిత్రం తయారు చేయాలనుకున్నాను" అని చెప్పారు.

గోదావరి బ్రిడ్జి మీద బాలు లూనా ఎక్కి కత్తిపట్టుకుని చంపుతానంటూ హీరో వెంట పడతాడు. అయితే బాలు ఎక్కిన లూనా హీరోని దాటిపోయాక కూడా 'నన్ను చంపొద్దు... చంపొద్దు' అంటూ స్కూటరు వెనుకే హీరో పరిగెత్తే సీన్ చూసి పగలబడి నవ్వకుండా ఎవరైనా వుండగలరా?

హీరోయిన్‌ని హీరో వెంబడించేటప్పుడు బ్యాక్‌గ్రౌండ్‌లో జేమ్స్‌బాండ్ మ్యూజిక్ పెట్టడం సమయోచితంగా కుదిరింది.

'ప్రేమగురువు ' వేటూరి, ఆయన శిష్యుడూ ఇద్దరూ కాషాయధారులే. కానీ రోజూ కాఫీ, టీ బ్రేక్ సమయాల్లో ఓ ఏడుగురు అదే బాపతు కాషాయ శాల్తీలు వచ్చి శుభ్రంగా తినిపోతున్నారట. మూడ్రోజుల తర్వాత మెస్ ఇన్‌ఛార్జి గుండుమణికి అనుమానం వచ్చి వాళ్లని తిట్టి పంపించేశారు. అప్పట్నుంచీ యూనిట్ అందరికీ ఐడెంటిటీ కార్డ్స్ ఇచ్చారు.

రాజమండ్రిలోని దానవాయి పేట నడిరోడ్డు మీద షూటింగ్ చేస్తున్నారు. మెగా ఫోన్ మెళ్లో వేసుకొని ఆర్టిస్టులకు సూచనలిస్తున్న జంధ్యాల దగ్గరికి గుంపులోంచి ఓ పల్లెటూరి బైతు వచ్చి రెండ్రూపాయల నోటు ముందుకు చాచి 'నా కోటియ్యి, సాదావద్దు. బంపర్‌వి గావాల' అన్నాడు. జంధ్యాల అయోమయంగా ఏమిటని అడిగారు. 'ఇంకేమిటి? బాగెలచ్మి లాట్రీ దేగా?' అన్నారాయన.

'ఇంకా నయం. అసలు కోతిమార్కు నంజన్‌గూడు పళ్లపొడి పాకెట్టొకటిమ్మన్నావు కాదు నన్ను' అన్నారు జంధ్యాల.


ఆ రోజు పెళ్లి భోజనాల సీను ప్లాన్ చేశారు. లంచ్, షాటూ కలిసొచ్చేలా ఆ మధ్యాహ్నం తీయాలి మూడయిపోయింది. అందరి పేగుల్లోనూ రైళ్ళు పరిగెడుతున్నాయి. 'నేను చప్పట్లు కొట్టగానే భోజనాలు మొదలు పెట్టండి' అన్నారు జంధ్యాల. చాలా సేపటికి చప్పట్లు వినిపించి అరనిమిషంలో ఆకులు ఖాళీ చేసేసారు. ఇంతకీ ఆ చప్పట్లు వంటకాల దగ్గర కాకుల్ని అదిలించడానికి హెడ్ కుక్ చరిచినవి. దాంతో మళ్ళీ అంతమందికీ భోజనాలు వడ్డించి, సాయంత్రం నాలుగున్నరకి బలవంతాన రెండోసారి తినిపించి షాట్ తీశారు.

## పాటలు

1. కదిలే కోరికవో కథలో నాయికవో
   - విజ్జిబాబు, జ్యోతి
   గానం : బాలు, జానకి,
   రచన : వేటూరి
2. తొలి చూపు తోరణమాయె
   - విజ్జిబాబు, జ్యోతి
   గానం : బాలు, జానకి,
3. లాగడానికెందుకురా తొందర?
   - నరసింగరావు,
   గానం : బాలు, కోరస్
   రచన : బాబన్న - సుబ్బారావ్
4. మగాడా - ఛస్తే మొగుడివి కాకు
   - విజ్జిబాబు, జ్యోతి
   గానం : బాలు
   రచన : వేటూరి
5. అబ్బ ఎవరండీ!
   - విజ్జిబాబు, జ్యోతి
   గానం : బాలు, జానకి,
   రచన : వేటూరి

'వెంకూ' పాత్రలో విజ్జిబాబు చేసే ఆత్మహత్య ప్రయత్నాల్లో కొండరాళ్ళ మీంచి దూకడం కూడా ఒకటి. ఆ కొండకు ఇటువైపు నుంచి షాట్ తీయడానికి గోదారి నీళ్ళలోకి దిగాలి. ఇస్త్రీ బట్టలు తడుపుకోవడం ఇష్టంలేక ఎస్.గోపాలరెడ్డి శుభ్రంగా అన్ని విప్పేసి, అండర్‌వేర్‌తో దిగారు. ఈ బట్టల్ని తన బాయ్‌కిచ్చి భద్రపరచమని చెప్పారు. మొదటి టేక్‌లోనే ఓకే అయిపోవడంతో అంతా చకచకా ఒడ్డెక్కేశారు. ఈ లోగా లోకల్ కాలేజీ అమ్మాయిలంతా వచ్చి ఒడ్డున నించొని ఆర్టిస్టులతో మాట్లాడుతున్నారు. ఆ బాయ్ అరగంట దాకా దొరక్కపోవడంతో పాపం గోపాల్‌రెడ్డి అలా నీళ్లలోనే వుండిపోవాల్సి వచ్చింది.

ఎలక్ట్రీషియన్‌గా ఎస్పీబాలు సినిమాలో కనిపించే మొట్టమొదటి సీను తీస్తున్నారా రోజు. వైర్లు చుట్టుకున్న విజ్జిబాబు కాఫీ తాగాలన్నా మంచినీళ్లు తాగాలన్నా బేల చూపులు చూడడంతో జంధ్యాల స్వయంగా గ్లాసు నోటికందించేవారు. లంచ్ కూడా అలాగే తినాల్సి వచ్చింది.


బాలు, విజ్జిబాబు

జంధ్యాల 'ముద్దమందారం' సినిమా తీస్తున్నపుడు 'సత్యానంద్' డైరెక్ట్ చేసిన 'మనిషి నూతిలో పడితే ' నాటకం చూసి అందులో నటించిన సుత్తివేలుకి ఆర్టిస్ట్‌గా 'మల్లెపందిరి' లో కూడా చిన్న పాత్ర చేశారు. నాలుగైదు సీన్ల వేషమిది. టైటిల్స్‌లో ఒక సీన్ , ఇంటర్వెల్ తర్వాత మరొక సీన్ వుంచి మిగతా



సీన్స్ ఎడిటింగ్‌లో తొలగించేశారు.

వైజాగ్ చెందిన డాక్టర్ దివాకర్ ఈ చిత్రకథను నవలీకరించారు.

ఈ చిత్రానికి ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేసిన బి. సత్యనారాయణ మొన్నీమధ్య 'మిస్సమ్మ' చిత్రాన్ని నిర్మించి నంది అవార్డునందుకున్నారు.

జంధ్యాల ఎంతో అందంగా నేసిన ఈ 'మల్లెపందిరి' చూస్తున్నంత సేపూ ప్రేక్షకులకి హాయి కలిగించింది.

## మెచ్చుతునకలు

✓వేటూరి : ప్రేమించడం, పనసకాయ కూర వండడం రెండూ ఒక్కలాంటివి నాయనా. రెంటికీ కాస్త ఓర్పూ, నేర్పూ కావాలి.

✓లక్ష్మీకాంతమ్మ : సగానికి చీరేసిన పూచిక పుల్ల బద్దలాగా' మా కండలవారి వంశంలో ఎలాగ పుట్టావో ఏమిటో!

✓సత్తిబాబు : ఏటి బామ్మా! నాకేదో పెద్ద గిరజాల జుట్టున్నట్టు , రోజూ ఇలా సాంబ్రాణి పొగేసి చంపేస్తున్నావు. నువ్వొకసారి గట్టిగా తల్పుకుని,'ఉఫ్' మని ఊదావంటే, ఈ అరంగుళం జుట్టూ ఆరకపోతుందా, చెప్పు?

లక్ష్మీకాంతమ్మ : ఊరుకో సన్నాసీ. సాంబ్రాణి పొగేస్తే తెలివితేటలు పెరుగుతాయ్, తెల్సా?

సత్తిబాబు : మరే! ఇలాగే రోజూ మా నాన్నకి పొగబెట్టుంటావు. అందుకే పిచ్చెక్కి రైలు కింద తలపెట్టుంటాడు.

✓జిత్‌మోహన్‌మిత్రా :ఓ భయంకరమైన సాదా టీ, వన్‌బై టూ, డికాక్షన్ ఎక్కువ, పాలు తక్కువ ఓ గుప్పెడు పంచదార.

✓విజ్జిబాబు : యస్.అమితాబ్ ఈజ్ మై కజిన్. మా పెదనాన్నగారబ్బాయి. యింటిపేరు అమితాబు వారు. అసలు పేరు బచ్చేశ్వర్రావన్న మాట. వీళ్ళమ్మకీ పిల్లలు పుట్టి పోతూ వుంటే, పిల్లలాడుకునే బచ్చాలు తీసుకెళ్ళి ఓ గుళ్లో యిచ్చి, వీడికి బచ్చేశ్వర్రావ్,అని పేరు పెట్టిందన్న మాట..అసలూ, వాడు పుట్టినప్పుడు మరీ ఇంతే వుండేవాడండీ. పుట్టేసరికి వాడికసలు జుట్టులేదు తెలుసాండి? అస్సలు మాటలు రావు. 'ఉంగా,ఉంగా' అనేవాడు వెధవ. ఆ తర్వాత జుట్టు దానంతటదే వచ్చేసింది. మాటలు వాడు కష్టపడి నేర్చుకున్నాడన్నమాట.

జ్యోతి : నో,నో. మీరు జోక్ చేస్తున్నారు!

విజ్జిబాబు : నిజమండీ! చిన్నప్పుడు దొండకాయలా ఇంతుండేవాడు. స్కూలు కెళ్ళనని మారాం చేసేవాడు. నేనే చెవి మెలిపెట్టి బలవంతాన లాక్కెళుతుండే వాడ్ని. దాంతో ఇదుగో - పొట్లకాయలా, ఇలా సాగిపోయాడు!

జ్యోతి : మీరు - మీరు... నిజంగా అమితాబ్ కజినా!

విజ్జిబాబు : హొట్టండీ! గోదావరి రైల్రోడ్డు బ్రిడ్జి మీద లైట్లు వెలిగినంత వొట్టు.

✓శ్రీరామమూర్తి : అయిదో నెంబరు బస్సు ఎంత సేపట్లో వస్తుందండీ?

విజ్జిబాబు : అయిదో నెంబరా?అదిప్పుడప్పుడే రాదు గానీ, పదో నెంబరు బస్సెక్కి అరటిక్కెట్టు కొనుక్కో

✓ఆటోడ్రైవర్ : సార్ ! మామూలుగా పాసింజర్లు నా ఆటోని కుంటుతూ ఎక్కుతారు. నవ్వుతూ ఎక్కుతారు ఏడుస్తూ ఎక్కుతారు. తుమ్ముతూ, దగ్గుతూ కూడా ఎక్కుతారు గానీ -ఇలా కప్పలా గెంతుతూ, పదేళ్ళ సర్వీసులో ఎప్పుడూ చూళ్ళేదు సార్. తమరెప్పుడు నా ఆటో - యిలాగే ఎక్కాలని నా ప్రార్థన.

3

ఆద్యంతం రక్తి కట్టించిన

# నాలుగు స్థంభాలాట



సరిగ్గా మీసాలు కూడా మొలవని ఇద్దరు టీనేజ్ కుర్రాళ్ల మీద కాస్త బరువైన ప్రేమకథను సినిమాగా పండించటం తలపండిన దర్శకుడికైనా కత్తిమీద సామే. కానీ జంధ్యాల సునాయాసంగా ఈ సాహసాన్ని పూర్తి చేసి సులువుగా విజయాన్ని అందుకున్నారు.

ఆ సాహసప్రక్రియే 'నాలుగు స్థంభాలాట'.

ఈ మధ్య యువతరాన్ని ఉర్రూతలూగించి ట్రెండ్ సెట్టర్స్‌గా నిలిచిన టీనేజ్ లవ్‌స్టోరీలు 'చిత్రం', 'నువ్వునేను'ల్లాగే అప్పట్లో యూత్‌లో ఓ హాట్(ర్ట్) డిస్కషన్‌గా మారిన చిత్రం 'నాలుగుస్థంభాలాట'. జంధ్యాల ఓ ఇరవై ఏళ్లు అడ్వాన్స్ అయిపోయి ఈ సినిమా తీశారేమో ! అందుకే ఈ తరం కుర్రకారుకి కూడా నచ్చే సన్నివేశాలు, పాటలు బోలెడన్ని ఇందులో ఉన్నాయని చెప్పొచ్చు.

'నాలుగు స్థంభాలాట' గురించి నాలుగు ముక్కల్లో చెప్పాలంటే

"ఇద్దరమ్మాయిలు+ ఇద్దరబ్బాయిలు" = ప్రేమాట+పెళ్ళాట'. ఇదే నాలుగు స్థంభాలాట మెయిన్ థీమ్. నాలుగు దిక్కులు నాలుగు స్తంభాలుగా దేవుడు ఆడే ఆటే ఈ నాలుగు స్తంభాలాట సినిమా.

ఒకబ్బాయి పేరు నరేశ్. నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోలేక, వెంటపడి వేధించే మరదలినే పెద్దల బలవంతం మేరకు పెళ్ళాడి విలపిస్తాడు. ఇంకొక అబ్బాయి ప్రదీప్. స్నేహితుని ప్రేమకు రాయబారిగా నిలిచాడు. చివరికి ఆ ప్రేమ కోసమే సంసారిగా మారాడు.

శారద చక్కని చుక్క. చిదిమి దీపం పెట్టుకోవచ్చు. తన గుండె గూట్లోకి ఈ వెలుగు కావాలని ఓ కుర్రాడు వెంటపడితే మనసుతో పాటు వయసు కూడా రాసిచ్చింది. తీరా అతను కాస్తా చీకట్లోకి పారిపోతే, అతని స్నేహితుడు తన రెండు చేతులూ అడ్డుపెట్టి వెలుగు పంచాలనుకున్నాడు. అయితే ఆ దీపం కొడిగట్టి పోయింది.

ఇక మరో అమ్మాయి పేరు కమల. బావంటే పంచప్రాణాలు. బావను రోజూ చూడాలని కాలేజీయే మార్చేసుకుంది. బావ పరాయి అమ్మాయితో కనపడితే ముఖం మాడ్చేసుకుంది. చివరకు బావను సాధించుకుంది. తన మనసు పండలేదని అతన్ని వేధించుకుతింది.

ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో క(వ్య)థ.

ఈ నలుగురితోనూ, విధి ఆడిన వింత ఆటే 'నాలుగు స్థంభాలాట'.

స్టోరీ లైన్ చెప్పుకుంటే చాలా ఈజీగాను, క్రేజీగానూ అనిపించొచ్చుగానీ, ఏమాత్రం లేజీగా వున్నా మొత్తం డామేజీ అయిపోయేంత సెన్సిటివిటీ ఉందీ సినిమాలో.

దర్శకుడిగా జంధ్యాలకి, హీరోగా ప్రదీప్‌కి ఇది మూడో సినిమా. ప్రఖ్యాతనటి, దర్శకురాలు విజయ నిర్మల తనయుడు నరేశ్ ఈ సినిమా ద్వారా కథానాయకునిగా పరిచయం అయ్యారు.

'పండంటి కాపురం', 'దేవదాసు', 'సంతానం-సౌభాగ్యం', 'కవిత' (మలయాళం) (దర్శకురాలిగా విజయనిర్మలకు ఇదే తొలిచిత్రం) తదితర చిత్రాలలో బాలనటుడిగా చేసిన నరేశ్‌కి చిన్నప్పట్నించే నటన మీద విపరీతమైన మక్కువ. తనకు పదిహేడేళ్ల వయసులో 'సీతాకోకచిలుక'లో హీరోగా ఆఫర్ వచ్చింది. అయితే దర్శకుడు భారతీరాజా అంతకుముందే మురళి(కార్తీక్)కి మాటివ్వడంతో ఆ అవకాశం మిస్సయ్యింది. తరువాత నరేశ్‌ని హీరోగా పరిచయం చేస్తూ విజయనిర్మల 'ప్రేమ సంకెళ్లు' అనే సినిమా మొదలుపెట్టారు.

ఓ రోజు కె.విశ్వనాథ్‌తో కలిసి ఓ డ్యాన్స్ స్కూల్‌కు వెళ్లారు జంధ్యాల. అక్కడో చాకు లాంటి కుర్రాడు జంధ్యాల దృష్టిని ఆకర్షించాడు. ఆరా తీయగా అతను విజయనిర్మల గారబ్బాయని తెలిసింది. దాంతో జంధ్యాల ఆవిడని కలిసి, తన 'నాలుగు స్థంభాలాట' సినిమా ద్వారా నరేశ్‌ని హీరోగా పరిచయం చేస్తానని అడిగారు. నరేశ్ తొలి సినిమా బయటి బ్యానర్‌లో వస్తేనే బాగుంటుందని భావించిన విజయనిర్మల తన 'ప్రేమ సంకెళ్లు'ని పక్కన పెట్టేసి జంధ్యాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఇక్కడ మరో ముఖ్యవిషయం చెప్పుకోవాలి. సంగీత దర్శకుడు రమేశ్‌నాయుడు విజయనిర్మల కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. జంధ్యాల సినిమాలకు అత్యధిక శాతం సంగీతం సమకూర్చింది కూడా ఈయనే.

నరేశ్, పూర్ణిమ



## పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| నరేశ్ | : నరేశ్ |
| ప్రదీప్ కుమార్ | : ప్రదీప్ |
| శారద | : పూర్ణిమ |
| కమల | : తులసి |
| గాయత్రి | : రోహిణి |
| వీరభద్రం | : వీరభద్రరావు |
| నరేశ్ అన్నయ్య | : విజ్జిబాబు |
| కమల నాన్న మూర్తి | : శంకర్ |
| గుర్నాథం | : వేలు |
| జానకమ్మ | : జానకి |
| అన్నపూర్ణ | : కాకినాడ శ్యామల |
| నరేశ్ వదిన | : అన్నపూర్ణ |
| డాక్టర్ | : కృష్ణ చైతన్య |
| మూగబ్బాయ్ | : మాస్టర్ అలీ |
| లెక్చరర్ | : థమ్ |
| స్టూడెంట్ | : బాలాజీ |

మరియు

సుందరలక్ష్మి, సత్తిబాబు, వల్లం నరసింహారావు, యం.యస్.యన్.రాజు, ప్రకాశరావు, తాతబాబు, శ్యాంప్రసాద్, కళాధర్, మాస్టర్ ప్రసాద్, బేబీ లలితా సుబ్బులక్ష్మి, బేబీ బబిత, బేబీ పద్మ.

జంధ్యాలతో ఆయనకు మొదటి నుండీ మంచి స్నేహం ఉంది. ఆయనే నరేశ్‌ని జంధ్యాలకు పరిచయం చేశారు. అంతకుముందు 'ముద్దమందారం'లో కూడా నరేశ్‌ని హీరోగా పెడితే బాగుండునని ఆయన అనుకున్నారు. అయితే అప్పటికే జంధ్యాల, ప్రదీప్‌ను ఎంపిక చేసుకున్నారు. మొత్తానికి ఆ సినిమా మిస్ అయినా, ఈ సినిమాలో నరేశ్‌కు అవకాశం రావటంతో రమేశ్‌నాయుడు చాలా ఆనందపడిపోయారు.

ఈ సినిమా ద్వారా పరిచయం కావడం తన అదృష్టంగా భావిస్తారు నరేశ్. "ఈ సినిమాతో జంధ్యాల అనే ఇన్‌స్టిట్యూట్‌లోకి ప్రవేశించాను. అప్పటికి నాకు నటనలో 'అ ఆ' లు కూడా రావు. అప్పుడు నేను ప్లస్ 2 చదువుతున్నాను. చిన్నప్పట్నించీ మద్రాస్‌లోనే ఉండడం వల్ల తెలుగు మాట్లాడటం మీద అంత అధికారం రాలేదు. జంధ్యాల దగ్గర నేను నటనతో పాటు తెలుగుభాష, నుడికారం నేర్చుకున్నాను. అందుకే ఇండస్ట్రీలో ఆయనొక్కరినే నేను గురువుగా భావిస్తాను" అని గురువుపట్ల తనకున్న అభిమానాన్ని ప్రదర్శిస్తారు నరేశ్.

## హైలైట్స్

1. వైజాగ్‌కి చెందిన వై. అప్పారావు, యస్.వి. రామారావు, వి. బాబురావు, బాబన్న ఈ చిత్రనిర్మాణశ్రమలో నాలుగు స్థంభాలుగా నిలిచారు.
2. 'సుత్తి' అనే పదం ఈ సినిమాతోనే పాపులరైంది.
3. 'నిన్ను-ఈ దేశాన్ని బాగు చేయడం నా వల్లకాదు' అనేది ఈ చిత్రంలో వీరభద్రరావు ఊతపదం.
4. 'మల్లెపందిరి'లో హీరోగా నటించిన విజ్జిబాబు ఇందులో నరేశ్‌కు అన్నయ్యగా నటించారు.
5. 'ముద్దమందారం'లో లాగానే ఇందులో కూడా (శంకర్‌కి) జంధ్యాల డబ్బింగ్ చెప్పారు.
6. ఈ సినిమాకు ప్రదీప్‌కి 15 వేల రూపాయల పారితోషికం ఇస్తే, అందులో కొంత డబ్బుతో స్కూటర్ కొనుక్కున్నారాయన.
7. ఈ సినిమాలో వేషానికి సుత్తివేలు అందుకున్న పారితోషికం వెయ్యి నూట పదహార్లు.

అప్పట్లో తెలుగు సినిమాలు ఎక్కువగా సెట్స్‌లోనే రూపొందేవి. ఆ పద్ధతికి విరుద్ధంగా జంధ్యాల తన సినిమాలను ఎక్కువశాతం అవుట్‌డోర్‌లోనే చిత్రీకరించేవారు. వైజాగ్ అంటే ఆయనకు ప్రాణం. మన రాష్ట్రంలో ముఖ్యంగా కోనసీమ, వైజాగ్ ప్రాంతాల్లో అందాలన్నీ కొలువు తీరినట్టుగా అనిపిస్తాయి. కోనసీమది పల్లె అందాల గుబాళింపైతే, వైజాగ్‌ది పల్లె, పట్టణాల జిగిబిగి. అందుకే జంధ్యాల తన సినిమాలన్నింటికీ వైజాగ్‌నే వేదికగా తీసుకున్నారు. నరేశ్‌కి కూడా వైజాగ్ మీద విపరీతమైన మమకారం ఉంది. "నేను రెండుసార్లు పుట్టాను. మనిషిగా మద్రాస్‌లో.. నటునిగా వైజాగ్‌లో. అందుకే వైజాగ్ అంటే నాకు చాలా ఇష్టం. అంత అందమైన ప్లేస్‌ని నేను ఇంతవరకూ చూడలేదు. స్విట్జర్లాండ్‌కు తీసుకెళ్లినా నాకు అంత ఫీల్ రాదు. నా కెరీర్‌లో సూపర్‌హిట్ సినిమాలన్నీ వైజాగ్‌లోనే రూపొందాయి. నన్ను కలిసినప్పుడల్లా రామోజీరావుగారు తమాషాగా 'వైజాగ్ హీరో' అని పిలుస్తుంటారు. ఒకానొక దశలో నేను వైజాగ్‌లో స్థిరపడాలనుకుని పెంట్ హౌస్ ఒకటి కొనాలనుకున్నాను. ఈలోగా తెలుగు సినిమా పరిశ్రమ మద్రాస్ నుండి హైదరాబాద్‌కు షిఫ్ట్ అవడంతో నా ఆలోచనకు అక్కడితో ఫుల్‌స్టాప్ పడిపోయింది" అని చెప్పారు నరేశ్.

ఈ చిత్రంలో నరేశ్ ఇంట్రడక్షన్ షాట్‌ని చాలా గమ్మత్తుగా చిత్రీకరించారు జంధ్యాల. నరేశ్‌ని శీర్షాసనం వేయమని చెప్పి తలకిందులుగా ఆ షాట్ తీశారు. " నా మీద ఇలా తలకిందులుగా షాట్ తీస్తుంటే మా మేనమామ రవికుమార్ 'ఏంట్రా, ప్రారంభమే ఇలాంటి షాట్' అని చాలా భయపడ్డారు. కానీ నాకు జంధ్యాల గారి మీద బాగా నమ్మకం



ఉంది. ఆయనది ప్రయోగశీల మనస్తత్వం." అని తొలి షాట్‌ని గుర్తుచేసుకున్నారు నరేశ్. ఈ షాట్ గురించి ఇండస్ట్రీలో కూడా కొందరు కామెంట్లు చేశారు. హీరో ఇంట్రడక్షన్ ఇలా చేయటం ఏంటని జంధ్యాలను ఆడిపోసుకున్నారు. కానీ జంధ్యాల ఇవేమీ పట్టించుకోలేదు. 'నేనొక దుర్గం, నాదొక స్వర్గం, అనితర సాధ్యం నా మార్గం' అని శ్రీశ్రీ రాసినట్టు తన మాట తనదే. తన బాట తనదే.

కొత్త ఆర్టిస్టులతో పనిచేయడానికి చాలామంది దర్శకులు నిరుత్సాహ పడిపోతారేమో కానీ, జంధ్యాల మాత్రం చాలా ఉత్సాహంగా ఉండేవారు. వాళ్లతో కలిసిపోయి వాళ్ల నటనలో కొత్త ఎనర్జీ కనబడటానికి రకరకాలుగా ప్రయత్నించేవారు. తనకు నటనానుభవం లేకపోవడాన్ని మాటిమాటికీ గుర్తుకు తెచ్చుకుంటున్న నరేశ్‌కు చాలాసార్లు ధైర్యాన్నిచ్చారు. "నేను చెప్పినట్టు చెయ్ చాలు" అనేవారు. అందుకేనేమో ఈ సినిమాలో నరేశ్ నూనుగు మీసాలతో ఫ్రెష్‌గా, ఎనర్జిటిక్‌గా తొలి సినిమా చేస్తున్న తడబాటు లేకుండా కనిపిస్తాడు. అయితే నరేష్ పాత్రకి వినిపించే గొంతు మాత్రం అతనిది కాదు. ప్రముఖ గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం గళం ఈ పాత్రకి మంచి గ్రేస్‌ని, గ్లామర్‌ని తీసుకువచ్చింది. ఈ ప్రక్రియలో చాలా పెద్ద తతంగమే జరిగింది. అదెలాగంటే.... షూటింగ్ అంతా పూర్తయ్యాక జంధ్యాల, నరేశ్‌ని పిలిచి " నీవు నీ పాత్రకు బాగానే డబ్బింగ్ చెప్పుకోగలవు. కానీ ఇది చాలా మెచ్యూరిటీ ఉన్న కారెక్టర్. బాలసుబ్రహ్మణ్యం నీ పాత్రకు డబ్బింగ్ చెబితే ఖచ్చితంగా నువ్వు పదేళ్లు వెనక్కి తిరిగి చూసుకోనవసరం లేదు. నీ కెరీర్‌కు నాది గ్యారంటీ" అని చెప్పారు. బాలులాంటి ప్రముఖ వ్యక్తి తన పాత్రకు డబ్బింగ్ చెప్తారనగానే నరేశ్‌లో ఓ పక్క ఆనందం ఉన్నా, మరో పక్క అమ్మ ఏమంటుందోనన్న భయం. ఎందుకంటే ఏ ఆర్టిస్ట్‌కైనా సొంత గొంతు ఉంటేనే వారి నటనకు సార్థకత లభిస్తుందని గట్టిగా నమ్మే వ్యక్తుల్లో విజయనిర్మల ఒకరు. అందుకే నరేశ్‌తో రోజూ తమ స్వంత డబ్బింగ్ థియేటర్‌లో డబ్బింగ్ ప్రాక్టీస్ చేయించేవారామె.

## పాటలు

రాగమో -అనురాగమో
గీతమో - సంగీతమో
నరేశ్, పూర్ణిమ అభినయించారు.

చినుకులా రాలి-నదులుగా సాగి
వరదలై పోయి కడలిగా పొంగు నీ ప్రేమ
నరేశ్, పూర్ణిమ అభినయించారు

కలికి చిలకరా కలిసి కులకరా
నరేశ్, ప్రదీప్ తదితరులు అభినయించారు.

కొబ్బరాకు గాలి ముబ్బు కేసింది,
ఉలికి పడ్డ మబ్బు ఉరిమి చూసింది
ప్రదీప్,పూర్ణిమ, నరేశ్, తులసి
తదితరులు అభినయించారు.

దొరలనీకు కనులనీరు
దొరలదీ లోకం
మగ దొరలదీ లోకం
పూర్ణిమ, తులసి, నరేశ్, ప్రదీప్ తదితరులు
అభినయించారు.

నరేశ్ కోరిక మేరకు విజయనిర్మలను కలిసి విషయం అంతా వివరించారు జంధ్యాల. అయితే విజయనిర్మల తొలుత అంగీకరించలేదు. "మీ సినిమా ఆపి మరీ, మీ అబ్బాయిని నాకు అప్పగించారు. అందుకే నేను కూడా మనఃస్ఫూర్తిగా పనిచేస్తున్నాను. ఈ ఒక్క అవకాశం నాకు ఇవ్వండి." అని జంధ్యాల గట్టిగా పట్టుబట్టడంతో విజయనిర్మల అంగీకరించక తప్పలేదు.

ఇప్పటివరకూ నరేశ్ సుమారు 90 సినిమాల్లో నటించారు. ఈ ఒక్క సినిమా మినహా అన్ని సినిమాలకూ ఆయనే స్వయంగా డబ్బింగ్ చెప్పుకున్నారు. "అప్పుడు బాలూగారు నాకు డబ్బింగ్ చెప్పడాన్ని ఇప్పటికీ నా అదృష్టంగా భావిస్తుంటాను" అని గర్వపడతారు నరేశ్. ఇలా 'నాలుగు స్థంభాలాట' చిత్రం నరేశ్ కెరీర్‌లో ఓ ల్యాండ్‌మార్క్‌గా నిలిచిపోయింది.

ఇక ప్రదీప్ విషయానికొస్తే - జంధ్యాల డైరెక్ట్ తొలి సినిమాతో

**విడుదల**
1982

**నిర్మాణ ప్రాంతాలు**
వైజాగ్, అరకులోయ,
భీమిలి, యారాడ
తదితరప్రదేశాలు

**నిర్మాణవ్యయం**
12 లక్షల
రూపాయలు

**నిర్మాణ సమయం**
సుమారు 50 రోజులు

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : నవత ఆర్ట్స్ |
| సంగీతం | : రాజన్-నాగేంద్ర |
| పాటలు | : వేటూరి |
| నేపథ్యగానం | : యస్.పి.బాలసుబ్రహ్మణ్యం, పి.సుశీల, యస్.జానకి |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : యస్.గోపాలరెడ్డి |
| కెమెరామన్ | : యమ్.వి. రఘు |
| సహాయకులు | : దివాకర్, సుబ్బారావు |
| ఎడిటింగ్ | : జి.జి. కృష్ణారావు, గౌతంరాజు |
| కళ | : కళాధర్ |
| సహాయకుడు | : రాజు |
| కో-డైరెక్టర్ | : యు.వి.పాణి |
| అసోసియేట్ డైరెక్టర్స్ | : ఇ.వి.వి. సత్యనారాయణ, బి.యస్.నిష్టల |
| అసిస్టెంట్ డైరెక్టర్ | : బి.రామకృష్ణ, శేఖర్‌బాబు |
| నృత్యం | : శివ-సుబ్రహ్మణ్యం |
| స్టిల్స్ | : సి. హెచ్. శ్యాంప్రసాద్ |
| పబ్లిసిటీ డిజైన్స్ | : లంక భాస్కర్ |
| రీ-రికార్డింగ్ | : ఎస్.పి.రామనాథన్ (ప్రసాద్ స్టూడియోస్) |
| నిర్వహణ | : యన్.అచ్యుతరామరాజు |
| నిర్మాత | : యన్. కృష్ణంరాజు |
| రచన - దర్శకత్వం | : జంధ్యాల |

తనూ నటుడిగా తొలి అడుగు వేశాడు. 'ముద్దమందారం' తర్వాత, ద్వితీయ విఘ్నం ఉండకూడదనే ఉద్దేశంతో 'మల్లెపందిరి'లో చిన్న వేషమైనా వేయాల్సివచ్చింది. 'ముద్దమందారం' హండ్రెడ్ డేస్ ఫంక్షన్ అయ్యాక ప్రదీప్ హైదరాబాద్‌కి తిరుగు ప్రయాణమవుతుండగా ఆఖరి నిమిషంలో జంధ్యాల ఆయన్ని నిలిపేశారు. 'కొత్త సినిమా మొదలుకాబోతోంది. నువ్వు ఇక్కడే ఉండాల్సి వస్తుంది' అని చెప్పారు.

దాంతో జంధ్యాల ఇంట్లోనే వుంటూ ప్రదీప్ సినిమాకి అవసరమైన డిస్కో డాన్స్ నేర్చుకున్నారు. 'ముద్దమందారం' లో లాగానే ఏదో లవబుల్ కేరెక్టర్ అయ్యుంటుందని భావించారు ప్రదీప్. తీరా చూస్తే బాగా బరువైన పాత్ర. ఒక రకంగా త్యాగం చేసే పాత్ర.

బాగా అనుభవజ్ఞుడైన నటుడు చేయాల్సిన పాత్ర అది. కెరీర్ తొలినాళ్ళలోనే అలాంటిపాత్ర చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావించారుప్రదీప్. 'ముద్దమందారం'లో బాలు గొంతు అరువు తెచ్చుకున్న ప్రదీప్ ఇందులో తనే స్వయంగా డబ్బింగ్ చెప్పుకున్నారు.

ఈ సినిమా గురించి ప్రదీప్ మరింత వివరంగా మాట్లాడుతూ "ఇందులో నా మీద ఒకే ఒక్క పాట వుంది. 'కలికి చిలకరా' అనే పాట మంచి డిస్కో ఊపుతో తీశారు. ఈ పాట కోసం నిర్మాత నాకు డిస్కో డాన్స్ నేర్పించారు. నాకు చాలా మంచిపేరు తెచ్చిపెట్టిందీ సినిమా. ఇప్పటికీ తెలంగాణా ప్రాంతంలో నన్ను 'నాలుగుస్థంభాలాట ప్రదీప్'అనే పిలుస్తుంటారు. దాన్ని బట్టే ఆ సినిమాతో నాకెంత పేరొచ్చిందో అర్థమై ఉంటుంది" అని తెలిపారు.

నరేశ్ చెల్లెలుగా వేసిన రోహిణికి ఈ సినిమా మంచి పేరు తీసుకువచ్చింది. ఇక పూర్ణిమ గురించి చెప్పాలంటే - పైకి అమాయకంగా కనిపించినా, నటన విషయానికొచ్చే సరికి మహా గడుగ్గాయి. యూనిట్‌లో అంతా కుర్రకారు కావటంతో ఈ అమ్మాయి అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని 'తింగరి' అంటూ ఏడిపించేవారు.

అలాగే మూగబ్బాయిగా నటించిన మాస్టర్ అలీ గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అంత చిన్న వయసులో కూడా అలీ చాలా షార్ప్‌గా ఉండడం గమనించి యూనిట్‌లో అందరూ ఆశ్చర్యపోయేవారు. "అలీ ఎప్పటికైనా మంచి పొజిషన్‌కు వస్తాడని నేను అప్పుడే అనుకున్నాను" అని





ప్రదీప్, నరేశ్, తులసి, పూర్ణిమ

ఈ సందర్భంగా చెప్పారు నరేశ్.


'నాలుగుస్థంభాలాట'లో ఒక క్లిష్టమైన సమస్యను సీరియస్‌గా చర్చిస్తూనే, మరోవైపు 'సుత్తి' కొట్టిన ఘనుడు జంధ్యాల. ఇందులో వీరభద్రరావు, వేలు జంటకు సుత్తి జంటగా నామకరణం చేశారాయన. ఈ సినిమా తర్వాత ఈ సుత్తిజంట ఎంత పాపులరయ్యారంటే, చాలా సినిమాల్లో వీరి కోసం ప్రత్యేకంగా పాత్రలు సృష్టించడం జరిగింది. హీరో,హీరోయిన్లు ఎవరైనా గానీ, వీరు మాత్రం బాక్సాఫీస్ హిట్ పెయిర్ అయ్యారు.

ఇల్లెగిరి పోయేలా అరుస్తూ వుండే వీరభద్రరావు ఇంటి వాతావరణం , అది వంటికి పడక నసుగుతూ వుండే గుమాస్తా వేలు వైఖరీ,'సుత్తి' వృత్తాంతమూ, దాని పుట్టు పూర్వోత్తరాలు జంధ్యాల మేధాశక్తికి, హాస్య చతురతకు దర్పణం పడతాయి.

ఏదైనా చిన్న విషయాన్ని లాగి లాగి పెద్ద విషయం చేస్తుంటే "సుత్తి' కొడుతున్నాడ్రా బాబూ" అని అనుకోవడం తెలుగువాళ్లకి పరిపాటైపోయింది. 'నాలుగు స్థంభాలాట' తో 'సుత్తి' ని తెలుగువాళ్లకి బాగా దగ్గర చేసేశారు జంధ్యాల. ఒరిజినల్ స్క్రిప్టులో ఈ 'సుత్తి' ఎపిసోడ్ లేదు. 'సుత్తి' మీద ఓ డైలాగ్ పెడితే లొకేషన్‌లో ఉన్న జనాలు బాగా ఎంజాయ్ చేశారట. దాన్ని గమనించి 'సుత్తి' ఎపిసోడ్‌ను పదిహేను సీన్లకు పెంచారు జంధ్యాల.

మామిళ్ళపల్లి వీరభద్రరావు కాస్తా ఈ సినిమాతో సుత్తి వీరభద్రరావు అయిపోయారు. 'జాతర'(1980)చిత్రంతో తొలిసారిగా వెండితెరపై కనిపించిన వీరభద్రరావుకి నటునిగా బ్రేక్ నిచ్చింది జంధ్యాలే. నిజానికి వీరభద్రరావు హాస్యరసమే కాదు, మిగతా రసాలను కూడా చక్కగా పోషించగలరని జంధ్యాలే నిరూపించారు. ఉదాహరణకి ఈ చిత్రం క్లైమాక్స్‌లో -తన కొడుకు అంతటి త్యాగాన్ని ఎందుకు చేశాడో తెలుసుకుని అతణ్ణి అభినందిస్తూ-'ఇప్పుడు నా కళ్ళకి ఎంతో ఎత్తుకు ఎదిగి పోయినట్టు కనిపిస్తున్నావురా' అంటూ అక్కున చేర్చుకునే దృశ్యం ఒక్కటి చాలు- వీరభద్రరావు నటనాపటిమకు అద్దం పట్టడానికి. ఈ సన్నివేశం అంటే నరేశ్‌కు కూడా చాలా ఇష్టం.

'నాలుగు స్థంభాలాట' షూటింగ్ జరుగుతున్న సమయంలో స్నేహితుల ప్రోద్బలంతో జంధ్యాలను



రికార్డ్‌గా విడుదల చేసిన 'నాలుగుస్తంభాలాట' కామెడీ ట్రాక్

కలిశారు వేలు. 'నాలుగైదు రోజులు సెలవు పెట్టగలరా?' అనడిగారు జంధ్యాల. వేలు ఆనందపడిపోయి ఓకే అనేశారు. అలా ఇందులో వీరభద్రరావు 'సుత్తి' భరించే గుమస్తా వేషం దొరికింది. నిజానికి మొదట అనుకున్న స్క్రిప్ట్‌లో ఈ వేషం లేదు. వంటవాడి పాత్ర అనుకున్నారు. ఆ పాత్రను సత్తిబాబు అనే ఆర్టిస్ట్‌తో వేయించాలనుకున్నారు. అయితే కథకు అడ్డు పడుతుందని జంధ్యాల ఆ పాత్రను పక్కన పెట్టేశారు. వంటవాడికన్నా గుమస్తా పాత్ర అయితే బాగుంటుందని అప్పటికప్పుడు క్రియేట్ చేశారు.

ఆఖరి నిమిషంలో సృష్టించబడ్డ ఈ పాత్ర వేలు నట జీవితానికి, ఆ సినిమాకు పెద్ద ప్లస్ అయ్యింది. "1968 నుండి నాటకాలు వేస్తున్నాను. కానీ సినిమాల్లో నటించాలని ఎప్పుడూ పెద్దగా ప్రయత్నించలేదు. ఎందుకంటే నా దృష్టిలో సినిమా అంటే కష్టమైన ప్రక్రియ. జంధ్యాల గారి దయవల్ల వెండితెరపై ఓ వెలుగు వెలగగలిగాను. ఈ సినిమా నా జీవితాన్ని ఓ మలుపు తిప్పింది. నాటకానుభవం వల్ల నటన ఈజీగా చేసేశాను గానీ, డబ్బింగ్ చెప్పడానికి మాత్రం 8 గంటలు పట్టింది. ఇప్పటిలా డబ్బింగ్‌లో సులువైన ప్రక్రియలు అప్పట్లో లేవు. కో డైరెక్టర్ యు.వి.పాణిగారు (ఇప్పుడాయన మణిరత్నం సినిమాలకు పని చేస్తున్నారు) నాతో చాలా ఓపిగ్గా డబ్బింగ్ చెప్పించుకున్నారు. జంధ్యాల గారి తొలి సినిమా మొదలుకుని దాదాపు అన్ని సినిమాల్లోనూ నటించే అవకాశం దక్కినందుకు నేను చాలా గర్వపడుతున్నాను" అని చెప్పారు సుత్తివేలు.


పూర్ణిమ,నరేశ్

వేలు డబ్బింగ్ చెబుతున్నప్పుడు ఓ సరదా సంఘటన జరిగింది. చాలా కష్టపడి ఒక్క చిన్న బిట్ మినహా మొత్తం డబ్బింగ్ అంతా పూర్తి చేసేశారాయన. ఆఖరి బిట్‌కి డబ్బింగ్ చెబుతున్నప్పుడు నిర్మాత నవతా కృష్ణంరాజు లోపలే ఉన్నారు. వేలు డబ్బింగ్ చెప్పేసి 'అమ్మయ్య విజయవంతంగా నా పని పూర్తయ్యింది' అని అనుకున్నారు. కానీ ఇంజనీర్ 'రీ టేక్' అన్నాడు. వేలు ఖంగుతిన్నారు. విషయమేమిటంటే - 




నరేశ్, ప్రదీప్

వేలు ఆ బిట్‌కి డబ్బింగ్ చెబుతున్నప్పుడు నవతాకృష్ణంరాజు చప్పుడు చేసుకుంటూ 'టీ' తాగారట. ఆ శబ్దం కూడా రికార్డ్ కావడంతో మళ్లీ టేక్ చేయాల్సి వచ్చింది.

'నాలుగుస్తంభాలాట' విడుదల కాగానే వేలు ఇంటి పేరు కాస్తా 'సుత్తి' అయిపోయింది. వేలు అంటే తెలిసేది కాదుగానీ, సుత్తివేలు మాత్రమే సులువుగా తెలిసిపోయేది. ఉదాహరణగా ఓ సంఘటన చెప్పుకుందాం.

ఈ సినిమా విజయానందాన్ని ప్రేక్షకులతో పంచుకోవడానికి జంధ్యాల కాకినాడ వచ్చారు. అప్పుడు వేలు కాకినాడలోనే ఉంటున్నారు. గురువుగారొచ్చారన్న సంతోషంతో వేలు వన్‌వే ట్రాఫిక్ విషయం కూడా మర్చిపోయి సైకిల్ తొక్కుకుంటూ వెళ్తుంటే పోలీసులాపి కేసు రాశారు. బతిమాలినా, లంచమిస్తానన్నా ఒప్పుకోలేదు. నేనే 'సుత్తి'నని సినిమా గురించి చెబితే వదిలేశారు.

డైలాగ్స్‌తో సహా ఫుల్ బౌండెడ్ స్క్రిప్ట్ రెడీ అయ్యాకనే షూటింగ్ మొదలుపెట్టారు జంధ్యాల. మొదట ఈ సినిమా చంద్రమోహన్, నూతన్‌ప్రసాద్, కొత్తహీరో సురేశ్‌లతో ప్లాన్ చేశారు. తర్వాత ఎందుకనో ఆ ఆలోచన మార్చుకున్నారు జంధ్యాల. 1981 డిసెంబర్ 7 ఉదయం 9 గంటలకు మద్రాసు జెమినీ రికార్డింగ్ థియేటర్లో పాటల రికార్డింగ్ ప్రారంభమైంది. 'దొరలనీకు కనుల నీరు...' అనే వేటూరి గీతాన్ని సుశీల పాడగా తొలి పాటగా రికార్డ్ చేశారు.

1982 జనవరి 8న ఈ చిత్రం షూటింగ్ వైజాగ్‌లో ప్రారంభమై, సింగిల్ షెడ్యూల్‌లో పూర్తయ్యింది. వైజాగ్‌లో చెవిటి, మూగపిల్లల ఆశ్రమం వుంది. ఆ ఆశ్రమంలో ఎక్కువ భాగం షూటింగ్ చేశారు.

సినిమా ప్రారంభం రోజున " తెలుగు దేశంలో తెలుగు తారలతో తెలుగు తనంతో తెలుగువారి కోసం 'నాలుగుస్తంభాలాట' నిర్మిస్తున్నాం" అని చెప్పారు నవతా కృష్ణంరాజు.

"అమెరికా అమ్మాయి, పంతులమ్మ, ఇంటింటి రామాయణం, ఓ ఇంటి భాగోతం, త్యాగయ్య" వంటి ఎన్నో చిత్రాలతో ఉత్తమ నిర్మాతగా పేర్గాంచిన నవతా కృష్ణంరాజు చాలా ఇష్టపడి రూపొందించిన చిత్రమిది. "త్యాగయ్య చిత్రం తీసి నేనెంత లాభం పొందానో అందరికీ తెలుసు! ఇవాళ నేను తిరిగి మళ్ళీ మీ ముందు నిలబడగలిగానంటే అందుకు కారణం జంధ్యాల. 'ఈ సినిమా కూడా పోతే నువ్వు ఇంటికి వెళ్ళాల్సిందే' అన్నారెవరో నాతో. ఇంటికెందుకు వెళ్ళడం? తిన్నగా బంగాళాఖాతంలోకి వెళ్ళేవాణ్ణి" అని అప్పట్లో చాలా నిజాయితీగా చెప్పుకున్నారు కృష్ణంరాజు.

సన్నివేశాలు, పాటల చిత్రీకరణలో జంధ్యాలది ఒక ప్రత్యేకమైన శైలి. స్క్రిప్ట్ మీద మంచి కమాండ్ ఉన్న ఆయన లొకేషన్స్ బట్టి డైలాగులు రాసేవారు. ఒక్కోసారి ఆయన ఏం తీస్తున్నారో, ఎందుకు తీస్తున్నారో యూనిట్‌లో చాలామందికి అర్థమయ్యేది కాదు. సీనియర్ అండ్ సిన్సియర్ ప్రొడ్యూసర్ అయిన నవతా కృష్ణంరాజుకి కూడా జంధ్యాల మేకింగ్ స్టయిల్ అంతగా అంతు పట్టలేదు.



'సుత్తి' జంట తొలి కలయిక

ఒకసారి ఏమయిందంటే - అది షూటింగ్ ఆఖరి రోజు. అరకులో షూటింగ్ జరుగుతోంది. యూనిట్ అంతా బస్‌లో వెళ్తున్నారు. మంచి లొకేషన్ ఉన్న చోట ఆగి షాట్స్ తీసేవారు జంధ్యాల. మధ్యాహ్నం మూడు దాటి పోయింది, అయినా లంచ్‌బ్రేక్ ఇవ్వలేదు. భోజనాలు తీసుకుని నిర్మాత వీళ్ల వెంట పడ్డారు. చివరకు నాలుగు గంటలకు వీళ్లను పట్టుకున్నారాయన. భోజనాలు పూర్తయ్యాక జంధ్యాలను పక్కకు తీసుకెళ్లి ఏదో మాట్లాడారు నవతా కృష్ణంరాజు. ఆ తరువాత ఇద్దరూ సీరియస్‌గా కూర్చుండిపోయారు. వాళ్లు ఏం మాట్లాడుకున్నారన్నది యూనిట్‌లో ఎవరికీ తెలియదు. తరువాత ఈ విషయాన్ని నరేశ్‌కి చెబుతూ " జంధ్యాల ఏం తీస్తున్నాడో, ఎందుకు తీస్తున్నాడో అర్థంకాక మొదట విసుక్కున్నాను. కానీ సినిమా చూశాక అతను ఎంత ప్రతిభావంతుడో, సినిమా మీద ఎంత కమాండ్ ఉందో అర్థమయ్యింది" అన్నారు నవతా కృష్ణంరాజు.

రాజన్-నాగేంద్ర సంగీతం ఈ చిత్రానికి ఆయువుపట్టుగా నిలిచింది. అప్పట్లో ఈ సినిమా పెద్ద మ్యూజికల్ హిట్. 'చినుకులా రాలి నదులుగా సాగి' పాట ఇప్పటికీ పాపులరే. 'దొరలనీకు కనులనీరు' పాట చాలా మంది కళ్ళల్లో కన్నీరొలికించింది.

అనేక తెలుగు, కన్నడ చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన రాజన్-నాగేంద్ర తెలుగులో పాటలు చేస్తున్నప్పుడు మాత్రం అప్పుడప్పుడూ కన్నడ బాణీలను వదులుకోలేకపోయేవారు. 'బయలు దారి' అనే కన్నడ చిత్రంలోని 'కనసల్లి నీనె - మనులూ నీనె నన్నాణె - నిన్నాణె' పాట బాణీ ఆధారం గానే 'చినుకులా రాలి... ' పాటను సృష్టించారు.

కె.రాఘవేంద్రరావు ప్రవేశంతో పాటల చిత్రీకరణలో ఓ కొత్త ప్రభంజనం మొదలయింది. జంధ్యాల కూడా పాటల్ని ఓ కొత్త శైలిలో చిత్రీకరించడానికి ఆసక్తి కనబరిచేవారు. ఆయన తీసిన చాలా పాటలకు నృత్యదర్శకుడు కూడా ఉండేవారు కాదు.

ఈ సినిమాలో ప్రతి పాటా ఓ ఆణిముత్యం. 'కొబ్బరాకు గాలి....' పాటలో ఒక్కొక్క షాట్‌ని కవిత్వంలాగా దృశ్యాలలో చూపించారాయన. సాధారణంగా అప్పట్లో ఒక పాట చిత్రీకరణ రెండుమూడురోజుల్లోనే పూర్తయిపోయేది. కానీ 'నాలుగు స్థంబాలాట'లో 'చినుకులా రాలి..' పాటని అరవై వేర్వేరు లొకేషన్స్‌లో 30 రోజులు తీశారు. అంటే 30 రోజులూ ఆ పాట ఒక్కటే తీశారని కాదు. ప్రతి రోజూ ఉదయం లొకేషన్‌కు వెళ్లగానే బ్యాక్‌లైట్‌లో చిన్న సాంగ్ బిట్ తీసి, తరువాత సీన్స్ తీసేవారు.

'కలికి చిలకరా..' పాటని రాత్రిపూట సముద్రపుటొడ్డున చిత్రీకరించారు. 'రాగమో, అనురాగమో....' పాటలో నరేశ్‌తో మోటారుబైక్ ఫీట్స్ చేయించారు.

ఈ సినిమాలోని పాటలలో తన అనుభవాల్ని నరేశ్ ఇలా వివరించారు - "'ప్రేమసంకెళ్లు' మేకప్ టెస్ట్ నిమిత్తం మోటారుబైక్ జంప్స్ చేశాను. అవి చూసిన జంధ్యాల 'రాగమో, అనురాగమో..' పాటలో నాతో ఈ ఫీట్స్ చేయించారు. ఆరు అడుగుల ఎత్తు కొండ మీద నుండి బైక్‌తో సహా దూకేయమన్నారు. ఉడుకురక్తం వయసు కాబట్టి భయం అనిపించలేదు. హీరో హోండా సి.బి.100 బండి మీద వెంటనే జంప్ చేశాను. అసలా ప్లేస్ జంపింగ్‌కి అనుకూలంగా లేదు. అయినా బైక్ కరెక్ట్‌గా ల్యాండ్ అయింది. ఈ ఫీట్ నేను చేశాక నా మీద ఆయనకు మరింత నమ్మకం పెరిగిపోయింది. నేను కూడా ఆయన ఎంత రిస్కీ ఫైట్ చేయమన్నా వెంటనే రెడీ అనేవాణ్ణి. ఓసారి గోదావరిలో దూకమంటే దూకేశాను. ఆ ముందు రోజే మా యూనిట్‌లో ఒకతను గోదావరిలో మునిగి చనిపోయాడు. అయినా నేను భయపడలేదు.



'దొరలనీకు..' పాట చిత్రీకరణలో నాకు ఎలాంటి ఫీలింగూ కలగలేదు. కానీ తెరమీద ఆ పాట చూసినప్పుడు మాత్రం గుండె బరువెక్కిపోయింది.

'చినుకులా రాలి...' పాట నా కెరీర్‌లో ఒన్ ఆఫ్ ది బెస్ట్ సాంగ్స్. చిత్రీకరణరీత్యా కూడా నేను మరిచిపోలేని సాంగ్ అది. నేను ఎప్పుడైనా పెళ్లిళ్లకు వెళితే అందరూ ఆ పాటనే గుర్తు చేసుకుంటారు." అని తెలిపారు నరేశ్.

ఈ పాటలను చిత్రీకరించేటప్పుడు ఓ భయంకరమైన అనుభవం ఎదురైంది. వైజాగ్‌లో ఎర్రకొండలు బాగా ఫేమస్ ప్లేస్. అక్కడొక చోట భూమి రబ్బర్‌లా కిందకు మీదకూ కదులుతూంటుంది. భలే తమాషాగా ఉందే అని జంధ్యాల ఆ లొకేషన్‌లో నరేశ్, పూర్ణిమలను నిలబెట్టి కొన్ని షాట్స్ తీశారు. ఈ లోగా ఎవరో ఆఫీసరు పరుగెత్తుకుంటూ వచ్చి "అది ఊబి సార్.. దిగబడితే మళ్లీ బయటకు రాలేరు." అని చెప్పారు. అలా ఓ పెద్ద ప్రమాదం తప్పి పోవటంతో యూనిట్ ఊపిరి పీల్చుకుంది.

అలాగే నరేశ్, పూర్ణిమ బైక్‌మీద వెళ్లే సీన్స్ తీస్తున్నారు. పూర్ణిమకు బైక్‌మీద కూర్చోవడం మొదటిసారి. కొంతదూరం వెళ్లాక పూర్ణిమ పైటకొంగు చక్రంలో చుట్టుకుని కిందపడిపోయింది. ఒళ్లంతా రాళ్లు తగిలి హూనమైపోయింది. 3 రోజులకు గానీ మామూలు మనిషి కాలేకపోయింది.

యూనిట్ మొత్తం ముచ్చలవాని పాలెం(ఇప్పుడు ఎం.వి.పి. కాలనీ) లో కొన్ని ఇళ్లు అద్దెకు తీసుకుని అక్కడే ఉండేవారు. విజయనిర్మల గారబ్బాయి కావటంతో నరేశ్‌ని ఓ హోటల్‌లో పెట్టారు. రెండు రోజులు ఒంటరిగా ఉండి బోర్ కొట్టేసిన నరేశ్, తాను కూడా యూనిట్‌తోనే కలిసి ఉంటానంటూ ఎం.వి.పి. కాలనీకి వచ్చేశారు.

ఈ సినిమాకు సంబంధించి మరో సంఘటన. షూటింగ్ పార్ట్ అంతా పూర్తయిపోయింది కానీ, నరేశ్‌కు మాత్రం రూపాయి కూడా పారితోషికం ఇవ్వలేదు. తొలి సినిమా అనుభూతిలో నరేశ్ ఆ విషయాన్ని పట్టించుకోలేదు కానీ, ఇంట్లోవాళ్లు మాత్రం 'ఎంతో కొంత తీసుకో... జీవితాంతం చెప్పుకోవాలి కదా' అని అన్నారు. అయినా నరేశ్ పట్టించుకోలేదు. సినిమా రిలీజైన వారం తరువాత నవతా కృష్ణంరాజు అకస్మాత్తుగా నరేశ్ ఇంటి కెళ్లి పదివేల రూపాయల పారితోషికం ఇచ్చారు. ఆ డబ్బుల్లో మూడువేలు పెట్టి సెకండ్‌హ్యాండ్ హెరాల్డ్ కారు, రెండు వేలు పెట్టి ఎ.సి. కొనుక్కుని, మిగతా డబ్బు బ్యాంకులో దాచుకున్నారు నరేశ్.

ఈ సినిమాకి గోపాల్‌రెడ్డి ఛాయాగ్రహణం పెద్ద ప్లస్ పాయింట్. మోటార్ బైక్ షాట్స్ అయితే డిక్కీల్లోంచి టార్చిలైట్ వేసి మరీ తీశారు. హై స్పీడ్ ఫిల్మ్ కొత్తగా వచ్చిన రోజులవి. దాన్ని ఉపయోగించేవారాయన. జంధ్యాల, గోపాల్‌రెడ్డి ఇద్దరూ బాగా చర్చించుకుని మరీ షాట్స్ తీసేవారు. అందుకేనేమో న్యూ కాన్సెప్ట్‌తో ఫోటోగ్రఫీ అలరిస్తుంది.



నిర్మాత 'నవత' కృష్ణంరాజు

ఈ సినిమాకి సంబంధించి ఉత్తమ ఛాయాగ్రాహకుడుగా ఎస్.గోపాల్‌రెడ్డి, ఉత్తమ ఎడిటర్‌గా గౌతంరాజు 1982'సితార' పత్రిక అవార్డులను అందుకున్నారు.

ప్రసిద్ధ దర్శకులు ఇ.వి.వి.సత్యనారాయణ ఈ చిత్రం నుండే జంధ్యాల దగ్గర దర్శకత్వ శాఖలో చేరారు. తన దగ్గర అవకాశం లేకున్నా నిర్మాత కృష్ణంరాజు బలవంతం మీద ఇ.వి.వి.ని తన అసిస్టెంట్‌గా తీసుకున్నారు జంధ్యాల. సినిమా పూర్తయ్యే లోపు జంధ్యాలకు బాగా దగ్గరయిపోయారు ఇ.వి.వి. అతని పనితనం నచ్చి తన డైరెక్షన్ టీమ్‌లో పర్మినెంట్ మెంబర్‌గా తీసుకున్నారు జంధ్యాల. అప్పటి నుంచి 'చెవిలోపువ్వు' తో దర్శకుడయ్యేంత వరకూ జంధ్యాల

దగ్గరే పనిచేశారు ఇ.వి.వి.



వేలు

సినిమా ప్రారంభంలోనూ, ఇంటర్వెల్ లోనూ, క్లైమాక్స్‌లోనూ కనబడే 'విధి' గా ఇ.వి.వి. నటించారు. "విధి పాత్రకోసం ఓ జూనియర్ ఆర్టిస్ట్‌ను అనుకున్నాం. మద్రాసు వి.జి.పి.బీచ్‌లో షూటింగ్ జరుగుతుంది. సన్‌రైజ్‌లో ఆ షాట్ తీయాలి. ప్రొడక్షన్‌వాళ్ళు కారు ఇవ్వకపోవడంతో బస్సులో బయలుదేరిన ఆ జూనియర్ ఆర్టిస్టు ఎంతకీ లొకేషన్‌కు రాలేదు. దాంతో జంధ్యాల గారు ఆ పాత్రను నాతో చేయించారు. ఈ 'విధి' పాత్రను నేను చేశానని జంధ్యాలగారి ద్వారా తెలుసుకున్న ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంగారు అప్పట్నుంచి ఇప్పటివరకూ కూడా నన్ను 'విధి' అనే పిలుస్తుంటారు" అని చెప్పారు ఇ.వి.వి. ఈ సినిమాలో మరోచోట బస్సు ప్రయాణీకునిగా కూడా కనిపిస్తారు ఇ.వి.వి.

ఈ నాలుగు స్థంభాలేంటి? ఈ ఆట ఏంటి? అని అప్పట్లో టైటిల్ గురించి చాలామంది సెటైర్లు వేసుకున్నా, సినిమా చూశాక మాత్రం తమ కామెంట్ల నుంచి రిటైరైపోయారు.

జంధ్యాల లోని ప్రతిభా 'పాట'వాలని ఓ కొత్త కోణంలో ఆవిష్కరించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే, కథాగమనం, డైలాగ్స్, సాంగ్స్, వాటి చిత్రీకరణ, లొకేషన్స్, ఆర్టిస్టుల పెర్‌ఫార్మెన్స్‌లో ఫ్రెష్‌నెస్ వల్ల ఈ సినిమా యూత్ బేస్‌డ్ ఫిల్మ్ అయినప్పటికీ ఆల్‌రౌండర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకోగలిగింది. సీరియస్ టాపిక్ అయినా కూడా జంధ్యాల బాగా హేండిల్ చేశారు.

చిలిపి చిలిపిగా, అల్లరల్లరిగా మొదలయ్యే ఈ సినిమా ద్వితీయార్థానికొచ్చేసరికి కొంచెం కన్నీళ్ళు, కొంచెం సెంటిమెంట్, కొంచెం త్యాగం, కొంచెం ప్రేమ మొదలైన వాటిని మేళవించుకుని పరిపూర్ణతను చేకూర్చుకుంది.

ఈ తరం కుర్రకారు సినిమాల్లాగానే ఈ సినిమా కూడా క్లాస్‌రూమ్‌లోనే ప్రారంభమవుతుంది. లెక్చరర్స్‌ని ఆటపట్టించడం, అమ్మాయిలకి బీట్ కొట్టడం ఇత్యాది అంశాలన్నీ చూస్తుంటే జంధ్యాల ఈనాటి ట్రెండ్‌కి తగ్గట్టుగా ఆనాడే సినిమా తీసినట్టనిపిస్తుంది. ఈ తరం వాళ్ళకి కూడా బోర్ కొట్టని

## కథాసంగ్రహం

నరేశ్ - ప్రదీప్ ప్రాణస్నేహితులు. నరేశ్ ధనవంతుడు. ప్రదీప్ మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. ప్రదీప్ ఇంట్లో అద్దెకు వుంటున్న శారదను తొలిచూపులోనే ప్రేమిస్తాడు నరేశ్. నరేశ్, శారదల ప్రేమకు ప్రదీప్ రాయబారం నడుపుతాడు. ప్రదీప్, శారదల సాన్నిహిత్యాన్ని అపార్థం చేసుకున్న పెద్దలు వీళ్ళ పెళ్ళి నిశ్చయిస్తారు. ఓ రోజు అనుకోకుండా శారద, నరేశ్ శారీరకంగా ఒకటవుతారు. నరేశ్ మేనమామ కూతురు కమలకి బావంటే పంచప్రాణాలు. శారద మెళ్ళో పసుపుతాడు కడితే, తన మెడకి ఉరితాడు వేసుకుంటానని నరేశ్ అన్నయ్య బెదిరిస్తాడు. దాంతో నరేశ్, కమలని పెళ్ళాడతాడు. శారద గర్భవతి అని తెలుసుకున్న ప్రదీప్ ఆమె పరువు నిలపడం కోసం తానే ఆమెను పెళ్ళాడతాడు. అయితే నాలుగు గోడల మధ్య ఆమెని తన చెల్లెలులాగా చూస్తుంటాడు. శారద ఆడపిల్లని ప్రసవిస్తుంది. పాపకి నరేశ్ తల్లి మహాలక్ష్మి పేరు పెడతాడు ప్రదీప్. ఈ రెండు జంటలు తిరుపతికి వెళ్తూ కలుసుకుంటారు. చివరికి కమల మానసిక క్షోభను గమనించి శారద నిద్రమాత్రలు మింగి నరేశ్ ఒళ్ళోనే కన్నుమూస్తుంది.



శతదినోత్సవ సభలో విజయనిర్మల నుండి మెమెంటో స్వీకరిస్తున్న ప్రదీప్



అంశాలు, పాటలు 'నాలుగు స్థంభాలాట' కి స్పెషల్ ఎస్సెట్.

టైటిల్స్ పడుతున్నప్పుడు ఇద్దరమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు నాలుగుస్థంభాలాట ఆడడం, ఈలోగా విధి ఎంటర్ కావడం తదితర సీన్లని బ్యాక్ డ్రాప్‌గా ఉపయోగించడం సినిమా పట్ల ప్రేక్షకుడికి మరింత ఆసక్తిని పెంచుతుంది.

తొలిరాత్రి రోజున పక్కగదిలో పడుకుంటానని నరేశ్, తులసితో చెప్పినపుడు - మంచం మీద అలంకరించిన పువ్వులన్నీ గాలికి చెల్లా చెదురైనట్టుగా చూపించిన షాట్ సింబాలిక్‌గా కుదిరింది.

కథానుగుణంగా నిజంగా టీనేజర్స్‌నే ఎంపిక చేసుకున్నారు జంధ్యాల. ఈ సినిమా నాటికి ప్రదీప్‌కి 19 ఏళ్ళ వయసు. నరేశ్‌కేమో పదిహేడేళ్ళు, పూర్ణిమ, తులసిలకు పదహారేళ్ళు. ఈ లేత వయసు కుర్రకారు మీద త్యాగాలు,పెళ్ళిళ్ళు, గొడవలు, ఆత్మహత్యలూ... హెవీగా అనిపించాలి. కానీ జంధ్యాల టేకింగ్ వల్ల ప్రేక్షకులు నావెల్టీ ఫీలయ్యారు.

ఈ సినిమా సక్సెస్ అవుతుందా, లేదా అని చాలామంది సందేహపడ్డారు. కానీ ఈ చిత్రం ఎనిమిది కేంద్రాల్లో శతదినోత్సవం జరుపుకుంది. హైదరాబాద్ 'దేవి' థియేటర్‌లో ఈ చిత్రం 175 రోజులు ప్రదర్శితమవడాన్ని ఆ రోజుల్లో చాలా గొప్పగా చెప్పుకునేవారు. 1982 ఆగస్టు 23న మద్రాసులోని స్వామి శంకరదాసు ఆడిటోరియంలో శతదినోత్సవ వేడుకలు జరిగాయి. "ఏటా సగటున 150 చిత్రాలు నిర్మింపబడుతున్న ఈ రోజుల్లో.. అనేక చిత్రాలు విఫలమౌతున్న ఈ వేగంలో చిన్న తారలతో చిత్రాన్ని తీసి విజయం సాధించడం ఎంతైనా హర్షించదగ్గ విషయం. నిజం చెప్పాలంటే ఈ చిత్రానికి హీరో జంధ్యాల" అని నాటి జాతీయ చలనచిత్రాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డి.వి.ఎస్. రాజు అభినందించారు. ముఖ్యఅతిథిగా ప్రసిద్ధ దర్శక నిర్మాత ఎల్.వి.ప్రసాద్ పాల్గొన్నారు. కృష్ణ,విజయనిర్మల ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసారు. "ఈనాటి ఉత్సవాన్ని చూస్తుంటే నాకు 'తేనెమనసులు' రోజులు గుర్తుకొస్తున్నాయి" అన్నారు కృష్ణ. నవతా కృష్ణంరాజుగారు మంచి అభిరుచిగల నిర్మాత అని, జంధ్యాలగారు సమర్థుడైన దర్శకుడని చెప్పి, నరేశ్ తొలి సినిమా వాళ్ళకిస్తే బాగుంటుందని విజయనిర్మలను ఒప్పించడం జరిగిందని ఈ సందర్భంగా కృష్ణ గుర్తుచేశారు. "మా అబ్బాయి నరేశ్ మొదటగా నటించిన చిత్రం విజయవంతం కావడం నాకెంతో ఆనందంగా వుంది" అని విజయనిర్మల తన సంతోషాన్ని వ్యక్తపరిచారు.

జంధ్యాల తన ప్రసంగంలో "సమర్థుడైన బిడ్డను చూసి తండ్రి, సార్థకమైన కృషిని చూసి కళాకారుడు అనుభవించే తృప్తి ఎలాంటిదో ఈనాడు అది నాకు కలిగింది" అన్నారు. నిర్మాత కృష్ణంరాజు చెబుతూ -"ఈ చిత్రం యొక్క బాధ్యతలన్నీ జంధ్యాలే పూర్తిగా స్వీకరించారు. ఏ రోజు ఎక్కడ, ఏది షూట్ చేస్తున్నది కూడా నేను పట్టించుకోలేదు. నిశిరాత్రి, వేకువజాము అనే తేడా లేకుండా అహోరాత్రులు ఆయన శ్రమించారు. ఈ చిత్ర విజయానికి 50 శాతం జంధ్యాల కారకులైతే, 49 శాతం కథ, నటీనటులు, టెక్నీషియన్లది, ఒక్కశాతం మాత్రం నాది" అని చాలా నిక్కచ్చిగా పేర్కొన్నారు.

హిందీలో ఈ చిత్రాన్ని 'బేకరార్' పేరుతో జగపతి ఆర్ట్ పిక్చర్స్ అధినేత వి.బి.రాజేంద్రప్రసాద్



నరేశ్, పూర్ణిమ, ప్రదీప్

పునర్మించారు. సంజయ్‌దత్, అశోక్‌కుమార్, పద్మినీ కొల్హాపురి తదితరులు ఈ చిత్రంలో నటించారు.

ఏ సినిమా కాన్సెప్ట్ అయినా ఏడాదికో, రెండేళ్లకో పాతబడి పోతుంది. కానీ, ఈ సినిమా కాన్సెప్ట్ మాత్రం ఇప్పటికీ వేడినీ,వాడినీ, తాజాదనాన్నీ అందిస్తూ నీట్‌గా హార్ట్‌ని టచ్ చేస్తూనే వుంది. అందుకే

**హ్యాట్సాఫ్ టు జంధ్యాల, హార్సాఫ్ టు జంధ్యాల.**

## మెచ్చుతునకలు

✦ గత దశాబ్దంగా తమ ఒంపు సొంపులతో, ఆటపాటలతో ఆంధ్ర ప్రేక్షకుల గుండెకాయల్ని వేరు శెనక్కాయల్లా తినేస్తున్న సోదరీమణులు జ్యోతిలక్ష్మి, జయమాలినిల గురించి మనం చెప్పుకుందాం....

✦ ఈ సోదరీమణులిద్దరూ ఆంధ్రుల పాలిట ఇష్టదైవాలు.... ఆవకాయ, గోంగూరలాంటి వారు. ఈ పచ్చళ్లలో ఏదో ఒకటి లేనిదే తెలుగు వాడి భోజనం ఎలా ఉండదో, వీరిద్దరిలో ఏ ఒక్కరైనా లేకుండా తెలుగు సినిమాయే అసలు ఉండదు. నేటి యువతరానికి దేశ రాజధాని పేరేమిటో తెలియదు కానీ, జయమాలిని ఇంటి అడ్రస్, ఫోన్ నెంబరు మహబాగా తెలుసు.....

✦ ఈ డిస్ట్రిక్ట్ మొత్తానికి స్ట్రిక్ట్ మనిషిని నేను

✦ ఆ పాదరక్షలు ఏంటిరా ? నీ శార్ధం.... అసలు మనం ఎవరం... ఎవరం?

తండ్రీ కొడుకులం..

నీ బొంద.... భారతీయులం... మన సంస్కృతి, చట్టుబండలు ఏమైనా తెలిసి ఏడ్చిందిరా నీకు....?'



పైథాగరస్ ఎవరంటే ఏ జర్మనీ వాడో, ఏ రష్యావాడో అంటావ్.... వాడి అసలు పేరు గిరీశుడని, కాకినాడలో మన పైథా వారబ్బాయ్ అని తెలుసా... ఊహు... తెలియదు. షేక్స్పియర్... శేషప్పయ్యర్ తమిళుడు, రామనాథ్ జిల్లా వాడు, మన భారతీయుడు.

న్యూటన్ ఎవడు ? నూతనుడు అని బెంగాలీయుడు, మన భారతీయుడు. ఇది తెలుసా ? ఊహు.. ఆగు... అసలు మనం ఎవరం?.... ఎవరం?

భారతీయులం

నీ బొంద.... తండ్రీ కొడుకులం... ఛీ ...ఛీ..ఛీ.. ఈ వీరభద్రం కడుపున చెడబుట్టార్రా మీరు... నిన్నూ... ఈ దేశాన్ని బాగు చేయటం నావల్ల కాదురా బాబూ... నా వల్ల కోదు.

✦ సిగ్గూ ఎగ్గూ ఉన్న సన్యాసయితే ఇలా పిల్లల భోజనాల పద్దులో తలనొప్పి బిళ్లల ఖర్చు రాస్తావా? చెప్పు ఎందుకొచ్చాయివి?

అయ్యా... అవి నేను వేసుకున్నవండయ్యా

చేతులతో పని చేస్తుంటే తలకు, మొలకు నొప్పులెందుకొస్తాయయ్యా?

చేతులతో చేస్తే రాదండయ్యా... కానీ ఈ మధ్య నా చేతులకంటే నా చెవులకు పని ఎక్కువయిపోయిందండయ్యా.... మీ సుత్తి వినీ..వినీ....

ఆగక్కడ.... అందుకే ఉదయం లేవగానే సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేయమన్నారు. దానితో ఏ జబ్బూ, రోగం నీ దరికి రాదు గాక రాదు... అసలు సూర్యనమస్కారం యొక్క ప్రాధాన్యత తెలుసా నీకు.....

✦ అదేంటిరా పొలిటిక్స్ క్లాస్‌లో చిక్కుకు పోయినవాడిలా అలా ఉన్నావేంటి?

✦ అదో పెద్ద జిడ్డుశ్రీ రా బాబూ...

✦ ఏడవనివ్వండి..... ఏడుపు ఇప్పటినుండే నేర్చుకుంటే మంచిది... ఆడపిల్ల కదా.

✦ పాఠాలకు ఎలాగూ రారు సరే... అటెండెన్స్‌కు కూడా రారా!

✦ ఇది గాంధీజీ ఉప్పుసత్యాగ్రహం మొదలు పెట్టిన రోజు సార్.... ఈ దేశానికి ఎంతో సుదినం. దేశభక్తి మీకు లేకపోవచ్చు కానీ మాకుంది. అందుకే ఇవాళ క్లాస్‌లు బహిష్కరిస్తున్నాం.

✦ ఆయన కోపిష్ఠి మనిషి. పుట్టగానే నర్స్ కేసి చూసి.... ష్.... సైలెన్స్ అని అరిచి... ఆ తరువాత క్యార్ మన్నాడట.

✦ ఇది విచిత్రవేషధారణ కాదు... మన తెలుగుదనం ప్రతిబింబించే వస్త్రధారణ.

అబ్బో వేషం వేయటమే కాదు.... భాష కూడా మారిందే! మన కాలేజీ క్యాంటీన్‌లో కాఫీ గానీ తాగావా ఏంటి? వద్దు బాబూ... నువ్వు క్లాస్‌లోకి రావద్దు... నువ్వు ఇలా వచ్చి క్లాస్‌లో కూర్చుంటే సడెన్‌గా ఎవరైనా వచ్చి చూస్తే ఈ క్లాస్‌కు ఇద్దరు లెక్చరర్‌లు అనుకుంటారు.... వెళ్లు.. వెళ్లుబాబూ.. వెళ్లు.....

✦ ఆ నవ్వేమిటమ్మాయ్... ఆడపిల్ల కాలు గడపదాటకూడదు.... నవ్వు పెదవి దాటకూడదు... తెలుసా. కారణం లేని నవ్వు, తోరణం లేని పందిరి, పూర్ణము లేని బూరె పనికి రాదన్నాడు శాస్త్రకారుడు. మీకివేమీ తెలియవు. మీ ఇంగ్లీషు బళ్లలో లింకన్ ఎప్పుడు పుట్టాడు... డంకన్ ఎప్పుడు చచ్చాడు.. ఇవే తప్ప... రాముడెవరు, కృష్ణుడెవరు ఇవి చెప్పి తగలడరు.

✦ విశాఖపట్నంలో సిటీబస్ ఎక్కడం, నిన్ను అర్థం చేసుకోవడం.... ఈ రెండూ నా వల్ల కావు నాయనా!

✦ ఈ దేశాన్ని బాగు చేయడానికి తమరేమన్నా మూలపురుషులా? మూల శంక పురుషులాయె.

4

## ఆదర్శాల వెన్నెల కురిపించిన

# నెలవంక



గుమ్మడి, రాజేశ్ తదితరులు

వరుసగా టీనేజ్ లవ్ స్టోరీలు చేస్తూ వచ్చిన జంధ్యాల ట్రాక్ మార్చి తీసిన చిత్రమిది. 'నెలవంక' కొన్ని ఆదర్శాలతో సందేశాత్మకంగా తీయడంతో ప్రేమకి ప్రాధాన్యత తగ్గినా, కొద్దో గొప్పో దీన్లో కూడా టీనేజ్ లవ్‌ని చూస్తాం. జంధ్యాల ముందు మూడు చిత్రాలూ ప్రేమతత్వంతో వుంటే, ఇది మత సామరస్య ప్రధానమైనది.

నిజం చెప్పాలంటే జంధ్యాల చేసిన ఈ ప్రయత్నం కత్తిమీద సామువంటిది. 'మతం కన్నా మానవత్వం మిన్న' అన్న సిద్ధాంతాన్ని అతి నాజూకుగా దృశ్యరూపంలో నూరిపోయడానికి జంధ్యాల ధైర్యం కనబరిచారు. కలాన్ని, కెమెరాని నిష్పాక్షికంగా వాడారు.

'నెలవంక'లో సీనియర్ నటులు గుమ్మడి, జె.వి. సోమయాజులు ముఖ్యపాత్రధారులు.



### పాత్రలు - పాత్రధారులు

| | | |
|---|---|---|
| సలీం | : | రాజేశ్ |
| శ్రీరామరాజు | : | గుమ్మడి |
| రహీం | : | జె.వి. సోమయాజులు |
| సావిత్రి | : | రాజ్యలక్ష్మి |
| లలిత | : | తులసి |
| రాజావారి అన్నగారు | : | సి. రామమోహనరావు |
| కామేశ్వరి | : | మద్దాలి సుశీల |
| నౌకరు శేషయ్య | : | కె. సాంబశివరావు |
| గుర్రాల గురవయ్య | : | పొట్టి ప్రసాద్ |
| రాణీవారు | : | ప్రమీలారాణి |
| రవి | : | ఈశ్వరరావు |

మరియు

విన్నకోట విజయరాం, సుత్తివేలు, సుత్తివీరభద్రరావు, శ్యాం, సాక్షి రంగారావు, థమ్, బాలాజీ, అలీ, కిరణ్, నాగమణి, సభారంజని


గుమ్మడి పాత్రపేరు శ్రీరామరాజు. ఆయన పరమ ఛాందస క్షత్రియుడు. ఆ ఊరికి జమీందారు. ఆస్తి వెన్నలా కరిగిపోయినా హోదా, దర్పం, లంకంత భవంతి మాత్రం మిగిలిపోయాయి. భార్య, ఇద్దరు కూతుళ్ళు - ఇవ్వాళ ఆయన ఆస్తి! పెద్ద కూతురు సావిత్రి (రాజ్యలక్ష్మి) మూగది! రెండో కూతురు లలిత (తులసి) గడుగ్గాయి!

జె.వి. సోమయాజులు పాత్ర పేరు రహీం! ముస్లిం. కానీ ఖురాన్‌తో పాటు పురాణాలు కూడా చదివిన మహామేధావి. జమీందారు గారి టాంగా తోలటం ఆయన ఉద్యోగం.

వీళ్ళిద్దరూ మంచి మిత్రులు. పక్కన ఎవరూ లేనప్పుడు ఒకరినొకరు ఏకవచనంతో పిలుచుకోవడం పరిపాటి. అలాంటి స్నేహితులు మధ్య చెలరేగిన కలవరపాటు కారణంగా హిందూ, ముస్లింల మతకల్లోలాలు... చివరకు మానవత్వాన్ని మించిన మతం లేదనీ, వ్యతిరేక శక్తులను ఎదిరించిననాడు మతసామరస్యం వర్ధిల్లుతుందన్నది ఈ చిత్ర ఇతివృత్తం.

1982 జూన్ 23న వేదాద్రిలో షూటింగ్ ప్రారంభించారు. ఆ రోజు నెలపొడుపు. అంటే నెలవంక కనిపించిన రోజునే 'నెలవంక' ప్రారంభమైంది.

కృష్ణానదీ తీరంలో మూడు జిల్లాల సంగమంగా నిలిచే ఊరు ముక్త్యాల. ఆ ఊరు పక్కనే నిండుగా ప్రవహించే కృష్ణవేణి. ఆ నదికి అవతలి ఒడ్డున కనిపించే మాదిపాడు గుంటూరుజిల్లా అయితే, ముక్త్యాల లోని రాజావారి కోట వెనుకవైపు నుంచి నల్లగొండ జిల్లా.



జె.వి. సోమయాజులు

ఈ 'నెలవంక' షూటింగ్‌ని జంధ్యాల ముక్త్యాలలోనే చేయడానికి చాలా కారణాలున్నాయి. ఇక్కడ హిందూ, ముస్లింలు ఎంతో సఖ్యతగా వుంటారు. కొన్నిసార్లు మొహరం పండుగ, వైకుంఠ ఏకాదశి ఒకే రోజు వస్తుంటాయి. ఆ రోజు ఈ ప్రాంతంలో ముస్లింలు పీరుల ఊరేగింపుతోనూ, హిందువులు పొన్న వాహనం ఊరేగింపుతోనూ బయల్దేరి ఒకరికొకరు ఎదురుపడి అభినందనలు తెలుపుకుంటారట. మరో కారణమేమిటంటే - ముక్త్యాల రాజుగారి వద్ద వున్న రథసారథి ముస్లిం. అప్పటికి వారు రాణీగారి ఆలనాపాలనాలోనే, మత సామరస్యంతో ఎంతో హాయిగా వుండేవారట.

జనవరి 23 నుండి ఆగస్టు 5 వరకూ సింగిల్ షెడ్యూల్‌లో ముక్త్యాల పరిసర ప్రాంతాల్లో షూటింగ్

**విడుదల**
2 -10 -1982

**నిర్మాణ ప్రాంతాలు**
ముక్త్యాల (కృష్ణాజిల్లా)

జరుపుకుంది.



ఈ చిత్రం ద్వారా రాజేశ్, కిరణ్ అనే ఇద్దరు నటులు పరిచయమయ్యారు. ఒకప్పుడు సంగీత ప్రధానమైన సాత్విక కథానాయక పాత్రలకు జీవం పోసిన అమర్‌నాథ్ కుమారుడు రాజేశ్. ఈ రాజేశ్, కెమెరామెన్ ఎస్.గోపాలరెడ్డిలు మంచి స్నేహితులు. 'నెలవంక' కథ విన్న గోపాలరెడ్డి, జంధ్యాలకు రాజేశ్‌ను పరిచయం చేశారు. అలా 'నెలవంక'లో రాజేశ్‌ని హీరోగా తీసుకున్నారు జంధ్యాల. అలాగే రాజమండ్రికి చెందిన కుర్రాడు కిరణ్‌తో ఆంగ్లో ఇండియన్ పాత్రను చేయించారు.

జె.వి.సోమయాజులు ఇందులో పూర్తి విభిన్న పాత్రను పోషించారు. 'రహీం'గా ఆ పాత్రలో ఒద్దికగా ఇమిడిపోయారాయన. ఇందులో తన పాత్ర కోసం జె.వి. సోమయాజులు నిజంగానే గడ్డం పెంచారు. ఈలోగా 'పెళ్ళీడు పిల్లలు' సినిమా ప్యాచ్‌వర్క్ కోసం సడన్‌గా గడ్డం తీసేయాల్సి వచ్చింది. దాంతో గడ్డం పెరిగే దాకా వారం రోజులు షూటింగ్ ఆపేసారు జంధ్యాల.

ఈ చిత్రం షూటింగ్‌లోనే తన 56వ పుట్టినరోజుని జరుపుకున్నారు గుమ్మడి. తోలుబొమ్మలాట, దొంగపూజారి - దూదేకుల సాయిబుల ప్రహసనం, లక్ష్మి మతం మార్చుకున్న తీరు, రహీం ద్వారా చెప్పించిన రామపాదుకలను గురించిన కథ, 'ఏ రాముణ్ణి ధ్యానిస్తున్నానో ఆ రాముని బాణానికే బలవుతుంటే ఎవరితో మొరపెట్టుకునేది?' వంటి పిట్ట కథలూ, కథనానికి ఊపు ఇచ్చాయి. అలాగే చివరి సన్నివేశంలో రహీం ముసలి అక్క రామరాజుల పునఃకలయిక, అటుపక్క హిందూ ముస్లింల కలహాలు, ఆ తరువాత ఆ మతకలహాలకి వీరిద్దరూ బలయ్యే తీరూ ఎంతో హృద్యంగా చిత్రీకరించారు జంధ్యాల.

'శంకరాభరణం' రాజ్యలక్ష్మి తల్లి సభారంజని (ఒకనాటి ప్రముఖ స్టేజి నటి) కూడా ఈ చిత్రంలో ముఖ్యపాత్ర ధరించడం జరిగింది. జంధ్యాల సమయస్ఫూర్తి గురించి, సమయానుగుణంగా వచ్చే కొత్త కొత్త థాట్స్ గురించి చెప్పుకోవాలంటే చాలానే వుంటాయి. ఉదాహరణగా ఈ చిత్రం షూటింగ్‌లో జరిగిన ఓ సంఘటన గురించి చెప్పుకుందాం.

ఆ రోజు ముక్త్యాలలోని రాజాగారి కోటలో గుమ్మడి, జె.వి.సోమయాజులు మీద సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. 'ఇంతలో ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు.... మెరుపులు! దానికి తోడు గాలి కూడా ప్రారంభమైంది. ఆ భవంతి ఆవరణలో వున్న పొడవాటి కొబ్బరి చెట్టు ఆ గాలి తాకిడికి విసురుగా అటూ ఇటూ వూగుతోంది. ఆ దృశ్యం చూడగానే జంధ్యాలకు

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : శ్రీమురళీకృష్ణా ఆర్ట్ క్రియేషన్స్ |
| సంగీతం | : రమేశ్‌నాయుడు |
| పాటలు | : ఇంద్రగంటి శ్రీకాంతశర్మ |
| నేపథ్యగానం | : ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం. ఎస్. జానకి. చంద్రశేఖర్ |
| కూర్పు | : గౌతంరాజు |
| కళ | : తోట తరణి |
| కో- డైరెక్టర్ | : యు.వి. పాణి |
| దుస్తులు | : కొండయ్య |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : ఎస్.గోపాలరెడ్డి |
| నిర్మాతలు | : ఎ.యస్.ఆంజనేయులు. యం.నరసింహారావు |
| రచన, దర్శకత్వం | : జంధ్యాల |





కొత్త థాట్ వచ్చింది కాబోలు వెంటనే రాజ్యలక్ష్మిని పిలిపించి ఆమెను నజెషన్‌లో నిల్చోబెట్టి బ్యాక్‌గ్రౌండ్‌లో ఆ కొబ్బరిచెట్లు వుండేలా కొన్ని షాట్స్ తీసుకున్నారు. గోపాలరెడ్డి ఆ 'షాట్ బ్యూటీ' ని కెమెరాలో బంధించారు.

ఈ చిత్రానికి జంధ్యాల 'నెలవంక' టైటిల్ పెట్టడం కొంత చర్చనీయాంశమైంది. ఈ టైటిల్ ఎందుకు పెట్టారని జంధ్యాలను అడిగితే - "శివుని జటాజూటంలో వున్నదీ... ముస్లింల జండాలో వున్నదీ ఒకటే - అదే నెలవంక! అంటే అన్ని మతాలూ ఒకటే అన్నది 'నెలవంక' సంకేతం! అందుకే ఈ చిత్రంలో ఓ పాటలో -'శివుని జటను వెలిసినది, మా జండా నిలిపినది ఒకటే నెలవంక, ఇక మన చూపులేల నేలవంక' అనే చరణం కూడా వుంది' అని వివరణ ఇవ్వడం జరిగింది. చిత్రానికి రమేశ్‌నాయుడు తనదైన శైలిలో సంగీతాన్ని అందించారు. సంగీతానికి అంత ప్రాధాన్యత అవసరంలేని సబ్జెక్టయినా చక్కటి పాటలతో, నేపథ్య సంగీతంతో ఈ చిత్రానికి కళాత్మక విలువలు ఆపాదించారు. ఈ చిత్రంలో ప్రసిద్ధ రచయిత, కవి ఇంద్రగంటి శ్రీకాంతశర్మతో ఆరు పాటలు రాయించుకున్నారు.

'మతం వద్దు గతం వద్దు మారణ హోమం వద్దు' అనే సందేశాత్మక గీతాలూ, 'కనుబొమ్మల పల్లకిలోన' వంటి శృంగార భరిత పల్లవులూ, ఓ కవాలీ, ఓ 'హొలియో హొలియో' పాట ఈ చిత్రానికి చక్కటి రిలీఫ్‌నిచ్చాయి. శ్రీకాంతశర్మ కలం ఈ చిత్రంలోని పాటల్లో కొత్త రుచులు చవి చూపించింది.

ఈ సినిమా విశేషాలను శ్రీకాంతశర్మ ఇలా వివరించారు - "జగ్గయ్యపేటలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేసే మెట్టెల రామబ్రహ్మం జంధ్యాలకి క్లాస్‌మేట్. ఆయన తన స్నేహితులతో కలిసి 'నెలవంక' సినిమా తీశారు. ఇందులో ఆరుపాటలు నేనే రాశాను. ఇందులో 'ఏది మతం'- పాటకి నేషనల్ అవార్డ్ ఎక్స్‌పెక్ట్ చేసారు రమేశ్ నాయుడు. అయితే సమయానికి ప్రింట్ మిస్సవడంతో అవార్డులకందలేదు. ఒక సినిమా పాటలాగా కాకుండా ఎంతో సహజంగా వుండే పాట వుంది. 'ఒన్ అండ్ టూ అండ్ ఐలవ్‌యూ ' అనే పాటను ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, ఎస్.జానకి, చంద్రశేఖర్ (రమేశ్‌నాయుడు అసిస్టెంట్) పాడారు.

ఈ సినిమా అంటే జంధ్యాలకి చాలా ఇష్టం. కొంచెం ట్రిమ్ చేస్తే గొప్ప సినిమా అవుతుందని ఆయన ఉద్దేశం, కానీ ఒరిజినల్ నెగిటివ్ పోవడంతో ఆ ప్రయత్నం కాస్తా నెరవేరలేదు. "ఈ సినిమా తర్వాత నాతో 'రెండు జెళ్ళ సీత'లో ఒక పాట 'పుత్తడి బొమ్మ' లో రెండు పాటలు, 'రావుగోపాలరావు' లో ఒక పాట (కులుకులమ్మ చూసిందిరో) రాయించారు జంధ్యాల. అలాగే జంధ్యాల దర్శకత్వంలో రూపొందిన 'కృష్ణమూర్తి - కుక్కపిల్లలు' అనే టెలీ ఫిలిమ్ క్కూడా నేను పాట రాశాను" అని తెలిపారు శ్రీకాంత్‌శర్మ. తను ఎంతో ఇష్టపడి, కష్టపడి, మరెంతో శ్రమకోర్చి తీసిన ఈ చిత్రం అంతగా ఆదరణకు నోచుకోలేకపోవడంతో చాలా రోజులు బాధపడిపోయారు జంధ్యాల.

నిజానికి 'నెలవంక' ఒక ఉత్తమమైన చిత్రం. అది హిందూ, ముస్లింల భావైక్యతకు పిలుపునిచ్చే చిత్రంగానే కాక, మానవతావాదానికి దర్పణం పట్టిన చిత్రం కూడా. రాష్ట్రస్థాయిలోనో, జాతీయ స్థాయిలోనో ఈ సినిమాకి చాలా అవార్డులు వస్తాయని అందరూ ఊహించారు. కానీ ఆ ఊహలు కూడా ఫెయిలయ్యాయి.

5

## యువ హృదయాలను కొల్లగొట్టిన

# రెండు జెళ్ళ సీత




'ముద్దమందారం', 'నాలుగు స్తంభాలాట' చిత్రాలతో జంధ్యాల పట్ల యువతరం ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆరాధనాభావం ఏర్పడింది. ఆ నేపథ్యంలో యువతరం కోసం జంధ్యాల ప్రత్యేకంగా రూపొందించిన చిత్రం 'రెండు జెళ్ళ సీత'.


జంధ్యాలకి కె.విశ్వనాథ్ అంటే ఎంతటి గౌరవాభిమానాలున్నాయో, బాపు-రమణలంటే కూడా అంతే!. ముళ్ళపూడి వెంకటరమణ-మాటల్లో హాస్యాన్ని అందంగా పొదిగిస్తే, మాటల్ని హాస్యరసంలో ముంచి తేల్చిన ఘనత జంధ్యాలది. ముళ్ళపూడి వెంకట రమణ 'బుడుగు' భాషలో సృష్టించిన కాయినింగే 'రెండు జెళ్ళ సీత'. బోలెడంత అందంగా, కాస్తంత అమాయకంగా ఉండే అమ్మాయిని.... అబ్బాయిలంతా 'రెండు జెళ్ళ సీత' అనేసుకునేవారు. అలాంటి కుర్రకారు డ్రీమ్‌గర్ల్ అయిన 'రెండు జెళ్ళ సీత'ని తనదైన హాస్యవంథాలో తెరకెక్కించారు జంధ్యాల.






నలుగురు కుర్రాళ్ళు ఓ అమ్మాయిని ప్రేమిస్తారు. ఆ అమ్మాయి అప్పటికే వేరే అబ్బాయిని ప్రేమించి కట్నపిశాచి దురాగతం వల్ల అతనికి దూరమైపోతుంది. ఈ నలుగురు కుర్రాళ్ళు ఆ అబ్బాయిని సంస్కరించి ఇద్దరి పెళ్ళి జరిపిస్తారు. ఇదే ఈ చిత్ర మూలకథాంశం. ప్రథమార్థం






క్రేజీగానూ, ద్వితీయార్థం కొంచెం సెంటిమెంట్‌తోనూ నడుస్తుంది.

ఇందులో నలుగురు కుర్రాళ్ళుగా నరేశ్, ప్రదీప్, రాజేశ్, శుభాకర్‌లు నటించారు. ఈ నలుగురూ ఒకరకంగా తెలుగు తెరకి కొత్తవాళ్ళే. ఇదే ప్రదీప్ ఆఖరి చిత్రం. ఈ సినిమా తర్వాత ప్రదీప్ ఏ సినిమా చేయలేదు. చదువుకే తొలి ప్రాధాన్యమిచ్చిన ప్రదీప్, అటుపై బుల్లితెరపై అగ్రపీఠాన్ని అలంకరించారు. శ్రీలక్ష్మి సోదరుడైన రాజేశ్‌ని 'నెలవంక' సినిమాతో జంధ్యాల హీరోని చేసారు. ఆ తర్వాత రాజేశ్ నటించిన సినిమా ఇది. తరువాతి రోజుల్లో 'మయూరి' శుభాకర్‌గా పేరుతెచ్చుకున్న శుభాకర్ కి ఈ చిత్రం మంచి గుర్తింపును తీసుకువచ్చింది.

హీరోయిన్ మహాలక్ష్మి ప్రేమికుడిగా సినిమాలో కనిపించిన అబ్బాయి పేరు కమలాకర్. ఇతగాడు ఓ సినిమాలో హీరోగా కూడా చేసాడు.

'రాము' సినిమా గుర్తుంది కదూ. అందులో ఎన్.టి.ఆర్. తో కలిసి 'పచ్చని చిలుకలు రెండు' పాటలో నటించినావిడ పేరు

### పాత్రలు-పాత్రధారులు

| | |
|---|---|
| గోపీ | : నరేశ్ (హీరో) |
| కృష్ణ | : ప్రదీప్ (హీరో) |
| మోహన్ | : రాజేశ్ (హీరో) |
| మూర్తి | : శుభాకర్ (హీరో) |
| సీత | : మహాలక్ష్మి (తొలి పరిచయం) |
| కామేశ్వరరావు | : 'శుభలేఖ' సుధాకర్ |
| మధు | : కమలాకర్ |
| సూర్యనారాయణ | : సాక్షి రంగారావు |
| సుబ్బారావు | : వేలు |
| రిటైర్డ్ మేజర్ మంగపతి | : వీరభద్రరావు |
| అనసూయ | : శ్రీలక్ష్మి |
| కాత్యాయని | : దేవి |
| సీత తల్లి | : పుష్పలత |
| జ్యోతిషసమ్రాట్ | |
| ఏ.వి. రావు | : పొట్టిప్రసాద్ |
| అప్పలకొండ | : రాళ్ళపల్లి |
| రసశ్రీ | : కృష్ణ చైతన్య |
| దుంబు | : మాస్టర్ చక్రవర్తి |
| సేట్‌జీ | : టెలిఫోన్ సత్యనారాయణ |
| గండభేరుండం | : అల్లు రామలింగయ్య |

మరియు

కిరణ్, సుందరలక్ష్మి, ప్రకాశరావు, తాతబాబు, విజయకృష్ణ, రామారావు, ఎర్రాజీరావు, తాతా అప్పారావు, భాస్కర్, విశ్వనాథ్ తదితరులు.




పుష్పలత. అలా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన పుష్పలత కూతురు మహాలక్ష్మిని ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎంపిక చేశారు జంధ్యాల. కన్నడంలో కొన్ని సినిమాల్లో నటించిన మహాలక్ష్మికి తెలుగులో మాత్రం ఇదే తొలి ప్రయత్నం. పుష్పలత కూడా ఇందులో నటించారు. అది కూడా మహాలక్ష్మికి తల్లిగానే...

ఇక్కడో తమాషా విషయం చెప్పుకోవాలి. ఈ సినిమాలో కథానాయికగా నటించాలని సెలక్షన్స్‌కు వచ్చినవారిలో విజయశాంతి, భానుప్రియ, శోభన తదితరులున్నారు. వీళ్లను కాదని జంధ్యాల మహాలక్ష్మిని ఎంపికచేశారు. విధివైచిత్రి ఏమిటంటే మహాలక్ష్మి కొన్ని సినిమాలతోనే వెనుతిరగ్గా, ఆ ముగ్గురూ మాత్రం హీరోయిన్లుగా టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు.

అమాయకపు ఇల్లాలి పాత్రలకు పెట్టింది పేరుగా భాసిల్లిన శ్రీలక్ష్మికి హాస్యనటిగా మంచి ముద్ర వేసిన చిత్రం 'రెండు జెళ్ళ సీత'. 1954లో వచ్చిన 'అమర సందేశం' వంటి చిత్రాల్లో హీరోగా నటించిన అమరనాథ్ కూతురే ఈ 'శ్రీలక్ష్మి'. తమిళంలో, మలయాళంలో కొన్ని సినిమాల్లో కథానాయికగా నటించిన శ్రీలక్ష్మి 'నివురు గప్పిన నిప్పు' సినిమాలో తొలిసారిగా హాస్యపాత్ర చేశారు. ఆమె కెరీర్‌కి 'రెండు జెళ్ళ సీత' మంచి ఊతాన్నిచ్చింది. ఈ చిత్రంలో తాను ఎంపికైన విధానాన్ని శ్రీలక్ష్మి వివరిస్తూ "ఈ చిత్ర నిర్మాణ నిర్వాహకులు జయకృష్ణ మా నాన్నగారికి పర్సనల్ మేకప్‌మేన్‌గా పనిచేసేవారు. అప్పటి నుంచీ ఆయన మాకు మంచి ఫ్యామిలీ ఫ్రెండ్. ఆయన నాకు ఇందులో అతిథి పాత్ర ఉందని చెప్పారు. 'హీరోయిన్‌గా చేస్తున్నావ్ కదా, ఇలాంటి గెస్ట్ క్యారెక్టర్స్ వద్ద'ని మా తమ్ముడు రాజేశ్

## పాటలు

| పాట | అభినయం |
|---|---|
| 1. లేడి వేట.. ఇది లేడీ వేట | నరేశ్, ప్రదీప్, రాజేశ్, శుభాకర్ తదితరులు |
| 2. రెండు జెళ్ల సీత తీపి గుండె కోత | నరేశ్, ప్రదీప్, రాజేశ్, శుభాకర్, మహాలక్ష్మి |
| 3. సరిసరి పదపదనీ నీ సరి ఎవరిక అని | నరేశ్, ప్రదీప్, రాజేశ్, శుభాకర్, మహాలక్ష్మి. |
| 4. మందారంలో ఘుమఘుమలై | కమలాకర్, మహాలక్ష్మి |
| 5. కొబ్బరి నీళ్లా జలకాలాడి | 'శుభలేఖ' సుధాకర్, దేవి, నరేశ్, ప్రదీప్, రాజేశ్, శుభాకర్, మాస్టర్ చక్రవర్తి |
| 6. పురుషులలో పుణ్య పుణ్యపురుషులు వేరు | 'శుభలేఖ' సుధాకర్, నరేశ్, ప్రదీప్, రాజేశ్, శుభాకర్, అల్లు రామలింగయ్య, మాస్టర్ చక్రవర్తి, వేలు తదితరులు |



వారించాడు. వచ్చిన అవకాశం వదులుకోకూడదనే పద్ధతిలో నేను సినిమా చేయడానికి సిద్ధమైపోయాను. తీరా రెండు రోజులు వేషం అనుకున్నది కాస్తా ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్ అయిపోయింది. అమాయకత్వం, మూగ భాష మాట్లాడే తీరు వల్ల ఆ పాత్ర అందరినీ ఆకట్టుకుంది. ఇందులో నా పాత్ర పేరు అనసూయ. ఈ పాత్రే నేను హాస్యనటిగా మారడానికి బలమైన పునాది వేసింది. నేను హాస్యరసంలో ఏ మాత్రమైనా పేరు తెచ్చుకున్నానంటే అదంతా జంధ్యాల గారి చలవే. 'రెండుజెళ్లసీత'లోని నా పాత్రకు ఉత్తమ హాస్యనటిగా కళాసాగర్ అవార్డు లభించింది. ఆ తరువాత పదమూడేళ్లు ఏకధాటిగా ఆ అవార్డునందుకున్నాను." అని చెప్పారు.

**విడుదల**
మే, 1983

**నిర్మాణ ప్రాంతాలు**
వైజాగ్,అరకు లోయ, విజయనగరం తదితర ప్రదేశాలు

**నిర్మాణ వ్యయం**
13 లక్షల 75 వేల రూపాయలు

**నిర్మాణసమయం**
సుమారు 45 రోజులు

వైజాగ్ కనకమహాలక్ష్మి కోవెలలో 4 అక్టోబర్,1982 నాడు షూటింగ్ ప్రారంభమైంది. వైజాగ్, చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 45 రోజుల పాటు ఈ చిత్రం షూటింగ్ జరిగింది.

వైజాగ్ రామకృష్ణా బీచ్‌కి ఎదురుగా ఓ బిల్డింగ్‌ని అద్దెకు తీసుకుని, దాన్నే ఈ చిత్రంలోని కథానాయకుల నివాసంగా తెర మీద చూపించారు.


నరేశ్, ప్రదీప్, రాజేశ్, శుభాకర్, కమలాకర్, శుభలేఖ సుధాకర్, మహాలక్ష్మి, శ్రీలక్ష్మి వీరందరిదీ ఇంచుమించు ఒకటే వయసు. ఈ ఎనమండుగురూ ఓ టీమ్‌లా కలిసి మెలిసి వుండేవారు. షూటింగ్ పూర్తి కాగానే వీళ్ళంతా నాలుగు బైక్స్ మీద షికారుకి బయలుదేరి పోయేవారు. "ఈ సినిమా షూటింగ్‌ని చాలా బాగా ఎంజాయ్ చేసాం. ఓ రకంగా మేం కోతిగోల చేసేవాళ్ళం" అన్నారు ప్రదీప్ ఆనాటి సంఘటనలను తలుచుకుని ముసిముసిగా నవ్వుతూ.

BSA Falcon అనే 100 సి.సి. మోటార్ బైక్స్ అప్పుడే మార్కెట్లోకి వచ్చాయి. షూటింగ్ నిమిత్తం ఓ నాలుగు బైక్స్‌ని తీసుకున్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్లు వేరేలా వున్నా గానీ, సినిమాలో తమాషాగా కనిపించాలనే ఉద్దేశ్యంతో 1111, 2222, 3333, 4444 అని ఏర్పాటు చేశారు.

ఓ రోజు ఈ ఎనమండుగురు బైక్స్ మీద షికారు చేస్తూంటే పోలీసులు ఆపారు. 'ఇవేవో దొంగ నెంబర్లలా వున్నాయే' అని సందేహపడి వీళ్ళని బైక్స్‌తో సహా పోలీస్ స్టేషన్‌కు తరలిస్తే జంధ్యాల వచ్చి విడిపించారట. ఈ విషయం ప్రదీపే స్వయంగా చెప్పారు.

సినిమాలో నలుగురు హీరోల ఇంట్రడక్షన్ కూడా కొత్తగా అనిపిస్తుంది. 'హాయ్' అంటూ ఆడియన్స్ వైపు ఓ చూపు విసిరి, క్లాస్‌రూమ్‌లోకి... (అసలు కథలోకి) ఎంటరౌతారు. హీరోలు ఇలా గ్రీట్ చేస్తుండగా వారి టైటిల్ కార్డ్స్‌ని ప్రదర్శించడం ఓ తమాషా థాట్. మిగిలిన టైటిల్స్ అన్నీ క్యారికేచర్లతో ప్రెజెంట్ చేయడం అప్పట్లో అందరూ కొత్తగా ఫీలయ్యారు.

చిత్రం చివర్న - తాము ప్రేమించిన అమ్మాయికి ఆమె ఇష్టపడిన అబ్బాయితో తమ చేతుల మీదుగా పెళ్ళి చేస్తూ ఓ వక్క ఆనందబాష్పాలు, మరోపక్క దుఃఖాశ్రువులు చిందిస్తూ ఈ నలుగురూ చేసిన అభినయం హార్ట్ టచింగ్‌గా వుంటుంది.




హీరోయిన్ ఇంట్రడక్షన్ కూడా భలే తమాషాగా తీశారు జంధ్యాల. హీరోయిన్ ఈ సినిమాలో ఆటో నుంచి దిగి తొలిసారిగా కనిపిస్తుందామె. ఆ ఆటో మీద 'బాపు - ముళ్ళపూడి వెంకటరమణ' అని రాసి వుంటుంది. అయితే ఇది షూటింగ్ కోసం ప్రత్యేకంగా రాయించలేదు. ఆ ఆటో కుర్రాడే బాపు-రమణల మీద అభిమానంతో

రాయించుకున్నాడు. ఇది కాస్తా జంధ్యాల స్నేహితుడు, వైజాగ్‌లో వీళ్ళ షూటింగ్ వ్యవహారాలన్నింటినీ సమన్వయ పరిచే బాబన్న దృష్టిలో పడింది. ఈ విషయం జంధ్యాలకు చెబితే, ఆయన వెంటనే అతణ్ణి పిలిపించి ఈ సీన్ షూట్ చేయడం జరిగింది. అసలు 'రెండు జెళ్ళ సీత'ను ఆంధ్రప్రదేశ్‌లో పాపులర్ చేసింది బాపు - రమణే కదా. ప్రేక్షకులకీ విధంగా 'రెండుజెళ్ళ సీత' అసలు సృష్టికర్తలను గుర్తు చేయడం సముచితంగా అనిపిస్తుంది.



'శుభలేఖ'సుధాకర్, దేవి

ఇందులో హీరోయిన్ పేరు సీత. కుందనపు బొమ్మలా వుంటుంది. ఒక జడ వేస్తే మరీ దిష్టి కొట్టేస్తారని వాళ్ళమ్మ పట్టుపట్టి రెండు జడలు వేస్తుంది. అలా రెండు జెళ్ళ సీత అయ్యిందన్న మాట. దానిక్కూడా సినిమాలో ఓ డైలాగ్ ప్రత్యేకంగా పెట్టారు జంధ్యాల.

కమలాకర్, మహాలక్ష్మిల మధ్య ప్రేమ సందేశాలకు క్షేత్రయ్య పదాలను ఉపయోగించడం జంధ్యాలలోని అభిరుచికి, స్పార్క్‌కి ఓ మచ్చుతునక.

రిటైర్డ్ మేజర్ మంగపతి పాత్రలో వీరభద్రరావు ఉన్నంతలో మంచి మోతాదులో హాస్యాన్ని నింపారు. జారుడు బల్లమీద జారడం,' సీ-సా' ఆట ఆడటం లాంటి విచిత్రమైన పనులు చేయడమే గాక, 'నేను రెండుసార్లు పిచ్చాసుపత్రి నుంచి పారిపోయి వచ్చాను తెలుసా' అంటూ కొసమెరుపు మెరిపించి అందర్నీ ఘొల్లుమనిపిస్తారాయన. అసలు ఆయన ఎంట్రెన్సే సుత్తితో కొడుతూ కనిపిస్తుంది - 'నేను సుత్తితో పాపులర్ అయిన వాణ్ణి సుమా' అన్నట్టు... దటీజ్ జంధ్యాల.

ఇందులో అల్లురామలింగయ్య పాత్ర పేరు 'గండభేరుండం'. ఈయనగారికి ఉత్తరభారత దేశమన్నా, హిందీ అన్నా చాలా ఇష్టం. ఆ వెర్రితోనే పిచ్చి హిందీలో తెగ మాట్లాడేస్తుంటారు.

విజయనగరం వెళ్ళి - సీత ప్రేమించిన మధు మనసు మార్చడానికి ఏం చేయాలా అని ప్లాన్ చేస్తుంటారు ఈ నలుగురు. వీరికి డుంబు అనే కుర్రాడు సాయం చేస్తుంటాడు. ఆ కుర్రాడి అసలు పేరు చక్రవర్తి. ప్రముఖ రచయిత డాక్టర్ తంబు గారబ్బాయ్. ఈ కుర్రాడే ఇటీవల కృష్ణవంశీ 'శ్రీ ఆంజనేయం' సినిమాకి గ్రాఫిక్స్ సమకూర్చాడు.

'రెండు జెళ్ళ సీత' విజయవంతంగా శతదినోత్సవం జరుపుకుంది గానీ, ఫంక్షన్ మాత్రం చేయలేదు.

ఇదే సినిమాని 'దేవి-శ్రీదేవి'గా తమిళంలో వేరేవాళ్ళు రీమేక్ చేశారు. శ్రీలక్ష్మి అందులో కూడా నటించారు.

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : శ్రీభ్రమరాంబికా ఫిలింస్ |
| సంగీతం | : రమేశ్‌నాయుడు |
| పాటలు | : వేటూరి, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ |
| నేపథ్యగానం | : బాలు, జానకి |
| ఎడిటింగ్ | : గౌతంరాజు |
| ఆర్ట్ | : తోట తరణి |
| స్టంట్స్ | : రాజు |
| నృత్యం | : శివ-సుబ్రహ్మణ్యం |
| అసోసియేట్ డైరెక్టర్స్ | : ఇ.వి.వి. సత్యనారాయణ, బి.యస్.నిష్టల |
| అసిస్టెంట్ డైరెక్టర్ | : బత్తుల రామకృష్ణ |
| కో-డైరెక్టర్ | : యు.వి.పాణి |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : యస్.గోపాలరెడ్డి |
| కెమెరామెన్ | : ఎం.వి. రఘు |
| నిర్వహణ | : జయకృష్ణ |
| నిర్మాత | : కె. కేశవరావు |
| కథ-మాటలు,దర్శకత్వం | : జంధ్యాల |



మహాలక్ష్మి

తొలుత మేకప్‌మన్‌గా పేరు తెచ్చుకుని ఆ తరువాత ప్రముఖ దర్శకులతో తన అభిరుచికి తగ్గట్టుగా ఎన్నెన్నో ఉత్తమ చిత్రాలను నిర్మించారు జయకృష్ణ. 'శంకరాభరణం' విడుదల తరువాత జంధ్యాలతో జయకృష్ణకు పరిచయం ఏర్పడింది. అటుపై వాళ్ళిద్దరూ తరచూ కలుసుకుంటుండేవారు. జంధ్యాల దర్శకుడైన తరువాత ఆయన షూటింగ్‌లకు రెగ్యులర్‌గా వెళ్తుండేవారు జయకృష్ణ. నవభారత్ పంపిణీ సంస్థకు చెందిన కేశవరావు, సాయికృష్ణ డిస్ట్రిబ్యూషన్ సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో హీరో కృష్ణ, దర్శకుడు దాసరి కూడా భాగస్వాములు. సినిమా నిర్మాణం మీద మక్కువ ఉన్న కేశవరావు తన అభిప్రాయాన్ని జయకృష్ణకు చెప్పి అండగా ఉండమని కోరారు. ఈ సందర్భంలో జంధ్యాల తనకు చెప్పిన ఓ స్టోరీ లైన్ గురించి వివరించారు జయకృష్ణ. అలా 'రెండు జెళ్ల సీత' మొదలయింది. ఆ తరువాత ఇదే బ్యానర్‌లో 'రావూ-గోపాలరావూ' చిత్రం కూడా రూపొందింది. జంధ్యాల, జయకృష్ణల అనుబంధం జంధ్యాల మృతి చెందేవరకూ కొనసాగింది. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో 'ముద్దుల మనవరాలు', 'రాగలీల', 'వివాహ భోజనంబు', 'నీకు నాకు పెళ్లంట' చిత్రాలు రూపొందాయి. 'శుభం' అనే చిత్రానికి ప్లానింగ్ జరుగుతున్న సమయంలోనే జంధ్యాల ఆకస్మికంగా కన్నుమూశారు.


సంగీత దర్శకునిగా రమేశ్‌నాయుడు చేసిన సరిగమల సరసాలు ప్రేక్షకుల్ని కొబ్బరి నీళ్ళలో జలకాలాడించాయి. తెలుగు వారి వంటకాలు, రుచుల మీద మహా మక్కువున్న జంధ్యాల చాల ఇష్టపడి 'మాగాయే మహాపచ్చడి- పెరుగేస్తే మహత్తరి - అది వేస్తే అద్దవిస్తరి - మానిన్యా మహాసుందరి' అంటూ వేటూరితో ఊరగాయపద్యంలా అనిపించే ఓ రాలుగాయి పద్యాన్ని రాయించుకున్నారు. ద్వైతా గోపాలం రాసిన 'శ్రీకాకుళే మహాక్షేత్ర, గుండేరే మహానదీ...' పద్యం వరుసలో ఈ పాట రాశానని వేటూరి చెప్పుకున్నారు.

అంతేకాదు ఆకాశవాణిలో పనిచేసే ప్రసిద్ధ సాహితీవేత్త ఇంద్రగంటి శ్రీకాంత శర్మ చేత వరకట్న

## కథాసంగ్రహం

గోపి-కృష్ణ-మోహన్-మూర్తి నలుగురు కుర్రాళ్ళు. ఒకే కాలేజీ-ఒకే రూమ్ -ఒకే మాట- ఒకే బాట-ఒకే లవర్ అన్నట్టుగా వుంటారు. వీళ్ళు వుంటున్న ఇంట్లోకి 'సీత' అనే అందమైన అమ్మాయి తన తల్లితండ్రులతో కలిసి అద్దెకు దిగుతుంది. అక్కణ్ణుంచే ఆ నలుగురి మధ్యనా పోటీ మొదలవుతుంది. ఈ పోటీ ముదిరి నలుగురూ డబ్బులిచ్చి ఒకే రౌడీతో దెబ్బలు తినాల్సివస్తుంది. దాంతో వీళ్ళు ఓ నిర్ణయానికి వచ్చి కలిసికట్టుగా, 'సీత' దగ్గరికి వెళ్ళి తమలో ఎవరిని ప్రేమిస్తున్నావని అడుగుతారు. అప్పుడు సీత తన గతాన్ని చెబుతుంది. మధు, సీతలు ప్రేమించుకుంటారు. మధు తండ్రి గండభేరుండం వీళ్ళ పెళ్ళికి రెండులక్షల కట్నం అడుగుతాడు. బడిపంతులైన సూర్యనారాయణ అప్పటికే ఒప్పుకుంటాడు. పెళ్ళికి అంతా సిద్ధమవుతుండగా సీత మీద నింద మోపి పెళ్ళి కేన్సిల్ అయ్యేట్టు చేస్తాడు గండభేరుండం. ఆమె గతం విని కరిగిపోయిన ఈ నలుగురు కుర్రాళ్ళు మధు మనసు మార్చి ఈ పెళ్ళి జరిపిస్తామని హామీ ఇస్తారు. విజయనగరం వెళ్ళి గండభేరుండం కూతురు కాత్యాయని, కామేశ్వరరావు అనే కుర్రాడితో ప్రేమలో పడేలా చేస్తారు. మధు, సీతలను విడగొట్టడం కోసం గండభేరుండం, ఫోటోల్లో తలలు మార్పించి సీతకు వేరే కుర్రాడితో సంబంధం ఉందని అబద్ధమాడతాడు. ఈ నలుగురూ అదే తరహాలో కాత్యాయని మీద అపనింద మోపుతారు. దాంతో గండభేరుండం తను చేసిన తప్పు ఒప్పుకుంటాడు. ఇలా ఆ నలుగురు మధును, సీతను కలుపుతారు.

మహాలక్ష్మి, రాజేశ్



సమస్య మీద క్లైమాక్స్‌లో వచ్చే 'పురుషులలో పుణ్య పురుషులు వేరు' అనే పాటను రాయించారు.

అప్పుడు శ్రీకాంత శర్మ విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పనిచేస్తూండేవారు. 'కృష్ణావతారం' సినిమా కోసం బాపు ఆయనతో 'చిన్నారి నవ్వు - చిట్టి తామర పువ్వు' అనే పాటను రాయించుకున్నారు. శ్రీకాంత శర్మ రాసిన తొలి సినిమా పాట అదే. జంధ్యాల, శ్రీకాంత శర్మ మంచి స్నేహితులు. 'కృష్ణావతారం'లో పాట రాశారని తెలుసుకుని చాలా ఆనందపడి పోయారు జంధ్యాల. ఆ ఉత్సాహంతోనే అప్పుడు తను దర్శకత్వం వహిస్తున్న 'నెలవంక' సినిమాలో మొత్తం ఆరు పాటలూ ఆయనతోనే రాయించుకున్నారు. ఆ తర్వాత 'రెండు జెళ్ల సీత' కోసం 'పురుషులలో పుణ్యపురుషులు వేరు' పాట రాయించుకున్నారు.

"నేను మద్రాసు వెళ్లినప్పుడు ఈ పాట సందర్భం చెప్పారు జంధ్యాల. మర్నాడు నిర్మాత జయకృష్ణ ఇంట్లో కూర్చొని ఈ పాట రాశాను. రాస్తున్నప్పుడు సంగీత దర్శకుడు రమేశ్‌నాయుడు, జంధ్యాల కూడా అక్కడే ఉన్నారు. పాట పూర్తయ్యాక రమేశ్‌నాయుడు బాణీ కట్టారు. సాధారణంగా పాటల రికార్డింగ్ సమయంలో రచయిత తప్పని సరిగా ఉండాలి. కానీ, రేడియో పనుల బిజీ వల్ల నేను పాల్గొనలేకపోయాను" అని ఆ పాట రాసిన సందర్భాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు శ్రీకాంతశర్మ.

పాటలు తీయడంలో కూడా జంధ్యాల కొత్త స్కీమ్ కనబరిచారు. 'రెండు జెళ్ళ సీత', 'సరిసరి పదపదనీ', 'మందారంలో ఘుమఘుమలై' పాటల చిత్రీకరణలో షాట్ డివిజన్ అద్భుతంగా కుదిరింది. 'సరిసరిపదపదనీ' పాటలో 'భీతహరిణనేత్రిని నేనూ' అన్నప్పుడు కథానాయిక వదనంపై లేడి పరుగు పెడుతున్నట్టుగా షాట్ వేయడం ఆయన అభిరుచికి ఓ నిదర్శనం. అలాగే నలుగురు హీరోల మీద చిత్రీకరించిన 'రెండు జెళ్ళ సీత... తీపి గుండె కోత' పాట సాహిత్యంలో - కథాపరంగా ఆ నలుగురు హీరోల పర్సనల్ టేస్ట్‌ల ప్రకారం - స్పోర్ట్స్ ఐటమ్స్‌ని నరేశ్‌కి, ఫుడ్‌ని శుభాకర్‌కి, డాన్స్‌ని రాజేశ్‌కి, బుక్స్‌ని ప్రదీప్‌కి వాడుకోవడం చాలా కొత్తగా అనిపిస్తుంది.

'పురుషులలో పుణ్యపురుషులు వేరు' పాటలో గోపాలరెడ్డి ఫోటోగ్రఫీ పనితనం కొత్త పుంతలు తొక్కింది. బ్యాండ్‌మేళం వాయిస్తున్న నలుగురు హీరోల షాడోలని ఆడ్ యాంగిల్స్‌లో చిత్రీకరించి తోలుబొమ్మలు గెంతుతున్నట్టుగా భ్రమింపజెయ్యడం ఓ ప్రయోగంగా చెప్పుకోవాలి.

వరకట్నంలాంటి అనాచారం మీద ఈ చిత్రం ఒక రకంగా పోరాటం. సమస్యను మరీ సీరియస్‌గా కాకుండా హాస్యమనే పంచదార అద్ది ప్రేక్షకులందరికీ మింగుడుపడే ఓ గుళికలా అందించారు జంధ్యాల.



## మెచ్చుతునకలు

- ఏమిటయ్యా ఇది.. ఏమిటిది వివాహాల్లో మంగళవాద్యాలు వినిపించే వాళ్లలాగా ఏమిటీ వస్త్రధారణా, మీరూను?
  పండగొచ్చింది కదండీ.... అందుకని ఇలా వెరైటీగా కుట్టించామన్నమాట.
  ఏమయ్యా.. నన్ను శుంఠా అని తిడతావా?
  అమ్మమ్మ.... మహాప్రభూ, ఎవరో కుర్రకుంక అనుకుని అలా తిట్టాను, 'మీరని తెలిస్తే అలా తిడతానా'
  అంటే మరోటైపులో తిడతావా ?
- ఏం చేస్తున్నావు ?
  శవాసనం వేస్తున్నా
  తేలికైన ఆసనం అనా... అయినా గుమ్మం ముందు అలా పడుకోకండి. అవాంఛనం... ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారు
- హలో సుబ్బారావు గారూ కులాసా?
  కు లేదు బాబూ...అంతా లాసే
- అది బెల్ కాదురా బాబూ.. హెల్, మోగుతాదనుకుంటే మనల్నే మోగించేసింది.
  ఏం తింటావురా?
  మీ ముగ్గుర్నీ
  పోనీ, ఏమన్నా తాగుతావురా?
  తాగుతానురా... మీ రక్తం తాగుతా...
- నీకు నచ్చిన పువ్వుపేరు చెప్పు బాబూ
  క్యాలీఫ్లవర్
  నీ బొంద... పువ్వంటే క్యాలీఫ్లవరూ, కంట్లో పువ్వూ కాదు
- ఇస్తా.. భర్త, భార్యను ప్రేమించే పద్ధతికి, భార్య, భర్తను వేధించే పద్ధతికి సరి అయిన నిర్వచనం నా కవితారూపంలో ఇస్తా.. ఇస్తా..
  ఇస్తావా... అయితే వస్తా..
  రూపాయ్ ఇస్తా..
  ఇది విని వెళ్లరూ...ఇప్పుడు మీకో కవితనిస్తా
  **పెళ్లయ్యే క్షణందాకా ఆడది బెల్లం ముక్క**
  **ఆ క్షణం నుంచి అదే ఆడది అల్లం చెక్క**
  నీ పీక నొక్కా
- హుం... తమ్ముళ్ళు.. నాకు నలుగురు తమ్ముళ్ళు ... నేను ధర్మరాజుని, వెర్రివెధవని అందుకే అన్నీ పంచుకోవాలని చూస్తున్నారు.
- ఛండాలీ, పాపీ, కులటా, కకుంభరీ
  కకుంభరీలాంటి కొత్త తిట్లు కనిపెట్టి తిట్టెయ్యకండి మరి
- ఈ ఊళ్ళో సిటీబస్సెక్కి క్షేమంగా ఇంటికి రాగలను. యూనివర్శిటీలో ఉపన్యాసం ఇవ్వగలను. హౌరాబ్రిడ్జి రోడ్డులో ముక్కు మూసుకోకుండా నడవగలను. కానీ నిన్ను మాత్రం ఏలుకోలేను. ఇంకే మాటా వినను. విన్నా నాకు తెలుగు రాదు. మై హిందీ కా ఆద్మీ హూ.
- ప్రాణాలు తియ్యటం తేలిక. ప్రాణాలకేం కాకుండా చెయ్యో, కాలో తీసెయ్యడం ఎంత కష్టమో

నీకేం తెలుసు మిస్టర్.


- పన్నెండేళ్ల దాకా ఆడది ఇండియా లాంటిది
అందరూ ఎత్తుకుని ముద్దుపెట్టాలనుకుంటారు!
12 నుంచి18 దాకా ఆడది అమెరికాలాంటిది.
ప్రతివాడు ఆ అందాన్ని అందుకోవాలని, పొందాలని చూస్తారు!
18 నుంచి 40 దాకా ఆడది ఇంగ్లాండ్ లాంటిది.
దూరం నుంచి చూసి ఆనందిస్తుంటారు!
40 నుంచి 60 దాకా ఆడది ఆఫ్రికాలాంటిది.
చూడగానే జడుసుకుని పారిపోతారు!
- త్వరగా చెప్పు... రైలుకి టైమైంది
రైలెందుకూ
దాని కింద తలపెట్టడానికేమో బావా
- వాడు నుయ్యో గొయ్యో చూసుకుంటే మనిద్దరం ఎవరికీ తెలియని నీ సొంత హిందీలో ఏడుస్తూ బ్రతకాలి.
- భాయ్ బందోం కో బురా నహీ కర్నరా, నహీ కర్నా,
ఇస్ మే నహీ హోతారా లడయిరా ..చాహియెరా'
- వాడొట్టి మలపత్రాష్టుడు
- ఓ ఆర్నెల్లు ఢిల్లీలో కాపురం పెడితే ఊర్ని చెడగొడుతున్నాడని జనం అంతా చందాలేసుకుని ఓ లారీలో వీణ్ణి అందులో కట్టిపడేసి దక్షిణ భారతదేశం పంపేశారు.
అప్పట్నించీ చీటికీ మాటికీ వచ్చీరాని హిందీ మాట్లాడుకుంటూ బతికేస్తున్నాడు.
- నా పక్కలో పడుకుని నాకు పళ్ళు తినిపిస్తూ నా పళ్ళే పీకేస్తున్నారయ్యా మీరు
- అది టులెట్ కాదండి, టాయిలెట్! పెయింటర్ తప్పురాశాడు
- ఇది పరువుమర్యాదలు గల వారిల్లా -ఇంకా మీ ఇల్లనుకున్నానే!
- ఎందుకైనా మంచిది కొంచెం తెలుగులో ఆలోచించు బావా
- నాతో పెట్టుకోకు మూడుసార్లు పిచ్చాసుపత్రి నుంచి పారిపోయివచ్చా
- నేను పొగొట్టినవన్నీ నా కందజేశారు నేనిప్పుడు నా మనసును పోగొట్టుకున్నాను
- అమ్మా సీతా! చిన్నప్పుడు కృష్ణమూర్తి బావని చేసుకుంటావా అని అడిగితే 'నేను సీతను.. నా మొగుడు రాముడు' అంటే సీత పేరు పెట్టినందుకు ఎంతో మురిసిపోయానమ్మా! ఓ రోజున చిన్న కోతి పిల్లనెత్తుకొచ్చి 'నేను సీతను కదా ఆంజనేయుడు నా దగ్గరకొచ్చేశాడు నాన్నా' అని నువ్వన్నప్పుడు నీ పేరు సీత అని పెట్టినందుకు ఎంతో సంబరపడి పోయానమ్మా.... కానీ ఇవాళ నీకా పేరు పెట్టినందుకు ఎంతో బాధపడుతున్నానమ్మా, కుమిలి పోతున్నాను. ఆ రాక్షసులు నీ మీద అభాండం వేశారమ్మా.
- నాన్నా ఆయన కూడా...
పిచ్చితల్లీ, కాకిపిల్ల కమ్మని సంగీతం పాడుతుందామ్మా. అతనూ తండ్రి లాగే మాట్లాడేడు.
- కృష్ణ, గోదావరుల్లో ప్రవహించేది నీరు కాదు.. కన్నీరు.
కట్నమిచ్చుకోలేని కన్నెపిల్లల కన్నీరు.



# 6


ప్రేమే త్యాగమన్న...

# అమరజీవి


అక్కినేని నాగేశ్వరరావు, జయప్రద


మహానటుడు అక్కినేని నాగేశ్వరరావుతో జంధ్యాల చేసిన ఏకైక చిత్రమిది.

ఇందులో డాక్టరు మురళీధర్‌గా అక్కినేని నటించారు. ప్రేమ, త్యాగం ప్రధానాంశాలుగా రూపొందింది. అప్పటికే జంధ్యాల రచనా శైలి గురించి తెలిసిన అక్కినేనికి ఆయన దర్శకత్వ










పనితీరు కొత్త అనుభూతిని కలిగించింది. "మీ దర్శకత్వం తీరు చూస్తోంటే ఆదుర్తి సుబ్బారావు డైరెక్ట్ చేసే విధానం గుర్తుకు వచ్చింది" అని కితాబు నిచ్చారు కూడా. ఆ ప్రశంసకు ఉప్పొంగిపోయారు జంధ్యాల. అంతకంటే తన జీవితంలో గొప్ప అభినందనను అందుకోలేనేమో అనేవారు జంధ్యాల. "అక్కినేనితో పనిచేయాలని అనుకున్నప్పుడు మొదట భయపడ్డాను. కానీ తరువాత చాలా సంతోషపడ్డాను. ఆయన అందించిన సహకారం అంతా ఇంతా కాదు. చాలా క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. వృత్తి మీద ఎంతో గౌరవం వుంది" అని చెప్పారు జంధ్యాల.

ఎస్. గోపాలరెడ్డి ఫోటోగ్రఫీ పనితనం ఈ చిత్రానికి కొత్త అందాల్ని చేకూర్చింది. జయప్రద నుదురు మీద సూర్యబింబం కనబడ్డం ఫోటోగ్రఫీ, ఎడిటింగ్ లో కూడా చెప్పుకోదగ్గ దృశ్యం.

రచయితగా జంధ్యాల, సంగీత దర్శకుడిగా చక్రవర్తి కాంబినేషన్‌లో ఎన్నో చిత్రాలు వచ్చినా, జంధ్యాల దర్శకుడయ్యాక నాలుగైదుచిత్రాల దాకా ఇద్దరి కలయిక కుదరలేదు. ఓ రోజు చక్రవర్తి తనకు తానుగా అడిగారు జంధ్యాలని. అందుకు జంధ్యాల "నా సినిమాల్లో అన్నీ మెలోడీ ఓరియెంటెడ్ సాంగ్స్ ఉంటాయి. మీవన్నీ రిథమేటిక్‌గా ఉంటాయి కదా!?" అని అన్నారు.

"ఓ సారి అవకాశం ఇచ్చి చూడరాదూ!?" అన్నారు చక్రవర్తి నవ్వుతూ. సరేనన్నారు జంధ్యాల. అలా 'అమరజీవి' చిత్రంలో వారిద్దరూ తొలిసారిగా కలిసి పనిచేయటం జరిగింది.

ఈ చిత్రంలో 'అసురసంధ్యవేళ ఉసురు తగలనీకు..' 'మల్లెపూల మా రాణికి బంతిపూల పారాణి..' పాటలన్నీ మెలోడీ ఓరియెంటెడ్‌లే. నిజానికి 'మల్లెపూల మా రాణికి..' పాట 'అమరజీవి' సినిమా కోసం ట్యూన్ చేసిన పాట కాదు.

## పాటలు

| | |
|---|---|
| 1. అసుర సంధ్యవేళ ఉసురు తగలనీకు స్వామి | - అక్కినేని, జయప్రద |
| 2.. ఓదార్పు కన్న చల్లనిది, నిట్టూర్పు కన్న వెచ్చనిది | - అక్కినేని , సుమలత |
| 3. మల్లెపూల మా రాణికి - బంతిపూల పారాణి | - అక్కినేని, జయప్రద |
| 4. ఎలా గడపను.... ఒక మాసం ముప్ఫైరోజుల ఉపవాసం | - అక్కినేని, జయప్రద |
| 5. ఓ మాలినీ... మోహినీ... కామినీ | - అక్కినేని, జయప్రద |
| 6. చేయనని నేరం హృదయం చేసిన పాపం ప్రణయం | - అక్కినేని, నగేశ్ |



ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి కోసం చేసిన పాట అది. యథాలాపంగా తనకిష్టమైన మంచి పాటల్లో ఇదొకటని చక్రవర్తి వినిపిస్తే, జంధ్యాల ముచ్చటపడి ఆ పాటను ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి దగ్గర్నుంచి తీసుకోవటం జరిగింది.

'మల్లెపూల మా రాణికి...' సాంగ్ ఈ సినిమాకే హైలెట్‌గా నిలుస్తుంది. అక్కినేని స్టయిల్‌లో జంధ్యాల తన మార్కు చూపుతూ చేసిన పాట ఇది. ఈ పాటలో సూర్యుణ్ని జయప్రద నుదుటన తిలకంలా చేసి చూపిన షాట్ నేటికీ అలరిస్తుంది.

ఇక 'విప్రనారాయణ' రూపకాన్ని చాలా పసనువడి, ముచ్చటవడి వేటూరితో రాయించుకున్నారు జంధ్యాల. ఈ పాటలో 'నశ్వరమిది నాటకమిది, నాలుగు గడియల వెలుగునీది..', 'కడలిని కలిసే వరకే కావేరికి రూపు వున్నది..' అనే వాక్యాలు చూసి జంధ్యాల పులకించిపోయారని, కన్నీళ్ళతో నవ్వుకున్నారని వేటూరి చెప్పారు. ఈ పాటలో అక్కినేని విప్రనారాయణుడి గానూ, జయప్రద దేవదేవిగానూ కనిపిస్తారు.

'విప్రనారాయణ' షూటింగ్ టైమ్‌లో షూటింగ్ చూడటాకి వెళ్లిన చిన్ని జంధ్యాలని అక్కినేని ఎత్తుకుని ముద్దు చేశారట. అదే అక్కినేనితో తీసిన చిత్రంలో 'విప్రనారాయణ' ఘట్టం ఉండటం మామూలు విశేషం కాదూ!

డిస్కోడాన్స్ పాట 'ఓ మాలినీ... మోహినీ..' ను సైకొ డెల్లిక్ రంగుల్లో చూపించడంతో క్లైమాక్స్‌కి చిత్రీకరణలో ఒక వూపు వస్తుంది. ఈ క్లబ్‌సాంగ్ లోనే ఓ చోట నాగేష్‌కి డ్రింక్ చేస్తున్న సర్వర్‌గా మాస్టర్ ఆలీని చూడొచ్చును.

అక్కినేని,జయప్రదలు విడిపోయే ముందు వచ్చిన 'ఎలా గడపనూ ఒక మాసం' పాటను జంధ్యాల చక్కగా చిత్రీకరించారు. ఈ పాటరాబోయే సన్నివేశానికి తగిన వాతావరణాన్ని సృష్టించింది.

జంధ్యాల ఈ చిత్రంలో దర్శకత్వ ప్రతిభ, సంభాషణా ప్రతిభ కూడా సమపాళ్ళలో ప్రదర్శించారు. ఈ చిత్రంలో కామెడీ ఒక రిలీఫ్‌లా వస్తుంది. ఓ రకంగా ఈ కామెడీ


## పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| మురళీధర్ | : అక్కినేని |
| లలిత | : జయప్రద |
| గాయత్రి | : సుమలత |
| మధు | : శరత్‌బాబు |
| శేఖర్ | : నరసింహరాజు |
| యశోద | : పండరీబాయి |
| మాలతి | : శ్రీలక్ష్మి |
| బాబు | : నగేశ్ |
| డాక్టర్ ఆనంద్ | : కాంతారావు |
| రామకృష్ణయ్య | : సాక్షి రంగారావు |
| శివం | : సుత్తివేలు |
| రఘు | : శంకర్ |
| విశ్వనాథమ్ | : భమ్ |
| రాము | : మాస్టర్ హరి, |

మరియు

శ్రీనివాసరావు, తిలక్, భూసం నాగేశ్వరరావు, చెంచురామిరెడ్డి, శ్రీనివాస్, వంతులు, రాజకుమారి, మద్దాలి విజయలక్ష్మి,బేబి కవిత లక్ష్మి చిత్ర, పద్మలత తదితరులు



ధోరణి 'రెండు జెళ్ళసీత' కి ఎక్స్‌టెన్షన్‌గా చెప్పుకోవాలి. సుత్తివేలు - నాగేష్-శ్రీలక్ష్మిల ఎపిసోడ్‌ని ఓ కామెడీ ట్రాక్‌లా తీర్చిదిద్దారు జంధ్యాల. థమ్ అమెరికా వెళ్తూ ఓ నెల్లాళ్ళు తన ఇంటిని సుత్తివేలు - శ్రీలక్ష్మిల కప్పగిస్తాడు. అయితే సుత్తివేలు ఆ ఇంటిని ఆక్రమించి థమ్‌ని బైటికి గెంటేస్తాడు. నాగేష్, థమ్‌కి అభయహస్త మందించి ఎలాగైనా సుత్తివేలుని ఇల్లు ఖాళీ చేయిస్తానంటాడు. ఆ ప్లాన్‌లో భాగంగా రోజుకో మారువేషంలో వచ్చి శ్రీలక్ష్మి గురించి అడుగుతూ వుంటాడు నాగేష్. దాంతో వేలు అనుమానంతో రగిలిపోతుంటాడు. చివరికి ఇల్లు ఖాళీ చేసేస్తాడు.

ఇందులో సుమలతని నరసింహరాజు ఆటపట్టిస్తే, అతన్ని అక్కినేని ఆటపట్టించిన విధానం చూడముచ్చటగా వుంటుంది.

అక్కినేని, జయప్రదల పెళ్ళికి ముహూర్తం పెడతారు. ఒక నెలరోజులు టైం వుంటుంది. ఆ నెలరోజులు విరహం తాలూకు అనుభవాల్ని ఒక పాట రూపంలో ఆవిష్కరించడం మంచి థాట్.


దృశ్య చిత్రీకరణలో ఓ నూతనత్వం కనబరిచారు జంధ్యాల.

1958 నుంచి నాటకాలు వేస్తున్న కోట శ్రీనివాసరావుకు ఇందులో అవకాశమిచ్చారు జంధ్యాల. శరత్‌బాబు -జయప్రదల పక్కింట్లో వుండే వరహాలు భర్తగా కోట కనిపిస్తారు. టైటిల్ కార్డులో ఆయన పేరు శ్రీనివాసరావుగా కనిపిస్తుంది. తన సూటిపోటి మాటలతో జయప్రద మీద శరత్‌బాబు మదిలో అనుమానపు బీజాలు నాటే పాత్రను తనదైన శైలిలో రక్తి కట్టించారు కోట.

ఇందులో మెడిసిన్ విద్యార్థినిగా సుమలత నటించింది. అక్కినేనితో నటించడం సుమలతకిదే తొలిసారి. అక్కినేని సరసన నటించిన 57వ

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : జ్యోతి ఆర్ట్ క్రియేషన్స్ |
| కథ | : భీశెట్టి |
| రచన | : జంధ్యాల |
| పాటలు | : వేటూరి సుందరరామ్మూర్తి |
| నేపథ్యగాయకులు | : ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల, యస్. జానకి, అనితారెడ్డి |
| డైరెక్టర్ ఆఫ్ ఆడియోగ్రఫీ | :పి. కృష్ణంరాజు |
| సాంగ్ రికార్డింగ్ - రీ రికార్డింగ్ | : ఏ.ఆర్. స్వామినాథన్ (విజయా గార్డెన్స్ డీలక్స్ థియేటర్) |
| స్టూడియో | : అన్నపూర్ణ స్టూడియోస్ |
| అసోసియేట్ డైరెక్టర్స్ | : బి.యస్.నిష్టల, ఐత్తుల రామకృష్ణ |
| సహాయదర్శకుడు | : జె. పుల్లారావు |
| కో- డైరెక్టర్ | : యు.వి.పాణి |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : ఎస్.గోపాలరెడ్డి |
| ఆపరేటివ్ కెమెరామన్ | : దివాకర్ |
| సహాయకుడు | : శ్రీనివాసరెడ్డి |
| నృత్యం | : శేషు, శివసుబ్రహ్మణ్యం |
| కళ | : భాస్కరరాజు |
| ఎడిటింగ్ | : గౌతంరాజు |
| నిర్వహణ | : బి. అంజిరెడ్డి |
| సంగీతం | : చక్రవర్తి |
| సహాయకులు | : కృష్ణ - చక్ర |
| నిర్మాత | : భీమవరపు బుచ్చిరెడ్డి |
| స్క్రీన్‌ప్లే - దర్శకత్వం | : జంధ్యాల |


నగేష్



## కథాసంగ్రహం

మురళి మంచి హస్తవాసిగల కళ్ళ డాక్టర్. తల్లి బలవంతం పెట్టినా సరే పెళ్ళంటే మాత్రం ససేమిరా కాదంటాడు. ఆపదలో చిక్కుకుని ఓ రాత్రంతా మురళి వాళ్ళింట్లో ఆశ్రయం పొందుతుంది నృత్యకళాకారిణి లలిత. మురళి తల్లి యశోద లలితను తన కోడలిగా చేసుకోవాలని ఆశపడుతుంది. కొడుకుని పెళ్లికి ఒప్పించేపని లలితకే అప్పగిస్తుంది యశోద. మురళి మనసులో ఆడదాని మీద పేరుకున్న అసహ్యానికి గల కారణాలను తెలుసుకుంటుంది లలిత. హౌస్‌సర్జన్ చదివేరోజుల్లో గాయత్రిని ప్రేమిస్తాడు మురళి. తీరా పెళ్ళికి అన్ని ఏర్పాట్లు చేశాక మురళిని ఛీ కొడుతుందామె. దాంతో మురళి మనసు భగ్నమై, ప్రేమ మీద నమ్మకం పోతుంది. అందరు ఆడవాళ్లు అలా వుండరంటూ అతనిపట్ల తన ప్రేమను వ్యక్తపరుస్తుంది లలిత. మురళి, లలితల పెళ్ళికి ముహూర్తం పెడతారు. తీరా ఆఖరు నిమిషంలో తాను గాయత్రి అక్కనని మోసానికి తగు ప్రతీకారం తీర్చుకున్నానని లలిత చెప్పడంతో మురళి షాకవుతాడు.

ఆ తర్వాత శేఖర్, మురళిని కలిసి గాయత్రి ఆత్మహత్య చేసుకోవడానికి తనే కారణమన్న నిజం చెబుతాడు. ఈ విషయం తెలుసుకున్న లలిత, మురళి కాళ్ళమీదపడి క్షమాపణ కోరుతుంది. తానే దగ్గరుండి మధు, లలితల పెళ్ళి జరిపిస్తాడు మురళి. లోకులు మురళి- లలితల సాన్నిహిత్యాన్ని తప్పుపట్టడంతో మధు అనుమానంతో రగిలిపోతాడు. యశోదకు హార్ట్‌ఎటాక్ వచ్చి ఆమె చనిపోతుంది. సరిగ్గా అదే సమయంలో ఫ్యాక్టరీ యాక్సిడెంట్‌లో కళ్ళు పోగొట్టుకున్న మధుకి ఆపరేషన్ చేయాల్సి వస్తుంది. ఆ ఆపరేషన్ వల్ల ఫలితం దక్కకపోవడంతో తన కళ్ళు దానమిస్తాడు మురళి. మధు తనని వదిలేసి వెళ్ళిపోవడంతో లలిత స్పృహ కోల్పోతుంది. మధు, లలితలను కలిపి తాను చనిపోయి అమరజీవిగా నిలిచిపోతాడు మురళి.


'విప్రనారాయణ'గా అక్కినేని

విడుదల
19 -8 -1983

నిర్మాణ ప్రాంతాలు
హైదరాబాద్

హీరోయిన్ ఆమె.

ఈ సినిమా విజయం సాధించకపోవడం అటు అక్కినేనిని, ఇటు జంధ్యాలని నిరాశపరిచింది. 1991 జూలై 6న జరిగిన 'ప్రేమ ఎంత మధురం', 'బావా బావా పన్నీరు' ఆడియో ఫంక్షన్‌లో అక్కినేని మాట్లాడుతూ -"నేను, జంధ్యాల కలిసి 'అమరజీవి' చిత్రానికి పని చేశాం. అది అంత విజయవంతం కాలేదు. మా ఇద్దరి కాంబినేషన్‌లో ఒక విజయవంతమైన చిత్రం రావాలని నేను కోరుకుంటున్నాను' అని ఆకాంక్ష వెలిబుచ్చారు.

తర్వాత జంధ్యాల మాట్లాడుతూ "అక్కినేనితో కలిసి పనిచేసే అవకాశం మళ్ళీ వస్తే చాలా అదృష్టంగా భావిస్తాను" అని అన్నారు.

అయితే ఆ అవకాశం అక్కినేనికి కలగలేదు. ఆ అదృష్టం జంధ్యాలకు మిగల్లేదు.

## 7

### కామెడీగా కాదు సీరియస్‌గానే...

# మూడుముళ్ళు


రాధిక, చంద్రమోహన్

తమిళనాట దర్శక కథానాయకుడు భాగ్యరాజా రాజ్యమేలుతున్న రోజులవి. డైరెక్ట్‌గానూ, ఇన్‌డైరెక్ట్‌గానూ కూడా ఆయన తెలుగు ప్రేక్షకులకి దగ్గరవసాగారు. ఆయన చిత్రాన్ని 'డార్లింగ్... డార్లింగ్' పేరుతో తెలుగులోకి అనువదిస్తే సూపర్‌హిట్ అయ్యింది. 'తూరల్ నిన్నుపోచ్చి' (తుప్పర ఆగిపోయింది)'ని తెలుగులో సారథి స్టూడియోస్ వాళ్ళు చంద్రమోహన్, విజయశాంతిలతో పి.సాంబశివరావు దర్శకత్వంలో 'పెళ్ళి చూపులు' పేరుతో పునర్నిర్మించి ఘనవిజయాన్ని అందుకున్నారు. భాగ్యరాజా మరో చిత్రం 'అంద 7 నాట్కళ్'ను 'రాధాకళ్యాణం' గా బాపుచే పునర్నిర్మించింది కూడా సారథీవారే!

ఇలా వరుస విజయాలతో తెలుగునాట భాగ్యరాజా ఓ స్పెషల్ క్రేజ్‌ని సంపాదించుకున్నారు. దాంతో భాగ్యరాజా కథల్ని రీమేక్ చేయడానికి చాలామంది దర్శకనిర్మాతలు ఉత్సాహం చూపసాగారు.




'సుత్తి' జంట

చివరకు కె. రాఘవేంద్రరావు సైతం ఆ తరహాలోనే 'సత్యభామ' (చంద్రమోహన్, జయసుధ హీరో హీరోయిన్లు) తీశారు.

భాగ్యరాజా 'ముందానై ముడిచ్చు' అనే సినిమాని 'వద్దంటేపెళ్ళి' పేరుతో అనువదించడానికి అన్ని ఏర్పాట్లు జరగసాగాయి. ఈలోగా సారథి స్టూడియోస్ వాళ్ళు రీమేక్ హక్కులు తీసుకుని జంధ్యాలను సంప్రదించారు.

అప్పటికాయన ముద్దమందారం, మల్లెపందిరి, నాలుగు స్తంభాలాట, నెలవంక, రెండుజెళ్ళసీత, అమరజీవి చిత్రాలను డైరెక్ట్ చేసి వున్నారు. టీనేజ్ లవ్ స్టోరీలను బాగా తీస్తాడని పేరు తెచ్చుకున్న జంధ్యాలకు 'ముందానై ముడిచ్చు' సినిమాలైన్ బాగా నచ్చింది. అందుకే వెంటనే ఓకే చెప్పేసారు. అలా 'మూడుముళ్ళు' సినిమా మొదలయ్యింది.

**పాత్రలు - పాత్రధారులు**

| | |
|---|---|
| మాస్టారు | : చంద్రమోహన్ |
| గౌరి | : రాధిక |
| గీత | : గీత |
| రాజ్యం | : రాజ్యలక్ష్మి(గెస్ట్) |
| ప్రెసిడెంట్ ధర్మయ్య | : కాంతారావు |
| ఆచారి | : సుత్తివేలు |
| గ్రామపెద్ద | : సుత్తివీరభద్రరావు |
| రత్నం | : వళినీ కాంత్ |
| గౌరి తల్లి | : జానకి |
| గౌరి ఫ్రెండ్ | : మాస్టర్ అలీ |
| శాస్త్రి | : కోటశ్రీనివాసరావు |
| గౌరి ఫ్రెండ్ | : మాస్టర్ చక్రవర్తి |
| చప్పిడి పాట్టోడు | : విచిత్రకుమార్ |
| సూరమ్మ | : శకుంతల |
| డాక్టర్ | : డాక్టర్ తంబు |

మరియు

మద్దాలి సుశీల, గంగారత్నం, లక్ష్మి, శకుంతల, తాటిపాక పాప, యోగానంద్, జి.కె.సింగ్, శేషగిరిరావు, తిలక్, నైవార్, పంతం వేణు, శ్రీపాద హనుమంతరావు,వంగల శ్రీరామమూర్తి, కుమార్, ఆదినారాయణ, సుబ్రహ్మణ్యరాజా, విజయలక్ష్మి (హైద్రాబాద్).

అల్లరి చిల్లరిగా వుండే ఓ ఆకతాయి అమ్మాయి తల్లిగా, బాధ్యతాయుతంగా ఎలా మారిందన్నది


రాధిక, గీత, చంద్రమోహన్

ఈ సినిమా ప్రధానా[illegible]తే, జంధ్యాల తనదైన శైలిలో హాస్యాన్ని అద్దారు.

"మగవాడు మొగుడు కాక భర్త కావాలన్నా, ఆడది భార్య కాక అర్థాంగి కావాలన్నా మూడు ముళ్ళు మెడకి కాదు, మనసులకి పడాలి"అని సినిమా ప్రారంభంలోనే తాను తీయదలచుకున్న పాయింట్‌ని సూటిగానే చెప్పేసారు జంధ్యాల. 'మూడుముళ్ళు' చిత్రకథ చిన్నదే అయినా దాన్ని ఎంతో ఆకర్షణీయంగా తెరకెక్కించిన ఘనత జంధ్యాలకే దక్కింది. జంధ్యాల వేసిన ముచ్చటైన నవ్వుల పందిరి ఇది.


ఆలీ

రాధిక 'గౌరి' పాత్రను ఎంతో సమర్థవంతంగా పోషించింది. చంద్రమోహన్ ఆమెకు తగ్గ జోడీ అనిపించుకున్నారు. ఇందులో ఆయన పాత్రకి పేరే లేదు. అందరూ మాస్టారనే పిలుస్తుంటారు. జంధ్యాల దర్శకత్వంలో చంద్రమోహన్ హీరోగా నటించిన తొలి చిత్రమిదే.

రాధిక తండ్రిగా కాంతారావు నటించారు. ఇక సుత్తి జంట వేలు, వీరభద్రరావులు తమ సహజ ధోరణిలోనే హాస్యాన్ని కురిపించారు.

ఇందులో తెలంగాణా శకుంతల ఓ చిన్న వేషంలో కనిపిస్తారు. రాధిక మీద కోపంతో స్కూలుకి వెళ్తూ తన బిడ్డను శకుంతల సంరక్షణలో వుంచుతాడు చంద్రమోహన్.

రాధిక అసిస్టెంట్స్‌గా నటించిన మాస్టర్ ఆలీ, మాస్టర్ చక్రవర్తి, విచిత్ర కుమార్‌లు ప్రేక్షకుల దగ్గర బాగానే మార్కులు కొట్టేసారు. ముఖ్యంగా మాస్టర్ ఆలీ చిచ్చరపిడుగులా చెలరేగిపోయి చక్కటి హాస్యస్ఫోరకమైన అభినయాన్ని కనబరిచాడు. పాన్ షాపులో కూల్‌డ్రింక్స్, బిస్కట్స్ దొంగలించడం కోసం తన మిత్రబృందంతో కలిసి ప్లాన్‌వేసి, షాపు కుర్రాడి ముందు 'మేరే అంగానే మే... ' అంటూ అమితాబ్‌బచ్చన్ తరహాలో డాన్సులాడటం చిన్న పిల్లల తాలూకు చిలిపిచేష్టలకు నిలువుటద్దంగా నిలుస్తుంది. ఇక చంద్రమోహన్ టీచర్‌గా పనిచేసే స్కూలులో పిల్లలు చేసే ఏఅల్లరి ఎపిసోడ్ చాలా సరదాగా సాగుతుంది. 'చప్పిడి పొట్టోడు'గా విచిత్రకుమార్ నటన ఎంతో ప్రశంసనీయంగా వుంది. మూలంలో కూడా ఈ పాత్ర ఉంది. అయితే జంధ్యాల మరింత పాలిష్ చేశారు.

ఈ సినిమాకి సంగీతం మెయిన్ ఎస్సెట్‌గా నిలిచింది. 'నాలుగుస్తంభాలాట' లో తెలుగు నేల నాలుగు చెరగులా వినబడే పాటల్ని అందించిన సంగీతదర్శకద్వయం రాజన్ - నాగేంద్రలు మరోసారి తన మ్యూజిక్‌తో మేజిక్ చేయగలిగారు. 'లేత చలిగాలులు.. ', 'నీ కోసం యవ్వనమంతా దాచాను

## కథాసంగ్రహం

ప్రెసిడెంట్ ధర్మయ్య కూతురు గౌరి మహాగడుగ్గాయి. తన మిత్రబృందంతో కలిసి అందర్నీ అల్లరి పెడుతూ వుంటుంది. మూడేళ్ళుగా మూతపడిపోయిన ఆ ఊరి స్కూల్‌కి కొత్త మాస్టారు వస్తాడు. భార్య రాజ్యం చనిపోవడంతో పసిబిడ్డను తానే అల్లారుముద్దుగా పెంచుకుంటాడు. మగాళ్ళని అసహ్యించుకునే గౌరి, మాస్టారిని పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది. ఆ ఊరికి గీత అనే మరో కొత్త టీచర్ వస్తుంది. మాస్టారు, గీతల సాన్నిహిత్యం చూసి గౌరి అసూయతో రగిలిపోతుంది. బావతో పెళ్ళి నిశ్చయం కావడంతో గౌరి తెగించి మాస్టారి వల్ల తాను తల్లినవుతున్నానని చెబుతుంది. దాంతో మాస్టారు గౌరిని పెళ్ళి చేసుకోవాల్సి వస్తుంది. అయినా ఆమె మీద అసహ్యంతో దూరంగా వుంచుతాడు. ఆమె ఎంత దగ్గరవుదామనుకుని ప్రయత్నించినా పట్టించుకోడు. గౌరి తన బిడ్డను సరిగ్గా చూస్తుందో లేదోనని అనవసర భయాలకు లోనవుతాడు. అతని భయాలను దూరం చేసేందుకు గౌరి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవాలనుకుంటుంది. ఈలోగా గీత వచ్చి అడ్డుకుంటుంది. గౌరి మంచిమనసుని అర్థం చేసుకున్న మాస్టారు ఆమెను మనస్ఫూర్తిగా దగ్గరకు తీసుకుంటాడు.




రాధిక, చంద్రమోహన్

మల్లెలలో...' పాటలు ఇప్పటికీ శ్రోతల హృదయాల్లో సజీవంగానే నిలబడివున్నాయి. 'మూడు ముళ్ళు' సినిమా పేరు చెప్పగానే అందరికీ ముఖ్యంగా ఈ రెండు పాటలే గుర్తుకొస్తాయి. ఈ రెండుపాటలూ రాజన్-నాగేంద్ర సంగీతం సమకూర్చిన కన్నడ చిత్రాలనుండి ఉపయోగించుకున్నవి. ముఖ్యంగా రాజ్‌కుమార్ 'న్యాయవే దేవరు' లోని 'ఆకాశద బీదేలిమేలే..' పాట ట్యూన్‌లో రూపొందిన 'నీకోసం యవ్వనమంతా..' పాట కర్ణాటకలోనూ మరింత పాప్యులరయింది. 'చాలించు ఉత్తుత్తి' పాట చిత్రీకరణపరంగా అందర్నీ ఆకట్టుకుంటుంది. ఆ ఊళ్ళో వయోజన విద్యాపథకం పెడదామని చంద్రమోహన్ తలపోస్తే ఒక్కరు కూడా సహకరించరు. కానీ మరో టీచర్‌గా వచ్చిన 'గీత' అడగ్గానే అందరూ 'ఎవరెడీ'అంటారు. ఈ సందర్భంలో ఊహాగీతంగా వచ్చే 'చాలించు ఉత్తిత్తి ఓనమాలు...' పాటలో తెలుగు అక్షరక్రమాన్ని వాడుకున్న తీరు భలే గమ్మత్తుగా అనిపిస్తుంది. సుత్తి జంటకున్న పాపులార్టీని దృష్టిలో పెట్టుకునే జంధ్యాల ఈ పాట పెట్టినట్టుగా అనిపిస్తుంది.

తమిళంలో వయోజన విద్యాకేంద్రం సీన్లలో కొంచెం శృంగారం పాళ్ళు ఎక్కువుంటే, తెలుగులో వాటి డోసు తగ్గించి సంసారపక్షంగా మలిచారు జంధ్యాల.

జంధ్యాల తొలి సినిమా మొదలుకుని వెన్నంటే వున్న ఎస్.గోపాలరెడ్డి ఈ సినిమాకు సమకూర్చిన

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : శ్రీసారథి స్టూడియోస్ |
| సంగీతం | : రాజన్ - నాగేంద్ర |
| కథ | : కె. భాగ్యరాజ్ |
| ఛాయాదర్శకుడు | : ఎస్. గోపాలరెడ్డి |
| నిర్మాత | : పి. శశిభూషణ్ |
| రచన - దర్శకత్వం | : జంధ్యాల |




### పాటలు

1. స్వాగతం...సుస్వాగతం
చావుదెబ్బ స్వాగతం
అభినయం : రాధిక, జెన్నీ, మాస్టర్ అలీ, మాస్టర్ చక్రవర్తి, వి.చిత్రకుమార్

2. జో జో లాలి
అభినయం : చంద్రమోహన్,రాధిక

3. నీ కోసం యవ్వనమంతా
దాచాను మల్లెలలో
అభినయం :చంద్రమోహన్, గీత, రాధిక, మాస్టర్ అలీ, మాస్టర్‌చక్రవర్తి, వి.చిత్రకుమార్

4. చాలించు ఉత్తుత్తి ఓనమాలు ...
అభినయం : గీత, సుత్తివీరభద్రరావు, సుత్తివేలు

5. లేత చలిగాలులు
దోచుకోలేవులే
అభినయం : చంద్రమోహన్,రాధిక

**విడుదల**
1983
**నిర్మాణ ప్రాంతాలు**
తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురం పరిసర ప్రాంతాలు
**నిర్మాణ సమయం**
35-40 రోజులు

ఫోటోగ్రఫీ నీట్‌గా, స్వీట్‌గా వుంటుంది. తూర్పు గోదావరి జిల్లాలో అందమైన ప్రకృతి ప్రదేశాల్లో ఈ చిత్రం మొత్తం చిత్రీకరించారు. 'శంకరాభరణం' రాజ్యలక్ష్మి ఇందులో చంద్రమోహన్ భార్యగా అతిథి పాత్రలో కనబడతారు.

'మూడుముళ్ళు' సినిమా విడుదలై ప్రేక్షకాదరణ పొందింది. అదే సమయంలో 'వద్దంటే పెళ్ళి'ని కూడా విడుదల చేశారు. ఇది యావరేజ్‌గా ఆడింది. తమిళ్ ఒరిజినల్‌లో భాగ్యరాజా, ఊర్వశి ప్రధాన పాత్రలు పోషించారు.

ఇదే సినిమాని హిందీలో కె.రాఘవేంద్రరావు 'మాస్టర్‌జీ' పేరుతో రాజేష్‌ఖన్నా, శ్రీదేవితో పునర్నిర్మించారు. 22 ఆగస్ట్ 1985 న విడుదలైన ఈ చిత్రాన్ని శివశక్తి ఫిలిమ్స్ బేనర్‌పై ఆర్.సి.ప్రకాష్ నిర్మించారు.

'మూడుముళ్ళు'- 'వద్దంటేపెళ్ళి', సినిమాలు పోల్చి చూస్తే జంధ్యాల ఎంత డీసెంట్‌గా సినిమా తీశారో అర్థమవుతుంది. 'వద్దంటే పెళ్లి' లో అతిగా కనిపించే ములక్కాడల ఎపిసోడ్ ఫ్యామిలీ హ్యూమర్‌కేతప్ప వల్గారిటీకి ఏ మాత్రం ఆస్కారమివ్వని జంధ్యాల 'మూడుముళ్ళు' లో మనకు కనబడదు.

జంధ్యాల ఈ చిత్రాన్ని ఆద్యంతం రసవత్తరంగా తీసి రచయితగా, దర్శకుడితో పోటీపడ్డారు. "మనసులు కలిస్తే మూడు ముళ్ళూ మూడు ముడులవుతాయి. ఆనందాల గుడులవుతాయి. కలవని మనసుల మూడుముళ్ళు మూడు 'ముళ్ళ'వుతాయి. జంటని విడదీసే గళ్ళవుతాయి" అంటూ జంధ్యాల 'శుభం' పలకడం బాగుంది.




8

కామెడీ స్టాంపులు అతికించిన

# శ్రీవారికి ప్రేమలేఖ

జంధ్యాల
రామోజీరావు




నరేశ్, పూర్ణిమ

కథా కథనాల్లో ఎంతో వైవిధ్యం కనబరుస్తూ యువతరాన్ని గిలిగింతలు పెట్టే చక్కని ప్రణయ సన్నివేశాలతో, సునిశితమైన హాస్యంతో జంధ్యాల తెలుగు తెరపై ఎంతో అందంగా రాసిన ఈ 'శ్రీవారికి ప్రేమలేఖ' ప్రేక్షకులకి వినోదాన్ని పంచడంతో పాటు, ఓ అగ్రశ్రేణి నిర్మాణ సంస్థ విజయవిహారానికి శ్రీకారం చుట్టింది.

ఈనాడు పత్రికాధినేత రామోజీరావు ఓ అభిరుచితో, నిండైన ఆశయంతో, తెలుగుచిత్ర సీమలో వేసిన తొలి అడుగే ఈ 'శ్రీవారికి ప్రేమలేఖ' చిత్రం.

'చతుర'లో పొత్తూరి విజయలక్ష్మి రాసిన 'ప్రేమలేఖ' నవల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. కథలో ప్రధానాంశం ఓ అల్లరిపిల్ల నరదాకి మగవాళ్ల నైజం గురించి తన స్నేహితురాళ్లతో పందెం కాస్తూ, ముక్కూ మొహం ఎరుగని ఓ ఆకాశరామన్నకి ప్రేమలేఖ రాయాలనుకుంటుంది. ఆ ఆకాశరామన్న పేరు ఆనందరావు అయితే బావుంటుందనుకుని ఆ పేరు ఏరుకుని మరీ ఉత్తరం పోస్టు చేయగా, ఇహ ఆ ప్రేమలేఖ రెక్కలు కట్టుకుని ఓ వివాహిత ఆనందరావు మీద వాలి, అక్కణ్ణుంచీ వెళ్లి ఓ బ్రహ్మచారి ఆనందరావు చేతిలో పడుతుంది. ఆ బ్రహ్మచారి తనకు ప్రేమలేఖ రాసిన అమ్మాయికోసం చేసే అన్వేషణ, ఆమెను చూడాలన్న తహతహ, ప్రేమించేయాలన్న హడావిడీలతో రకరకాల సన్నివేశాలు అల్లుకుంటాయి. ఆ తర్వాత ఉత్తరం రాసిన ఆ అల్లరి పిల్ల స్వర్ణ, ఆ ఉత్తరం అందుకున్న ప్రేమపక్షి ఆనందరావు అకస్మాత్తుగా కలుసుకోవడం, అది కాస్తా ప్రేమగా మారడం, మధ్యలో మరో యువతి తనే ఆ ప్రేమలేఖ రాసిన సోనీనంటూ రావడం, ఆనక నిజం తెలిసాక ఆమె రంగంనించి నిష్క్రమించడం, చివరికి స్వర్ణ-ఆనందరావుల ప్రేమ వివాహానికి దారి తీయడం జరుగుతుంది. ఆ వివాహసమయంలో మాత్రమే ఉత్తరం రాసింది స్వర్ణ అనీ, అందుకున్న ఆనందరావు తనేననీ, తను పెళ్లి చేసుకోవాలనుకున్న ఆ ప్రేమలేఖ రాసిన అమ్మాయినే తను పెళ్లాడుతున్నాడనీ ఆనందరావుకు తెలియడంతో కథ కంచికి



సిహెచ్.రామోజీరావు

## పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| ఆనందరావు | :నరేశ్ |
| స్వర్ణ | :పూర్ణిమ |
| పరంధామయ్య | :సుత్తి వీరభద్రరావు |
| ఆనందరావు | :వేలు |
| భాస్కరం | :నూతన్‌ప్రసాద్ |
| పూర్ణ | :శ్రీలక్ష్మి |
| ఆనందరావు తల్లి | :డబ్బింగ్ జానకి |
| తిలక్ | :పి.ఎల్.నారాయణ |
| రీటా | :అరుణ ముచ్చర్ల |
| జానకి | :అత్తిలి లక్ష్మి |
| సూర్యం | :విద్యాసాగర్ |
| సూర్యం భార్య | :సంగీత |
| ఆనందరావు బాస్ | :మెల్కోటే |
| పంకజం | :కాకినాడ శ్యామల |
| భాస్కరం ఫ్రెండ్స్(మరచెంబు) | : థమ్ |
| (హార్మని) | :పొట్టి ప్రసాద్ |
| చిన్ని | :మాస్టర్ చక్రవర్తి |
| సారంగరావు | :రాళ్లపల్లి |
| భీముడు | :మిశ్రో |
| వరమ్మ | :పావలా శ్యామల |

మరియు

సత్తిబాబు, కమలాకర్, సుబ్బరాయశర్మ, చిడతల అప్పారావు



చేరుతుంది.


1983 అక్టోబర్ 26న మద్రాసు ఎ.వి.యమ్. స్టూడియోలోని ఆర్.ఆర్.థియేటర్‌లో పాటల రికార్డింగ్ జరిగింది. కృష్ణ, శోభన్‌బాబు, చంద్రమోహన్, విజయనిర్మల తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'లిపిలేని కంటి బాస...' అని వేటూరి రాసిన పాటను బాలు, జానకి పాడగా ముహూర్తపు గీతంగా రికార్డ్ చేశారు.

నవంబర్ 2 ఉదయం 10 గంటలకు వైజాగ్ సమీపంలోని భీమునిపట్నం వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. గుళ్లో పూజ పూర్తయితేనేగానీ మాట్లాడని పూజారిని పూర్ణిమ, తన స్నేహితురాళ్లతో పందెం వేసి ఆటపట్టించే సీన్‌ని ముహూర్తపు షాట్‌గా తీశారు. నవంబర్ 2 నుంచి డిసెంబరు 5 వరకూ ఏకధాటిగా షూటింగ్ వైజాగ్ పరిసరాల్లో జరిగింది. బ్యాలెన్స్ వర్క్ డిసెంబర్ 30 నుంచి జనవరి 2 వరకూ హైదరాబాద్ సారథీ స్టూడియో, డక్కన్ కాంటినెంటల్ హోటల్‌లో తీశారు.

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | :ఉషాకిరణ్ మూవీస్ |
| కథ | :పొత్తూరి విజయలక్ష్మి |
| ఆర్ట్ | :భాస్కరరాజు |
| ఎడిటింగ్ | :గౌతంరాజు |
| సంగీతం | :రమేశ్‌నాయుడు |
| పాటలు | :వేటూరి |
| నేపథ్యగానం | :బాలు, ఎస్.జానకి, శైలజ |
| నృత్యాలు | :శివసుబ్రహ్మణ్యం |
| కెమెరా | :ఎస్.గోపాల్‌రెడ్డి, దేవీప్రసాద్ |
| నిర్వహణ | :అట్లూరి రామారావు |
| నిర్మాత | :రామోజీరావు |
| రచన-దర్శకత్వం | :జంధ్యాల |

డైలాగులు అన్ని చిత్రాల్లోనూ అవసరమే! అయినా కొన్ని చిత్రాల్లో మాత్రం డైలాగులే ప్రతిసీన్‌లోనూ, ప్రతి షాట్‌లోనూ సందడి చేస్తుంటాయి. అలాంటిదే 'శ్రీవారికి ప్రేమలేఖ' చిత్రం. ప్రారంభం నుండి



నరేశ్

ముగింపు వరకూ రకరకాల విచిత్ర పాత్రలు విద్వారమైన ధోరణిలో దమ్మున్న డైలాగులు పుంఖానుపుంఖాలుగా చెబుతుంటాయి. 'శ్రీవారికి ప్రేమలేఖ' అంత ఫుల్‌లెన్త్ ఎంటర్‌టైనర్స్ అరుదుగా మాత్రమే తెలుగుతెరపై లభ్యమవుతుంటాయన్నది నాటితరం ప్రేక్షకులు గొప్పగా చెప్పుకునే మాట.


ముచ్చర్ల అరుణ

అసలు ఆ టైమ్‌లో ఈ టైటిలే పెద్ద సంచలనం. ఇదేం టైటిల్ అనుకున్న వాళ్లు కూడా జంధ్యాల సంభాషణల ప్రభంజననానికి ముగ్ధులైపోయారు.

చిత్రంలో అడుగడుగునా సస్పెన్స్ ఉంది. ఈ సస్పెన్స్‌లోంచే ఎంతో హ్యూమర్‌ని పుట్టించారు జంధ్యాల. మేరేజ్‌లుక్స్ అంటూ పెళ్లిచూపులను గురించి చెప్పడం వంటి వాటిల్లోనూ, పక్కవాడి తలమీద మొక్కుకుని గుండు కొట్టించడంలోనూ, మాదీఫల రసాయనం ఘట్టంలోనూ గిలిగింతలు పెట్టే హాస్యం ఉంది. హాస్యం కోసమని పాత్రలు సృష్టించకుండా పాత్రోచితమైన హాస్యంతో కొత్త తరహాగా రూపొందింది. నవలలో ఉన్న చిన్న ప్రాణాన్ని తీసుకుని దృశ్యపరంగా ఎంత అందంగా చెప్పవచ్చో అంత అందంగానూ చెప్పారు జంధ్యాల. పతాక సన్నివేశంలో గొప్ప ఉద్వేగం, వేగం తీసుకొచ్చి 'కామెడీ క్లైమాక్స్' అనే కొత్త సిద్ధాంతానికి ప్రాణం పోసారు జంధ్యాల.

ఇంచుమించు చిత్రంలోని ప్రతి ప్రధానపాత్రకీ ఓ మేనరిజమ్ ఉంది. సినిమా పిచ్చితో కనబడ్డవారికల్లా కథలు చెప్పి హింసించే మొబైల్ సినిమా కథకురాలు పూర్ణగా శ్రీలక్ష్మి, రకరకాల వంట ప్రయోగాలతో అందరి దుంప తెంచే కాముడుగా సంగీత, పేకాట ప్రియునిగా నూతన్‌ప్రసాద్, అనుమానం పెళ్లాం టార్చర్‌కి బలయ్యే బలహీనమైన భర్తగా సుత్తివేలు చక్కటి హాస్యాన్ని పండించారు. ఇందులో వేలు అతిథి పాత్ర పోషించినా ప్రధాన పాత్రధారులకు వచ్చినంత పేరు వచ్చింది.

'ఆడది భర్త చేతి వేలు పట్టుకుని మెట్టినింట అడుగుపెట్టాలిగానీ, వేలకు వేలు కాదు' లాంటి డైలాగ్స్ బాగా పేలాయి.


'నాన్నగారూ... ఇదేనా రావడం' అని నరేశ్ అడిగితే, 'లేదు.. నిన్ననే వచ్చి మెట్ల కింద దాక్కున్నాను' అని చెప్తాడు వీరభద్రరావు. ఈ డైలాగ్ బట్టే ఆయన క్యారెక్టర్ ఏమిటో అర్థమవుతుంది. చీటికిమాటికి రకరకాల తిట్లతో అందర్నీ భయపెడుతుంటారు. 'నవరంధ్రాల్లో మైనం కూరేస్తా' అంటుంటారు.

'శ్రీవారికి ప్రేమలేఖ' చిత్రం వీరభద్రరావు కోసమే నిర్మించబడిందా లేక వీరభద్రరావే ఆ పాత్ర కోసం పుట్టాడా అన్నంత మహత్తరంగా మనసులలో హత్తుకుపోయింది.

జంధ్యాల దర్శకత్వంలో నూతన్‌ప్రసాద్ నటించిన తొలి చిత్రమిది. ఈ చిత్రం తర్వాత దాదాపు జంధ్యాల అన్ని చిత్రాల్లోనూ నూతన్‌ప్రసాద్ మంచి పాత్రలను పోషించారు. ఈ సినిమా గురించి నూతన్ ప్రసాద్ ఏమన్నారంటే - "హాస్యరసానికి ఒకానొక దశలో జబ్బు చేసింది. సినిమాల్లో హాస్యం

| | |
|---|---|
| విడుదల | :2-3-1984 |
| నిర్మాణ వ్యయం | :19 లక్షల రూపాయలు |
| నిర్మాణ ప్రదేశాలు | :వైజాగ్, అరకులోయ పరిసర ప్రాంతాలు, హైదరాబాద్ సారథీ స్టూడియో, దక్కన్ కాంటినెంటల్ హోటల్ |
| నిర్మాణ సమయం | : 36 రోజులు |





మెల్కోటే, విద్యాసాగర్, మిశ్రో, పి.యల్.నారాయణ, నూతన్‌ప్రసాద్, వీరభద్రరావు

నిడివి తగ్గిపోసాగింది. హాస్య నటులకి ప్రాధాన్యం కూడా తగ్గిపోయింది. అలాంటి సమయంలో జంధ్యాల 'శ్రీవారికి ప్రేమలేఖ' అనే మంచి ఔషధాన్నిచ్చి హాస్యానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగించారు. జంధ్యమంటే వనికి ఉపక్రమించడమని పెద్దలు నాకు అర్థం చెప్పారు. ఈ జంధ్యాల నవరసాల్లోని హాస్యాన్ని తన జంధ్యంగా వేసుకున్నాడు. జంధ్యాలకి జోహార్.

"సుప్రసిద్ధ పత్రికా సంపాదకుడు రామోజీరావు నిర్మించిన తొలి చిత్రమిది. ఇందులో సుత్తి వీరభద్రరావుకి ముగ్గురు కొడుకులు. అందులో నేనొకడిని. ఈ సినిమా సూపర్‌హిట్ అయ్యింది. నాటకాలనుండి వచ్చిన వాళ్లే ఎక్కువ మంది ఈ సినిమాలో నటించడంతో ఓ టీమ్‌లా కలిసిపోయి సినిమా చేశారు. హాస్యనటులకి ఈ సినిమా తరువాత మంచి మంచి పాత్రలు లభించాయి. చక్కని, చిక్కని తెలుగు వాతావరణంలో తెలుగు నుడికారంతో, తెలుగు సంస్కృతితో, తెలుగు హాస్యంతో తీసిన సినిమా ఇది.

"జంధ్యాల సినిమాల్లో బూతులు, ద్వంద్వార్థాలు ఉండవు. చిన్న చిన్న మాటలతోనే నవ్వులు సృష్టించేవారు. న్యాయంగా ప్రతి తెలుగువాడు జంధ్యాలను గుర్తుపెట్టుకోవాలి. నా ఉద్దేశ్యం ప్రకారం తెలుగువారి ఆస్తిపాస్తుల్లో జంధ్యాల ఒకరు.

"రంగస్థలం మీద జంధ్యాల కన్నా నేను సీనియర్‌ని. ఆయన నా నటనని బాగా అభిమానించేవారు. తన ట్రూప్‌లో నాటకమాడమని జంధ్యాల విజయవాడ నుంచి నాకు చాలాసార్లు ఉత్తరాలు రాసేవారు. వైజాగ్‌లో నాటకోత్సవాలు జరిగినప్పుడు నాకు జంధ్యాలని ఎవరో పరిచయం చేసారు. చాలామంది కళాపోషణ చేస్తున్నామంటారు. డబ్బులు తీసుకుని నటించే మేము కళాపోషణ చేయడమేంటి? రంగస్థలానికి అపూర్వ గౌరవాన్ని ఇచ్చిన వ్యక్తి జంధ్యాల. ఏ ఊళ్లో షూటింగ్ చేస్తే ఆయా చోట్ల ఉన్న రంగస్థల కళాకారులకి మంచి మంచి వేషాలిచ్చి ప్రోత్సహించారు. నాకు తెలిసి తెలుగు సినిమా పరిశ్రమలో పేరొందిన రంగస్థల కళాకారులకందరికీ సినిమాల్లో వేషాలిచ్చింది ఒక్క జంధ్యాలే. కొంత

### పాటలు

| | |
|---|---|
| 1. తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు | - పూర్ణిమ అభినయించారు |
| 2. పెళ్లాడు - పెళ్లాడు ఆనందరాయా | - నరేశ్, రాళ్లపల్లి, శాస్త్రి, మెల్కోటే తదితరులు |
| 3. రఘువంశ సుధాంబుధి చంద్ర | - నరేశ్, వీరభద్రరావు, నూతన్‌ప్రసాద్, శ్రీలక్ష్మి, విద్యాసాగర్, సంగీత, డబ్బింగ్ జానకి తదితరులు |
| 4. సరిగమపదని స్వరధార | - నరేశ్, పూర్ణిమ |
| 5. లిపిలేని కంటి బాస | - నరేశ్, ముచ్చర్ల అరుణ |
| 6. మనసా తుళ్లిపడకే | - పూర్ణిమ, నరేశ్ |



శ్రీలక్ష్మి, నూతన్‌ప్రసాద్

మంది దర్శకులిచ్చారు. అందరికన్నా పరిపూర్ణంగా చేసింది మాత్రం ఆయనే. నిజంగా కళాపోషణ చేసినది ఆయనేనని చెప్పాలి" అని జంధ్యాల గొప్పదనాన్ని విశ్లేషించారు నూతన్‌ప్రసాద్.

ఆఫీస్ ప్యూన్ సారా(సారంగరావు)గా రాళ్లపల్లి తనదైన శైలిని కనబర్చారు. మందు కొట్టడాన్ని 'మాట్లాడటం' అనే ప్రక్రియకు అన్వయించి రకరకాల భాషల్లో మాట్లాడే పాత్రలో రాళ్లపల్లి నటన ఎంతగానో నవ్విస్తుంది.

ఈ చిత్రం ద్వారా నటులుగా మెల్కోటే, విద్యాసాగర్ పరిచయమయ్యారు. హైదరాబాద్‌లో విన్నకోట రామన్న పంతులు పరిషత్ నాటకాల్లో 'లిఫ్ట్' నాటకంలో వెరైటీగా పాత్రను పోషించిన విద్యాసాగర్‌ని అట్లూరి రామారావు, జంధ్యాలకు రికమెండ్ చేశారు. విద్యాసాగర్ ఇందులో సంగీతకు జోడీగా కామెడీ పాత్ర చేశారు. ఆనందరావు ఆఫీస్‌బాస్‌గా మెల్కోటే నటించారు. ఆయన నవ్వాడు అంటే సీరియస్‌గానూ, సీరియస్‌గా వుంటే చాలా ఆనందంగానూ ఉన్నట్టు లెక్క

ఈ సినిమా గురించి హీరో నరేశ్ చాలా విషయాలే చెప్పారు.

"ఈ సినిమా హిట్‌తో నా స్టార్‌డమ్ పెరిగింది. మిస్సమ్మ, గుండమ్మ కథలాంటి సినిమాలు మళ్లీ రావాలనుకుంటున్న సమయంలో వచ్చిన సినిమా ఇది. నాతో ఉషాకిరణ్ మూవీస్ బేనర్ ప్రారంభం కావటం ఇప్పటికీ ఆనందదాయకం. 'ఈ సినిమాను నూరు శాతం ఎంటర్‌టైనర్ చేస్తాను' అని రామోజీరావుగారికి హామీ ఇచ్చి మరీ చేసారు జంధ్యాల.

"ఆ సినిమాలో ఒక్కో పాత్రతో ఒక్కో కామెడీ ట్రాక్ చేయొచ్చు. ఇట్స్ ఏ డిక్షనరీ ఫర్ కామెడీ ఫిల్మ్ మేకింగ్. డైలాగ్, కేరక్టరైజేషన్ ఏది తీసుకున్నా సూపర్. రాళ్లపల్లి పాత్ర మొదలుకుని, ఒక సీన్‌లో వచ్చే వేలుతో పాటు అన్ని పాత్రలూ అద్భుతం. సిగ్గు లేకుండా చెప్పాలంటే ఈ సినిమాని చాలాసార్లు మళ్లీ మళ్లీ ఉపయోగించుకున్నాం. నాకు తెలిసి నేను చేసిన మొట్టమొదటి సంపూర్ణ హాస్యరసభరిత చిత్రం ఇదే. అందుకే ముందు కొంచెం భయపడ్డాను. జంధ్యాల గారు 'నీకెందుకు, నేను చెప్పినట్టు



చెయ్ చాలు.' అని ధైర్యం చెప్పేవారు.

"ఈ సినిమాని తమిళంలో నేనే చేశాను. తెలుగు వెర్షన్ విడుదలైన ఒకటి రెండేళ్ల తరువాత తమిళంలో చేసారు. హిందూ పత్రిక రంగరాజన్ 'పొరుత్తం' పేరుతో నిర్మించిన ఆ చిత్రానికి మౌళి దర్శకత్వం వహించారు. ఇక్కడంతగా తమిళంలో ఆడలేదు.

"తమిళంలో నా సరసన పూర్ణిమ తప్ప మిగిలిన వాళ్లంతా అక్కడి ఆర్టిస్టులే నటించారు. తమిళంలో ఇది నా రెండవ సినిమా. 'పోలీస్ పోలీస్' నా మొదటి చిత్రం.

"మౌళి కూడా క్రియేటివ్ రైటర్, డైరెక్టర్. అలాంటివాడుకూడా 'శ్రీవారికి ప్రేమలేఖ' లోని చీరలసాంగ్‌ని యథాతథంగా ఉపయోగించుకున్నాడు. ఆ పాట గొప్పదనం అలాంటిది.

"'శ్రీవారికి ప్రేమలేఖ' షూటింగ్ లో కొన్ని సరదా సంఘటనలు ఇప్పటికీ నాకు గుర్తున్నాయి. కొన్ని వేల టపాకాయలు రెడీ చేసి సింగిల్ టేక్‌లో షాట్ ఓకే చేయాలి. నేను, పూర్ణిమ మూడు, నాలుగు రోజులు రిహార్సల్స్ చేసాం. భరతనాట్యం చేయాలి. నేను భరతనాట్యం స్టూడెంట్‌నే అయినా రిహార్సల్స్ చేశాను. జంధ్యాల గారికి సముద్రమంటే చాలా ఇష్టం. రాత్రివేళ సముద్రం దగ్గర ఆ సన్నివేశం చిత్రీకరించటానికి అంతా రెడీ చేసి ఓకే చెప్పారు. సీన్ బాగా పండింది. అయితే కెమెరాలో రీల్ నడవలేదు. దాంతో యూనిట్‌లో అందరూ డీలాపడిపోయారు. మరిచిపోలేని షాట్ అది. దాంతో మళ్లీ టపాసులు తెప్పించి మళ్లీ ఆ షాట్ తీశారు.

"అప్పట్లో చాలా సినిమాల్లో నిలబడి డైలాగ్స్ చెప్పడం పద్ధతి. ఈయన మాత్రం ఏదో ఒక వర్క్ చేస్తూ డైలాగ్ చెప్పించేవారు. ఆయనది ఇన్నోవేటివ్ స్కూల్. ఆయన స్కూల్‌లో వర్క్ చేస్తే మిగతా చోట్ల ఈజీగా పని చేసేయొచ్చు.

"ఇంకో ముఖ్య సంఘటన గురించి




నరేశ్, ముచ్చర్ల అరుణ

## కథా సంగ్రహం

శ్రీమంతుడైన పరంధామయ్యకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. చిన్న కొడుకు ఆనందరావు వైజాగ్‌లోని ఓ షిప్పింగ్ ఏజెన్సీలో పనిచేస్తుంటాడు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తిలక్, జానకి దంపతుల కూతుళ్లు హేమ, స్వర్ణ. అల్లరిపిల్ల అయిన స్వర్ణ, స్నేహితురాళ్లతో పందెం కట్టి సోనీ పేరుతో ఓ ప్రేమలేఖని రాస్తుంది. అది ఆనందరావుకి చేరుతుంది. సోనీని కనిపెట్టడానికి అతను విశ్వప్రయత్నం చేస్తుంటాడు. ఆమెనే పెళ్లి చేసుకుంటానని భీష్మించుక్కూర్చుంటాడు. హేమ ఇంటికి వచ్చిన స్వర్ణ, ఎదురింట్లో ఉంటోన్న ఆనందరావుని ప్రేమిస్తుంది. ఆనందరావు ఆఫీసులో పనిచేసే మార్గరెట్, తన చెల్లెలు రీటాని సోనీగా నమ్మిస్తుంది. ఆనందరావు, సోనిల ప్రేమను తెలుసుకున్న స్వర్ణ, తిరిగి ఊరికి వచ్చి తల్లితండ్రులు కుదిర్చిన సంబంధాన్ని అంగీకరిస్తుంది. మార్గరెట్ నాటకం బయటపడటంతో, తండ్రి కుదిర్చిన పెళ్లి అంగీకరిస్తాడు ఆనందరావు. పెళ్లి కూతురు స్వర్ణ, తనకి ప్రేమలేఖ రాసిన సోనీ ఒక్కరేనని తెలుసుకుంటాడు ఆనందరావు. వాళ్లిద్దరి పెళ్లితో కథ సుఖాంతమౌతుంది.

చెప్పాలి. ఆ రోజు షూటింగ్ ముహూర్తానికి చెన్నైలో బయలుదేరాను. ఫ్లైట్‌లో నా పక్కన ఎవరో పెద్దాయన 'హూ ఆర్ యూ నరేశ్?' అనడిగితే, నేను కూడా ఆయన నాకు ముందే బాగా తెలిసిన వ్యక్తిలాగా 'హౌ ఆర్ యూ, సర్?' అనేశాను. ఆయన 'నీకు నేనెవరో తెలుసా?' అనడిగితే ఖంగు తినాల్సి వచ్చింది. తర్వాత తెలిసింది ఆయనే రామోజీరావు గారని" అని నాటి సంగతుల్ని గుర్తుచేసుకుని మురిసిపోయారు నరేష్.




అట్లూరి రామారావు

ఈ చిత్రంలో పాటలన్నీ బాగా కుదిరాయి. రమేష్‌నాయుడు కృషి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ - త్యాగరాజస్వామి ప్రశిష్యులు. ఈయన కృతులను, వర్ణనలను, జావళీలను, తిల్లానాలను కూడా రచించారు. ఈ సినిమాలో ఆయన 'రఘువంశ సుధాంబుధి చంద్ర' అనే కీర్తనను పల్లవి వరకూ తీసుకుని చరణాలను వరకట్న పరంగా వేటూరితో రాయించి మంచి ప్రయత్నం చేశారు.

'సరిగమ పదనీ స్వరధారా..' పాట ఆరు నిమిషాలు ఉంటుంది. ఈ పాట వింటుంటే బాలు, రమేష్‌నాయుడులు ఎంత కష్టపడ్డారో అర్థమవుతుంది. ఈ పాట చిత్రీకరణలో కొత్త శైలి, ఒరవడి, కొత్తదనం కోసం జంధ్యాల పడిన కష్టం మనల్ని ఆ పాటని బాగా ఇష్టపడేలా చేస్తుంది. ఈ పాటని నాలుగు రోజుల పాటు అనంతగిరి కొండల్లో ఎల్లో ఫ్లవర్స్ మధ్య, అరకు నుంచి పాడేరు వెళ్లే దారిలో వున్న జలపాతం వద్ద, అరకులోనే విశాలమైన ఖాళీ ప్రదేశంలో నైట్ ఎఫెక్ట్‌లో దాదాపు వెయ్యి చిచ్చుబుడ్లతో కళాదర్శకుడు భాస్కరరాజు ఏర్పాటు చేసిన కాంతుల మధ్య చిత్రీకరించారు.

అనంతగిరి సమీపంలో బ్లాక్‌హిల్స్ మీద నీలం రంగు చీరలు, ఎల్లో ఫ్లవర్స్ మధ్య ఎరుపు రంగు చీరలు అందంగా పరిచి 'అరుణం అరుణం ఒక చీర, అంబర నీలం మల్లికలా' అంటూ పూర్ణిమను ఉద్దేశించి నరేశ్ ఉద్వేగంతో పాడిన చరణాన్ని చిత్రీకరించారు.

ఈ సమయంలోనే ఓ వందమంది కొండజాతి ప్రజలు వచ్చి షూటింగ్‌కి అభ్యంతరం తెలిపారు. వాళ్ల భాష వీళ్లకి, వీళ్ల భాష వాళ్లకు అర్థం కాలేదు. వాళ్లకెలా నచ్చచెప్పాలా అని అనుకుంటున్న సమయంలో నరేశ్‌కు ఫ్లాష్‌లా ఓ ఆలోచన వచ్చింది. వెంటనే టేప్ రికార్డర్ తీసుకుని వాళ్ల భాషలో ఓ పాట పాడమని సైగ చేశారు. వాళ్లు పాట ప్రారంభించగానే టేప్ ఆన్ చేసి, పాట పూర్తికాగానే వాళ్ల పాటను వాళ్లకే తిరిగి వినిపించారు. అది వినగానే వాళ్లంతా ఒక్కసారి ఆశ్చర్యపోయారు. బహుశా అప్పటివరకూ వాళ్లు టేప్ చూసి వుండరు. అంతే! ఆ తరువాత ఆ కొండజాతి వాళ్ల నుంచి షూటింగ్‌కి ఎలాంటి అభ్యంతరం రాలేదు. యూనిట్ అక్కణ్నుంచీ కదిలేవరకూ వాళ్లు అక్కడే కూర్చుండిపోయారు.



అరకు సమీపంలోని కొండల మధ్య పసుపు పచ్చని పువ్వుల బ్యాక్‌గ్రౌండ్‌లో నరేశ్, ముచ్చర్ల అరుణల మీద 'లిపిలేని కంటి బాస...' పాటను తీశారు. మిగిలిన భాగాన్ని వైజాగ్ పరిసరాల్లో తీశారు.




ఆనందరావు తనను గాఢంగా ప్రేమించే ప్రేయసి కోసం ఎదురుచూస్తుంటాడు. అసలు ఆ అమ్మాయి ముక్కూ మొహం ఇంకా చెప్పాలంటే కళ్లూ, కాళ్లు ఏవీ అతనికి తెలియదు. తెలిసిందల్లా ఆ అమ్మాయి అందమైన దస్తూరి, తనకు రాసిన ప్రేమలేఖలో పొదిగిన ముత్యాల్లాంటి అక్షరాలు. దిక్కుతోచని ఆనందరావుకు ఆఫీస్‌ప్యూన్ 'సారంగరావు' ఓ బ్రిలియెంట్ ఐడియా చెబుతాడు. ఆ సలహామేరకు ఆనందరావు పెళ్లి చూపులకు వెళ్తున్నట్టు బహిరంగంగా ప్రకటించి ఆఫీస్ స్టాఫ్‌కు, పరిచితులకు ఓ పార్టీ ఏర్పాటు చేస్తాడు. ఈ దెబ్బతో తనను ఆరాధించే ప్రేయసి బయటపడుతుందని అతని నమ్మకం. పార్టీ ప్రారంభమైంది. ఆనందరావుని అభినందిస్తూ పాట కూడా అందుకుంటారు కొలీగ్స్. 'పెళ్లాడు పెళ్లాడు ఆనందరాయా..' అంటూ పాట మొదలవుతుంది. ఇందులో కామెడీ కోసం కొన్ని తమాషా బిట్స్ జతపరిచారు. అందులో భాగంగా ఎన్టీఆర్ అభినయాన్ని ఎస్.రాంబాబు, ఎఎన్ఆర్ అభినయాన్ని బి.చక్రవర్తి(రాజమండ్రి), శోభన్‌బాబు అభినయాన్ని పి.శ్రీనివాసబాబు(ముమ్మిడివరం) అనుకరిస్తూ డాన్స్ చేశారు. ఈ ముగ్గురికీ ఎన్నో ఏళ్లుగా ఆయా నటులను అనుకరిస్తూ రికార్డింగ్ డాన్స్ చేయడంలో అనుభవం ఉంది.

హీరో కృష్ణ అభినయాన్ని ప్రదర్శించిన శాస్త్రి, దర్శకుడు జంధ్యాలకి మంచి మిత్రుడు. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంకు స్వయానా తోడల్లుడు. మిమిక్రీ అద్భుతంగా చేసి స్నేహితుల మధ్య నవ్వుల పువ్వులు కురిపించడం ఆయనకు సరదా. 'జంధ్యాల మాటను కాదనలేక తొలిసారిగా కెమెరా ముందు నిలబడ్డాను' అని చెప్పారు శాస్త్రి. ఈ పాటను నాలుగు రోజుల పాటు రాత్రి సమయాల్లో శివసుబ్రహ్మణ్యం నృత్య దర్శకత్వంలో డాల్ఫిన్ హోటల్‌లో చిత్రీకరించారు.

గోపాల్‌రెడ్డి ఫోటోగ్రఫీ, గౌతంరాజు ఎడిటింగ్ ఈ చిత్రానికి అదనపు అందాల్ని తీసుకొచ్చాయి. 1984 సంవత్సరానికి ఉత్తమ ఎడిటర్‌గా ఈ చిత్రం ద్వారా నంది అవార్డ్ నందుకున్నారు గౌతంరాజు.



నరేశ్, పూర్ణిమ



దుక్కిపాటి మధుసూదనరావు చేతులమీదుగా శతదినోత్సవ జ్ఞాపికను స్వీకరిస్తున్న జంధ్యాల

ప్రేమప్రధానమైన చక్కటి హాస్యరస చిత్రంగా 'శ్రీవారికి ప్రేమలేఖ'ను అభివర్ణించవచ్చు. చిత్రమంతా తెలుగు వాతావరణం తొణికిసలాడుతూ ఉంటుంది.

"మనిషి జీవితం బాధల, సమస్యలమయమై ఉంటుంది. అలాంటి మనిషి థియేటర్‌కు వచ్చినప్పుడు అతనికి కాస్త నవ్వులు పంచి నవ్వించాలన్నదే నా ధ్యేయం. అందుకే నేను ఎక్కువగా హాస్యరస ప్రధానమైన చిత్రాలు రూపొందించడానికే ఇష్టపడతాను. రచయితగా నేను హాస్యమే రాసాను. దర్శకుడిగా హాస్యాన్నే పంచుతున్నాను. అయితే హాస్యం రాయటం, హాస్య చిత్రాన్ని రూపొందించడం చాలా కష్టమైన పనులు. కొంచెం శృతిమించితే హాస్యం అపహాస్యమవుతుంది. హాస్యానికి, అపహాస్యానికి మధ్య రేఖామాత్రమైన భేదం మాత్రమే ఉంటుంది. నేను నా శక్తివంచన లేకుండా హాస్యాన్ని హాస్యంగా ఉంచడం కోసమే ప్రయత్నిస్తున్నాను" అని ఈ చిత్రం ప్రెస్‌మీట్‌లో చెప్పారు జంధ్యాల. ఈ చిత్రానికి వైవిధ్యమైన పబ్లిసిటీ పోస్టర్లు వేశారు. "నవ్వు నాలుగిందాల గ్రేట్ అనుకునేవారు చూడాల్సిన సినిమా" అని, "నూట ఏభై నిమిషాలపాటు నవ్వు'కొనా'లనుకునే వారు చూడదగ్గ సినిమా." అని, "ఒక నిమిషం నవ్వితే పదినిమిషాల ఆయుర్దాయం పెరుగుతుంది. మరి నూట యేభై నిమిషాలు నవ్వితేనో.. అందుకే శ్రీవారికి ప్రేమలేఖ చూడండి" అనే కాప్షన్స్‌తో ఈ పోస్టర్లు వెలువడ్డాయి.

చక్కటి వినోదంతో పాటు, ఎందులోనూ అతి పనికి రాదనే సందేశంతో పాటు వరకట్న సమస్యను గురించి అండర్ కరెంట్‌గా చర్చించారు. ఒక నీతిని, సామాజిక చైతన్యానికి సంబంధించిన ప్రబోధాన్ని సందేశాన్ని హాస్యరస భరితంగా చేసిన కొత్త ప్రయోగం 'శ్రీవారికి ప్రేమలేఖ'.

"ఈనాడు గ్రూప్ నుంచి ఓ కొత్త వింగ్ మీతో ప్రారంభమవుతుంది. ముమ్ముందు వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు గర్వంగా ఫీలయ్యేట్టుగా సినిమా తీయమని" తనతో రామోజీరావు చెప్పిన మాటలని తన చేతల్లో నిజం చేసి చూపించారు జంధ్యాల.

జంధ్యాల ఆడిన లాంగెస్ట్ హ్యూమర్ ఇన్నింగ్స్‌లో ఈ చిత్రం రికార్డ్స్‌మీద రికార్డ్సు నెలకొల్పింది.



# సంభాషణలలో మెచ్చుతునకలు

★ ...ఒరే అలా చేతులు వణికించావంటే నీ నవరంధ్రాల్లోనూ మైనం కూరతాను తలమాసిన కుంకా. గడ్డం గీస్తే సుతారంగా నెమలి ఈకతో నిమిరినట్టుండాలిరా..గోకుడుపారతో గోకినట్టు కాదు.

బాబూ తమరిట్టా గాలిపటంలా కదిలిపోతే ఏ పీకో తెగి రేపటీయాలి నుంచీ నేను జైల్లో గెడ్డాలు గీసుకోవాల్సి వస్తుంది.

★ ఊ..లేవోయ్ భీముడూ.. లే, కుంకన్నర నన్ను తెగిపోయిన పాతచెప్పు క్రింద జమకట్టి వేరే బేరాలున్నాయంటూ నీలుగుతున్నాడు వెధవ. ఎలా కదులుతాడో చూస్తాను. కూర్చుని శుభ్రంగా గుండు గీకించుకో.

గుండా.. అయ్యా వీడిమీద కోపంతో నాకు గుండు గీకించి రెండు నెలలే కాలేదు. ఇప్పటికిది పన్నెండో గుండు. ఇంకోసారి ఇలాగే గుండు గీకిస్తే నాకు విడాకులిచ్చి లేచిపోతానని బెదిరిస్తుంది మా ఆవిడ. భృత్యుడ్ని క్షమించి ఆ గుండు వరం ప్రసాదించకండి మహాప్రభో.

★ అయ్యా మహాప్రభువుల వ్యాకరణం తమకు తెలియందేముంది చెప్పండి. వారి తృతీయ తత్పురుష లేదు. నేను, నువ్వు అనేవే తప్ప అతను, ఆమె అనేవే లేవు వారికి. ఇప్పుడు వారిని కరిచిన కుక్కకు పిచ్చెక్కి చచ్చిందనుకోండి.. నన్ను కరిచి నువ్ చచ్చావంటారాయన.

చాల్లే ఊరుకో.. నన్ను కుక్క కరిచిన విషయం దేశమంతా చెప్పాలా? వెధవర్ధాయిష్షు కుక్క!

★ అమ్మాయ్ ఎంత వరకూ చదివావ్?

మధు, నిర్మల అపార్థం చేసుకునే వరకూ.
నోర్ముయ్.. ముయ్..య్..
వారడిగేది నువ్విప్పుడు చదువుతున్న నవల గురించి కాదమ్మా, మామూలు చదువు...

★ ఇదిగో మాటలుజాగ్రత్తగా రానీయండి. ఇలా రాంగ్ షోలు చూపించారంటే డైమండ్ ఆసు పెట్టి పొడుస్తాను జాగ్రత్త.


★ ఏం తాగొచ్చావేంట్రా అక్కుపక్షీ?

ఛీ..ఛీ.. తాగడం అని ఆ పనికున్న గౌరవాన్ని పాడు చేయకు, మాట్టాడుకుని వచ్చా. ఒంటరిగా కూర్చుని నాలో నేనే బండబూతులు మాట్టాడుకుని వచ్చా.

★ అశోకుడు, కనిష్కుడూనా.. వాళ్లెవరట?

డైమండ్ రాజూ, కళావర్ రాజూను..

★ కలకత్తా భౌ...భౌ .. వండటం గురించి చెబుతున్నాను మావయ్యా
నా టూరింగ్ టాకీసా, మా అమ్మే దొరికిందా నువ్వు వేయించుకుతింటానికి.
నా కదిలే మిల్ట్రీ భోజనహోటలా మా అక్కయ్యే దొరికిందా వేయించుకు తింటానికి
అబ్బా ఉండండి.. ఏదో చెబ్దామనుకున్నాను మర్చిపోయాను
సింగినాదం.. జీలకర్ర..
ఆ.. భౌభౌ మీద జీలకర్రకూడా వేస్త చాలా బాగుంటుందమ్మా
డి.డి.టి. వేస్తే ఇంకా బాగుంటుంది.




## ప్రేమ హృదయాలకు సరికొత్త ఆలాపన

# ఆనందభైరవి

'శంకరాభరణం' తర్వాత ఆ స్థాయిలో నృత్య, సంగీతాలకు విశేష ప్రాధాన్యమిస్తూ రూపొందిన చిత్రం 'ఆనందభైరవి'.

హాస్య చిత్రాల రూపకల్పనకు కొత్త ఒరవడి పెట్టిన జంధ్యాల ఎంతో ఇష్టపడి, కష్టపడి రూపొందించిన చిత్రమిది. 'శంకరాభరణం' చిత్రప్రభావితుడనై తీసానని జంధ్యాల నిజాయితీగా చెప్పుకున్నా, అద్భుతమైన సృజనతో పరమ పవిత్రంగా ఈ చిత్రాన్ని రూపొందించి తనలోని సరికొత్త దర్శకుడిని ఆవిష్కరింపచేశారు. జంధ్యాలకిది తొమ్మిదవ చిత్రం. ఈ చిత్రం ద్వారా జంధ్యాల ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్ర దర్శకుడిగా అవార్డు పొందారు. 'ఆనందభైరవి'లో కూచిపూడి నృత్యం నేపథ్యం! కూచిపూడి నృత్యం పురుషులకే కానీ, స్త్రీలకు అందులో ప్రవేశం ఉండరాదన్నది ఛాందసవాదుల అభిప్రాయం. 'నటరాజు' పురుషుడు కాబట్టి నృత్యం పురుషులకే సొంతం అనే అభిప్రాయం ఆనాటి అగ్రహారాల్లో పాతుకుపోయి వుండేది. ఈ సంప్రదాయం కారణంగానే 'కూచిపూడి' కి రావలసినంత ఖ్యాతి రాలేదని భావించేవారున్నారు. ఈ చిత్రం అలాంటి ఛాందసభావాలను తుడిచివేస్తూ రూపొందడం విశేషం!

కొండముది శ్రీరామచంద్రమూర్తి ఆంధ్రప్రభ వీక్లీలో రాసిన 'చిరుమువ్వల మరుసవ్వడి' నవల ఆధారంగా ఈ చిత్ర కథను రూపొందించారు జంధ్యాల. 'ఆనందభైరవి' కర్ణాటక సంగీత సంప్రదాయంలో ఒక రాగం పేరు. అదే పేరుని ఆనంద్– భైరవి అని విడగొట్టి ఒక ప్రేమ జంటకు పెట్టారు. కూచిపూడి నాట్యానికి తన జీవితాన్నే అంకితం చేసిన నాట్యాచార్యుడు నారాయణశర్మ పాత్రకు ఎలాంటి ఇమేజ్ లేని నటుడు కావాలని తలపోసారాయన. ఎన్నో తర్జనభర్జనల తర్వాత ప్రముఖ కన్నడ నటుడు, రచయిత, దర్శకుడు గిరీశ్‌కర్నాడ్‌ని ఎంపిక చేసారు. ఈ పాత్రను బాగా ప్రేమించిన గిరీశ్ కర్నాడ్ పరిపుష్టత కోసం నృత్యం నేర్చుకోవడానికి సిద్ధపడ్డారు. ప్రసిద్ధ నృత్య దర్శకులు శేషు మాస్టారి దగ్గర రెండు నెలలు కూచిపూడి శిక్షణ పొందారు. గిరీశ్ కర్నాడ్ ఈ పాత్ర కోసం తన ఒత్తయిన జుట్టును కూడా కత్తిరించుకున్నారు. నారాయణశర్మ ధర్మపత్ని పాత్రకు ఒకప్పటి ప్రముఖ కథానాయిక కాంచనను తీసుకున్నారు. నారాయణశర్మ కొడుకు ఆనందం పాత్రకు యువ నటుడు రాజేశ్‌ని ఎంపిక చేశారు.

ఇలా అన్నిపాత్రల ఎంపికా పూర్తయిందిగానీ, ఒక్క హీరోయిన్ మాత్రం మిగిలిపోయింది. నృత్యం తెలిసినవారే ఈ పాత్రకు అర్హులు. నృత్యం తెలిసిన అందమైన అమ్మాయిలెవరూ సినిమాల్లో చేయడానికి అంగీకరించలేదు. చివరకు బెంగాల్‌కు చెందిన కథక్ నృత్యకారిణి మాళవికా సర్కార్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. తెలుగు రాకపోయినా, కూచిపూడి తెలియకపోయినా మంచిపేరు తెచ్చుకుంది మాళవిక.


గిరీశ్‌కర్నాడ్


మాళవిక

### పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| నారాయణశర్మ | - గిరీశ్ కర్నాడ్ |
| ఆనందశర్మ | - రాజేశ్ |
| భైరవి | - మాళవిక |
| లక్ష్మీదేవమ్మ | - కాంచన |
| డా॥ అవధాని | - 'సుత్తి' వీరభద్రరావు |
| అవధాని కొడుకు | - 'సుత్తి'వేలు |
| చైనులు | - పుచ్చా పూర్ణానందం |
| కరటకుడు | - శుభాకర్ |
| అవధాని కోడలు లక్ష్మి | - శ్రీలక్ష్మి |
| కేశవ | - హేమసుందర్ |
| ప్రియ | - మహాలక్ష్మి |
| నటరాజన్ | - జె.వి.రమణమూర్తి |
| చిన్నప్పటి ఆనంద్ | - మాస్టర్ హరీశ్ |
| చిన్నప్పటి భైరవి | - బేబి కవిత |

ఇంకా జిత్‌మోహన్ మిత్రా, రామమోహనరావు, డబ్బింగ్ జానకి, కాకినాడ శ్యామల, మాస్టర్ హరికృష్ణ, నందూరి సుబ్బారావు, జి.వి.జి., **నృత్య కళాకారులు :** వెంకట్రామమ్మ (కూచిపూడి), శ్రీమతి సేన్ (మణిపురి), కుమారి జూబి (కథక్), శ్రీరాం (కథకళి)


'ఆనందభైరవి' శతదినోత్సవ దృశ్యం




'ఆనందభైరవి' జైత్రయాత్రను పురస్కరించుకుని అమెరికాలోని తెలుగువారు వెలువరించిన ఆహ్వాన పత్రిక

ఈ సినిమాకు సంబంధించి ఎక్కువ సన్నివేశాలు రాజమండ్రి సమీపంలోని కోరుకొండలో చిత్రీకరించారు. 'భైరవి' పాత్రధారిణి మాళవిక నృత్యం చేసే ప్రముఖ ఘట్టాలు అక్కడి ఓ దేవాలయంలోని మండపంలో చిత్రీకరించారు. శిల్ప సౌందర్యం లేక మండపం బోసిగా వున్నా ఆ లోపం కనిపించకుండా జంధ్యాల మ్యాజిక్ చేసినట్టు మేనేజ్ చేశారు.

ముఖ్యంగా 'పిలిచిన మురళికి' పాట చిత్రీకరణలో యూనిట్ సభ్యులు చాలా శ్రమపడాల్సి వచ్చింది. రాజమండ్రికి 15 మైళ్ళ దూరంలో గల కోరుకొండ వద్ద గల ఎత్తైన కొండమీది గుడి దగ్గర ఈ పాటను చిత్రీకరించారు. ఈ గుడికి గల 600 మెట్ల మీద నూనెతో దీపాలు పెట్టి అలంకరించారు. షాట్ మొదలవగానే అక్కడక్కడా గాలికి దీపాలు ఆరిపోసాగాయి. కొండ మీదా, కొండ మీది గుడిమీద వరుసగా వెలిగించిన దీపాలు గాలికి కొండెక్కుతున్నప్పుడల్లా వాటిని వెలిగించడానికి పదేపదే కొండ ఎక్కి, దిగి యూనిట్‌వాళ్ళు నానా ఇబ్బందులు పడ్డారు.



'ఆనంద భైరవి' శతదినోత్సవ సభలో కమలహాసన్, జంధ్యాల

క్లైమాక్స్‌లో ఓ పాట వుంది. రాజేశ్, మాళవిక నుద్దేశించి 'రా..రా...రా... రాగమై' అంటూ పాడతాడు. ఆ పాట ద్వారా సినిమాలో టెన్షన్ ఏర్పడేలా చిత్రీకరించా లనుకున్నారు. అయితే జంధ్యాలకూ, కెమెరామన్ గోపాలరెడ్డికి ఆ సీన్‌లో ఏదో వెలితి అనిపించింది. ఆ సమయంలో వర్షం వచ్చే సన్నివేశం ఉంటే బాగుంటుందని వాళ్ళిద్దరూ అనుకున్నారు. దైవికంగా ఆ సమయంలో నిజంగానే వర్షం వచ్చింది. వెంటనే ఆ ప్రకృతిసిద్ధమైన వర్షాన్నే షూట్ చేశారు. ఈ చిత్రానికి గోపాలరెడ్డి సినిమాటోగ్రఫీ ఆయువుపట్టుగా నిలిచింది. జంధ్యాలలోని భావుకతకు, గోపాలరెడ్డిలోని వాస్తవికత తోడై ఈ చిత్రం ఓ దృశ్య ప్రబంధంగా రూపొందింది.

ఈ చిత్రానికి రమేశ్ నాయుడు సమకూర్చిన సంగీతం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. క్లాసికల్ టచ్‌తో పాపులర్ ట్యూన్స్ చేయడంతో పాటలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. సంగీతపరంగానే కాకుండా సాహిత్యపరంగా కూడా పాటలు బాగా జనరంజకమయ్యాయి. ముఖ్యంగా దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి రాసిన 'కొలువైతివా రంగసాయి', వేటూరి రాసిన 'పిలిచిన మురళికి వలచిన మువ్వకి ఎదలో ఒకటే రాగం అది ఆనందభైరవి రాగం' పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అసలు 'ఆనందభైరవి' రాగంలో డ్యూయెట్ కంపోజ్ చేయడాన్ని అప్పట్లో గొప్ప ప్రయోగంగా చెప్పుకున్నారు. లలితంగానూ, శాస్త్రీయంగానూ ఏర్చికూర్చిన పాటలన్నీ ఈ సినిమా విలువలను మరింత పెంచాయి. రమేశ్‌నాయుడు ప్రతిభను మరో కోణంలో ఆవిష్కరించిందీ చిత్రం. ఈ చిత్రం పాటల కంపోజింగ్ విశాఖ సముద్రతీరంలో జరిగింది. ఈ చిత్రంలో "కొలువై తివా రంగసాయి.." పాట తెరపై కనిపించగానే చాలా ఊళ్లలో నృత్యకళాకారులు తెరసమీపంలోకి వెళ్లి నృత్యాలు చేశారు. 'కూచిపూడి' పోటీలో భాగంగా రూపొందిన ఆ పాట తరువాత పలుమార్లు నృత్యపోటీలలో ప్రధానాంశంగా మారింది.

సినిమా షూటింగ్ పూర్తయి ఫస్ట్‌కాపీ చేతికొచ్చాక అసలు కష్టాలు మొదలయ్యాయి. ప్రొజెక్షన్ కొచ్చినవాళ్ళంతా రిస్కీ ప్రాజెక్ట్‌గా తీసిపారేశారు. బిజినెస్ చేయడానికి ఇందులో

## 'ఆనందభైరవి' అందుకున్న బహుమతులు

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ 'బంగారునంది' బహుమతులు**
ఉత్తమచిత్రం (బంగారునంది)
ఉత్తమ దర్శకుడు
ఉత్తమ ఫోటోగ్రఫీ
ద్వితీయ ఉత్తమకథ

**ఆంధ్రప్రదేశ్ ఫిలిం జర్నలిస్టుల అవార్డు**
ఉత్తమ చిత్రం
ఉత్తమ దర్శకుడు
ఉత్తమ నటుడు (గిరీశ్ కర్నాడ్)

**విజయవాడ ఫిలిం జర్నలిస్టుల అవార్డు**
ఉత్తమ చిత్రం
ఉత్తమ దర్శకుడు
ఉత్తమ సంగీతం

**'వంశీ' అవార్డులు**
ఉత్తమ చిత్రం
ఉత్తమ దర్శకుడు
ఉత్తమ సంగీతం
ఉత్తమ నటి -కాంచన
ఉత్తమ హాస్యజంట - 'సుత్తి' వీరభద్రరావు,వేలు
ఉత్తమ హాస్యనటి - శ్రీలక్ష్మి
ఉత్తమ రచన - కొండముది

**'కళాసాగర్' అవార్డులు**
ఉత్తమ చిత్రం
ఉత్తమ దర్శకుడు
ఉత్తమ సంగీతం
ఉత్తమ కథ
ఉత్తమ హాస్యనటుడు
ఉత్తమ హాస్యనటి

**ఆంధ్రప్రదేశ్ సినీగోయర్స్ అవార్డులు**
ఉత్తమ చిత్రం
ఉత్తమ దర్శకుడు
ఉత్తమ నటుడు
ఉత్తమ సంగీతం
ఉత్తమ నటి
ఉత్తమ హాస్యనటి
ఉత్తమ బాలనటుడు

**హాస్యప్రియ-రేలంగి అకాడమీ అవార్డు**
ఉత్తమ హాస్యనటి

**మద్రాసు ఫిలిం ఫ్యాన్స్**
ఉత్తమ దర్శకుడు

పేరొందిన ఆర్టిస్ట్ ఎవరూ లేరాయె. దాంతో నిర్మాతలు నాగభూషణరావు, భరద్వాజ్‌లు డీలాపడి పోయారు.

ఆ తర్వాత 'వెండితెర' సినీ వారపత్రిక ఎడిటర్ స్వర్గీయ బి.ఎ.వి. శాండిల్య చిత్రం నెగిటివ్ రైట్స్ సొంతం చేసుకున్నారు. ఈ చిత్రంలోని కళాత్మక విలువలు తమకెంతో నచ్చటం వల్ల అశ్వనీ కార్తీక చిత్ర తరుపున హక్కులు తీసుకున్నట్లు శాండిల్య చెప్పారు.

సినిమాను రిలీజ్‌కి సిద్ధం చేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డులను ప్రకటించింది. 'ఆనందభైరవికి' ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ కథా రచయిత, ఉత్తమ ఛాయా గ్రాహకుడు అవార్డులు దక్కాయి.

నంది అవార్డులతో 'ఆనందభైరవి'కి కొత్త కళ వచ్చింది. సినిమా కొనడానికి చాలామంది ఉత్సాహపడ్డారు. 1984లో లక్ష్మీఫిలిమ్స్ ద్వారా ఈ చిత్రం విడుదలైంది. కళాత్మక చిత్రాలు ప్రజా విజయం సాధించలేవనే అపప్రథను తొలగిస్తూ ఈ చిత్రం విజయవిహారం చేసింది.

కూచిపూడి నృత్య వైశిష్ట్యాన్ని చాలా సులభ శైలిలో హృదయాలకు హత్తుకునేలా చిత్రీకరించిన జంధ్యాల ప్రతిభకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. పండితులతో పాటు పామరులు కూడా ఈ సినిమాను బాగా ఆదరించారు.

ఈ కథని తెరకెక్కించినన్ని రోజులూ తన మనసులో కె.విశ్వనాథ్‌నే ప్రతిష్ఠింపచేసుకున్నారు జంధ్యాల. 'విశ్వనాథ్ గారు నన్ను ఆవహించి ఇంత అందమైన చిత్రాన్ని తీయించారు' అని సభాముఖంగానే ప్రకటించారు జంధ్యాల. ఈ చిత్రాన్ని ఆయన కె.విశ్వనాథ్‌కే అంకితమిచ్చారు. సినిమా ప్రారంభంకాగానే మొదటికార్డు ఇదే పడుతుంది.

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : కళ్యాణి ఆర్ట్ ఫిలిమ్స్ |
| నిర్వహణ | : బి.ఏ.వి. శాండిల్య |
| సమర్పణ | : డి. సీతాపద్మరాజు |
| మూలకథ | : కొండముది శ్రీరామచంద్రమూర్తి |
| గీతరచన | : కీ॥శే॥ దేవులపల్లి కృష్ణ శాస్త్రి, డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, వేటూరి, బి.ఎల్.ఎన్.ఆచార్య |
| నేపథ్యగానం | : యస్పీ బాలసుబ్రహ్మణ్యం, యస్.జానకి, యస్పీ శైలజ, పూర్ణచందర్, వింజమూరి కృష్ణమూర్తి |
| సంగీతం | : రమేశ్ నాయుడు |
| నిశ్చల ఛాయాగ్రహణం | : శ్యామ్ ప్రసాద్ |
| సహాయ ఛాయాగ్రాహకులు | : దివాకర్, కె.శ్రీనివాసరెడ్డి |
| సహకార దర్శకులు | : ఈదర సత్యనారాయణ, బత్తుల రామకృష్ణ |
| సహాయ దర్శకుడు | : జె.పుల్లారావు |
| కళ | : భాస్కరరాజు |
| నృత్య దర్శకులు | : శేషు, కృష్ణమూర్తి రాజు |
| కూర్పు | : గౌతంరాజు |
| ఛాయాగ్రహణం | : ఎస్.గోపాలరెడ్డి |
| నిర్మాత | : అశ్వనీ కార్తీక చిత్ర |
| రచన,దర్శకత్వం | : జంధ్యాల |

సంగీత ప్రధాన చిత్రమైనా జంధ్యాల అవకాశం దొరికినప్పుడు మాత్రం తన చమక్కులను ప్రదర్శించారు. సినిమా ప్రారంభంలో ఆనందం చదివే స్కూల్ ఫంక్షన్‌కి విచ్చేసిన ఓ రాజకీయనాయకుడు "ప్రియమైన మిత్రులారా.. ఇవ్వాళ నా జీవితంలో ఓ దుర్దినం. బాధతో నోట మాట రావడంలేదు" అంటూ పొరపాటున వేరే స్లిప్ చదివి నాలిక్కర్చుకునే సన్నివేశం జంధ్యాల మార్కు హాస్యానికి అద్దం పడుతుంది.

అలాగే సుత్తిజంట వీరభద్రరావు, వేలుల కామెడీ హుషారు పుట్టించింది. వేలు తండ్రిగా వీరభద్రరావు డాక్టరు పాత్రలో రకరకాల ప్రాసల్తో మాట్లాడుతూ నవ్వించారు, కవ్వించారు. 'నాని నాని... నీ నూనె నీ నూనె నా నూనె నా నూనె, నా నూనె నీ నూనేనని నిన్న నేనన్నానా...' నోనో... నేనన్నానా నున్నని నాన్నా... నైనైనై' అంటూ 'న' ప్రాసలోనూ, 'ఏ కాకి... కాకీక కాకికి కోక... ఆ కాకీక కాకికి కాక కోకికా కుకూకా...!?' అంటూ 'క' ప్రాసలోనూ వీరభద్రరావు తెగ నస పెడుతుంటే నవ్వని ప్రేక్షకుడు లేడంటే అతిశయోక్తి



మహాలక్ష్మి, గిరీశ్‌కర్నాడ్, కాంచన, రాజేశ్, మాళవిక



కాదేమో!

అలాగే ఎక్కువ సంతోషం గానీ, బాధగానీ కలిగితే తనకు తెలియకుండానే ఈలవేసే శ్రీలక్ష్మి ఎపిసోడ్ కూడా ప్రేక్షకులను అలరించింది.

ఈ చిత్రాన్ని తిలకించిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి.నారాయణరెడ్డి ' నారాయణశర్మ పాత్ర కోసమే గిరీశ్ కర్నాడ్ పుట్టారా అని అనిపించిందని' అభినందించారు. కన్నడ దర్శక సమ్రాట్ పుట్టణ్ణ - భారతీయ సంస్కృతిని ఇందులో జంధ్యాల పూర్తిగా ఆవిష్కరించి, సంప్రదాయ విలువలను పెంచారని ప్రశంసించారు. "ఈ చిత్రం కన్నడంలో ఫెయిలైంది. కానీ తెలుగువారు బాగా ఆదరించారు. వారి అభిరుచికీ, అభిమానానికి పులకరించిపోతూ 'నేను ఆంధ్రునిగా పుట్టలేకపోయానే' అని బాధపడుతున్నాను" అని చెప్పారు పుట్టణ్ణ.

గిరీశ్‌కర్నాడ్‌కి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం డబ్బింగ్ చెప్పడం వల్ల పువ్వుకి తావి అబ్బినట్టయింది.

సుప్రసిద్ధ కూచిపూడి నర్తకి శోభానాయుడు ఈ చిత్రాన్ని చూసి పులకించిపోయారు. "సీరియల్‌గా ప్రచురితమవుతూ వచ్చిన 'చిరుమువ్వల మరుసవ్వడి' నవలను వారం వారం

### కథాంశం

కూచిపూడి నాట్యకళను తర తరాలుగాసేవిస్తున్న వంశానికి చెందిన నారాయణశర్మ, తనకొడుకు ఆనందశర్మను కూడా నాట్యాచారుణ్ణి చేయాలని ప్రయత్నించి భంగపడతాడు. పట్టుదలతో ఓ దొమ్మరి పిల్లను చేరదీసి, భైరవి అని పేరుపెట్టి నాట్యంలో నిష్ణాతురాలిని చేస్తాడు. తనను వెలివేసిన గ్రామపెద్దల దగ్గర భైరవి వల్ల తిరిగి గౌరవస్థానం పొందుతాడు శర్మ. ఆనందం భైరవిని ప్రేమిస్తున్నాడని, పెళ్లయ్యాక ఆమెను నృత్యానికి దూరం చేద్దామనుకుంటున్నాడని విని వారి పెళ్లి ని ఆమోదించడు. చివరకు ఆనందం, భైరవి ఒక్కటి కావడంతో అది తట్టుకోలేక ప్రాణం విడుస్తాడు. శర్మ స్మృతికి గుర్తుగా ఆనందం, భైరవిలు తమ కొడుకును నాట్యకళకు అంకితం చేస్తారు.


చదివేటప్పుడు ఆ పాత్రలన్నీ రూపుదాల్చి కళ్ళముందుకొస్తే ఎంత బాగుండు అనిపించేది. 'ఆనందభైరవి' నా ఊహను నిజం చేసింది. మధురమైన అనుభూతిని కలిగించింది. నారాయణశర్మలో నాకు మా గురువుగారైన వెంపటి చినసత్యంగారు, లక్ష్మీదేవమ్మగారిలో మా గురువుగారి శ్రీమతి కనిపించారు. మాళవిక తనది కథక్ బాణీ అయినా, కూచిపూడి నృత్యాన్ని చక్కగా చేసి ఒప్పించింది' అని 'ఆనందభైరవి' గురించి ప్రత్యేకంగా ప్రశంసించారామె.

కథారచయిత కొండముది శ్రీరామచంద్రమూర్తి అయితే 'ఆనందభైరవి' చూసి తెగ పొంగిపోయారు. 'నేనిచ్చిన మట్టిముద్దను అద్భుతమైన కళాఖండంగా తీర్చిదిద్ది రంగులు వేసి అందించారు జంధ్యాల' అని ప్రస్తుతించారు.




ఈ చిత్ర శతదినోత్సవం 1984 జులై 29న మద్రాసులోని వళ్లువర్‌కొట్టమ్‌లో జరిగింది. నాటి ఆంధ్రప్రదేశ్ సమాచారశాఖ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య, ఎమ్మెస్‌రెడ్డి, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, శ్రీదేవి, కమలహాసన్, వాణీగణపతి, ప్రముఖ దర్శకుడు పుట్టణ్ణ కణగళ్, తమిళ దర్శకుడు భారతీరాజాలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

మద్రాసు కళాసాగర్ భారీ యెత్తున ఈ చిత్ర యూనిట్‌కి సత్కారసభ ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1985లో అమెరికాలోని తెలుగువారి ఆహ్వానం మేరకు అమెరికా వెళ్ళారు. జంధ్యాల దంపతులు, వీరితోబాటు, నిర్మాత శాండిల్య, సీతాదేవి, శివ, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం దంపతులు, ఎస్.పి.శైలజ, మాధవపెద్ది సురేష్ దంపతులు, ఆర్కెస్ట్రా సభ్యులు అందరూ అమెరికా వెళ్ళారు. ఈ అమెరికా పర్యటనలోనే జంధ్యాల మదిలో 'పడమటి సంధ్యారాగం' సినిమా కథ పుట్టింది.


'ఆనందభైరవి' అభినందన సభ దృశ్యం




'ఆనందభైరవి'లో శివతాండవ దృశ్యం

'ఆనందభైరవి' తెలుగుతోపాటు కన్నడంలో కూడా ఏకకాలంలో నిర్మాణమైంది. అది జంధ్యాల 10 వ చిత్రం.

నటుడు ద్వారకేశ్ నిర్మించిన ఆ చిత్రానికి కన్నడంలో రెండవ ఉత్తమ చిత్రంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం అవార్డునిచ్చింది. 31 వ ఫిలింఫేర్ అవార్డుల్లో కన్నడ 'ఆనందభైరవి' కై గిరీష్‌కర్నాడ్‌కి ఉత్తమనటుడు అవార్డు లభించింది.

అమెరికా పర్యటనలో బిజీగా వుండటం వల్ల శాండిల్య ఈ చిత్రాన్ని జాతీయ అవార్డులకు పంపడం మరచి పోయారు. లేకుంటే ఈ చిత్రం కచ్చితంగా జాతీయ అవార్డును సొంతం చేసుకునేదే !

ఈ చిత్రం పదవ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఇండియన్ పనోరమాకు ఎంపిక కాకపోయినా, ఫిలిం మార్కెటింగ్ విభాగంలో ప్రవేశాన్ని పొంది, అక్కడ జరిగిన ప్రదర్శనలతో దేశ, విదేశీ ప్రతినిధులను పలువురిని విశేషంగా ఆకర్షించింది.

కూచిపూడి నృత్య వైశిష్ట్యాన్ని వివరించిన ఈ సినిమా చివర 'శుభం' కార్డుకు బదులు 'నృత్యాంజలి' అని వేయడం సముచితం, సమయోచితం.



## పాటలు

**1. సుడిగాలిలోన దీపం**
అభినయం: జిత్‌మోహన్‌మిత్రా, కాకినాడ శ్యామల, బేబి కవిత, మాస్టర్ హరీశ్ తదితరులు

**2. పిలిచిన మురళికి వలచిన మువ్వకి**
అభినయం: రాజేశ్, మాళవిక, బేబి కవిత, మాస్టర్ హరీశ్

**3. బ్రహ్మాంజలి తాండవనృత్యప్రస్థమ్**
అభినయం : గిరీశ్ కర్నాడ్, బేబి కవిత

**4. చైత్రము కుసుమాంజలి**
అభినయం: గిరీశ్ కర్నాడ్, బేబి కవిత, పుచ్చా పూర్ణానందం, మాళవిక

**5. కొలువైతివా రంగసాయి**
అభినయం : గిరీశ్‌కర్నాడ్, మాళవిక, రాజేశ్, కాంచన, పుచ్చాపూర్ణానందం తదితరులు

**6. రా...రా..రా..రాగమై**
అభినయం : రాజేశ్, మాళవిక, గిరీశ్‌కర్నాడ్, కాంచన, మహాలక్ష్మి, శుభాకర్ తదితరులు

## 'ఆనంద భైరవి' సినిమాలో వీరభద్రరావు పాత్రకి జంధ్యాల రాసిన సంభాషణలలో మెచ్చుతునకలు

★ ...మింగినట్టున్నావు ఆవకాయతో కొండంత వాయ

★ ఆవకాయలో వేడుంటుంది. ఆ వేడి నాలాంటి వాడిగల వైద్యునికి నాడిలో తెలుస్తుందిరా... బోడి!

★ కోడలేదంటే గోడలకేసి, నీడలకేసి చూస్తావేరా, ఊడల జుట్టు వెధవా...

★ మనకా ఈలల గోల యేల!? ఈ ఈలన్నది ఇలలో కలలో మన ఇంటా వంటా లేని విద్యయే.

★ గుండుగి క్రింద పడ్డ అప్పడంలా గుండె చితికిపోయింది కదమ్మా. ఒరె కుంకాక్షీ ... ఇహ నుంచి క్షమించమనీ అదీ మీ ఆవిడను అడక్కు ఆ సంబరంలో మళ్లీ ఈల కొట్టిందంటే ఈ గుండెకు ఆ ఈల జోలవుతుంది.

★ ఇప్పుడే బుర్రలో ఓ మెరుపు మెరిసిందిరా. కొత్త ప్రాస కనిపెట్టాను. 'క'తో ఇస్తా... ఏ కాకి... కాకీక కాకికి కోక... అకాకీక కాకికి కాక కోకికా కుక్కకా...!? ఇందులో 24 'క' లున్నాయి ఎలా ఉంది?

★ పోనీ ఇంకోటి ఇస్తా... 'న' మీద...!
నాని నాని... నీనూనె నీనూనె నానూనె నానూనె... నేనై నేను నీనూనె నా నూనేనని, నా నూనె నీనూనేనని నిన్న నేనన్నానా... నోనో... నేనన్నానా నున్నని నాన్నా... నైనైనై.
ఇందులో 56 'న'లున్నాయి. లెక్క చూసుకో కావాలంటే.

★ ఏరా గస్తీ గుమాస్తాలా చంకన సర్టిఫికెట్ల బస్తాతో బస్తీ అంతా గస్తీ తిరిగొస్తున్నట్టున్నావ్.

★ అయ్యా... సర్వేశ్వర శాస్త్రిగారూ. మీ సిగ్గు బొగ్గులవ్వ... ఆ రోజు శర్మగారి మీద నెగ్గిన గర్వంతో దిగ్గున లేచి భగ్గున మండి పడ్డారు కదా!? ఈ రోజు నిగ్గు తేలిన ప్రభతో, ప్రతిభతో ఈ మల్లెమొగ్గ నెగ్గింది. మీ బుగ్గ వాచేలా జవాబు చెప్పింది. ఇక మీరు తగ్గేసి, మాటకు తల ఒగ్గేసి ఊరంతా ముగ్గేసి శర్మగారిని సన్మానించండి. ఆ తర్వాత మీకు సిగ్గనిపిస్తే... ఆ దగ్గు ఆపేసి నా దగ్గరకు రండి ఓ ఉగ్గు గిన్నెడు మందిస్తాను, జగ్గు నీళ్ళు కలిపి, ఉగ్గు తాగినట్టు తాగి, రగ్గు కప్పుకుని పడుకుందురుగాని. ఇప్పుడు ఆయన కాళ్ళు కడగండి, చేతికి కంకణం తొడగండి.

★ మొక్కుబడికి బుక్కులెన్ని చదివినా బక్కచిక్కిన కుక్కగొడుగు మొక్కలా... చెదలు కొట్టేసిన చెక్కముక్కలా... కుక్క పీకేసిన పిచ్చి మొక్కలా బిక్క మొహం వేసుకుని... వక్క నోట్లో కుక్కుతూ బొక్కుతూ డెక్కుతూ చుక్కలు లెక్కపెడుతూ... ఇక్కడే ఈ ఉక్కలో గుక్కపెట్టి ఏడుస్తూ... ఈ చుక్కల చొక్కా వేసుకుని డొక్కు వెధవలా గోళ్ళు చెక్కుకుంటూ నక్క పీనుగులా చక్కిలాలు తింటూ... అరటి తొక్కలా... ముంగిట్లో తుక్కులా... చిక్కు జుట్టు వేసుకుని... ముక్కు పొడి పీలుస్తూ... కోపం కక్కుతూ... పెళ్ళాన్ని రక్కుతూ... పెక్కు దిక్కుమాలిన పనులు చేస్తూ... ఏ రెక్కలు తెగిన అక్కుపక్షిలా నక్కి నక్కి ఈ చెక్కబల్ల మీద బక్కచిక్కి ఇలా పడుకోకపోతే... ఏ పక్కకో ఓ పక్కకు వెళ్ళి... పిక్కబలం కొద్ది తిరిగి... నీ డొక్కశుద్ధితో వాళ్ళని ధక్కాముక్కీలు తినిపించి... నీ లక్కు పరీక్షించుకుని ఒక్క చక్కటి ఉద్యోగం చిక్కించుకొని ఒక్క చిక్కటి అడ్వాన్సు చెక్కు చెక్కుచెదరకుండా పుచ్చుకుని తీసుకురావచ్చు కదరా తిక్క సన్నాసి... ఇందులో 56 'క్క'లు ఉన్నాయి తెలుసా.



# 11




విడుదల : 1984
నిర్మాణప్రాంతాలు: మద్రాసు, ఊటీ

### తారాగణం

రావుగోపాలరావు, చంద్రమోహన్, పొట్టి ప్రసాద్, రావికొండలరావు తదితరులు

### సాంకేతిక బృందం

| | |
|---|---|
| పాటలు | : వేటూరి |
| సంగీతం | : రమేశ్ నాయుడు |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : లోక్‌సింగ్ |
| ఎడిటింగ్ | : గౌతంరాజు |
| కో–డైరెక్టర్ | : యు.వి.పాణి |
| నిర్మాణసారథి | : జయకృష్ణ |
| నిర్మాత | : కేశవరావు |
| రచన- దర్శకత్వం | : జంధ్యాల |

12

# పుత్తడిబొమ్మ





### కథాంశం

రంగురంగుల గాజులమ్ముకుంటూ ఊరికి ఉపకారిగా ఉండే రంగడిని ఆ ఊరి మాస్టారి కూతురు పూర్ణ ప్రేమిస్తుంది. అతనికి తన ప్రేమను ఎన్ని విధాల వ్యక్తపరిచినా అతను అర్థం చేసుకోడు. పైగా ఆమెకి మంచి కుర్రాడితో పెళ్లి కావాలని తాపత్రయ పడిపోతుంటాడు. ఆమె పెళ్లి నిలబెట్టడం కోసం తను ఇంకొకరితో పెళ్లికి ఒప్పుకుని ఆ డబ్బును ఆమెకు కట్నంగా ఇస్తాడు. పూర్ణ భర్త వీళ్లిద్దరి సంబంధాన్ని తప్పు పడతాడు. అతను చనిపోతే పూర్ణకు పెళ్లి చేయాలనుకుంటాడు రంగడు. ఇందుమూలంగా సమాజం నుండి వచ్చే అడ్డంకుల్ని ఒంటరిగా ఎదుర్కొంటాడు. చివరకు పూర్ణ ఉరిపోసుకుని చనిపోతుంది.

### సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : శ్రీ పల్లవీ ఫిలింస్ |
| పాటలు | : డాక్టర్ నెల్లుట్ల, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ |
| నేపథ్యగానం | : ఎస్.పి.బాలు, పి.సుశీల, సుత్తివేలు |
| సంగీతం | : చక్రవర్తి |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : ఓ.ప్రభాకర్ |
| ఎడిటింగ్ | : గౌతంరాజు |
| నిర్మాత | : ఎస్.వెంకటరత్నం |
| రచన- దర్శకత్వం | : జంధ్యాల |

### తారాగణం

నరేశ్, పూర్ణిమ, ముచ్చెర్ల అరుణ, సుత్తి వీరభద్రరావు, జె.వి.సోమయాజులు. సుత్తివేలు,విద్యాసాగర్, జిత్‌మోహన్‌మిత్రా, అత్తిలి లక్ష్మి, ఝాన్సీ, జానకి తదితరులు

విడుదల
1985

నిర్మాణ ప్రాంతాలు
రాజమండ్రి పరిసరాలు




13

'మనీ'తో 'మెనీ' కష్టాలుపడ్డ

# బాబాయ్ అబ్బాయ్



వీరభద్రరావు



బాలకృష్ణ

'ధనం మూలం ఇదం జగత్'
'డబ్బుకు లోకం దాసోహం'

'మనీ మేక్స్ మెనీ థింగ్స్'... ఇత్యాది సూక్తులన్నీ పెద్దల ద్వారా వందల సార్లు వినివుంటాం. డబ్బు చేసే ఇంద్రజాలాన్ని దేవుడు కూడా రాయలేని గొప్ప స్క్రీన్‌ప్లేగా అభివర్ణించాలి. అసలు (లేదా వడ్డీ) విషయానికొస్తే డబ్బు సంపాదించడంలో కష్టముందో లేదో తెలీదుగానీ, 'మనీ'ని విచ్చలవిడిగా ఖర్చు పెట్టడంలో మాత్రం మెనీ మెనీ కష్టాలున్నాయి. అవేంటో జంధ్యాల తెరకెక్కించి చూపించి మరీ మనల్ని నవ్వించారు.

మనలో కొందరికి పాతకాలం నాటి బ్లాక్ అండ్ వైట్ సినిమా 'వద్దంటే డబ్బు' గుర్తుండే వుంటుంది. ఓ మరాఠీ నాటిక ఆధారంగా రూపొందిన ఈ చిత్రాన్ని తొలి టాకీ చిత్రం 'భక్తప్రహ్లాద' ను రూపొందించిన హెచ్.యం.రెడ్డి, వై.ఆర్.స్వామి దర్శకత్వంలో నిర్మించారు. ఇందులో ఎన్‌టిఆర్, పేకేటి శివరామ్‌లు మంచి మిత్రులు. ఎన్‌టిఆర్, జానకి ప్రేమించుకుంటారు. పేదవాడయిన ఎన్‌టిఆర్‌ని తన అల్లుడిగా చేసుకోవడానికి ఇష్టపడని జానకి తండ్రి రాజనాల వరపరీక్ష పెడతాడు. అదేమిటంటే తన అల్లుడు

తన తాహతుకు తగ్గట్టుగా ఖర్చుచేయడం నేర్చుకోవాలంటూ కొంత సొమ్మునిచ్చి నిర్ణీత సమయంలోనే ఆ డబ్బుని ఖర్చు చేయాలని షరతు విధిస్తాడు. డబ్బు ఖర్చు చేయడం ఓ లెక్కా అనుకుని ఎన్టీఆర్, శివరామ్‌లు సరేనంటారు. డబ్బు ఖర్చు పెట్టేకొద్దీ వారికి రాబడి వస్తూనే ఉంటుంది. వద్దనుకున్నా వస్తున్న డబ్బు తన ప్రేమను ఎక్కడ బలితీసుకుంటుందోనని భయపడ్తాడు ఎన్.టి.ఆర్. చివరకు ఓడిపోయానని అంగీకరిస్తాడు. అతనిలోని నిజాయితీ నచ్చి రాజనాల తన కూతురునిచ్చి పెళ్ళి చేస్తాడు.

ఈ పాయింట్‌నే బేస్ చేసుకుని తనదైన శైలిలో మనసారా హాయిగా నవ్వుకునేలా ప్రేక్షకుల ముందుంచారు జంధ్యాల. ప్రముఖ కార్టూనిస్ట్ జయదేవ్ క్రియేట్ చేసిన కార్టూన్ సీరీస్‌ల్లో ఒకటైన 'బాబాయ్ - అబ్బాయ్' ఆ రోజుల్లో బాగా పాపులర్ అయ్యింది. అదే స్ఫూర్తితో జంధ్యాల ఈ సినిమా టైటిల్ పెట్టుకున్నారు.

ఇందులో 'అబ్బాయ్' అని పిలవబడే బాలకృష్ణ పాత్ర పేరు బాలసుబ్రహ్మణ్యం. ఈ అబ్బాయ్‌గారు పెళ్ళికాని బ్రహ్మచారి అయితే, ఆ బాబాయ్‌గారు.. అదేనండి మన సుత్తి వీరభద్రరావు పెళ్ళయిన బ్రహ్మచారి.

## పాటలు

రచన : వేటూరి సుందరరామమూర్తి

**లేడి లేడి**

అభినయం :బాలకృష్ణ, వీరభద్రరావు, కోట శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, రాళ్ళపల్లి, నిర్మలమ్మ, పావలా శ్యామల, జిత్ మోహన్‌మిత్రా తదితరులు

**తెలుసా నీకు తెలుసా**

అభినయం : బాలకృష్ణ, అనితారెడ్డి

**నీ రూపు పారాణీ దీపం**
**కనుచూపు కళ్యాణీ రాగం**

అభినయం : బాలకృష్ణ, అనితారెడ్డి

**సొమ్ము పెంచకు బాబాయో**
**సొమ్ము సిల్లకు అబ్బాయో**

అభినయం : బాలకృష్ణ, వీరభద్రరావు

**ఓ ప్రియా ఒంటరి రాత్రిలా**

అభినయం : బాలకృష్ణ, అనితారెడ్డి

ఈ బాబాయ్ అబ్బాయ్‌లు ఒకరికొకరు బంధువులు కాదు. స్నేహితులు అంతకన్నా కాదు. అసలు వీరిద్దరి కలయిక భలే తమాషాగా జరుగుతుంది. అబ్బాయిగారు తన భవిష్యత్తు తెలుసుకుందామని చిలక జ్యోతిష్కుని ముందు కూర్చుంటే ఆ చిలక కాస్తా ఎగిరిపోతుంది. బాబాయ్‌కి కడుపులో తేడాగా అనిపించి గత్యంతరం లేని పరిస్థితుల్లో 'టు లెట్'(టాయిలెట్ కాదు) బోర్డ్ వున్న ఇంట్లో దూరి ఇంటి ఓనర్‌కి ఎక్కువ అద్దె ఆశ చూపించి నిర్విఘ్నంగా తన శంక తీర్చుకుంటాడు. అటు అబ్బాయ్‌ని చిలక జ్యోతిష్కుడు, ఇటు బాబాయ్‌ని ఇంటి ఓనరు ఫుట్‌బాల్ ఆడుకుంటున్న ఆ అశుభ సమయంలో వీళ్ళిద్దరి కలయిక జరుగుతుంది. అగ్నికి వాయువు తోడయినట్టు బాబాయ్‌కి అబ్బాయ్ జత కుదిరారు. అక్కణ్ణుంచి వీళ్ళ పొట్టపాట్లు చూస్తూంటే నవ్వి నవ్వి మనకు పొట్ట చెక్కలవుతుంది.

దారుణంగా పెరిగిపోయిన రుణానుబంధాలను తెంచుకోవడం కోసం వీళ్ళు పడే తిప్పలు చెప్పనలవి కాదు. ఉదాహరణగా ఓ తమాషా సన్నివేశం చెప్పుకుందాం. అప్పులవాళ్ళ బాధలు పడలేక బాబాయ్ ఓ ఉచిత సలహా (సలహాను ఎవరూ అప్పు ఇవ్వరు.ఇచ్చినా తీసుకోరు) పారేస్తాడు. అదేమిటంటే తాను, అబ్బాయ్ కలిసి ఓ బ్రహ్మాండమైన నాటకం ఆడేస్తారుట. జనం విరగబడి చూస్తారుట. కనకవర్షం కురిపిస్తారుట. అలా అందరి అప్పు తీర్చేస్తారుట. ఐడియా రుచిగా ఉందని రుణదాతలంతా లొట్టలేసుకుంటూ వెళ్ళిపోతారు.

ఇంతకీ ఆ నాటకం ఏమిటంటే 'సీతారామ సంగ్రామం'! 'సీతారామ జననం', 'సీతారామకళ్యాణం', 'రామాంజనేయ యుద్ధం' గురించి తెలుసుగానీ ఇదెక్కడి 'రామాయణం'రా బాబు అంటే, అదే వెరైటీ అంటాడు బాబాయ్. ఐడియా చెప్పడమే కాదు సీతగా ఆడవేషం వేసుకుని వేదిక మీద 'లేడి వేట... లేడి వేట...' అంటూ తెగ హొయలొలకబోస్తాడు. అబ్బాయ్ రాముడు వేషం వేస్తాడు. ఈ సీతారామ సంగ్రామానికి జనం కురిపించింది కనకవర్షం కాదు రాళ్ళవర్షం...! 'తరై-నా తరై' అనేది ఇందులో వీరభద్రరావు ఊతపదం. 'తరై' అంటే అరవంలో 'ఇస్తా' అని అర్థం. 'నా' అంటే నేను.



## పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| అబ్బాయ్(బాల) | : బాలకృష్ణ |
| కృష్ణవేణి | : అనితారెడ్డి (నూతన పరిచయం) |
| బాబాయ్ | : వీరభద్రరావు |
| ప్రసాదరావు | : వేలు |
| గోదావరి | : నిర్మలమ్మ |
| ప్రసాదరావు భార్య | : రాధాకుమారి |
| అరుణ | : శ్రీలక్ష్మి |
| అరుణతల్లి | : కాకినాడ శ్యామల |
| సుందరి | : శ్యామలా(పావలా) |
| టాక్సీడ్రైవర్ | : రాజేంద్రప్రసాద్ |
| కుక్కుటేశ్వరరావు | : పొట్టిప్రసాద్ |
| జంబులింగం | : సత్తిబాబు |
| సర్వర్ | : థమ్ |
| సర్వర్‌టీమ్ | : కె.కె.శర్మ, చిట్టిబాబు, విన్నకోట విజయరామ్ |
| అప్పులవాడు | : జిత్‌మోహన్ మిత్రా |
| 'చేతిలో చిప్ప'ప్రేక్షకుడు | : చిడతల అప్పారావు |
| ఎస్.ఐ.శ్యామసుందర్ (అకితాబ్‌బుచ్చన్) | : ప్రసాదరావు (వైజాగ్) |
| ఛోటా (వస్తాద్) | : రాజు |
| సేట్‌జీ | : కోట శ్రీనివాసరావు |

మరియు

రాంబాబు, రావూజీ, మల్లాది, భాను, గణేశ్వరరావు, ప్రకాశరావు, తాతబాబు, రాజు (మాస్టర్), వీరభద్రరావు, డా॥ దివాకర్, వేణు గోపరాజు, ప్రసాద్ (బాబు)

ఈ 'బాబాయ్ అబ్బాయ్'లకి అప్పులిచ్చి వసూళ్ళ కోసం నానా తిప్పలు పడే బ్యాచ్‌లో జిత్‌మోహన్ మిత్రాతో పాటు శ్రీనివాసరావు అనే కొత్త ఆర్టిస్ట్ కనిపిస్తారు. రెండు, మూడు సీన్లు గమనించగానే అతగాడు ఎవరో ఇప్పటి ప్రేక్షకులు ఇట్టే గుర్తుపట్టేస్తారు. ఆయనే ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు. ఈ సినిమా టైటిల్స్ లో ఆయన పేరు శ్రీనివాసరావు అని వుంటుందే తప్ప కోట అని వుండదు.

కోటతోపాటు మరో ఇద్దరు సుప్రసిద్ధ నటులు కూడా మీకిందులో కనిపిస్తారు. ఒకరేమో రాజేంద్రప్రసాద్, ఇంకొకరేమో వైజాగ్ ప్రసాద్.

'నువ్వు-నేను'- చిత్రం ద్వారా ప్రతినాయకుడిగా మంచి ప్రాచుర్యం పొందిన వైజాగ్ ప్రసాద్ ఇందులో 'అకితాబ్ బుచ్చన్'గా కామెడీని వండించే ఎన్.ఐ.గా కనిపిస్తారు. నటునిగా వైజాగ్ ప్రసాద్‌కిదే తొలిచిత్రం. హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో కంప్యూటర్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఈయన అనుకోకుండా ఈ సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. ఈ సినిమా గురించి ఆయన్ని కదిపితే బోలెడన్ని ముచ్చట్లు చెప్పుకొచ్చారు -

"నేను మొదట నాటకప్రియుణ్ణి. ఒకే రంగస్థలం మీద నేను, జంధ్యాలగారు పోటాపోటీగా నాటకాలు ప్రదర్శించేవాళ్లం. జంధ్యాల ట్రూపు 'సంధ్యారాగంలో శంఖారావం' నాటకం, 'బహుకృత వేషం' నాటిక ప్రదర్శిస్తే, మా 'విజయ భారతి నటసమాఖ్య' వాళ్లు 'గరీబీ హఠావో' నాటిక , 'మనసున్న మనిషి' నాటకం వేసేవాళ్లం. అలా మా ఇద్దరికీ పరిచయం ఉంది.

"'బాబాయ్ అబ్బాయ్' సినిమా తీస్తున్నప్పుడు 'బుల్లెట్ డ్రైవింగ్' తెలిసిన మంచి పర్సనాలిటీ వున్న ఆర్టిస్ట్ కావాలని ఎంక్వైరీ చేశారు జంధ్యాల. ఆయనకి సన్నిహితుడైన బాబన్న నన్ను ఆయన దగ్గరికి తీసుకెళ్లాడు. అలా ఈ సినిమాతో నా వెండితెర యాత్ర మొదలయ్యింది. మొదటి రోజే ఎలాంటి బెరుకూ లేకుండా నటించడంతో జంధ్యాల గారి దగ్గర మంచి మార్కులు కొట్టేశాను. ఆ ఆనందంతో బుల్లెట్ మీద సిటీలోకి వెళ్తున్నాను. నా ముందు జంధ్యాల గారు కారులో వెళ్తున్నారు. చినవాల్తేరు

జంక్షన్ దగ్గర్లోని ఆర్.టి.సి.డిపో దగ్గర ఓ డ్రైవర్ సైకిల్‌మీద వస్తూ జంధ్యాల గారి కారు క్రింద పడబోయి దురదృష్టవశాత్తూ నా బుల్లెట్ కింద పడ్డాడు. వెంటనే అతను గుండెపట్టుకుని పడిపోవడంతో, నా గుండెలు జారిపోయాయి.

"ఈ యాక్సిడెంట్ చూసి జంధ్యాల గారు కారు వెనక్కి తిప్పుకుని వచ్చారు. అతణ్ని వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. ఇక తను బతకడం కష్టమే అనుకుంటున్నారు. నాకు ఒకటే వణుకు. గొంతు దాహంతో పిడచగట్టుకుపోయినా కూడా మంచినీళ్లు తాగాలనిపించలేదు. ఈ యాక్సిడెంట్ మూలంగా మధ్యాహ్నం షూటింగ్ కూడా కేన్సిల్ చేసేశారు జంధ్యాలగారు. నాలుగు గంటల సమయంలో అతను సేఫ్ అని తెలిసి నాతో పాటు యూనిట్ వాళ్లందరూ ఊపిరి పీల్చుకున్నారు. అక్కడితో ఈ కథ అయిపోలేదు. అసలు ట్విస్ట్ తర్వాత మొదలైంది.

"నేను నడిపిన బుల్లెట్ ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ది. సెలవు మీద వెళ్తూ షూటింగ్‌కిచ్చారు దాన్ని. ఎవరో పోలీస్ రిపోర్ట్ ఇవ్వడంతో పోలీసులు వేట మొదలు పెట్టారు. మూడ్రోజులు తర్వాత... నేను, బాలకృష్ణగారు, రామకృష్ణా బీచ్ దగ్గర షాట్‌గ్యాప్‌లో మాట్లాడుకుంటున్నాం. ఓ హెడ్ కానిస్టేబుల్ నా దగ్గరకొచ్చి, 'మీరేనా ఈ బండి నడిపింది' అనడిగాడు. నేను 'అవున'న్నాను. 'వెంటనే మా ఎస్సైగారిని కలవండి. కేసు తప్పించుకు తిరుగుదామనుకుంటున్నారా?' అని అతను దబాయించబోతుంటే, బాలకృష్ణ గారు అడ్డువడి, 'జరిగిందేదో జరిగిపోయింది. అతను ప్రాణాలతో బయటపడ్డాడు. హాస్పిటల్ ఖర్చులు కూడా మేమే పెట్టుకున్నాం. ఇంకెందుకీ కేసులు' అంటూ అతని మీద కోప్పడి సర్దిచెప్పి పంపించేశారు. ఇదండీ నా తొలి సినిమా తాలూకు అనుభవాల చిట్టా" అంటూ వివరించారాయన.

## సాంకేతిక బృందం

| | | |
|---|---|---|
| బ్యానర్ | : | ఉషోదయా మూవీస్ |
| సంగీతం | : | చక్రవర్తి |
| సహాయకులు | : | కృష్ణ-చక్ర |
| పాటలు | : | వేటూరి సుందరరామ్మూర్తి |
| నేపథ్యగానం | : | బాలు, జానకి. రమేశ్, అనితారెడ్డి, శ్రీనివాసచక్రవర్తి |
| ప్రొడక్షన్ మేనేజర్స్ | : | మాణిక్యం, చిరంజీవి, రాంబాబు |
| ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ | : | ఎ.పి. స్వామి, జయబాబు |
| స్టిల్స్ | : | రాజశేఖర్ |
| పబ్లిసిటీ డిజైన్స్ | : | సింధూర్ |
| పబ్లిసిటీ ఇన్‌ఛార్జ్ | : | నరసింహం |
| రికార్డ్స్ | : | సప్తస్వర్ |
| అసోసియేట్ డైరెక్టర్స్ | : | బి.ఎస్.నిష్ఠల, బత్తుల రామకృష్ణ |
| అసిస్టెంట్ డైరెక్టర్ | : | జె. పుల్లారావు |
| ప్రొడక్షన్ కంట్రోలర్ | : | వై. ప్రకాష్ |
| ఎడిటింగ్ | : | భాస్కరరాజు |
| కళ | : | భాస్కరరాజు |
| సహాయకుడు | : | రామచంద్రసింగ్ |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : | ఎస్.గోపాలరెడ్డి |
| ఆపరేటివ్ కెమెరామన్ | : | దివాకర్ |
| ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ | : | కె. కృష్ణకుమార్ రెడ్డి |
| నిర్మాత | : | ఎస్.సుధాకర్‌రెడ్డి |
| రచన - దర్శకత్వం | : | జంధ్యాల |

వైజాగ్ ప్రసాద్ పూర్తిపేరు కొర్లాం పార్వతీ వరప్రసాదరావు. ఈ సినిమా టైటిల్స్‌లో కె.పి.వి.ప్రసాదరావు అని ఉంటుంది. ఈయనకి 'వైజాగ్ ప్రసాద్' అని పేరు పెట్టింది కూడా జంధ్యాలే. 'మొగుడు పెళ్లాలు' సినిమా టైటిల్స్‌లో ఈయన పేరు అలాగే వేశారు. అయితే ఈయన 'నువ్వు -నేను' వరకూ కూడా కె.పి.వి. ప్రసాదరావు పేరునే కంటిన్యూ చేశారు గానీ, అందరూ 'వైజాగ్‌ప్రసాద్' అని పిలుస్తుండటంతో జంధ్యాలగారిని మనసులో తలుచుకుని ఇక ఆ పేరుకే ఫిక్స్ అయిపోయారు.

ఈ సినిమా నిమిత్తం ఆయన 516 రూపాయల పారితోషిక మందుకున్నారు. ఈ సినిమా తర్వాత జంధ్యాల దర్శకత్వంలో 'మొగుడు పెళ్లాలు', 'ప్రేమ ఎంత మధురం', 'అఆ ఇఈ' చిత్రాల్లో





కూడా నటించడం జరిగింది.

బాలకృష్ణ తాను సినిమా డైరెక్టర్‌నని, కొండమీద కెమెరా ఉందని, మిమ్మల్ని చిత్రీకరిస్తామని అబద్ధమాడితే నమ్మేసి, 'అకితాబ్ బుచ్చన్'గా ఊహించేసుకుంటూ బైక్ మీద కూర్చొని ఫోజు కొడుతున్న ఈ ఎస్.ఐ. శ్యామసుందర్‌ని (అకితాబ్ బుచ్చన్) చూసి, తన టాక్సీ ఆపి పలకరించిన డ్రైవర్ మరెవరో కాదు, నటుడు రాజేంద్రప్రసాద్! వేరే షూటింగ్ నిమిత్తం వైజాగ్‌లోనే ఉండటంతో సరదాగా అతనితో ఈ చిన్న పాత్ర చేయించారు జంధ్యాల. ఈ ఒక్క సీన్‌లో మాత్రమే కనబడే ఈ పాత్రకి వేరే ఎవరో డబ్బింగ్ చెప్పారు. జంధ్యాల దర్శకత్వంలో రాజేంద్రప్రసాద్ నటించిన తొలి సినిమా ఇదే. ఈ సినిమా రిలీజైన ఏడాదికే రాజేంద్రప్రసాద్ హీరోగా జంధ్యాల 'రెండురెళ్ళు ఆరు' సినిమా రూపొందించారు.

ఇందులో సుత్తివేలుది విచిత్రమైన పాత్ర. ఈయన గారు మహా బి.పి. మనిషి. ఎవరైనా ఎదురు చెప్పినా, సలహాలిచ్చినా కోపం నషాళానికి అంటుతుంది. బయటివాళ్ళ మీద తన కోపం ప్రదర్శిస్తే బాగోదు కనుక, ఛోటా అనే ఓ మోటా పర్సన్‌ని అసిస్టెంట్‌గా పెట్టుకుని అతణ్ణి చితకబాదుతూ కోపాన్ని కంట్రోల్ చేసుకుంటుంటాడు. ఈ చితకబాదుడు వ్యవహారం కూడా రోజుకి మూడుసార్లు మాత్రమే. డోసు పెరిగితే ఆ ఛోటా రివర్స్‌లో వేలుని ఉతికి ఆరేస్తుంటాడు.

చాలామందికి తెలీని విషయం ఒకటుంది. ఈ సినిమాలో 'బాబాయ్' పాత్రకి తొలుత సుత్తివేలుని అనుకున్నారు. "వరుసగా ఎక్కువ రోజులు డేట్స్ అడిగారు. నాలుగైదు సినిమాలకి కమిట్‌మెంట్స్ వున్నాయి. అలా డేట్స్ కుదరక బాబాయ్ పాత్ర చేజారిపోయింది. చివరికి వీరభద్రరావు గారు ఆ పాత్రను పోషించారు. జంధ్యాల గారికి ఆ వేషం వేయలేదని నా మీద కోపం వచ్చినట్టుంది. అందుకే ఇందులో నాకు కోపిష్టి పాత్రనిచ్చారు. ఆవేశమొస్తే కొట్టడానికి అసిస్టెంట్‌ని పెట్టారు" అని గుర్తు చేసుకున్నారు సుత్తివేలు.


వైజాగ్ సముద్రానికి ఎదురుగా వున్న 'ఓషన్‌వ్యూ ఇన్' హోటల్‌లో ప్రముఖ తారాగణమంతా మకాం చేశారు. ఈ హోటల్‌లోనే సుత్తివేలుని ఉతికి ఆరేసి దండానికి వేలాడదీసే సీన్ తీసారు. ఆ హోటల్ ఆవరణలో కొబ్బరిచెట్లు చాలా వున్నాయి. అక్కడే ఈ సీన్ తీశారు. నా వంటి నిండా నవారు చుట్టేసి చేతులకు తాళ్ళు కట్టి దండానికి వేలాడదీసారు. ఆ షాట్ చేస్తున్నంతసేపు ఏసుప్రభువులా ఫీలయ్యాను. నవారు వంటికి బిగుసుకుపోయి నేను నరకయాతన అనుభవించాను" అని చెప్పారు సుత్తివేలు ఆ సంఘటన గురించి.


సీతారాములుగా బాలకృష్ణ, వీరభద్రరావు

వేలు దగ్గర తన్నులు తినే అసిస్టెంట్‌గా నటించిన బడావ్యక్తి పేరు 'రాజు'. వైజాగ్ షిప్‌యార్డ్‌లో డ్రైవర్‌గా పనిచేసే ఇతణ్ణి అందరూ 'దిబ్బరాజు' అని ముద్దుగా పిలుచుకుంటారు. నటన మీద ఆసక్తి లేకుండానే నటుడైపోయాడు రాజు. 'ముద్దమందారం'లో ప్రదీప్, పూర్ణిమ పారిపోతూ ఓ కారు ఎక్కుతారు. ఆ కారుడ్రైవర్‌గా


కోట


వైజాగ్ ప్రసాద్


రాజేంద్రప్రసాద్


సుత్తివేలు

కీచుగొంతుతో మాట్లాడిన వ్యక్తే ఈ 'రాజు.' 'బాబాయ్ అబ్బాయ్'లో వేలు అసిస్టెంట్‌గా భారీ పర్సనాల్టీ కావాలనుకున్నప్పుడు జంధ్యాలకు ఈ రాజే గుర్తుకొచ్చాడు.

సినిమా చూస్తే చాలు ఘొల్లున ఏడుస్తూ ఇంటికి వచ్చి తల్లితో పాటు తిరిగి ఏడ్చే శ్రీలక్ష్మి ఎపిసోడ్ పగలబడి నవ్వేలా చేస్తుంది. ఓసారి శ్రీలక్ష్మి పక్క సీట్‌లో కూర్చుని సినిమా చూస్తూంటాడు వీరభద్రరావు. సినిమాలో ఎన్టీఆర్ చనిపోవడంతో సడన్‌గా లేచి ఏడ్చుకుంటూ బైటికి వెళ్ళిపోతుంది శ్రీలక్ష్మి. ఆమెని ఏదో చేసుంటాడని తప్పుగా అర్థంచేసుకుని ఇతర ప్రేక్షకులు వీరభద్రరావుని చితక బాదుతారు. అలా..అలా.. శ్రీలక్ష్మి మీద మనసు పారేసుకుని తనదాన్ని చేసుకుంటాడు వీరభద్రరావు.

శ్రీలక్ష్మి తన పాత్ర గురించి వివరిస్తూ –" సినిమా చూస్తూ సంతోషం కలిగినా, దుఃఖం వచ్చినా ఓవర్ రియాక్ట్ అయిపోయి తలుచుకుని తలుచుకుని మరీ ఏడ్చే పాత్ర నాది. నేను ఏడుస్తూ ప్రేక్షకుల్ని నవ్వించ గలగడమనేది నిజంగా కష్టసాధ్యమే. జంధ్యాల గారు సర్వసమర్థులు కాబట్టి దేన్నైనా ఈజీగా చేయించగలరు. కన్నీళ్లు రావడం కోసం గ్లిజరిన్ కళ్లలో పోసుకుని పోసుకుని చివరికి కళ్లు వాచిపోయేంత పరిస్థితి ఏర్పడింది. నిర్మాత అయితే 'గ్లిజరిన్ ఫ్యాక్టరీ కట్టించమంటారా' అంటూ చమత్కరించారు కూడా" అని చెప్పారు.

సీనియర్ నటి నిర్మలమ్మది ఈ 'బాబాయ్ అబ్బాయ్'ల ఇంటి ఓనరు పాత్ర. ఈవిడగారి ముద్దుల కూతురు సుందరిగా 'పావలా' శ్యామల కనిపిస్తారు. ఇందులో శ్యామల సీనియర్ బ్రహ్మచారిణి. 'కల్యాణం' అనే మాట వినగానే తెగ ఇదైపోతుందామె. నల్లగా ఉన్న తన కూతురి కోసం కనిపించిన ప్రతి మగాణ్ణీ 'పెళ్ళయిందా' అని నిర్మలమ్మ అడగడం, ఆవిడ అలా అడిగినప్పుడల్లా 'అమ్మా నాకు సిగ్గేస్తున్నట్టుందే' అంటూ శ్యామల వంకర్లు తిరగిపోవడం, 'అవునమ్మా దాన్ని సిగ్గనే అంటారు' అంటూ నిర్మలమ్మ కన్ఫర్మ్ చేయడం భలే కామెడీ ఎపిసోడ్.

జంధ్యాల –రచయిత ఆదివిష్ణుల అనుబంధం చాలా ప్రగాఢమైనది. సందర్భం కుదిరినప్పుడల్లా ఏదో ఒక సన్నివేశంలో ఆయన పేరుని ఇరికిస్తూంటారు జంధ్యాల. ఇందులో బాలకృష్ణ, వీరభద్రరావులు అద్దె ఎగ్గొట్టడం కోసం నిర్మలమ్మతో ఓ అబద్ధమాడతారు. నిర్మలమ్మ కూతురు శ్యామలను వీళ్ళ స్నేహితుడు తొలి చూపులోనే ప్రేమించాడట. ఆ స్నేహితుడు ఆర్.టి.సి.లో పెద్ద ఆఫీసరు. పేరేమో ఆదివిష్ణు విఘ్నేశ్వరరావు. ఇది మన రచయిత ఆదివిష్ణు పూర్తిపేరు. తన ఇంటిపేరుతోనే ఆయన



ప్రాచుర్యం పొందారన్న విషయం, ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.లో ప్రజాసంబంధాల అధికారిగా పనిచేసారన్న సంగతి చాలామందికి తెలిసిన విషయమే.

ఇలా జంధ్యాల తన మిత్రబృందం పేర్లు ఉపయోగించుకుని అప్పుడప్పుడు చిలిపిపనులు చేస్తుంటారు. తన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బత్తుల రామకృష్ణను కూడా ఆయన వదిలి పెట్టలేదు. ఇవివి సత్యనారాయణతో 'నాలుగు స్థంభాలాట' లో విధి వేషం వేయించిన జంధ్యాల, ఇందులో బత్తుల రామకృష్ణని దర్శకుడిగా చూపించారు. అదెలాగంటే – బాలకృష్ణ, వీరభద్రరావులు పాతికలక్షల్ని ఎలాగైనా ఖర్చుపెట్టే ప్రయత్నంలో 'చేతికి చిప్ప' అనే ఓ ఫ్లాప్ సినిమా కొంటారు. ఆ సినిమా వాల్‌పోస్టర్స్‌లో దర్శకుడిపేరు బత్తుల రామకృష్ణ అని వుంటుంది. గమనించండి!

ఈ 'చేతికి చిప్ప' నిర్మాతగా పొట్టిప్రసాద్ కనిపిస్తారు. సినిమా తీసి....తీసి చివరికి అమ్ముకోలేక పిచ్చివాడై పోతాడు. బాలకృష్ణ, వీరభద్రరావులని జేమ్స్‌బాండ్‌లా అనుసరిస్తూ వాళ్ళని అనవసరంగా టెన్షన్ పెడుతుంటాడు. చివరికి క్లైమాక్స్‌లో పిచ్చాసుపత్రివాళ్ళకి దొరికిపోతాడు.


పావలా శ్యామల, నిర్మలమ్మ


పొట్టిప్రసాద్


వేలు నుదండానికి ఆరేసిన దృశ్యం

బాలకృష్ణ –వీరభద్రరావుల మేనేజర్ జంబులింగంగా నత్తిబాబుది మంచి కార్టూన్‌లాంటి పాత్ర. కొంచెం గాలి వీచినా దబ్‌మని పడిపోయే సత్తిబాబు, ఒకానొక సమయంలో జబ్బర్ అనే గజదొంగ అని తెలిసాక మనకి నవ్వు ఆపుకోవడం చాలా కష్టమవుతుంది.

ఈ సినిమా షూటింగ్ సమయంలో చిన్నా, పెద్దా కలిపి సుమారు 22 యాక్సిడెంట్లు జరిగాయి. అందులో ప్రధానమైనది అనితారెడ్డి తనకారుతో బాలకృష్ణను ఢీ కొట్టడం. అనితారెడ్డికి అస్సలు కారు డ్రైవింగ్ తెలియదు. ఈ సీన్ కోసమని ఒక రోజు డ్రైవింగ్ నేర్చుకుందామె. తీరా సీన్ తీస్తున్నప్పుడు కంగారులో బ్రేక్ వేయబోయి యాక్సిలేటర్ నొక్కడంతో కారు బాలకృష్ణని బలంగా గుద్దింది. దాంతో ఆయన గాలిలో పల్టీలు కొట్టారు. కొద్దిపాటి గాయాలు తగిలాయి కూడా. ఎఫెక్టివ్‌గా ఉందని సినిమాలో ఆ సీన్‌ని అలాగే ఉంచేశారు.

ఆ యాక్సిడెంట్ సీన్‌లో బాలకృష్ణ గాయపడటం జరిగింది. ఆ విషయం తనకు ముందే తెలుసునంటారు బాలకృష్ణ. "ప్రమాదం జరిగే ముందు రోజున నా మిత్రులతో మాట్లాడుతూ నాకు ఏదో జరగబోతోంది అని అన్నాను. ఆ మిత్రులు వైజాగ్ చుట్టుపక్కల ప్రదేశాలు చూసి తిరిగి రెండవరోజు వైజాగ్




వచ్చేసరికి నేను హాస్పిటల్‌లో వున్నాను" అని అప్పట్లోనే చెప్పారు బాలకృష్ణ.

మరో సీన్‌లో కూడా అనితారెడ్డి ఇలాంటి పొరపాటే చేసింది. వైజాగ్‌లోని ఆంధ్రా యూనివర్శిటీకి ఎదురుగా గల కాలనీలో షూటింగ్ చేస్తున్నారు. కూరగాయల బండిని కారుతో డాష్ కొట్టాలి. ఇంతకుముందు ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఆమె ఈ సీన్ చేయడానికి తెగ భయపడిపోయింది. జంధ్యాల ధైర్యం చెప్పి పంపించారు. పాపం ఈ సీన్‌లో కూడా అనితారెడ్డి పొరపాటున నిజంగానే కూరగాయల బండిని గుద్దేసింది. దాంతో ఆ కూరగాయల బండి తుక్కుతుక్కయిపోయింది. ఈ సీన్‌ని కూడా జంధ్యాల రియల్‌గా సినిమాలో ఉపయోగించుకోవడం జరిగింది.

అలాగే వైజాగ్‌ప్రసాద్ చేసిన యాక్సిడెంట్ గురించి ముందే చెప్పుకున్నాం. ఇలా ఈ సినిమా యాక్సిడెంట్లు పరంగా కూడా ఆర్టిస్టులకి బాగా గుర్తుండిపోయింది.

అలాగే ఈ చిత్రం క్లయిమాక్స్‌లో బాలకృష్ణ గుర్రంమీద దౌడు తీస్తుంటారు. ఆ గుర్రం వైజాగ్‌లో సుప్రసిద్ధులైన వైద్యులు సదాశివరావుది. బీచ్‌రోడ్డులో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. గుర్రం ఒకవైపుకి వెళ్తుంటే, బాలకృష్ణ మరో వైపుకి కళ్లెం విదిల్చారు. దాంతో పట్టు తప్పి అటు గుర్రం, ఇటు బాలకృష్ణ పడిపోయారు. చిన్న పాటి దెబ్బలతో గండం తప్పిపోయింది.

ఇక ఈ చిత్రం హీరోయిన్ అనితారెడ్డి గాయనిగా తొలుత పరిశ్రమకు పరిచయం అయింది. మొదట్లో ప్రఖ్యాత గాయకుడు జేసుదాసుతో కలిసి పాట కచ్చేరీల్లో పాల్గొని ఆ తర్వాత పాప్ సింగర్‌గానూ, అటుపై నటిగానూ పరిచయమైంది అనితారెడ్డి. 'ఖైదీ'లో ఈమె పాడిన 'తప్పించుకోలేవు నాచేతిలో' పాట పాప్యులర్ అయింది. ఈ సినిమా కన్నా ముందే 'శ్రీవారి శోభనం' కోసం ఆమెను కథానాయికగా ఎంచుకున్నారు జంధ్యాల. అయితే మొదట రిలీజైన సినిమా మాత్రం 'బాబాయ్ అబ్బాయ్'. 1985 లో హీరో సురేశ్‌ని పెళ్ళిచేసుకుని సినిమాల్లో నటించడం మానేశారు. ఆ తర్వాత సురేష్, అనితారెడ్డి విడిపోయారనుకోండి. ఇక్కడ మనకది అప్రస్తుతం.

ఇందులో మొత్తం ఐదు పాటలున్నాయి. వేజెళ్ల డైరెక్షన్‌లో 'ఆడపిల్లలే నయం' సినిమాతో సింగర్‌గా పరిచయమైన శ్రీనివాస చక్రవర్తి(సంగీత దర్శకుడు శ్రీ పూర్తిపేరు ఇదే) 2వ పాట ఇందులోనే పాడారు. ముఖ్యంగా ఓ పాట గురించి ప్రత్యేకంగా ప్రస్తావించుకోవాలి. 'సొమ్ము పెంచకు బాబయో' పాటను మాధవపెద్ది రమేశ్, బాలు కలిసి ఆలపించారు. కొంతమందికే తెలిసిన విషయమేమిటంటే - ఈ పాటలో రమేశ్ స్వయంగా

విడుదల
8 - 2 -1985

నిర్మాణప్రాంతాలు
వైజాగ్ తదితర ప్రదేశాలు




షూటింగ్ గ్యాప్‌లో కాలక్షేపం


తన బాబాయ్ మాధవపెద్ది సత్యం గొంతును అనుకరించి, మొత్తం పాటను అదే బాణీలో పూర్తి కావించారు.

ఈ ఆసక్తికరమైన అంశం గురించిన పూర్తి వివరాలు రమేశ్ తమ్ముడైన మాధవపెద్ది సురేశ్‌నడిగితే - "అన్నయ్య రమేశ్, జంధ్యాల ఇద్దరూ ఒకటో తరగతి నుండి ఎస్.ఎస్.ఎల్.సి. దాకా క్లాస్‌మేట్స్. తర్వాత విజయవాడ ఎస్.ఆర్.ఆర్. అండ్ సి.వి.ఆర్. గవర్నమెంట్ కాలేజ్‌లో కలిసి డిగ్రీ చదువుకున్నారు. రమేశన్నయ్యకి మిమిక్రీ అంటే చాలా ఇష్టం. అవకాశం దొరికినప్పుడల్లా బాబాయ్ మాధవపెద్ది సత్యంను అనుకరిస్తుండేవాడు. ఎస్.జానకి గారితో కలిసి అమెరికా ప్రోగ్రామ్స్‌కి వెళ్లినప్పుడు అన్నయ్య, సత్యం బాబాయ్‌ని ఇమిటేట్ చేస్తూ 'వివాహభోజనంబు' మొదలైన పాటలు పాడుతుంటే అక్కడి శ్రోతలు ఉర్రూత లూగిపోయేవారట. ఇవన్నీ జంధ్యాలకు బాగా తెలుసు. అందుకే 'బాబాయ్ - అబ్బాయ్' లో ఈ పాటని ప్లాన్ చేసినప్పుడు తమాషాగా సత్యంగారి వాయిస్‌తో పాడించాలనుకున్నారు. అన్నయ్య ఈ పాట పాడుతుంటే రికార్డింగ్ టైమ్‌లోనే జంధ్యాల, బాలు, చక్రవర్తి, సుత్తి వీరభద్రరావు మహదానందపడిపోయారు. మాధవపెద్ది సత్యం గారిది విలక్షణమైన కంఠస్వరం. ఆయన్ని అనుకరించడం చాలా కష్టం. అయితే ఆయన రక్తసంబంధీకులం కాబట్టి అన్నయ్యకి ఇమిటేషన్ ఈజీ అయ్యింది. నేను గాయకుణ్ణి కాదు కానీ, అప్పుడప్పుడూ ఆయన్ని అనుకరించే ప్రయత్నం చేస్తుంటాను.

"అన్నయ్య విషయనాకి వస్తే - తను ఇలా బాబాయ్‌ని అనుకరిస్తూ సినిమాల్లో పాడడమనేది ఇదే మొదటిసారి, చివరిసారి కూడానూ. ఒకరకంగా చెప్పాలంటే అలా పాడే అవకాశం కూడా మళ్లీ రాలేదు. అన్నయ్య పాడిన ఆ పాటను బాబాయ్‌కి వినిపిస్తే 'ఎప్పుడో నేనే పాడివుంటాను' అన్నారు మతిమరుపుగా. తర్వాత నేను అసలు విషయం చెబితే 'ఆరి భడవల్లారా! ఇలా కూడా నన్ను బతకనివ్వరా" అంటూ తియ్యగా కసురుకున్నారు. బాబాయ్‌కి కూడా మిమిక్రీ అంటే చాలా ఇష్టంలెండి. ఇలా ఈ సినిమా టైటిల్‌కి తగ్గట్టుగా 'బాబాయ్' గొంతుని అనుకరిస్తూ 'అబ్బాయ్' పాడటమనేది చరిత్రలో గుర్తుపెట్టుకోదగ్గ అంశం" అంటూ ఆ వివరాలను చెప్పుకొచ్చారు మాధవపెద్ది సురేశ్.

ఉషోదయా మూవీస్ వారికిది తొలి చిత్రం. 1984 సెప్టెంబరు 7న విశాఖపట్నంలో ఈ చిత్రం

నిరాడంబరంగా ప్రారంభమైంది. ఆరోజే బాలకృష్ణ నటించిన 'మంగమ్మగారి మనవడు' విడుదలైంది. "భగవంతుడా! సక్సెస్ అయ్యేలా చూసే బాధ్యత నీదేనయ్యా" అని బాలకృష్ణ డైలాగ్ చెప్పడాన్ని ముహూర్తపు షాట్‌గా చిత్రీకరించారు. కళాదర్శకుడు భాస్కర్‌రాజు ప్రథమ క్లాప్ ఇవ్వగా, జంధ్యాల కెమెరా స్విచాన్ చేశారు. ఈ సినిమా మొత్తం వైజాగ్ చుట్టుపక్కలే తీశారు. కొన్ని బీచ్‌హౌస్ షాట్స్ మాత్రం మద్రాసులో తీశారు.



ఈ చిత్ర ప్రారంభ సమయంలో జంధ్యాల, భాస్కరరాజు, గోపాలరెడ్డి, సుధాకరరెడ్డి, బాలకృష్ణ, అనితారెడ్డి

బాలకృష్ణ -జంధ్యాల కాంబినేషన్‌లో ఇదే తొలి చిత్రం. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి 'సీతారామ కళ్యాణం' సినిమా చేశారు. 'బాబాయ్ -అబ్బాయ్' జంధ్యాలకు 12వ చిత్రం కాగా, బాలకృష్ణకు20వ చిత్రం. ఈ సినిమాలో చాలా తమాషాలు కనిపిస్తాయి. బాలకృష్ణ, వీరభద్రరావులు ఇంటి అడ్వాన్స్‌గా అరవైవేలు ఇవ్వగానే ఓనర్ ముఖంలో రంగులు మారడాన్ని జంధ్యాల చాలా తమాషాగా చిత్రీకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే వున్నాయి.

ఇలా ఫస్ట్‌ఫ్రేమ్ టూ లాస్ట్ ఫ్రేమ్ అందరూ ఎంజాయ్ చేసే విధంగా ఈ చిత్రాన్ని తనదైన శైలిలో తీర్చిదిద్దారు జంధ్యాల.

## కథాసంగ్రహం

అతివృష్టి వల్ల అనాథగా మారిన 'బాల' అనే అబ్బాయ్, అనావృష్టి వల్ల బికారిగా మారిన బాబాయ్‌లు ఆకలి పుణ్యమా అంటూ స్నేహితులుగా మారతారు. ఉద్యోగాల్లేక తిండికి నానా ఇబ్బందులు పడుతుంటారు. దాంతో జనాల్ని తెలివిగా బురిడీ కొట్టేస్తూ బ్రతికేస్తుంటారు. ఓ యాక్సిడెంట్ మూలంగా బాలకి కృష్ణవేణి అనే సంపన్నురాలితో పరిచయం అవుతుంది. ఆ పరిచయం కాస్తా ప్రణయంగా మారుతుంది. తన కూతురితో పెళ్ళి జరగాలంటే తాను పెట్టే పరీక్షలో నెగ్గాలంటాడు కృష్ణవేణి తండ్రి ప్రసాదరావు. ఓ పాతిక లక్షల్ని నెలరోజుల్లోగా దానం చెయ్యకుండా, ధ్వంసం చేయకుండా న్యాయమార్గంలో ఖర్చు పెట్టాలని షరతులు విధిస్తాడు. డబ్బు సంపాదించడం కష్టంగానీ ఖర్చుపెట్టడం ఎంతసేపు? అని పందెం ఒప్పుకుంటాడు బాల. పాతిక లక్షలు ఖర్చుపెట్టడానికి బాబాయ్, అబ్బాయ్‌లు నానా అవస్థలు పడతారు. ఎంత ఖర్చు పెడితే అంతకు రెట్టింపై తిరిగి వచ్చేస్తూ వుంటుంది. ఈలోగా దూరపు బంధువులెవరో పోయి ఆస్తి కూడా కలిసొచ్చేస్తుంది. వీటన్నిటితో బాలకు పిచ్చెక్కిపోతుంది. డబ్బుని, సౌకర్యాలని భరించలేక పోతాడు. పందెంలో ఓడిపోయానని చెప్పటానికి నిశ్చయించుకుంటాడు. అటువంటి సమయంలో ప్రసాదరావు వచ్చి 'నువ్వు మోసగాడివే అయితే నేనిచ్చిన డబ్బుతో పారిపోయేవాడివి. అలా కాకుండా సక్రమమైన మార్గంలో ఖర్చుపెట్టడానికి ప్రయత్నించావు. ఇక్కడే నువ్వు నాకు నచ్చావు. మా అమ్మాయినీ, ఆస్తినీ జాగ్రత్తగా చూసుకోగలవనే నమ్మకాన్ని నాలో కలిగించావు' అంటూ తన కూతుర్నీ, ఆస్తినీ బాల చేతిలో పెట్టేసి కథను సుఖాంతం చేస్తాడు.



## మెచ్చుతునకలు

- హోటల్ సర్వర్ :అక్కడ ఇద్దరున్నారే. ఇవన్నీ వాళ్ళకే. ఒకడు... పది గ్రామాల్ని దత్తత తీసుకుని కడుపులో దాచుకున్నట్టు, ఇంకొకడు.. కడుపులో శరణార్థుల శిబిరం పెట్టినట్టు, తెగ మేస్తున్నారు. ఏం చెప్పమంటారు నా బాధ.
- బాలకృష్ణ : బాబాయ్ ! దోసె మాత్రం మహ గొప్పగా వుంది. అదవిరాముడే అనుకో.
వీరభద్రరావు : అబ్బాయ్ ! వడ శంకరాభరణమే.
సర్వర్ : (మరిన్ని టిఫిన్ ప్లేట్లతో వస్తూ...) వేటగాడిని, కొండవీటి సింహాన్ని, ప్రేమాభిషేకాన్ని, ఖైదీనీ కూడా తెచ్చాను.
- బాలకృష్ణ : అత్తయ్యగారూ... హైదరాబాద్ నుండి ఆ మధ్య మా ఫ్రెండ్ ఒకడు ఇక్కడకు వచ్చాడు.... మీరు చూశారా...?
వీరభద్రరావు : చూశార్లేబ్బాయ్.... ముందు వాళ్లకు విషయం చెప్పేయ్...
బాలకృష్ణ : వాడు ఇక్కడకు వచ్చినప్పుడు మన సుందరిని చూశాడు.... ఊరు వెళ్లిన దగ్గర్నుండీ మంచం ఎక్కాడంట.
వీరభద్రరావు : దడుసుకుని అనుకునేరు... ప్రేమలో పడి..
శ్యామల : అమ్మో... ఏంటో నాకు సిగ్గేస్తున్నట్టుగా ఉందే...
నిర్మలమ్మ : అవునమ్మో... ఇది సిగ్గే.. నువ్ ఊరుకో....
- వీరభద్రరావు : అమ్మాయి ఫోటో ఒకటి తీసి ఇవ్వండి. వాళ్ల ఊళ్లో మంకీ ఎగ్జిబిషన్ ఒకటి జరుగుతుందట. అక్కడ కనీసం ఫోటో అయినా పెట్టాలని తాపత్రయ పడుతున్నాడు.
నిర్మలమ్మ : అలాగే బాబూ... ఇప్పుడే తీయిస్తా.
- వీరభద్రరావు : "శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజు, కళాహృదయుడు తన మహామంత్రికి 'అప్పాజీ' అని పేరు పెట్టుకున్నాడంటే... అప్పు ఎంత విలువైనదో గ్రహించండి. ఇంగ్లీష్‌లో కూడా 'డౌన్' కంటే 'అప్' ఉన్నతమైనదా, కాదా?
- వీరభద్రరావు : మిత్రులారా.... నా ఆంతరంగిక అప్పాజీల్లారా...
- వీరభద్రరావు : వద్దూ.... జాలర్ల గాలం హుక్కులాగా అలా లుక్కివ్వకు. ఇప్పటికే ఒళ్లంతా వాచింది.. అలా చూస్తే వాంతి అయ్యి లోపలకూడా పూస్తుంది.
- అనితా రెడ్డి : ఏం చేస్తుంటారు మీరు
బాలకృష్ణ : భోంచేస్తుంటాను, నిద్రపోతుంటాను.
అనితా రెడ్డి : ఇంతకి ఏం చదువుకున్నారు?
బాలకృష్ణ : కప్‌ని తిరగేస్తే మీకేం అర్థమవుతుంది.?
అనితా రెడ్డి : ఓ... పియుసి నా.
- వేలు : ఏమిటోయ్ నీ పేరు బాలా? బ్యాటా?
- సేట్ : పైకి వెళ్ళి చూద్దాం పదండి. క్షవర కళ్యాణం చేద్దాం.
శ్యామల : అమ్మో ! 'కల్యాణం' అంటున్నారే నాకు సిగ్గేస్తుంది బాబు.
- వీరభద్రరావు : అసలు మన భారతదేశానికి తల మీద మంచు కొండలు ఉండడంతో కాస్తో కూస్తో రంగు తేలతారు కానీ... అత్తయ్య గారూ... అసలు నలుపు ఎంత అందమని.... కృష్ణుడు నల్లగా ఉండడూ...
నిర్మలమ్మ : ఏమిటో... ఎండలో కూర్చోవద్దే అంటే కూర్చుంటుంది.... చిన్నప్పుడు పచ్చగా మెరిసిపోతూ ఉండేది.
వీరభద్రరావు : ఆఁ... ఏం మెరుపోలెండి... అదేమన్నా శాశ్వతమా... గాంధీ గారు తర్వాత గాంధీ గారంతటి వాడు లూథర్‌కింగ్ నల్లగా ఉండడా... ఆఫ్రికన్లు నల్లగా ఉండరా.... చింపాజీ నల్లగా ఉండదా....
నిర్మలమ్మ : మరే ఉన్నమాట అన్నావ్...నీ నోట్లో కిలో పంచదార కుక్కాలి.

**వీరభద్రరావు :** మన సుందరి గారి ఫోటో ఒకటి తీయించండి. ది బార్బేరియన్స్ అని.. ది అగ్లియస్ట్ అని అమెరికాలో రెండు పోటీలు జరుగుతాయి. మన సుందరి గారు ఫోటో పెట్టి పంపించామంటే అక్కడి జడ్జీలు దడుసుకుని చస్తారు... ప్రైజు ఇచ్చి తీరతారు...

**నిర్మలమ్మ:** బాబూ... అదెప్పుడో కాస్త కనుక్కో.

- **వీరభద్రరావు :** మీరు వైద్యుడా...?

**భూతవైద్యుడు :** అవునండీ.. భూత వైద్యుడినండీ...

**వీరభద్రరావు :** ఆహాహా... అప్పిచ్చువాడు వైద్యుడు అన్న సుమతీ శతకకారుడు ఎంత గొప్పవాడండీ.,.

**భూతవైద్యుడు :** ఇంతకీ మీరు...

**వీరభద్రరావు :** దేశభక్తి వీరభద్రాన్ని.... ఒక భారత పౌరుడిగా దేశభక్తి కలిగిఉండటం తప్పంటారా...

**భూతవైద్యుడు :** అబ్బెబ్బె... తప్పెలా అవుతుందండీ...

**వీరభద్రరావు :** అన్నారా.... అయితే దొరికిపోయారన్నమాటే... నా తరై..

**భూతవైద్యుడు :** ఆటో.. ఆపు...

**వీరభద్రరావు:** వద్దు బాబూ... మాక్కాస్త పని ఉంది నువ్వు వెళ్లు... వెళ్లు.. ఆటోలకేముందండీ.. అరక్షణానికొకటి వస్తుంది. మన భారతదేశం చేసిన పనే మనమూ చేయటం తప్పుకాదుకదా...మన దేశం అహింసను పాటిస్తే మనమూ పాటిస్తాం... మన దేశం క్రమశిక్షణ పాటిస్తే మనమూ అనుసరిస్తాం... ఇప్పుడు మన దేశం ఏం చేస్తోంది...? పరాయి దేశాలనుంచీ వీర లెవల్లో అప్పులు చేస్తోంది. ఆగండి... ఆగండి... ఈ ఏడాది ప్రపంచబ్యాంకుకు హెచ్చు మొత్తంలో బాకీ ఉన్న దేశాల్లో మొదటిది భారతదేశం అయితే రెండోది బెల్జియం. అంచేత అప్పు చేయటం తప్పు చేయటం కాదు. అసలా మాటకొస్తే అప్పు చేయటం భారతీయుడి జన్మహక్కు ప్రథమ కర్తవ్యమూనూ...

**భూతవైద్యుడు :** ఆటో.. ఆటో....

**వీరభద్రరావు :** అవును అది ఆటోయే... టాక్సీ కాదు... ఆటో నువ్వు వెళ్లు.... మీరు భూత వైద్యుడు కదా... పంచభూతాలు ఏమిటో చెప్పండి..

**భూతవైద్యుడు :** అయ్యా... పంచభూతాల సంగతి నాకు తెలియదు కానీ... ఇప్పుడు నాకు ఫాంట్ భూతం ఒక్కటే కన్పిస్తుంది.

**వీరభద్రరావు :** నీ సెన్సాఫ్ హ్యూమర్‌కి నిప్పెట్ట... బూతు జోకులు వేయకండి మాస్టారు.. అసలు పంచభూతాలు ఏమిటి? పృథివ్యాపస్తేజో వాయురాకాశః.... పృథ్వి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశం... అలా అప్పు అనేది మన పవిత్ర పంచభూతాల జాబితాలో ఉంది. ఏషియాడ్‌లో మన గుర్తు గున్న ఏనుగు పేరు ఏమిటి?..... అప్పు... మన వైజాగ్‌లో ఉన్న సింహాచలం దేవుడి పేరు ఏమిటి?.... సింహాద్రి అప్పన్న ...

**భూతవైద్యుడు :** ఆటో... ఆగు.. ఇతను వెళ్లిపొమ్మంటాడు... అయినా వెళ్లొద్దు... అమ్మమ్మ... ఇంకో గంటసేపు నేను ఇక్కడే ఉంటే... నేనే వేరే భూతవైద్యుడి దగ్గరకు వెళ్లి దడుపు మంత్రం పెట్టించుకోవాల్సి ఉంటుంది. ఇదిగో నాయనా... నా దగ్గర ఉన్న మొత్తం సొమ్ము ఇచ్చేస్తున్నాను... నన్ను వదిలేయ్ ....

- **వేలు :** ఈ డబ్బుకో తమాషా గుణం ఉంది. వంద రూపాయలు ఉన్నవాడు ఖర్చుపెడితే వందా పోతుంది. అదే లక్షరూపాయలు ఉన్నవాడు ఖర్చుపెడితే ఏదో ఒక రూపంలో డబ్బు వస్తూనే ఉంటుంది.
- **వేలు :** డబ్బు పెరిగినా, జబ్బు పెరిగినా ఆ తేడా ముఖంలోనే తెలుస్తుంది.
- రేసుల్లో పెట్టిన డబ్బు... గోడకు కొట్టిన సున్నం తిరిగిరావు....
  చెట్టు పెరిగేకొలదీ గాలి తాకిడి ఎక్కువవుతుందయ్యా...
- **వీరభద్రరావు :** నా జబ్బంత లేదు... వాడు జబ్బురా!



14

# శ్రీవారి శోభనం

## కథాంశం

తొలిరాత్రే భార్యదృష్టిలో మన్మథుడి ఇమేజ్ సంపాయించుకోవాలంటే ముందుగానే ఆ అనుభవం వుంటే మంచిదనే మిత్రుల ప్రోద్బలంతో, సూచనతో, ఆలోచనలో పడతాడు హీరో. దాంతో, తన ఆఫీసులోనే పనిచేసే స్టెనోతో సంబంధం పెట్టుకుంటాడు. ఈ దశలో రకరకాల మలుపులు తిరుగుతుంది కథ. ఏదైతేనేం చివరికి ఫ్రెండ్స్ చెప్పింది అబద్ధమని తెలుసుకుంటాడు. హాయిగా భార్యతోనే నేరుగా శోభనం జరగడం ఈ కథకు ముగింపు.

విడుదల
1985
నిర్మాణప్రాంతాలు
మద్రాసు, పరిసరాలు

## తారాగణం

నరేష్, అనితారెడ్డి, మనోచిత్ర, లక్ష్మీకాంత్, వీరభద్రరావు, వేలు, శ్రీలక్ష్మి, కె.కె.శర్మ, 'సాక్షి' రంగారావు, కాకినాడ రాజరత్నం, భీమరాజు, పుచ్చా పూర్ణానందం, హేమసుందర్, జానకి, రావి కొండలరావు, రాధాకుమారి తదితరులు.


## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : రవికళామందిర్ |
| కథ | : మల్లాది వెంకటకృష్ణమూర్తి |
| పాటలు | : వేటూరి |
| సంగీతం | : రమేశ్ నాయుడు |
| గానం | : జానకి, |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : బి.కోటేశ్వరరావు |
| ఎడిటింగ్ | : గౌతంరాజు |
| అసోసియేట్స్ | : ఇ.వి.వి.సత్యనారాయణ, బత్తుల రామకృష్ణ |
| సమర్పణ | : 'సూపర్‌స్టార్' కృష్ణ |
| నిర్మాత | : ఎం.ఎస్.ప్రసాద్, ఆదుర్తి భాస్కర్ |
| రచన- దర్శకత్వం | : జంధ్యాల |

15

## కొంచెం వలపులు - కొంచెం కలహాలు

# మొగుడూ - పెళ్ళాలూ !



నరేశ్, భానుప్రియలకు సూచనలిస్తున్న జంధ్యాల

రోజా ఆర్ట్ ఫిలింస్ పతాకంపై నరేశ్, భానుప్రియ జంటగా జంధ్యాల ఈ హాస్యభరిత చిత్రాన్ని రూపొందించారు. టైటిల్‌ని బట్టే ఇది భార్యాభర్తలకు సంబంధించిన కథాంశమని అర్థమైపోతుంది. అయితే దర్శకుడు జంధ్యాల కాబట్టి ఈ భార్యభర్తల మధ్య నవ్వులు రాజ్యమేలుతాయని పసిగట్టేయొచ్చు.

జనవరి 9 ఉదయం 10 గంటలకు విశాఖపట్నం రామకృష్ణ బీచ్ సమీపంలోని ఆంధ్ర సిమెంట్ కంపెనీ గెస్ట్‌హౌస్‌లో తొలిషాట్ తీయడం జరిగింది. శ్రీ వెంకటేశ్వరస్వామికి నమస్కరిస్తున్న నరేష్ పై తొలిషాట్‌కి శ్రీరామా ఫైనాన్స్ కార్పొరేషన్ అధినేత సి.వి.రామస్వామి తొలి క్లాప్ కొట్టగా, నాటి జిల్లా ఎస్.పి. వి.రామచంద్రయ్య కెమెరా స్విచాన్ చేశారు.



ఇందులో మొత్తం అయిదు పాటలు ఉన్నాయి. రెండు పాటల్ని అరకు లోయలోనూ, మూడు పాటల్ని విశాఖ పరిసరాల్లోనూ చిత్రీకరించారు. జంధ్యాల - రమేశ్‌నాయుడు కలయికలో ఇది పదో చిత్రం. పాటలన్నీ ఇప్పటికీ గుర్తుపెట్టుకునే విధంగానే ఉంటాయి. ముఖ్యంగా 'నువ్వు కాటుక దిద్దకపోతే..' పాట బాగా ప్రాచుర్యం పొందింది.

జంధ్యాల దర్శకత్వంలో భానుప్రియ తొలిసారిగా ఇందులో నటించారు. ఆమెకు గాయని శైలజ గాత్రదానం చేశారు. భానుప్రియకు ఈ తరహా చిత్రం సరికొత్త అనుభవం.

ఈ సినిమా ప్రారంభమే ప్రేక్షకుడికి స్వీట్ షాక్ ఇస్తుంది. అది 2085వ సంవత్సరం జనవరి నెల. పెళ్ళి చూపులు జరుగుతుంటాయి. వచ్చిన గెస్ట్‌లని 'బీర్ తీసుకుంటారా?' అనడుగుతాడు నరేశ్ నాన్న. ఆ తర్వాత నరేశ్ సిగ్గుపడుతూ పెళ్ళి కూతురు ముందు కూర్చుంటాడు. వాళ్ళు నరేశ్‌ని ఇంటర్వ్యూ చేస్తారు. ఇలా సాగే ఈ ఎపిసోడ్‌ని చూస్తుంటే 'జంబలకిడిపంబ' సినిమా గుర్తుకొస్తుంది. ఈ విషయమై ఇ.వి.వి. సత్యనారాయణను ఆరా తీస్తే "నేను అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలోనే చాలా కథలు తయారు చేసుకునేవాడ్ని. 'ఆమె', 'జంబలకిడిపంబ', 'అప్పుల అప్పారావు' మొదలైన సినిమా కథలు అప్పుడే రాసుకున్నాను. 'జంబలకిడిపంబ' స్క్రిప్టును

### పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| చిట్టిబాబు | : నరేశ్ |
| సరోజ | : భానుప్రియ |
| హనుమంతరావు | : సుత్తి వీరభద్రరావు |
| పంకజాక్షి | : కాకినాడ శ్యామల |
| ఉత్తర | : శ్రీలక్ష్మి |
| దక్షిణామూర్తి | : 'శుభలేఖ' సుధాకర్ |
| వాసు మాస్టారు | : 'సాక్షి' రంగారావ్ |
| అనసూయ | : డబ్బింగ్ జానకి |
| నారాయణరావు | : నారాయణరావు |
| ప్రేమ | : మహీజ |
| రవి | : రవి |
| మేనేజర్ | : ప్రసాదరావు |
| యస్.కె. వల్లభరావు | : సుత్తివేలు |

**మరియు**

రామలింగేశ్వరస్వామి, స్వామి, చిరంజీవి పాండురంగ దత్త, సౌమ్య , పావలా శ్యామల.

| | |
|---|---|
| విడుదల | : 1985 |
| నిర్మాణ ప్రాంతాలు | : విశాఖపట్నం, అరకులోయ పరిసరాలు |



భానుప్రియ, నరేశ్, ఇ.వి.వి., యు.వి.పాణి, జంధ్యాల

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : రోజా ఆర్ట్ ఫిలింస్ |
| కథ | : జంధ్యాల - తంబు |
| సంగీతం | : రమేశ్‌నాయుడు |
| పాటలు | : వేటూరి |
| డాన్స్ | : శేషు |
| ఫోటోగ్రఫీ | : ఒ. ప్రభాకర్ |
| ఆర్ట్ | : భాస్కరరాజు |
| ఎడిటింగ్ | : గౌతంరాజు |
| ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ | : డి. యోగానంద్ |
| అసోసియేట్ డైరెక్టర్ | : ఈదర సత్యనారాయణ |
| కో - డైరెక్టర్ | : యు. వి. పాణి |
| నిర్మాత | : కె. శివరామరాజు |
| రచన-దర్శకత్వం | : జంధ్యాల |

నరేశ్



డైలాగులుతో సహా రెడీ చేసుకుని జంధ్యాలగారికి ఇచ్చి అభిప్రాయం చెప్పమన్నాను. ఆయన చదివి 'కాన్సెప్ట్ చాలా బాగుంది సత్యం, అయితే సినిమా తీస్తే రిస్క్ అవుతుందేమో! నాలుగైదు సీన్లు వరకైతే బాగుంటుంది' అని అన్నారు. మూడు నెలలు గడిచాక 'మొగుడూ-పెళ్లాలూ!' సినిమా షూటింగ్ మొదలయింది. ఓ రోజు నన్ను పిలిచి 'జంబలకిడిపంబ'లో పెళ్లి చూపుల సీన్స్‌ను ఈ సినిమాలో వాడుకుందామనుకుంటున్నాన'ని జంధ్యాలగారు అడిగారు. నేను ఆనందంగా ఒప్పుకున్నాను. థియేటర్‌లో ఆ సీన్స్‌కు విపరీతమైన రెస్పాన్స్ లభించింది. జంధ్యాల గారు కూడా మెచ్చుకున్నారు. ఆ నమ్మకంతోనే 'జంబలకిడిపంబ'ను సినిమాగా తీయొచ్చని అప్పుడే నిశ్చయించుకోవడం జరిగింది" అని ఆ ఎపిసోడ్‌ను వివరించారు ఇ.వి.వి.

ఇందులో సుత్తి వీరభద్రరావుది విచిత్రమైన పాత్ర. కొత్త కొత్త తిట్లు కనిపెట్టి మరీ తిట్టడం ఆయనకు అలవాటు. భార్యతో నిత్యం కీచులాడుతుండే ఈయనగారు కొడుకుని కూడా అవకాశం

### కథాసంగ్రహం

నిత్యం కీచులాడుకునే పంకజాక్షి, హనుమంతరావుల సుపుత్రుడైన చిట్టిబాబుకి పెళ్ళిమీద మోజు కలుగుతుంది. తనకు కళ్యాణయోగం కలగడానికి నానా తిప్పలు పడుతుంటాడు. గోద్రేజ్ ఫేస్ పౌడర్ సేల్స్ రిప్రజెంటివ్ అయిన సరోజను తొలిపరిచయంలోనే ఇష్టపడతాడు. చివరకెలాగైతేనేం ఆమెను పెళ్ళాడతాడు. వీళ్ళ తొలిరాత్రి రోజునే పంకజాక్షి చనిపోతుంది. చిట్టిబాబుకి ఎరువుల కంపెనీలో ఉద్యోగం దొరుకుతుంది. సరోజకి దైవభక్తి ఎక్కువ. ఒక్క బుధవారం మినహా అన్ని రోజులూ ఏదో ఒక పూజలు, వ్రతాలు చేస్తూనే వుంటుంది. తీరా వీళ్ళు బుధవారం కలవడానికి ఏదో ఒక అడ్డంకి. హనుమంతరావు కూడా కాలం చేస్తాడు. చిట్టిబాబు, సరోజలకు మగబిడ్డ పుడతాడు. పిల్లాడొచ్చాక భార్య తన మీద శ్రద్ధ చూపడంలేదని అసంతృప్తితో మండిపడిపోతుంటాడు చిట్టిబాబు. తన ఆఫీసు ప్యూను వల్లభరావు హితబోధ విని స్టెనో ప్రేమతో రాసుకు పూసుకు తిరుగుతున్నట్టు నటించి సరోజలో అసూయ రగిలేట్టు చేయాలనుకుంటాడు చిట్టిబాబు. ఇలా ఈ మొగుడు పెళ్ళాల కీచులాట పెరిగి పెద్దదై చివరికి ఎలా ఇద్దరినీ దగ్గరకు చేసిందన్నది మిగిలిన కథ.



## పాటలు

1. కలిగించు కళ్యాణ యోగం మా ఇంట వెలిగించు అనురాగ దీపం – నరేశ్ తదితరులు అభినయించారు.
2. నువ్వు కాటుక దిద్దక పోతే మలిసంధ్యకు చీకటి రాదు – నరేశ్,భానుప్రియ
3. దూరం... దూరం....దూరం నన్నంటు కోవద్దు శ్రీవారు – నరేశ్,భానుప్రియ
4. జాము గడిచెను జాబిలి అడిగెను – నరేశ్,భానుప్రియ
5. ఒకే వెలుతురు ఇచ్చే రెండు పొద్దులు – నరేశ్,భానుప్రియ, సౌమ్య శ్రీలక్ష్మి, శుభలేఖసుధాకర్.



నరేశ్, జంధ్యాల

కుదిరినప్పుడల్లా తలంటు పోసేస్తుంటాడు. వీరభద్రరావు తిట్టే కొత్త తిట్లు ఏమిటంటే లసతోమా పినాకి, విక్కియో టపా, తింగినా సుహ... ఇలా రాసుకుంటే పోతే చాలా పెద్ద లిస్టే అవుతుంది. అయితే వీటి అర్థం తిట్టించుకున్న వాళ్లకు తెలీదు, తిట్టినాయనకి అస్సలు తెలీదు.

ఇక శ్రీలక్ష్మి, 'శుభలేఖ' సుధాకర్‌లది చిత్రమైన దాంపత్యం. రెండు చీరలకి ఒక స్టీలుగ్లాసు ఫ్రీగా వస్తుందని డబ్బుని ఖర్చు పెట్టేస్తుంది శ్రీలక్ష్మి. ఉచిత వస్తువుల కోసం అవసరంలేని వస్తువులను కూడా ఎగబడి కొనేవాళ్లు మన సమాజంలో చాలామంది ఉంటారు. వాళ్ల మనస్తత్వాలకి దర్పణం పట్టే విధంగా ఇందులో శ్రీలక్ష్మి పాత్రను తీర్చిదిద్దడం జరిగింది. ఈమెగారి ప్రవర్తన నచ్చక సుధాకర్ విసుక్కోవడమో, గొణుక్కోవడమో చేస్తాడు. అంతే ఆవిడ వెంటనే కోపం నటించి ఖాళీ సూట్‌కేసుతో (అందులో బట్టలున్నాయని వాళ్లాయన అనుకుంటాడు) పక్కనే వున్న పుట్టింట్లో ప్రత్యక్షమైపోతుంది. మళ్ళీ సుధాకర్ బతిమాలుకుని తిరిగి తన ఇంటికి తీసుకువస్తుంటాడు.


'బాబాయ్ అబ్బాయ్' లో అకితాబ్ బుచ్చన్ పాత్రతో తొలిసారిగా వైజాగ్ ప్రసాద్‌ని తెలుగు తెరకు పరిచయం చేసిన జంధ్యాల, అతని ప్రతిభను గుర్తించి ఆ సినిమా రిలీజ్ కాకుండానే 'మొగుడూ-పెళ్ళాలు'లో అవకాశమిచ్చారు. నరేశ్, వేలు పనిచేసే ఆఫీసు మేనేజర్‌గా ఆయన ఈ సినిమాలో కనిపిస్తారు. వైజాగ్‌లో వుండే డాక్టర్ తంబుతో కలిసి జంధ్యాల ఈ కథను అల్లడం జరిగింది.

నటీనటుల ఎంపిక, వారి పాత్ర పోషణ వారికి తగ్గట్టుగా సంభాషణా, సన్నివేశాల రచన సినిమాకు సమపాళ్లలో కుదిరాయి. కొంచెం వలపులు, మరికొంచెం కలహాలతో కలగలిసి నవ్వుల రహదారిలో నడిచిన ఈ 'మొగుడూ-పెళ్లాలూ!' అందరినీ ఆకట్టుకున్నారు.

16

'బామ్మ' కలాపం చేసిన

# ముద్దుల మనవరాలు



సుహాసిని, భానుమతి

దర్శకుడిగా జంధ్యాలలోని సరికొత్త కోణాన్ని ఆవిష్కరించిన చిత్రమిది. ఓ బామ్మ - మనవరాలికి సంబంధించిన కథ ఇది. చేదుమాత్రలాంటి సెంటిమెంట్ కథ అయినప్పటికీ జంధ్యాల తనదైన శైలిలో కామెడీ కోటింగ్ ఇచ్చారు. మోహన్‌లాల్, నదియాతో ఫాజిల్ రూపొందించిన ఓ మలయాళ చిత్రం ఈ 'ముద్దుల మనవరాలు'కు మాతృక.

జంధ్యాల దర్శకత్వంలో బహుముఖ ప్రజ్ఞాశాలి భానుమతి రామకృష్ణ నటించిన ఏకైక చిత్రమిది. ఇందులో శాంతమ్మ పాత్రకి నిండుదనం తీసుకొచ్చారామె. మనవరాలి మీద ఆమె చూపే ఆపేక్ష, కనబరిచే చిరుకోపం, మనవరాలి కోసం ఆమె పడ్డ క్షోభ వర్ణనాతీతం. మనక్కూడా ఇలాంటి అమ్మమ్మ ఉంటే బాగుండునన్న ఫీలింగ్ కొంతమందికైనా కలగడం సహజం. జంధ్యాల కేవలం భానుమతి కోసమే ఈ పాత్రను సృష్టించారేమోననిపిస్తుంది కూడా. ఇందులో శాంతమ్మగా జీవించిన భానుమతి పైకి గయ్యాళిలా మాట కరుకుగా కనిపించినా, మనసు మాత్రం చెరకు.

తన మనవరాలి రోగం సంగతి తెలిసిన తర్వాత వచ్చే దృశ్యాలు మనసుని కదిలిస్తాయి. ముఖ్యంగా పతాక సన్నివేశాల్లో భానుమతి అభినయం గుండెను పిండేస్తుంది. మృత్యువుకు దగ్గరైన మనవరాలికి నిద్రమాత్రలిచ్చి నిద్రపుచ్చి తనే అంబులెన్స్‌లో సిటీకి సాగనంపుతుంది. మనవరాలు సంపూర్ణారోగ్యంతో తిరిగి వస్తుందన్న నమ్మకంతో అంతకు ముందు మనవరాలు వచ్చిన ఆనందంలో విప్పదీసిన కాలింగ్‌బెల్‌ని మళ్లీ బిగిస్తుంది.

మనసుని తేలికపరిచే కామెడీలో తానెంత స్పెషలిస్టో, మనసుని బరువెక్కించే సెంటిమెంట్ సీన్స్ తీయడంలో కూడా తాను నేర్పరినని జంధ్యాల 'ముద్దుల మనవరాలు' లోని పతాక సన్నివేశాలతో నిరూపించారు. మనవరాలు మళ్లీ వస్తుందనే ఆశిద్దామంటూ ప్రేక్షకుడిని బరువైన మనసుతో థియేటర్‌నుండి సాగనంపుతారు జంధ్యాల.

ముఖ్యంగా భానుమతి - సుహాసిని - శరత్‌బాబుల మధ్య నడిచే డ్రామా ఎలాంటి వారికైనా కన్నీళ్లు తెప్పిస్తాయి.

ఇక మనరాలు విషయానికి వస్తే - ఇందులో సుహాసిని మహా అల్లరి పిల్ల. గుళ్లో తారసపడ్డ సుత్తివేలుని కన్ను కొట్టి మరీ పలకరిస్తుంది. 'ఏం చదువుతున్నావ్?', 'ఎన్నాళ్లు ఉంటారు?'.. ఇలా సుత్తివేలు ప్రశ్నలడిగిన ప్రతిసారీ కన్ను కొడుతూనే రిప్లయ్ ఇస్తుంది. అలాగే తమ పక్కింట్లో ఉండే చంద్రమోహన్‌కి తానే బీట్ కొడుతుంది. ఫ్లయింగ్ కిస్‌లిస్తుంది. ఇలా నానారకాలుగా అల్లరిపెడుతూనే వుంటుంది. ఓ సీన్‌లో చంద్రమోహన్‌ని నరకయాతన

**పాత్రలు - పాత్రధారులు**

| | |
|---|---|
| శాంతమ్మ | :భానుమతి రామకృష్ణ |
| మీనాక్షి | :సుహాసిని |
| రాధ | :జయసుధ (స్పెషల్ రోల్) |
| ప్రసాద్ | :చంద్రమోహన్ |
| రాఘవ | :శరత్‌బాబు |
| శర్మ | :గుమ్మడి |
| కోదండం | :సుత్తివేలు |
| ప్రసాద్‌తల్లి | :నిర్మలమ్మ |
| బుజ్జి | :మాస్టర్ చక్రవర్తి |
| చిన్నప్పటి మీనాక్షి | :బేబి మీనా |
| సుబ్బారావు | :'శుభలేఖ' సుధాకర్ |
| రామనాధం | :సుధాకర్ |
| సీతారామయ్య | :వంకాయల |
| నిర్మలమ్మ భర్త | :పొట్టి ప్రసాద్ |
| మహాలక్ష్మి | :అత్తిలి లక్ష్మి |
| శ్రీకాంత్ | :మాస్టర్ శ్రీకాంత్ |

మరియు

థమ్, ఏచూరి, మాస్టర్ విమల్, మాస్టర్ రాజీవ్, బేబి లావణ్య



జంధ్యాల, జయసుధ, భానుమతి, సుహాసిని, జయకృష్ణ


జయసుధ, శరత్‌బాబులతో..

పెదుతుంది. తాను పెట్టుకున్న కళ్లజోడు సీత్రూ గ్లాసెస్ అని, ఎదుటివాళ్లని ఈ గ్లాసెస్‌తో చూస్తే న్యూడ్‌గా కనబడతారని సుహాసిని చెప్పడంతో చంద్రమోహన్ పడిన బాధ వర్ణనాతీతం.

ఈ సినిమా కోసం సుహాసిని మేజిక్ కూడా నేర్చుకోవడం జరిగింది. ప్రముఖ మెజీషియన్ బి.వి.పట్టాభిరాం ఆమెకు స్వయంగా మేజిక్ నేర్పించారు. 'చిలిపితనం... ఈ చిన్నతనం' పాటలో సుహాసిని కొన్ని మేజిక్ ఐటమ్స్ చేస్తుంది. ఖాళీ డబ్బాలో పావురాన్ని, పూలగుత్తుల్ని సృష్టిస్తుంది. ఇందులో సుహాసినికి మరో నటి సరిత గాత్రదానం చేశారు.

## పాటలు

1. చిలిపితనం... ఈ చిన్నతనం ఇక తిరిగిరాదు మళ్లీ
   సుహాసిని, మాస్టర్ చక్రవర్తి తదితరులు అభినయించారు
2. జగదేకపతి మేనా (కీర్తన)
   భానుమతి, జయసుధ అభినయించారు
3. అబ్బ మీరు మరినండి ఎప్పుడూ అదే గోల
   శరత్‌బాబు, జయసుధ అభినయించారు
4. అమ్మమ్మ చేవ్రాలు ఈ మనవరాలు
   భానుమతి, సుహాసిని అభినయించారు
5. కుంచెకు అందనిది కంచిపట్టు కోకమ్మ
   చంద్రమోహన్, సుహాసిని అభినయించారు
6. ఇన్నాళ్లకొచ్చింది దీపావళి తీపి
   కన్నీటి ప్రమిదల్లో కళకావళి
   భానుమతి, సుహాసిని తదితరులు అభినయించారు

సుహాసిని కేరెక్టరైజేషన్‌ని తీర్చిదిద్దడంలో జంధ్యాల సునిశితమైన ప్రతిభను కనబరిచారు. ఓ పక్క మృత్యుఘంటికలు మోగుతున్నా కూడా, అవి తన వాళ్లకి వినిపించకూడదనే ఉద్దేశ్యంతో నవ్వులతో, అల్లరితో మేనేజ్ చేస్తుంది సుహాసిని. చివరకు చివరి సీన్‌లో కూడా సుహాసిని తన అల్లరి విడిచిపెట్టదు. సుత్తివేలుని యథాప్రకారం కన్నుకొట్టి తమాషా చేస్తుంది. పాపం సుత్తివేలు కళ్లల్లో కన్నీళ్లు తన్నుకురాక ఏం చేస్తాయి?

సుహాసిని తల్లిగా, భానుమతి కూతురిగా జయసుధ స్పెషల్ రోల్ వేశారు. హీరోయిన్‌గా బిజీగా ఉన్నప్పటికీ జయసుధ ఈ ప్రత్యేక పాత్రని పోషించారు. అందుకే టైటిల్స్‌లో ఆమెకు కృతజ్ఞతలు చెబుతూ స్పెషల్ కార్డ్ వేశారు. జయసుధ తెరమీద కాసేపే కనబడ్డా కథకి ఊపు నిచ్చారు.

జయసుధకు జోడిగా శరత్‌బాబు నటించారు. జయసుధను ప్రేమించిన శరత్‌బాబు తన ప్రేమ గురించి భానుమతి దగ్గరకు చెప్పడానికి వెళ్లి నానా తిప్పలు పడతాడు. నాలిక మెలికలు పడుతుంది. కంగారులో ఏవేవో మాట్లాడేస్తుంటాడు. అతని మంచితనం నచ్చి తన కూతురునిచ్చి పెళ్లి చేయడానికి సిద్ధమవుతుంది భానుమతి.


చంద్రమోహన్, సుధాకర్, మాస్టర్ చక్రవర్తులతో..



ఆతిథ్యాల విషయంలో భానుమతిది ఓ ప్రత్యేకమైన పద్ధతి. ఎవరైనా అతిథి వస్తే చాలు... వాళ్లకి నవకాయ పిండివంటలతో ఊపిరాడకుండా చేస్తుంది. ఓసారిలాగే వారం రోజులు ఉందామని బంధువులు వస్తారు. మూడుపూట్లా ఆవిడ గారి విందు ఏర్పాట్లకు కడుపుబ్బిపోయి రెండ్రోజులకే పారిపోతారు. ఇల్లరికపుటల్లుడిగా వచ్చిన శరత్‌బాబుని కూడా ఆవిడ వదిలిపెట్టదు. సున్నుండలని, అరిశెలని చెప్పి అతని నోటికి రెస్ట్ లేకుండా చేస్తుంది.

ఇందులో గుమ్మడిది చాలా చిన్న పాత్ర అయినా, సినిమాకి కీలకమైన పాత్రే. భానుమతికి తుమ్మంటే మహా చిరాకు. ఎవరైనా తుమ్మితే చాలు పెద్దపులిలా గాండ్రించేస్తుంది. గుళ్లో పురాణపఠనం చేసే గుమ్మడికూడా ఈవిడను చూసి తుమ్మీ, తుమ్మలేక నానా ఇబ్బందులు పడిపోతాడు.


చంద్రమోహన్‌ది కూడా సినిమాలో కీలకమైన పాత్రే. సుహాసిని ఆటపట్టిస్తుంటే ఎప్పుడూ దంగైపోతుంటాడు. ఆమెను మనసులో ఆరాధిస్తూ తన ప్రేమను వ్యక్తపరిచే అవకాశం కోసం ఎదురుచూస్తుంటాడు. ఆమె చావుకు దగ్గరైందని తెలిసి ఊరడిస్తాడు, బాసటగా నిలబడతాడు.

చంద్రమోహన్ తండ్రిగా, నిర్మలమ్మ భర్తగా పొట్టిప్రసాద్ అతిథి పాత్రలో కనిపిస్తారు. నిర్మలమ్మకి బస్కీలంటే ఇష్టం. భర్తని పట్టుబట్టి ప్రాణం తీసి రోజంతా బస్కీలు తీయిస్తూనే ఉంటుంది. దాంతో పొట్టి ప్రసాద్ నీరసించి పోతాడు. చంద్రమోహన్‌క్కూడా ఆ బాధ తప్పదు. రోజు 'బస్కీమే సవాల్' అని అనుకుంటూనే బస్కీలు తీస్తుంటాడు.

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | :ముద్దు ఆర్ట్ మూవీస్ |
| ఇంద్రజాలం | :ప్రొఫెసర్ బి.వి.పట్టాభిరామ్ |
| నేపథ్యగానం | :డా॥భానుమతి రామకృష్ణ ఎస్.పి.బాలు, పి.సుశీల, ఎస్.జానకి, ఎస్.పి.శైలజ |
| పాటలు | :వేటూరి |
| ఆర్ట్ | :దిలీప్‌సింగ్ |
| స్టిల్స్ | :గిరి |
| ఎడిటింగ్ | :గౌతంరాజు |
| సంగీతం | :ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | :హరి అనుమోలు |
| ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ | :డి.యోగానంద్ |
| డాన్స్ | :శేషు, రాజు |
| ప్రెస్ రిలేషన్స్ | :ఐ.అర్జునరావు |
| పబ్లిసిటీ డిజైన్స్ | :లంకభాస్కర్ |
| కాస్ట్యూమ్స్ | :శాయి |
| ఆపరేటివ్ కెమెరామెన్ | :ప్రసాద్ అనుమోలు |
| సంగీత సహాయకుడు | :శ్రీనివాసమూర్తి |
| అసోసియేట్ డైరెక్టర్ | :బి.ఎస్.నిష్టల |
| అసిస్టెంట్ డైరెక్టర్ | :జె.పుల్లారావు |
| కో–డైరెక్టర్ | :యు.వి.పాణి |
| నిర్మాత | :జయకృష్ణ |
| రచన–దర్శకత్వం | :జంధ్యాల |

నిర్మలమ్మది అంతా అదో తరహా. భర్తతో నానా చాకిరీలు చేయించుకుని, దొంగతనాలు చేయించి పెద్ద ఇల్లు కట్టిస్తుంది. ఇక ఆవిడ పోరు పడలేక పదేళ్ల క్రితమే ఇల్లు వదిలి పారిపోతాడు పొట్టిప్రసాద్. ఎవరైనా ఏదైనా చెపుతున్నప్పుడు 'మా ఆయన ఇలాగే చేసేవారు...' అని ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లిపోతుంది నిర్మలమ్మ.


పట్టాభిరామ్, సుహాసిని, చంద్రమోహన్,లతో..

విడుదల : 1985
నిర్మాణ ప్రాంతాలు : వైజాగ్, రాజమండ్రి

ఇక మిగతా పాత్రల విషయానికొస్తే - చంద్రమోహన్ స్నేహితుడిగా సుధాకర్ కాసేపు కనిపిస్తారు. శరత్‌బాబు తల్లితండ్రులుగా వంకాయల, అత్తిలి లక్ష్మి కనిపిస్తారు.

అప్పటి వరకూ రమేష్‌నాయుడు, రాజన్ - నాగేంద్ర, చక్రవర్తిలతో మ్యూజిక్ చేయించుకున్న జంధ్యాల 'ముద్దుల మనవరాలు'కు ముద్దులు మూటగట్టే స్వరాల్ని చేకూర్చే బాధ్యతను ప్రసిద్ధ నేపథ్యగాయకులు ఎస్.పి.బాల సుబ్రహ్మణ్యంకు అప్పగించారు. తన మీద దర్శకుడు పెట్టిన నమ్మకాన్ని బాలు వమ్ము చేయలేదు. అందువల్ల ఈ కాంబినేషన్ ఇంతటితో ఆగిపోలేదు. 'పడమటసంధ్యారాగం', 'వివాహ భోజనంబు' చిత్రాలకు కూడా ఈ జోడీ స్వరాభిషేకం గావించింది.

తనపై చిత్రీకరించే పాటలను తనే స్వయంగా పాడుకునే అలవాటు ఉన్న భానుమతి ఈ సినిమాలో 'అమ్మమ్మ చేవ్రాలు..' అనే పాటను, 'జగదేకపతి మేనా...' అనే కీర్తనను స్వయంగా ఆలపించారు.


ప్రముఖ కెమెరామన్ హరి అనుమోలు, జంధ్యాలతో కలిసి పనిచేసిన ఏకైక చిత్రమిది.

కృష్ణంరాజు," జయప్రదల పర్సనల్ మేకప్‌మ్యాన్‌గా ప్రసిద్ధిగాంచిన జయకృష్ణ ఈ చిత్రానికి నిర్మాత. ఈ సినిమాతో జయకృష్ణ - జంధ్యాల స్నేహం బాగా వృద్ధి చెందింది. ఇద్దరూ కలిసి సంయుక్తంగా జె.జె.మూవీస్ బేనర్‌ని స్థాపించుకుని 'రాగలీల', 'వివాహ భోజనంబు' చిత్రాలు నిర్మించారు.

తనకంటూ హాస్యమార్గాన్ని ఏర్పాటు చేసుకుని వరుసగా సంచలన చిత్రాలు చేసుకుంటూ వస్తోన్న జంధ్యాల సడన్‌గా రూటుమార్చి చేసిన నీట్‌ైన, ఘాటైన సెంటిమెంటు చిత్రంగా 'ముద్దుల మనవరాలు' ఓ ప్రత్యేకతను సంపాదించుకుంది.

### కథాసంగ్రహం

మిలట్రీ మేజర్‌గా పనిచేసే తన భర్త చనిపోవడంతో ఒక్కగానొక్క కూతురు రాధ మీదే ఆశలు పెట్టుకుని బతుకుతూ ఉంటుంది శాంతమ్మ. రాధ, అగ్రికల్చరల్ కాలేజీలో పనిచేసే రాఘవను ప్రేమిస్తుంది. ఇల్లరికం వస్తానంటే ఈ పెళ్లికి అభ్యంతరం లేదంటుంది శాంతమ్మ. రాధ, రాఘవల పెళ్లి జరుగుతుంది. కొన్ని రోజులు గడిచాక రాఘవ అనాథ కాడని, పెళ్లి కోసమే రాధ చెప్పిన మేరకు అబద్ధమాడాడని తెలుసుకుని కన్నీళ్ల పర్యంతమవుతుంది. అప్పట్నుంచీ కూతురు, అల్లుడు తనకిక లేరనే అనుకుంటూ ఉంటుంది. తర్వాత కూతురు గర్భవతి అని తెలుసుకుని ఆత్మాభిమానాన్ని చంపుకుని రాధను తన ఇంటికి తీసుకొస్తుంది. మీనాని కని చనిపోతుంది రాధ. మనవరాలిలోనే తన కూతుర్ని చూసుకుని మురిపెంగా పెంచుతుంటుంది శాంతమ్మ. శాంతమ్మ ఎంత బతిమిలాడినా వినకుండా కూతుర్ని తీసుకుని ఢిల్లీ వెళ్లిపోతాడు రాఘవ. కొన్నేళ్లు గడిచాక శాంతమ్మ ఇంటికి మీనా వస్తుంది. మెల్లిగా కోపాన్ని పోగొట్టి అమ్మమ్మకు బాగా దగ్గరైపోతుంది మీనా. పక్కింట్లో ఉండే ప్రసాద్‌ని అల్లరిపట్టిస్తూ ఉంటుంది మీనా. ప్రసాద్‌కి సడన్‌గా ఓ విషయం తెలుస్తుంది. మీనా బ్రెయిన్‌లో ఏదో సమస్య వచ్చి నెలరోజులకన్నా ఎక్కువ బతకదని తెలుస్తుంది. రాఘవ తన కూతుర్ని ఆపరేషన్‌కు తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తే శాంతమ్మ, రాఘవను ఇంట్లోకి కూడా రానివ్వదు. తర్వాత మనవరాలి జబ్బు విషయం తెలుసుకుని తనే దగ్గరుండి ఆపరేషన్‌కు పంపించి మనవరాలికోసం వేయికళ్లతో


సుధాకర్, జంధ్యాల



# 17

కొరింతల్ని మూరింతలు చేసే నవ్వుల గుణింతం

# రెండు రెళ్ళు ఆరు

2+2=4
2×2=4

మరి రెండు రెళ్ళు ఆరు ఎలా అవుతుందంటారు !?!

ప్రపంచం మొత్తం మీద రెండు రెళ్ళు ఎంతని ఎవరిని అడిగినా నాలుగే అని చెబుతారు.

కానీ తెలుగు సినిమా ప్రేక్షకులని మాత్రం రెండు రెళ్ళు ఎంతని అడిగితే 'ఆరు' అని చెబుతారు.

ఇది జంధ్యాల (సినిమా) మాహాత్మ్యం.

పెద్ద పీట వేసినా, చిన్న పీట వేసినా జంధ్యాల ఎప్పుడూ కొత్తదనానికే ఆహ్వానం పలుకుతారు. తెలుగు తెరపై ఆయన చేసినన్ని అల్లరి పనులు, తమాషాలు ఇంకెవరూ చేయలేదంటే అతిశయోక్తి కాదేమో. టైటిల్ కార్డ్ మొదలుకుని శుభం కార్డు వరకూ హమేషా ఏదో ఒక తమాషా చేస్తూనే ఉంటారాయన. అలాంటిదే ఈ 'రెండు రెళ్ళు ఆరు' కూడానూ.

ఇదో తమాషా ప్రేమకథ. టైటిల్ కార్డ్ నుండే జంధ్యాలమార్కు తమాషాలు మనల్ని గిలిగింతలు పెడతాయి. ఇంచుమించు చిత్రం నిండా తన మార్క్ స్పార్క్ డైలాగులు నింపారు జంధ్యాల. రెండు జంటల మధ్య మూడు జంటల కథ నడవడమే 'రెండు రెళ్ళు ఆరు' అన్నదానికి అర్థం.


రాజేంద్రప్రసాద్


ప్రీతి

ఇందులో ఏ పాత్రనూ తక్కువ చేయడానికి లేదు. రాజేంద్రప్రసాద్, రజని, చంద్రమోహన్, ప్రీతిలతో పాటు కోపం వచ్చిన ప్రతిసారి బట్టలు చింపుకునే ఐరావతం (సుత్తి వీరభద్రరావు), తన విచిత్ర గాత్రంతో సకల మానవాళినీ క్షతగాత్రుల్ని చేసే లలిత (శ్రీలక్ష్మి), గొంతు విప్పితే అరమైలు దూరం వినిపించేలా మాట్లాడే కీర్తన (ప్రీతి) మావయ్య దత్తాత్రేయులు (పి.యల్. నారాయణ), తను ఎప్పుడో మిలట్రీలో ఉండగా సైనికుల సౌకర్యార్థం నేర్చుకున్న బహుభాషా ప్రజ్ఞను ఎప్పుడూ వినిపిస్తుండే తికమకరావు (రాళ్ళపల్లి), ఒకనాటి మహానటుడు సివిస్సార్ గొంతును అనుకరించే నాటకాల రాయుడు గిరీశం (వేలు), సూపర్ స్పీడ్‌లో మాట్లాడే మధుసూధనరావు తండ్రి జగపతిరావు (సాక్షి రంగారావు), 'పిత' అని గొంతు చించుకుని అరిచే స్వామీజీ (పొట్టిప్రసాద్)... ఇలా రకరకాల పాత్రలు తెర మీద నవరసాలు చిందిస్తాయి. వీటన్నిటిలో కనీసం ఒక్క పాత్రతోనే సినిమా అంతా కామెడీ ట్రాక్ నడిపించేయొచ్చు. ఒక్కో పాత్రలో అంత సరుకుంది మరి!


రజని


చంద్రమోహన్

ప్రఖ్యాత మెజీషియన్, హిప్నాటిస్ట్ ప్రొఫెసర్ బి.వి. పట్టాభిరాం ఇందులో తన పాత్రను తానే పోషించుకోవడం ఓ ప్రత్యేకత. ఆయనను ప్రత్యక్షం గానూ, పరోక్షం గానూ ఉపయోగించుకున్న ఘనత జంధ్యాలదే. చాలామందికి తెలియని విషయం మరొకటుంది. జంధ్యాల కూడా మంచి మెజీషియన్. ఆ మోజుతోనే ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్‌తో చిన్న చిన్న మేజిక్‌లు చేయించారు. పట్టాభిరాం నటించడం గురించి, మేజిక్ గురించి మున్ముందు వివరంగా చెప్పుకుందాం.

ఇందులో రాజేంద్రప్రసాద్‌ది భలే చిలిపి పాత్ర. తన ప్రేమను పండించుకోవడం కోసం ఓ తమాషా పద్ధతిని ఎంచుకుంటాడు. సినిమా థియేటర్‌లో పరిచయమైన ప్రీతిని 'ఒకే గొడుగు క్రింద ఐదుగురు ఎలా వెళ్ళొచ్చు' అనే ప్రశ్నతో, అలాగే మరిన్ని తమాషాలతో ఆమె మనసులో విజయవంతంగా తిష్టవేసేస్తాడు.

కథానాయిక ప్రీతికి 'బాబీ' (హిందీసినిమా) అంటే ప్రాణం. 90 సార్లకు పైగానే ఆ సినిమా చూసింది. ఈ విషయంలో సెంచరీ పూర్తి చేయాలన్నది ఆమె


## పాత్రలు - పాత్రధారులు

| | |
|---|---|
| మధుసూధనరావు | : రాజేంద్రప్రసాద్ |
| సద్గుణరావు | : చంద్రమోహన్ |
| వింధ్య | : రజని |
| కీర్తన | : ప్రీతి |
| ఐరావతం | : సుత్తి వీరభద్రరావు |
| లలిత | : శ్రీలక్ష్మి |
| దత్తాత్రేయులు | : పి.యల్. నారాయణ |
| దత్తాత్రేయులు భార్య | : డబ్బింగ్ జానకి |
| గిరీశం | : సుత్తివేలు |
| తికమకరావు | : రాళ్లపల్లి |
| సర్వానందం | : పుచ్చా పూర్ణానందం |
| జగపతిరావు | : సాక్షి రంగారావు |
| స్వామీజీ | : పొట్టి ప్రసాద్ |
| వార్డెన్ | : కాకినాడ శ్యామల |
| పట్టాభిరాం | : బి.వి. పట్టాభిరాం (మెజీషియన్, హిప్నాటిస్ట్) |
| చిన్నప్పటి విఘ్నేశ్వరి | : బేబి మీనా |

మరియు

రామలింగేశ్వర రావు, ప్రకాశరావు, తాతా అప్పారావు, కె. యస్. హరిబాబు, భీమేశ్వరరావు, సిందూరి, సుందరలక్ష్మి, పద్మ, మాస్టర్ వేణు, మాస్టర్ శ్రీకాంత్.




రాజేంద్రప్రసాద్,జంధ్యాల

ఆశ. ఇలా 'బాబీ' సినిమా చూస్తున్నప్పుడే ఆమెకు రాజేంద్రప్రసాద్‌తో పరిచయం ఏర్పడుతుంది, పరిచయం కాస్తా ప్రణయంగా మారుతుంది.


ఇక సుత్తి వీరభద్రరావుది ఓ విచిత్రమైన గాథ. సంగీతమంటే చెవికోసుకునే అతగాడు సంగీతం బాగా తెలిసిన అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. కానీ పెళ్ళి చూపుల్లో మోసపోతాడు. తను చేసుకున్న శ్రీలక్ష్మికి సంగీతం అస్సలు రాదు. అందుకే నెలరోజుల్లోగా సంగీతం నేర్చుకోమని హుకుం జారీచేస్తాడు. అదే అతని కొంపముంచుతుంది. రాత్రీపగలూ తేడా లేకుండా హార్మోని పెట్టె ముందేసుకుని సంగీతశిక్షణ పేరుతో అందర్నీ శిక్షిస్తూ ఉంటుంది. ఈ శిక్ష భరించలేక వీరభద్రరావు బట్టలు కూడా చించేసుకుంటాడు.


ఆమెకు సంగీతసాధనే ప్రపంచంగా ఉండటంతో, వీరభద్రరావే వంట చేయవలసి వస్తుంది. ఈ విషయం ప్రపంచమంతా తెలిసిపోతుంది. ఆ వీధిలో అడుక్కునే ముష్టివాడు 'అయ్యా మాదాకోళం తండ్రీ' అనే అంటాడు. అప్పడాల కంపెనీల వాళ్ళు, గ్రైండర్ కంపెనీల వాళ్ళు వీరభద్రరావుకు ఫోన్లు చేస్తూ ఉంటారు. వీటితో పిచ్చెక్కిపోయి షర్టులు చించేసుకుంటాడు వీరభద్రరావు. శ్రీలక్ష్మి సంగీతం పిచ్చి ముదిరి పోవడంతో హిప్నాటిస్ట్ పట్టాభిరామ్‌ని ఆశ్రయిస్తాడు వీరభద్రరావు. ఆయన ఆమె సంగీతపు పిచ్చిని పోగొట్టి వంట బాగా చేసే విధంగా హిప్నటైజ్ చేస్తారు. అయితే వీరభద్రరావు ఆయన కివ్వాల్సిన పదిహేనువందల రూపాయిల ఫీజు ఎగ్గొట్టడంతో తిరిగి శ్రీలక్ష్మిని పూర్వ స్థితికి తీసుకొచ్చేస్తారు. హిప్నాటిజంతో కూడా కామెడీ పుట్టించగలనని ఈ ఎపిసోడ్‌తో జంధ్యాల నిరూపించారు.

**విడుదల**
1991
**నిర్మాణప్రాంతాలు**
గుడివాడ,
విజయవాడ,
వైజాగ్

రాళ్ళపల్లి విషయానికొస్తే ఆయనది బహుభాషా పాత్ర. ఒకే మాటని నాలుగైదు భాషల్లో ఉపయోగిస్తుంటాడు. ఉదాహరణకు రండి -తెలుగు, వాంగో- తమిళ్, ఆయియే -హిందీ, ప్లీజ్ కమ్ - ఇంగ్లీష్ - ఇది రాళ్ళపల్లి తరహా సంభాషణమ్.

సీనియర్ నటుడు పొట్టిప్రసాద్‌కి ఈ సినిమాలోని స్వామిజీ పాత్ర మంచి గుర్తింపుని తీసుకువచ్చింది.


వీరభద్రరావు


రాళ్లపల్లి

'పితా' అంటూ ఆయన గొంతు చించుకుని అరిచే ప్రక్రియ మనల్ని కడుపుబ్బ నవ్విస్తుంది. పొట్టిప్రసాద్ తొలి చిత్రం 'అప్పు చేసి పప్పుకూడు'. 300కి పైగా చిత్రాల్లో నటించిన ఆయనకు తన జీవితంలో బాగా నచ్చిన చిత్రాలుగా రెండే సినిమాలు చెప్పుకునే వారు. ఒకటి 'సాగర సంగమం' అయితే, మరొకటి 'రెండు రెళ్ళు ఆరు'.

జంధ్యాల సినిమాలో పర్మినెంట్ ఆర్టిస్ట్ అయిన వేలు ఇందులో గుర్తు (గొంతు)ండి పోయే పాత్ర. వేలు ఇందులో సియస్సార్ గొంతుని అనుకరించడం వెనుక చాలా పెద్ద కథే వుంది. అదేమిటో వివరంగా తెలుసుకుందాం.

ప్రఖ్యాత నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ది నాటక రచనలో కూడా అందె వేసిన చేయి. అప్పటి సినిమాలు, వాటి ధోరణుల మీద ఆయన 'చీమకుట్టిన నాటకం' పేరుతో వ్యంగ్య నాటకం రాస్తే బాగా పాపులరైంది. ఈ నాటకాన్ని కృష్ణచైతన్య బృందం వాళ్ళు అనేకసార్లు వైజాగ్‌లో ప్రదర్శించారు. ఈ నాటకంలో హీరోయిన్ తండ్రి పాత్ర భలే వెరైటీగా ఉంటుంది. ఇందులో పాత్రలన్నీ ఏదో ఒక నటుణ్ణి అనుకరిస్తుంటాయి. హీరో పాత్ర ఎన్‌టిఆర్‌ని అనుకరిస్తే, హీరోయిన్ పాత్ర అంజలీదేవిని అనుకరిస్తుంది. ఈ అనుకరణ అనేది ఆయా పాత్రధారుల అభీష్టం మేరకు ఉంటుంది. హీరోయిన్ తండ్రి పాత్రను పోషించిన నటుడు కొంచెం భారీ పర్సనాల్టీ కావడంతో ఎస్వీఆర్‌ని అనుకరించేవాడు. అదే పాత్రను మన వేలుకి పోషించే అవకాశం వచ్చింది. అయితే వేలుది పీల పర్సనాలిటీ. బాడీ లాంగ్వేజ్‌తో ఎస్వీఆర్‌ని అనుకరిస్తే బాగోదు. అందుకే తన కిష్టమైన నటుడు సియస్సార్‌ని అనుకరించే ప్రయత్నం చేశారు వేలు. "సియస్సార్ డైలాగ్ డిక్షన్‌లో వెరైటీ ఉంటుంది, క్లారిటీ ఉంటుంది. ప్రతి అక్షరాన్ని స్పష్టంగా పలుకుతారాయన. అందుకే ఆయన్ని అనుకరిస్తే బాగుంటుందనిపించింది. ఇందు

## సాంకేతిక బృందం

| | |
|---|---|
| బ్యానర్ | : విజయ కమర్షియల్స్ |
| సమర్పణ | : కె. శాంతికుమార్ |
| కథ | : మల్లాది వెంకటకృష్ణమూర్తి |
| సంభాషణలు | : జంధ్యాల |
| నేపథ్యగానం | : బాలు,జానకి |
| పాటలు | : వేటూరి |
| నృత్యాలు | : శేషు |
| ఎడిటర్ | : గౌతంరాజు |
| సంగీతం | : రాజన్-నాగేంద్ర |
| డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ | : బి. కోటేశ్వరరావు |
| కళ | : దిలీప్ సింగ్ |
| స్టిల్స్ | : గిరి |
| అసిస్టెంట్ డైరెక్టర్స్ | : జె. పుల్లారావు, ప్రకాష్ |
| అసోసియేట్ డైరెక్టర్ | : ఇ.వి.వి.సత్యనారాయణ, బి.యస్.నిష్ఠల |
| నిర్వహణ | : టి. సభాపతిరావు |
| నిర్మాత | : జి. సుబ్బారావు |
| దర్శకత్వం | : జంధ్యాల |


చంద్రమోహన్, రజని




జంధ్యాల, పొట్టిప్రసాద్


నిమిత్తం సియస్సార్ నటించిన 'అప్పుచేసి పప్పుకూడు', 'జగదేకవీరుని కథ' చిత్రాలను బాగా జీర్ణించుకున్నాను" అని తెలిపారు వేలు.

వేలు అక్కడితో ఆగిపోలేదు. ఇదే అనుకరణని 'రామదాసు' నాటకంలో కూడా కొనసాగించారు.

ఆరోజు గాయకుడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జన్మదినం. జంధ్యాల కోరిక మేరకు 'రామదాసు' నాటకంలోని తన పాత్రను ఆహూతుల ముందు అభినయించారు వేలు, దీన్నంతా జంధ్యాలే స్వయంగా వీడియోలో చిత్రీకరించారు కూడా.

అలా జంధ్యాల మదిలో ఓ పాత్ర పుట్టింది. అదే 'రెండు రెళ్ళు ఆరు'లోని 'గిరీశం' పాత్ర.

'గిరీశం' తాలూకు అనుభవాలను వేలు వివరిస్తూ " సినిమాలో చిన్న పాత్రే అయినా పెద్ద గుర్తింపునే



'రెండు రెళ్ల ఆరు' శతదినోత్సవానికి జంధ్యాల తయారు చేయించిన ఆహ్వాన పత్రం ఇది.

తీసుకువచ్చింది. నా కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన పాత్రగా పరిగణించాలి. సియస్సార్‌ని వెక్కిరించాలనే ఉద్దేశంతో నేను ఏ కోశానా ఈ అనుకరణ చేయలేదు. ఆయన మాడ్యులేషన్ లోని విరుపుని అందరూ ఎంజాయ్ చేస్తారనే ఉద్దేశ్యంతోనే అలా చేశాను. ఈ అనుకరణ ద్వారా సియస్సార్ గారి కున్న పేరుని మాత్రం పోగొట్టలేదని గర్వంగా చెప్పుకోగలను" అని చెప్పారు.


ప్రీతి, రాజేంద్రప్రసాద్

ఇక 'రెండు రెళ్లు ఆరు' లో ప్రధానంగా చెప్పుకోవలసింది బి.వి.పట్టాభిరాం గురించి. హిప్నాటిస్ట్‌గా, మెజీషియన్‌గా ఆయనకున్న పేరు ప్రఖ్యాతుల గురించి తెలుగు ప్రజలకు ప్రత్యేకంగా గుర్తు చేయనవసరం లేదు.

ఈయన నటించిన తొలి సినిమాగా 'రెండు రెళ్ళు ఆరు'కు ఓ ప్రత్యేకత ఆపాదించబడింది. ఓ రోజు సడన్‌గా పిలిపించుకుని ఈ సినిమాలో పాత్ర వేయాలని కోరడంతో పట్టాభిరాం మొదట చాలా ఇబ్బంది పడిపోయారు. "నాకు సినిమాలంటే మొదట్నించీ ఇంట్రస్ట్ లేదు. మా అన్నయ్య సీతారాముదు, బాపు, రమణలు ముగ్గురూ క్లాస్‌మేట్స్. 'నీకు ఆసక్తి వుంటే చెప్పు బాపు గారితో చెప్పి ఆయన సినిమాలో వేషం ఇప్పిస్తా ' అని అన్నయ్య చాలాసార్లు అన్నా నేను ఆసక్తి కనబరచలేదు. అందుకే జంధ్యాలగారు అడిగినా వెంటనే ఓకే చెప్పలేకపోయాను.

"మరో కారణం కూడా వుంది. చాలా సినిమాల్లో హిప్నాటిజాన్ని భ్రష్టుపట్టించడం నాకు చాలా బాధ కలిగించింది. అందుకే జంధ్యాల గారితో కరాఖండీగా చెప్పేసాను. 'నాపాత్ర స్థాయి ఏ మాత్రం దిగజారకూడదు, సంభాషణలు కూడా నా కనుగుణంగానే ఉండాలి' అని చనువుకొద్దీ చెప్పాను. జంధ్యాలగారు కూడా అలాగే అన్నారు. మాట తప్పకుండా చేతల్లో కూడా ఆ సంస్కారాన్ని నిలబెట్టారు. అరగంట చేస్తే గానీ హిప్నాటిజమ్ పండదని చెప్పాను. అయితే అంతసేపు సీన్ చేయడం కష్టం కాబట్టి తెలివిగా గడియారం చూపి అరగంట అయినట్టుగా తన డైరెక్షన్‌తో ప్రేక్షకుల్ని హిప్నటైజ్ చేశారు జంధ్యాల. నేను ఈ వేషం వేస్తున్నానని తెలిసి ఓ పెద్ద ఆర్టిస్ట్ జంధ్యాల దగ్గరకు వచ్చి 'ఆయన కెందుకండీ వేషం? మాతో వేయించొచ్చుగా' అని అడిగారు. కానీ జంధ్యాలగారు సహజత్వానికే ప్రాణమిచ్చే వ్యక్తి. అందుకే ఆ ఆర్టిస్ట్ వాదన పట్టించుకోలేదు" అని తెలిపారు.


శ్రీలక్ష్మి, వీరభద్రరావు

షూటింగ్ సమయంలో జరిగిన ఓ సరదా సంఘటనని ఇలా వివరించారు పట్టాభిరాం.

"నేను శ్రీలక్ష్మిని హిప్నటైజ్ చేసే సీన్ తీస్తున్నారు. 'మీరు వంట బాగా చేయగలుగుతారు' అంటూ, స్క్రిప్ట్ ప్రకారం వంటకాల లిస్ట్ చెబుతుంటే సడన్‌గా





మీనా

'మజ్జిగపులుసు ' కూడా కలపండి అన్నారు వీరభద్రరావు. ఆయన డైలాగ్‌కి నాతో పాటు శ్రీలక్ష్మి, జంధ్యాల కూడా నవ్వేసారు. వెంటనే ఆ సీన్‌కు కట్ చెప్పి వీరభద్రరావు నిజంగా ఆ డైలాగ్ చెప్పేట్టుగా సీన్ మార్చితీశారు. ఆ సీన్ నిజంగానే చాలా బాగా పండింది' అని వివరించారు.

పట్టాభిరాం వెర్షన్ షూటింగ్‌కి రెండ్రోజుల సమయం పట్టింది. వైజాగ్‌లో హోటల్ ఓషన్‌పార్క్‌లో ఆయన వెర్షన్ షూటింగ్ చేశారు. ఈ సినిమాలో పట్టాభిరాం కేవలం నటనకే పరిమితమై పోలేదు. హీరో రాజేంద్రప్రసాద్‌కి మ్యాజిక్ ట్రిక్స్ నేర్పడం, కొన్ని తమాషా ప్రశ్నల్ని సినిమా కోసం రాయడం వంటివి చేశారు. అదేమిటో ఆయన మాటల్లోనే వివరంగా తెలుసుకుందాం-

"కాస్తందుకో దరఖాస్తందుకో" పాటలో రాజేంద్రప్రసాద్ చేత 13 మేజిక్‌లు చేయించారు జంధ్యాల. ఇందుకోసం నాకు పెద్ద పని పెట్టారు. 3 రోజుల్లో 30 మేజిక్ ఐటమ్స్ రాజేంద్రప్రసాద్‌కి నేర్పాలి. అయితే రాజేంద్రప్రసాద్ నాకు పెద్ద షాక్ ఇచ్చారు. ఉదయం నుంచి సాయంత్రంలోపే మొత్తం ఐటమ్స్ అన్నీ నేర్చేసుకుని, రాత్రి డిన్నర్ టైంలో జంధ్యాల ముందు అద్భుతంగా ప్రదర్శించి చూపారు రాజేంద్రప్రసాద్.. హేట్సాఫ్ టు హిమ్. అలాగే ఈ సినిమా కోసం రకరకాల పజిల్స్ క్రియేట్ చేయమని అడిగారు జంధ్యాల" అని చెప్పారు పట్టాభిరాం.

పట్టాభిరాం తన పాత్రకి తనే స్వయంగా డబ్బింగ్ చెప్పుకోవడం జరిగింది. మేజిక్ ప్రోగ్రామ్స్‌లో విపరీతమైన బిజీగా వుండటంతో తొలుత డబ్బింగ్ చెప్పడానికి ఆయనకు ఖాళీ దొరకలేదు. ఒక రోజు సమయం చిక్కింది. దాంతో ఉదయం ఫ్లైట్‌కి మద్రాసు వెళ్ళి మధ్యాహ్నం డబ్బింగ్ పూర్తి చేసి ఈవినింగ్ ఫ్లైట్‌కి తిరిగి హైద్రాబాద్ చేరుకున్నారాయన. "అలవాటు లేని ప్రక్రియ కాబట్టి డబ్బింగ్ చెప్పడం కొంచెం కష్టమనిపించింది. ఎక్కువ టైం తినేస్తున్నాననిపించి సిగ్గేసి, జంధ్యాలగారితో 'ఇక నావల్ల కాదు వేరే ఎవరితోనైనా డబ్బింగ్ చెప్పించుకోండి' అన్నాను. దానికాయన 'అలా కుదరదు,


బి.వి.పట్టాభిరాం, సుత్తి వీరభద్రరావు, శ్రీలక్ష్మి



సుత్తివేలు

మీరు చెప్పగలరు' అని ధైర్యం చెప్పి పక్కన కూర్చుని డబ్బింగ్ చెప్పించారు" అని వివరించారు పట్టాభిరాం.

ఇక నేటి ప్రముఖ కథానాయిక మీనా కూడా ఈ సినిమాలో నటించింది. అప్పటికామె బాలతార. ఇందులో చిన్నప్పటి విఘ్నేశ్వరిగా బొద్దుగా, ముద్దుగా కనిపిస్తారామె.

జంట సంగీత దర్శకులు రాజన్- నాగేంద్రలతో జంధ్యాలది అపురూప రాగానుబంధం. 'నాలుగు స్థంభాలాట'తో మొదలైన వీరి స్నేహం అనేక చిత్రాల వరకూ కొనసాగి లలిత లావణ్యమైన బాణీలతో తెలుగు ప్రేక్షకులు రాగాల ఉయ్యాలలూగేలా చేసాయి.

ఇందులో కేవలం మూడే మూడు పాటలున్నాయి. రాజేంద్రప్రసాద్, ప్రీతిలపై చిత్రీకరించిన 'కాస్తందుకో.. దరఖాస్తందుకో' పాట భలే బావుంటుంది. ప్రేమకు, దరఖాస్తుకు ముడిపెట్టి చేసిన ఈ రచన చాలా సున్నితంగానూ, చిలిపిగానూ సాగుతుంది.

టైటిల్ కార్డ్‌లో జంధ్యాల మార్కు తమాషాలు గురించి ఇప్పటికి చాలానే చెప్పుకున్నాం. ఇందులో కొత్త ధోరణి చూపించారు. యువరాజు వేషంలో వున్న రాజేంద్రప్రసాద్ గుర్రం మీద ఓ పాడుపడ్డ కోటలో ప్రవేశించడం, అడ్డుకున్న ద్వారపాలకుడితో సంస్థానం ఎవరిదంటే 'సినిమా టైటిల్' రావడం, లోపల ఎవరున్నారంటే 'ఆర్టిస్టు'ల పేర్లు రావడం, ఇలా టైటిల్స్ అన్నీ సందర్భోచితంగా వస్తాయి. ఇంతకూ ఇదంతా హీరో కనే కల అన్నమాట.

ఆంధ్రుల అహ్లాద రచయితగా పేర్గాంచిన మల్లాది వెంకటకృష్ణమూర్తి ఈ సినిమాకి కథ నందించారు. "నేను ఇంతవరకూ 1500 కథలు, 50 నవలలు రాశాను. అవన్నీ పాఠకుల కోసమే రాశాను. కానీ సినిమాలను దృష్టిలో పెట్టుకుని ఏనాడూ రచన చేయలేదు. సినిమాగా తీసిన నా

## కథాసంగ్రహం

మధుసూదనరావు, సద్గుణరావు ఇద్దరూ మంచి ఫ్రెండ్స్, రూమ్మేట్స్. ఓ సినిమా థియేటర్‌లో పరిచయమైన కీర్తనను గాఢంగా ప్రేమిస్తాడు మధుసూదనరావు. కీర్తన, వింధ్యలు ఒకే హాస్టల్‌లో వుంటారు.

మధుసూదనరావు అసలు పేరు వెంకటశివం, కీర్తన అసలు పేరు విఘ్నేశ్వరి. వెంకటశివం, విఘ్నేశ్వరిల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే చిన్నవయసులోనే పెళ్ళి అయిపోతుంది. తల్లితండ్రుల ఉద్యోగరీత్యా ఇద్దరూ చిన్న వయసులోనే వేరుపడిపోతారు.

విఘ్నేశ్వరి పెద్దనాన్న సర్వానందం ఎన్నోసార్లు ఊరు రమ్మంటాడు. విఘ్నేశ్వరి స్థానంలో వింధ్య, వెంకట శివం స్థానంలో సద్గుణరావు మంగళగిరి వెళ్తారు. అక్కడ ఇద్దరూ ద్వేషిస్తున్నట్టు నటిస్తానే మనసులో ప్రేమ పెంచుకుంటారు. ఇంట్లో వాళ్ళకి వీళ్లిద్దరూ అసలు వారు కాదని తెలిసి కంగారుపడతారు. చివరికి మధుసూదనరావు - కీర్తన, సద్గుణరావు- వింధ్య ఒక్కటవుతారు.

## పాటలు

కాస్తందుకో .. దరఖాస్తందుకో
రాజేంద్రప్రసాద్, ప్రీతి

జోహారు పెళ్ళామా
రజని ,చంద్రమోహన్

విరహవీణ
నిదురరాక వేగే వేళలో
రజని, చంద్రమోహన్





జంధ్యాల, ప్రీతి, రజని

మొదటి నవల 'రేపటి కొడుకు'. ఆ నవలను హిందీలో సినిమాగా తీశారు. 'రెండు రెళ్ళు ఆరు' నవలను మాత్రం సినిమా కోసం, జంధ్యాల కోసం రాశాను" అని ఈ సినిమా షూటింగ్ సమయంలో చెప్పారు మల్లాది.

విజయవాడ నటరాజ్ హోటల్‌లో శ్రీలక్ష్మి పిక్చర్స్ ఆధ్వర్యంలో ఈ చిత్రం అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా జంధ్యాల మాట్లాడుతూ "..నవరసాల్లో ఏ రసంలో అయినా హాస్యరసం కలిస్తేనే అది రక్తి కడుతుంది. దురదృష్టవశాత్తు మన దేశంలో హాస్యానికి కావాల్సినంత గుర్తింపు రావడం లేదు. చిత్రరంగంలో చూస్తే ఇప్పుడిప్పుడే హాస్యభరిత చిత్రాల్ని, ప్రేక్షకులు ఆదరిస్తున్నారు" అని అన్నారు. "కామెడీ పాత్రలు పోషించడం నిజంగా కష్టం. ఆర్టిస్టుల కోసం పాత్రలను మలచకుండా పాత్రల కోసం ఆర్టిస్టులను ఎంపిక చేయడంవల్లనే ఈ సినిమా విజయవంతమైంది" అని చంద్రమోహన్ పేర్కొన్నారు. పుచ్చా పూర్ణానందం తన అభిప్రాయం వెలిబుచ్చుతూ "తెలుగులో గల హాస్యరస చిత్రాలను, సాహిత్యాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేస్తే అంతర్జాతీయంగా తెలుగువారి హాస్యం ఏమిటో తెలుస్తుంది. ఆ బాధ్యతను జంధ్యాల చేపట్టాలి. ఆయన హాస్యరసంలో నోబుల్ పొందాలి " అని చెప్పారు.

ఈ చిత్ర శతదినోత్సవం ఏప్రిల్ 22 సాయంత్రం మద్రాస్‌లోని హోటల్ పామ్‌గ్రోవ్ లో సరికొత్త పద్ధతిలో జరిగాయి. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఈ ఫంక్షన్‌కి వ్యాఖ్యాతగా వ్యవహరించి ఆద్యంతం ఫంక్షన్‌ని రక్తి కట్టించారు. కొందరు మొమెంటోలు అందుకుంటున్న సమయంలో బాలసుబ్రహ్మణ్యం గొంతుమార్చి గ్రహీతల లాగే మాట్లాడి సభికులను ఆశ్చర్యపరిచారు. ఫన్ డాక్టర్ చంద్రశేఖరం, జెవి సోమయాజులు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ మొమెంటోల నందజేశారు. వీరభద్రరావు తన మొమెంటోను అందుకుంటూ చిత్రంలో లాగానే స్టేజిపై తలకొట్టుకుంటూ, చొక్కా చింపేసుకున్నారు. పొట్టి ప్రసాద్ కూడా పాత్రలో లీనమైనట్లు 'పితా' అంటూ బిగ్గరగా అరిచి సభికులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తారు. ఆ తర్వాత బి.వి.పట్టాభిరామ్ మాయాజాల ప్రదర్శన చేశారు.

ప్రేక్షకుల్ని కేరింతలు కొట్టేలా చేసింది 'రెండు రెళ్ళు ఆరు'. ఈ చిత్రాన్ని చూసేకొద్దీ ఇప్పటికీ మన మనసుల్లో నవ్వులు ఊరుతూనే ఉంటాయి. లేకపోతే ఊరుకుంటారా జంధ్యాల!

## మెచ్చుతునకలు

- నన్ను లోపలకు వెళ్లనియకపోయావో వరుసగా వారంరోజులు తెలుగు సినిమాలు చూపిస్తాను.
  వద్దు యువరాజా... అసలే అర్భకుణ్ణి భరించలేను
- పగలల్లా నీ విచిత్రగాత్రంతో నన్ను క్షతగాత్రుణ్ణి చేస్తున్నావ్. ఇప్పుడు రాత్రిళ్లు కలలు తెచ్చుకుని మరీ నన్ను కలవర పెట్టకే.
- ఒరెరే... ఆగరా.... పిల్లలు ఏడుస్తున్నాయ్ అన్నావ్.... ఆవిడ పాడుతున్నారు రా...
- హలో ఐరావతం హియర్...
  కామధేను హియర్...
  ఎవరూ కామధేనువా..... ఏం ఆటలుగా ఉందేటయ్యా నీకు.... నేను ఐరావతాన్నంటే నువ్ కామధేనువంటావేంటి....
- నేను ఇంట్లో వంట చేస్తానని చెప్పిన ఆ శుంఠ ఎవడు ?
  మీ ఏరియా ముష్టివాడు సార్
  ఎవరూ... మా ఏరియా ముష్టివాడా.... వాడి మాటలు నమ్మి మీ గ్రైండర్ కంపెనీ పబ్లిసిటీలో నా ఫోటో వేసుకుంటావా... ఇలా నాతో మాట్లాడటానికి ఎన్ని గుండెలురా రాస్కెల్.... ఓసారి ఇటువచ్చి కనబడు.... నిన్ను రోట్లో వేసి రుబ్బుతా గ్రైండర్ వెధవా...
- ఒక గొడుగు క్రింద తడవకుండా అయిదుగురు ఎలా వెళ్లగలరు? అనడిగారు కదా... మీ ప్రశ్నకి సమాధానం తెలిసింది –
  వర్షం లేనప్పుడు
- ప్రేమించడం తేలిక. ప్రేమించిన అమ్మాయిని పెళ్లిచేసుకోవడం కష్టం. ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుని కూడా సుఖంగా ఉండటం అమిత కష్టం
- First is the first of the first and last is the first of the last, in between two zeroes అంటే ఏమిటో చెప్పండి.
  ఫస్ట్‌లో మొదటి అక్షరం ఎఫ్, లాస్ట్‌లో మొదటి అక్షరం ఎల్. ఇన్ బిట్వీన్ టూ జీరోస్.... అంటే ఫూల్ (Fool)
- ప్రేమకు దరఖాస్తు అంటే ఏమిటి?
  ప్రేమకు దరఖాస్తు అంటే ముద్దు. Kiss is an enquiry about the heart whether it is to be letout or not.
- నువ్వు సంగీతం వినిపించేసరికి వంకాయలు మాడిమసై పోయాయి. బెండకాయకు దడపుట్టి దొండకాయంత కుమిలిపోయింది.
- ఓరి నీ 'పిశా'సు పిల్లలు తిన... పిల్లలు వెళ్లిపోతున్నారయ్యా
- ఇవాళ నీకు నేనున్నాను, వండిపెడుతున్నాను. రేపు అటో ఇటో అయితే నీకు తిండి ఎలా చెప్పు?
  నా అదృష్టం ఇంతే అనుకుని హోటల్ నుండి క్యారియర్ తెప్పించుకుంటాను.
- అయ్యో మాదాకబళం తండ్రీ....
  ఛీ... మరీ మద్దెల బ్రతుకు అయిపోయింది నాది. ఒక వైపు నాకు వంట చేసిపెట్టని ఆడది, మరో వైపు నా వంట మాత్రమే అడుక్కుతినే మగాడు. వస్తున్నా నాయనా.... మళ్లీ అరవకు నీరసం వస్తుంది.
- చొక్కా చింపుకుంటున్నారా.... కానీయండయ్యా... నేను కాసేపు వెయిట్ చేస్తాను.
- ఏరా బకాసురుడి బావమరిదీ!



18

రెండు గ్రామాల్ని కలిపిన

# సీతారామకళ్యాణం



రజని, బాలకృష్ణ

ఓ ప్రత్యేకమైన ఇమేజ్ కలిగిన ప్రసిద్ధ నిర్మాణ సంస్థ 'యువచిత్ర' బేనర్‌లో జంధ్యాల చేసిన ఏకైక చిత్రం ఈ 'సీతారామ కళ్యాణం'. టైటిల్‌ని బట్టి ఇదేదో పౌరాణిక చిత్రమని భ్రమసే సూచనలు ఉన్నా కథానుగుణంగా, డేరింగ్‌గా ఈ టైటిల్‌కే ఫిక్స్ అయిపోయారు. పద్నాలుగేళ్లు సీతారాముల విగ్రహాలని వేరే వేరే ఊళ్లలో ఉంచిన దానికి పర్యవసానంగా రామాపురం, రాఘవాపురం గ్రామాల్లో నివసిస్తున్న ఒకే కుటుంబీకులు రకరకాల అవస్థలకు గురై, చివరికి పద్నాలుగేళ్ల తర్వాత కళ్లు తెరిచి కలిసిన వైనమే




ఈ చిత్ర కథాంశం.

'బాబాయ్ అబ్బాయ్' తర్వాత బాలకృష్ణ- జంధ్యాల కలయికలో రూపొందిన రెండో చిత్రం ఇది. అసలు వీరిద్దరి కలయికలో సినిమా చేయాలని నిర్మాత మురారి ముందుగానే పథక రచన చేశారు. ఈలోగానే 'బాబాయ్ - అబ్బాయ్' మొదలైపోయింది.

తొలుత 'సీతారామకళ్యాణం'లో భానుప్రియను కథానాయికగా అనుకోవడం జరిగింది. చివరికి ఆ స్థానంలో రజని ఎంపికైంది.

చిత్రీకరణ విషయంలో తనకంటూ ఓ ప్రత్యేకమైన పంథా కలిగిన జంధ్యాల ఈ సినిమా విషయంలో మురారి అభిరుచికే ప్రాధాన్యత నిచ్చారు. ముఖ్యంగా జంధ్యాల పాటల్లో నంబరాఫ్ షాట్స్ ఎక్కువ ఉంటాయి. మురారికేమో స్టడీ షాట్స్ అంటేనే ఇష్టం. "ప్రేక్షకుడు తన మైండ్‌లో ఓ ఫ్రేమ్‌ని రిజిస్టర్ చేసుకోవాలంటే కొంచెం టైం ఇవ్వాలి. టైమ్ గ్యాప్ లేకుండా నంబరాఫ్ షాట్స్ తీసేస్తే ప్రేక్షకుడు టైర్ అయిపోతాడని నా అభిప్రాయం. జంధ్యాల నా మనసుకి నచ్చిన విధంగా ఈ సినిమా మలిచారు" అని తెలిపారు మురారి.

జంధ్యాల గురించి మురారి వివరిస్తూ - 'సీతామాలక్ష్మి' చిత్ర నిర్మాణ సమయంలో జంధ్యాలతో నాకు పరిచయమేర్పడింది. నేను, జంధ్యాల, కె.విశ్వనాథ్, పాలగుమ్మి పద్మరాజు కలిసి దాదాపు సంవత్సరం పాటు కథా చర్చల్లో పాల్గొన్నాం. జంధ్యాలకు నెలకు 500 రూపాయలు పారితోషికమిచ్చే వాడిని. ' మీ దగ్గర రెండు సినిమాల పారితోషికం ఒక్క సినిమాకే తీసుకున్నాను' అంటూ నా పట్ల చివరివరకూ కృతజ్ఞతాభావంతో ఉండేవాడాయన. 'సీతామాలక్ష్మి' కి చిత్రానువాదంలో కూడా సహకరించడంతో పాటు, డబ్బింగ్ కార్యక్రమాలు కూడా తనే పర్యవేక్షించాడు. అంతేకాదు రెండు, మూడు పాత్రలకు డబ్బింగ్ కూడా చెప్పాడు" అంటూ నాటి సంగతుల్ని తెలిపారు.

**తారాగణం**


బాలకృష్ణ, రజని, జగ్గయ్య, రమాప్రభ, గొల్లపూడి మారుతీరావు, రామకృష్ణ, రాజేష్, శుభలేఖ సుధాకర్, 'సప్తపది' గిరీష్, ముచ్చర్ల అరుణ,సంగీత, శ్రీధర్, వేలు, సి. హెచ్. కృష్ణమూర్తి సి.రామ మోహనరావు, జీవా

ఇక 'సీతారామ కళ్యాణం' విషయానికొస్తే... ఈ సినిమా కథకి ప్రేరణ పేపర్లో వచ్చిన ఓ వార్త. సీతారాముల విగ్రహానికి సంబంధించి రెండు గ్రామాల మధ్య గొడవలు రావడం, కలెక్టర్ మధ్యవర్తిగా ఉండి రెండు గ్రామాల మధ్య గుడి కట్టించాడన్నది ఆ వార్త సారాంశం. ఈ వార్తని ఆధారంగా చేసుకుని 'సీతారామ కళ్యాణం' కథను అల్లుకున్నారు. ఐదారు నెలల పాటు జరిగిన ఈ కథా చర్చల్లో జంధ్యాల, మురారితో పాటు భమిడిపాటి రాధాకృష్ణ కూడా పాల్గొన్నారు.

మురారి సినిమాలకి ఆస్థాన సంగీత దర్శకుడు కె.వి.మహదేవన్. సంగీత దర్శకునిగా మహదేవన్‌కు ఇది 551వ చిత్రం. మహదేవన్‌తో కలిసి జంధ్యాల పనిచేయడం



బాలకృష్ణ, రజని



ఇదే తొలిసారి. ఆ తర్వాత 'విచిత్రప్రేమ' సినిమాకు కూడా మహదేవన్‌తో మ్యూజిక్ చేయించుకున్నారు జంధ్యాల. అలాగే ఆత్రేయ, ఆరుద్రలతో తొలిసారిగా తన సినిమాకు పాటలు రాయించుకున్నారు. ఈ చిత్రంలో ఆత్రేయ నాలుగు, ఆరుద్ర రెండు, వేటూరి ఒక పాటను రాశారు.

ఈ సినిమాలో మొత్తం 6 పాటలున్నాయి. మరో రెండు రికార్డ్ చేశారు గానీ, సినిమాలో ఉపయోగించలేదు. 'ముత్యాలముగ్గు'లో 'ముత్యమంతా పసుపు ముఖమంత ఛాయ...' స్టైల్‌లో రజని మీద ఓ పాట తీయాలనుకుని ఆరుద్రతో 'పసుపు కెంపు....' అంటూ ఓ పాట రాయించారు.

'యువచిత్ర' వారి చిత్రాల్లో పాటలకు ఓ ప్రత్యేకత ఉంటుంది. సంగీతం,సాహిత్యం జోడుగుర్రాల్లా స్వారీ చేసే ఈ పాటలతో కూడా కథను నడిపించడం మురారికి నచ్చిన పద్ధతి. ఈ పద్ధతిలోనే జంధ్యాల వెళ్లి అందర్నీ మెప్పించారు.

ఇంద్రధనస్సులోని రంగులని ప్రేమకు అన్వయిస్తూ ఆరుద్ర 'సరిగమపదనీ పనిదప మగరీ' పాటను రాశారు. ముద్దుపై ఆరుద్ర రాసిన ముద్దెట్టుకోవాలనిపించే పాట 'ముద్దు వద్దు..'. సినిమా కోసం తొలుత ఈ పాటనే రికార్డు చేశారు. ఈ పాటను జంధ్యాలే రాయాలనుకున్నారు. తర్వాత ఆ పాట కోసం ఒంగోలు నుండి ధారా రామనాథ శాస్త్రిని పిలిపించారు. చివరకా పాటను ఆరుద్ర పూర్తి చేశారు. ఆ సిట్యుయేషన్‌లో పాట ఎందుకని మురారి ముందు వాదించినా, చివరికి జంధ్యాల పట్టుబట్టడంతో ఉంచేశారు.

ఆడియోను మార్కెట్లోకి విడుదల చేసి బావున్న పాటలను ఎంపిక చేయమనగా, చాలామంది అభిమానులు "ముద్దు...వద్దు" బాగా లేదని తెలిపారు. దాంతో దాన్ని తొలగించి "ఏమని పాడను.." వేటూరితో రాయించి చిత్రీకరించారు.


'రాళ్లల్లో ఇసుకల్లో రాశాము ఇద్దరి పేర్లు' అంటూ చిన్ననాటి స్నేహాన్ని గుర్తు తెచ్చుకుంటూ యువ ప్రేమికులు పాడుకునే ఈ పాటని ఆత్రేయ రాశారు. ఈ పాటకు పెద్ద తతంగమే జరిగింది.

**సాంకేతిక బృందం**

| | |
|---|---|
| బేనర్ | :యువచిత్ర |
| సమర్పణ | :కె.నరసింహం నాయుడు |
| సంగీతం | :కె.వి.మహదేవన్ |
| పాటలు | :ఆరుద్ర,ఆత్రేయ |
| నేపథ్యగానం | :ఎస్.పి.బాలు, పి.సుశీల |
| ఛాయాగ్రహణం | :నందమూరి మోహనకృష్ణ |
| ఆర్ట్ | :రాజు |
| కో డైరెక్టర్స్ | :యు.వి.పాణి, సత్యనారాయణ |
| స్క్రీన్‌ప్లే | :జంధ్యాల, మురారి |
| నిర్మాత | :మురారి |
| మాటలు-దర్శకత్వం | :జంధ్యాల |

ఆ వివరాల్లోకెళితే... శోభారాజు ఆలపించిన 'అన్నమాచార్య కీర్తనలు' క్యాసెట్లో 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు' పాట అంటే మురారికి చాలా ఇష్టం.

అందుకే ఆ పాటకి తగ్గట్టుగా సినిమాకనుగుణంగా ఓ ట్యూన్‌ని ఎప్పుడో రెడీ చేయించుకున్నారాయన. 'త్రిశూలం', 'అభిమన్యుడు' సినిమాల్లో ఆ పాటను పెట్టాలనుకున్నా కుదర్లేదు. 'సీతారామకళ్యాణం'లో ఈ పాట పెట్టమని జంధ్యాలని అడిగారు.




నిర్మాత కె.మురారి

వేటూరితో ఆ పాట రాయించాలనుకుంటే ఆయన ఫుల్ బిజీ. దాంతో ధారా రామనాథశాస్త్రితో ఆ పాట రాయించారు జంధ్యాల. అయితే రెండు రోజులు ఆ పాట తీశాక నచ్చక పక్కన పెట్టేశారు జంధ్యాల. ఎందుకంటే ఆ పాట పెట్టాలనుకున్న తరువాత సిట్యుయేషనే మారింది. హీరో హీరోయిన్లు ఇద్దరూ చిన్నప్పటి స్నేహితులు. పల్లెటూళ్లో కలిసి మెలిసి ఆడుకున్నారు. తర్వాత విడిపోయారు. కొన్నేళ్ల తర్వాత మళ్లీ కలుసుకుంటారు.

ఈ నేపథ్యాన్ని తీసుకుని ఆ ట్యూన్ కనుగుణంగా ఆత్రేయతో పాట రాయించారు. అదే 'రాళ్లల్లో ఇసుకల్లో...' పాట. భద్రాచలం దగ్గర గోదావరి సైకత తీరంలో ఈ పాటను తీశారు.

'వీళ్లూ వాళ్లూ ఎవరంట,నువ్వూ నేనూ ఒకటంట' అంటూ ఓర్వలేని వారిని చూసి యువ ప్రేమికులు పాడుకునే ఈ పాటని ఆత్రేయ రాశారు. 'కళ్యాణ వైభోగమే', 'ఎంత నేర్చినా ఎంత చూసినా..' ఈ రెండు పాటల్ని ఆత్రేయ రాశారు.



మహదేవన్‌తో జంధ్యాల



త్యాగరాజస్వామి కీర్తన ఆధారంగా 'ఎంత నేర్చినా..' పాట రాయించారు. తొలుత ఈ పాటని సాయికృష్ణ యాచేంద్రతో రాయించాలనుకున్నారు. అసలు ఈ పాట సినిమాలో పెట్టాలన్నదే ఆయన.


ఆ తరువాత ఈ పాటను ఆత్రేయ రాశారు. బాలకృష్ణ సంగీతం మాస్టర్ వేషంలో వచ్చి రజనీకి పాట నేర్పే సన్నివేశం లోని ఈ పాట త్యాగరాయ కృతిలా ప్రారంభమై ఆత్రేయ కవిత్వంతో సాగుతుంది.

'కళ్యాణ వైభోగమే..' పాటని బాలకృష్ణ, రజనిలపై 5 రాత్రులు చిత్రీకరించారు. రెండున్నర లక్షల ఖర్చుతో గోదావరి మధ్యలో ఉన్న ఇసుకలంకలమీద విద్యుద్దీపాలు అమర్చి, ఆరు సెట్లు వేశారు. ఈ పాటకి 140 మంది ఎలక్ట్రీషియన్లు ప్రత్యేకంగా పనిచేశారు. గ్రామీణ, పట్టణ వాతావరణానికి సంబంధించిన కథ కావడం వల్ల సహజత్వానికి చేరువగా ఉండాలనే దృష్టితో రాజమండ్రి పరిసరాల్లో షూటింగ్ చేశారు.

## పాటలు

1. సరిగమ పదనీ పనిదప మగరీ, పసుపు కెంపు ఆకుపచ్చ
   రచన : ఆరుద్ర
2. ఏమని పాడను రెండు మనసుల..
   రచన : వేటూరి
3. రాళ్లల్లో ఇసుకల్లో రాశాము ఇద్దరి పేర్లు
   రచన: ఆత్రేయ
4. వీళ్లూ వాళ్లూ ఎవరంట నువ్వూ నేనూ ఒకటంట
   రచన: ఆత్రేయ
5. కళ్యాణ వైభోగమే శ్రీ సీతారాముల కళ్యాణమే
   రచన : ఆత్రేయ
6. ఎంత నేర్చినా ఎంత చూసినా
   ఎంత వారలైనా ప్రేమదాసులే

| | |
|---|---|
| విడుదల | :18-4-1986(శ్రీరామనవమి) |
| నిర్మాణసమయం | :50-60 రోజులు |
| నిర్మాణ ప్రాంతాలు | :రాజమండ్రి, ఊటీ తదితర ప్రాంతాలు |



బాలకృష్ణకు సూచనలిస్తున్న జంధ్యాల




అలా ఆంధ్రప్రదేశ్‌లోని అతి ప్రాచీన గ్రంథాలయాల్లో ఒకటైన రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో బాలకృష్ణ, వేలు, సుధాకర్, కల్పనారాయ్ పాల్గొన్న మూడు సన్నివేశాలు చిత్రీకరించారు.

సినిమా అంతా రెడీ అయ్యాక కథలో లొసుగులు కనబడటంతో 13.రోజులు రీ షూట్ చేశారు.

సీతామాలక్ష్మి, గోరింటాకు, జేగంటలు, త్రిశూలం, అభిమన్యుడు చిత్రాల తర్వాత 'యువచిత్ర' బేనర్‌లో మురారి నిర్మించిన చిత్రమిది. "ఇది సీరియస్ లవ్‌స్టోరీ. అయినా ఇందులో హృదయాలను అలరించే అందమైన హాస్యం ఉంది. అంతేగాక మసాలా కూడా తగిన పాళ్లల్లో ఉంది" అని చెప్పారు మురారి.

ఇక జంధ్యాల అయితే "నా గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. సీరియస్ డ్రామాతో కూడిన ప్రేమకథ. ఇన్నాళ్లూ డైరెక్షన్ పైనే శ్రద్ధ చూపుతున్న నేను, ఈ చిత్రానికి పూర్తి సంభాషణలు రాశాను. బాలకృష్ణకు డైలాగ్స్ రాస్తున్నప్పుడు ఎన్.టి.ఆర్.గారి చిత్రాలకు డైలాగ్స్ రాయడం గుర్తుకొచ్చి ఆ స్థాయిలోనే వీటిని రాశాను. ఈ చిత్రంలో ఫైట్స్ ఉన్నాయి. కొందరు జంధ్యాల చిత్రంలో ఫైట్స్ ఏమిటన్నారు. కథకు కావల్సిస్తే పాటలే కాదు ఫైట్స్ ఉండాలి. అయితే ఫైట్స్‌ని రొటీన్‌కు భిన్నంగా సహజంగా చిత్రీకరించాం." అని తెలిపారు.

ఈ సినిమాకు ప్రత్యేకంగా కథా రచయితగా టైటిల్స్‌లో ఎవరి పేరూ వేయలేదు. మురారి కారణం వివరిస్తూ –" సీతారాముల అరణ్యవాసం పధ్నాలుగేళ్లు. దాన్ని సింబాలిక్‌గా అన్వయిస్తూ సీతారాముల విగ్రహాలను కోర్టు గొడవల్లో ఇరికించి పధ్నాలుగేళ్లు విడదీసి మళ్లీ శ్రీరామనవమికి కలపటం అన్నది నాకు నచ్చి నేను అల్లుకున్న తీరు ఇది. అందుకే కథగా ఎవరి పేరు ఉండదు" అని చెప్పారు.

## కథాసంగ్రహం

అలనాడు రామాయణంలో సీతారాములు 14 సంవత్సరాల ఎడబాటులో ఎన్నో కష్టాలకు గురై చివరికి కలిశారు. ఈనాటి ఈ ప్రేమాయణంలో హీరో హీరోయిన్లకు చిన్న వయసు లోనే పెళ్లి చెయ్యాలని, ఇరుగు పొరుగు గ్రామాలకు చెందిన రెండు కుటుంబాల పెద్దలు అనుకుంటారు. అయితే ఆ కుటుంబాల మధ్య తలెత్తిన తగాదాల వల్ల ఒకరి మొహం మరొకరు చూడకుండా 14 ఏళ్లు గడుపుతారు. ఆ తర్వాత వీరి పెళ్లి జరగడం, విడిపోయిన రెండు గ్రామాలు ఏకంకావటం, అంతా ఆనందం పంచుకోవడం ఈ చిత్ర కథాంశం.




'నాలుగు స్థంభాలాట' మొదలుకుని జంధ్యాల దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న ఇ.వి.వి.సత్యనారాయణ ఈ సినిమాకోసం తొలిసారిగా మెగాఫోన్ చేతపట్టారు."జంధ్యాల గారి ప్రోద్బలంతో ఇందులో క్లైమాక్స్ ఫైట్‌ని నేను తీశాను. ఎడిటింగ్ రూమ్‌లో ఆ సీన్స్ బాగా తీశానని జంధ్యాలగారు మెచ్చుకోవడంతో భవిష్యత్తులో నేను దర్శకత్వం చేయగలనన్న నమ్మకం పెరిగింది." అని తెలిపారు ఇ.వి.వి.సత్యనారాయణ.

ఈ చిత్రం 14 కేంద్రాల్లో శతదినోత్సవం జరుపుకుంది. 1986 జులై 27న శతదినోత్సవ వేడుకలు మద్రాస్‌లోని విజయ శేష్‌మహల్‌లో జరిగాయి. ఈ శతదినోత్సవానికి డా॥ దాసరి నారాయణరావు అధ్యక్షత వహించగా, గొల్లపూడి మారుతీరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ ఫంక్షన్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ –"ప్రేక్షకులు చక్కని కుటుంబ కథా చిత్రాలను తప్పక ఆదరిస్తారని ఈ సినిమా నిరూపించింది. జంధ్యాల దర్శకత్వ ప్రతిభ, మురారి నిర్మాణ దక్షత, మహదేవన్ సంగీత నైపుణ్యం ఈ చిత్ర విజయానికి ఎంతగానో తోడ్పడ్డాయి" అని చెప్పారు.

పద్నాలుగేళ్ల క్రితం విడిపోయిన సీతారాముల విగ్రహాలతో పాటు హీరో హీరోయిన్లు ఇద్దరూ కలవడమనేది ప్రేక్షకులకు బాగా నచ్చే అంశం. వాటిని జంధ్యాల అద్భుతంగా తెరకెక్కించి ప్రేక్షకులను రంజింపచేశారు.



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో......
అభిమానులు ఏర్పాటు చేసిన జంధ్యాల విగ్రహం



తండ్రి విగ్రహం ముందు



# బయోగ్రఫీ

| | | |
|---|---|---|
| పేరు | : | జంధ్యాల వెంకట దుర్గా శివ సుబ్రహ్మణ్య శాస్త్రి |
| జననం | : | 14-1-1951 |
| జన్మస్థలం | : | నర్సాపురం, పశ్చిమ గోదావరి జిల్లా |
| చదువు | : | బి.కాం. |
| తొలిరచన | : | దేవుడు చేసిన బొమ్మలు (1976) |
| గ్రేట్‌నెస్ | : | 1976 నుంచి 1981 మధ్యకాలంలో దాదాపు 200 సినిమాలకు రచన చేయడం |
| దర్శకునిగా తొలిచిత్రం | : | ముద్దమందారం(1981) |
| రచయితగా స్కోర్ | : | 350 |
| దర్శకునిగా స్కోర్ | : | 39 |
| అవార్డులు | : | 'ఆనందభైరవి' సినిమాకి ఉత్తమ దర్శకునిగా నంది అవార్డు, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రదర్శకునిగా అవార్డు |
| దర్శకునిగా ప్రేరణ | : | కె.విశ్వనాథ్ |
| అభిమాన తారలు | : | చార్లీచాప్లిన్, రాజ్‌కపూర్, దిలీప్‌కుమార్, ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్., సావిత్రి |
| అభిమానించే దర్శకులు | : | కె.విశ్వనాథ్, బి.ఎన్.రెడ్డి, బాలచందర్, బాపు, డేవిడ్‌లీన్ (ఈయన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసేందుకు ఆయనకు ఉత్తరం రాశారు.) |
| ఫేవరెట్ విలన్ | : | ఎస్వీఆర్ |
| ఫేవరెట్ మూవీ | : | మాయాబజార్ |
| తన సినిమాల్లో తనకు బాగా నచ్చిన సినిమాలు | : | రచయితగా శంకరాభరణం, సప్తపది, సాగరసంగమం, వేటగాడు, జగదేకవీరుడు - అతిలోక సుందరి, దర్శకునిగా నెలవంక, ఆనందభైరవి, పడమటి సంధ్యారాగం |
| మురిపించిన పాత్ర | : | 'పుత్తడి బొమ్మ' చిత్రంలో వీరభద్రరావు వేసిన పాత్ర |
| జీవిత లక్ష్యం | : | ఓ మంచి జాతీయస్థాయి ఉత్తమచిత్రం తీయాలని ఉండేది |
| మరణం | : | 19-5-2001 |